

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 211

మంగళవారం 22-10-2024



జల రథ సారథులు

- IIలో



మట్టి+ఆముదం+కుంకుడు ద్రావణంతో పచ్చని పంటలు!

- IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మల్టీ టాలెంట్



కూచిపూడి నుంచి కరాటే వరకు

'నేర్చుకుంటే పోయేదేమీ లేదు... వచ్చేదే తప్ప' అన్నట్లుగా ఉంటుంది స్వాప్నిక ఉత్సాహం. అల్లికల కళలో చేయి తిరిగిన స్వాప్నిక అక్కడితో ఆగిపోలేదు. తల్లి దండ్రులు నాగెళ్ల లీనా కెథీరాల, డాక్టర్ కొండేపోగు డేవిడ్ లివింగ్ స్టన్ ప్రోత్సాహంతో కూచిపూడి నేర్చుకుంది. రాష్ట్ర స్థాయిలో ఎన్నో బహుమతులు గెలుచుకుంది. కరాటేలో కూడా ప్రావీణ్యం సంపాదించింది. బిఫార్మసీ చదివే రోజుల్లో స్వాప్నిక తన చేతులపై జీపును నడిపించుకుని సాహసవంతమైన ఫీట్ చేసింది. వృత్తిరీత్యా ఫార్మసిస్టు అయిన స్వాప్నిక ప్రవృత్తిరీత్యా ఆర్టిస్ట్. ఎప్పటికప్పుడు కొత్త కళలపై ఆసక్తి చూపుతుంటుంది.

స్వాప్నికళ

ఆస్ట్రేలియాకు చెందిన ప్రసిద్ధ క్రోచెట్ ఆర్టిస్ట్ జెన్నీ కింగ్ నోటి నుంచి వినిపించే మాట... 'అల్లికల కళకు మాంత్రిక శక్తి ఉంది. అది మన మనసును ఎప్పుడూ ఆహ్లాదభరితం చేస్తుంది. మంత్రముగ్ధుల్ని చేసే మనోహర కళ ఇది' మార్కాపురానికి చెందిన స్వాప్నిక రాజ్జీ చిన్నప్పుడే ఆ మంత్రముగ్ధకళలలో ఓనమాలు నేర్చుకుంది. ఆ కళ ఇచ్చిన ఉత్తేజం ఊరకేపోలేదు. అల్లికల కళలో చేయి తిరిగిన స్వాప్నిక పేరు గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కింది.

ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన స్వాప్నిక అమ్మమ్మ తోటకూర క్రిస్టియనమ్మ పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ తీరిక వేళల్లో ఇంట్లో అల్లికలు (క్రోచెట్స్) చేసేది. అమ్మమ్మ అల్లికల పనిలో ఉన్నప్పుడు స్వాప్నిక ఆసక్తిగా గమనించేది. అలా 'అమ్మమ్మ అల్లికల స్కూల్' లో స్టూడెంట్‌గా చేరింది. గురువుగారి ప్రియ శిష్యురాలు అయింది. అల్లికలకు సంబంధించి ఎన్నో మెళకువలు అవలీలగా నేర్చుకుంది.


అమ్మమ్మ క్రిస్టియనమ్మతో స్వాప్నిక

కొత్త అల్లికల గురించి ఆలోచించడమే కాదు, క్రోచెట్స్‌కు సంబంధించి కొత్త రికార్డ్‌ల గురించి తెలుసుకోవడం అంటే స్వాప్నికకు ఇష్టం.

మదర్ ఇండియాస్ క్రోచెట్ క్వీన్స్ (ఎంఐక్యూ)లో ఆరు వేలమందికి పైగా సభ్యులు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది క్రోచెట్ ఆర్టిస్ట్‌లకు స్ఫూర్తినిచ్చే సంస్థ ఇది. 'క్రోచెట్ క్వీన్స్'కు చెందిన మహిళలు అతి పెద్ద క్రోచెటెడ్ దుప్పటి, అతి పెద్ద క్రోచెటెడ్ స్కార్ఫ్, అతి పెద్ద క్రోచెటెడ్ క్రిస్మస్ డెకరేషన్... మొదలైన వాటితో రికార్డ్ సృష్టించారు.

'ఎంఐక్యూ'లాంటి సంస్థల రికార్డుల గురించి తెలుసుకునే క్రమంలో స్వాప్నికకు రికార్డ్‌లపై ఆసక్తి మొదలైంది.

'గిన్నిస్ బుక్ రికార్డ్' అంటే ప్రపంచ దృష్టిని ఆకర్షించే సవాలు. అలాంటి అరుదైన సవాలును స్వీకరించే అవకాశం స్వాప్నికకు విశాఖపట్టణంలో వచ్చింది.

విశాఖపట్టణానికి చెందిన 'మహిళా మనో వికాస్ క్రాఫ్ట్స్ అండ్ క్రియేషన్స్' సంస్థ క్రోచెట్స్‌కు సంబంధించి నిర్ణీత వ్యవధిలో అత్యధిక కళాకృతులు తయారు చేయాలని సవాలు ఇచ్చింది. ఈ సవాలుకు 'సై' అంటూ స్వాప్నిక బృందంలోని మహిళలు అతి తక్కువ సమయంలో 58,112 క్రోచెట్ స్క్వేర్‌లను తయారుచేసి 'లార్జెస్ట్ డిస్‌ప్లే ఆఫ్ క్రోచెట్స్ స్క్వేర్' అనే టైటిల్ సొంతం చేసుకున్నారు. గిన్నిస్ బుక్ రికార్డ్ నెలకొల్పారు. గిన్నిస్ రికార్డు కోసం 20 వేల క్రోచెట్స్ స్క్వేర్స్ తయారు చేయాల్సి ఉండగా స్వాప్నిక బృందం 58,112 తయారుచేసి వరల్డ్ రికార్డు సాధించింది.

'గిన్నిస్ రికార్డ్ ఇచ్చిన ఉత్సాహంతో భవిష్యత్‌లో మరిన్ని రికార్డ్‌లు నెలకొల్పుతాం' అంటుంది ఆత్మవిశ్వాసం నిండిన గొంతుతో స్వాప్నిక రాజ్జీ.


– గోపాలుని లక్ష్మీ నరసింహారావు, 'సాక్షి', మార్కాపురం, ప్రకాశం జిల్లా

మన హైదరాబాద్‌లో మెట్రో రైల్ ఉంది. కొచ్చిలో కొత్తగా మెట్రో ఫెర్రీ మొదలైంది. కొచ్చిలో ట్రాఫిక్‌ను, కాలుష్యాన్ని కట్టడి చేయడానికి అక్కడి ప్రభుత్వం 'మెట్రో వాటర్ ఫెర్రీ' వ్యవస్థను దక్షిణాసియాలోనే మొదటిసారిగా మొదలెట్టింది. 100 మంది పాసింజర్లను మోసుకెళ్లే ఫెర్రీలను నడిపేందుకు ముగ్గురు మహిళా పైలట్‌లు సెలెక్ట్ అయ్యారు. దేశంలోనే వీరు ప్రథములు. జల రవాణాలో ఇది మహిళా శకం.

జల రథ సారథులు

న్యూస్ మేకర్స్


అరుణిమ, లక్ష్మి, స్నేహ


కొచ్చి బ్యాక్ వాటర్స్‌లో ఫెర్రీలు

మొన్నటి సాయంత్రం కొచ్చిలోని హైకోర్టు నుంచి ఫోర్ట్ కొచ్చికి ఫెర్రీ బయలు దేరింది. బ్యాక్ వాటర్స్‌లో రాత్రి పార్టీలకు కొన్ని హౌస్ బోట్లు బయలు దేరాయి. బెస్త పడవలు వెనుకకు మరలుతున్నాయి. వాటి మధ్య హుందాగా మృదువుగా కదిలింది నీలి రంగు ఫెర్రి. తండ్రి చేయి పట్టుకుని ఫెర్రీ ఎక్కిన ఒక పదేళ్ల అమ్మాయి ఫెర్రీ పైలెట్‌కు సహాయంగా నిలబడి ఉన్న మహిళా పైలెట్‌ను చూస్తూ ఉండిపోయింది. కాసేపటి తర్వాత తండ్రితో అంది 'నాన్నా... నేను కూడా ఇలా అవుతా'. తండ్రి చిరు నవ్వు నవ్వి ఆ మహిళా పైలెట్‌తో 'ఇలా మా అమ్మాయి కావాలంటే ఏం చదవాలమ్మా' అని అడిగాడు. ఆ ప్రశ్న ప్రస్తుతం కొచ్చిలో ఫెర్రీలలో ప్రయాణిస్తున్న చాలామంది తల్లిదండ్రులతో. అంతగా స్ఫూర్తినిస్తున్నారు కొత్తగా నియమితులైన ముగ్గురు మహిళా పైలట్‌లు.

అరుణిమ, లక్ష్మి, స్నేహ

ఈ ముగ్గురు యువ సారథులు 'కొచ్చి వాటర్ మెట్రో లిమిటెడ్'లో ట్రెయినీలుగా నియమితులయ్యారు. ఫెర్రీలలో అసిస్టెంట్‌లుగా సేవలు అందిస్తున్న వీరు సంవత్సరం తర్వాత పూర్తిస్థాయి పైలట్‌లుగా విధులు నిర్వర్తిస్తారు. జనరల్ పర్పస్ రేటింగ్ (జిపిఆర్) కన్వర్షన్ కోర్సు పూర్తి చేసిన వారికే ఈ ఉద్యోగం దొరుకుతుంది. కేరళలో ఈ కోర్సు లభ్యమవుతోంది. కొల్లంకు చెందిన అరుణిమ, తిరువనంతపురంకు చెందిన లక్ష్మి, అలెప్పికి చెందిన స్నేహ వివిధ ఇంజినీరింగ్ డిప్లమాలు చేశాక ఫెర్రీ పైలెట్ ఉద్యోగాల పట్ల ఆసక్తి చూపారు. అయితే జీపీఎస్ కోర్సు పూర్తి చేశాకనే వారికి ట్రెయినీలుగా అవకాశం వస్తుంది. ఆ కోర్సును కూడా సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేయడంతో ట్రెయినీ పైలట్‌లు నియమితులయ్యారు.

75 ఫెర్రీలు 33 వేల పాసింజర్లు

కొచ్చి చుట్టూ లంక గ్రామాలు ఉన్నాయి. కొచ్చిలో కూడా ఒకచోట నుంచి మరో చోటకు వెళ్లడానికి మెట్రో రైలు ఉన్నా ట్రాఫిక్ సమస్య తీరడం లేదు. దీంతో ప్రభుత్వం దాదాపు లక్షా పదమూడు వేల కోట్ల ఖర్చుతో వాటర్ మెట్రో సర్వీసును మొదలెట్టింది. ఇందులో భాగంగా 75 హైబ్రీడ్ ఫెర్రీలు అందుబాటులోకి రానున్నాయి. వీటి రాకపోకల కోసం 38 జెట్టీలు నిర్మించారు. 15 రూట్లు ఖరారు చేశారు. దీంతో 33 వేల మంది పాసింజర్లకు మేలు జరుగుతుంది. టికెట్ 20 రూపాయల నుంచి 40 రూపాయలు ఉంటుంది. 100 మంది పాసింజర్లున్న ఫెర్రీ గరిష్ఠంగా 23 కిలోమీటర్లు గంటలో ప్రయాణిస్తుంది.


పైలట్‌గా శిక్షణ...

పురుష ప్రపంచంలో మహిళా సారథులు

కేరళలో టూరిజం కోసం ఉపయోగించే హౌస్‌బోట్లు, ఇతర ఫెర్రీలలోగాని పురుషులే డ్రైవర్‌లుగా ఉంటారు. మెట్రో ఫెర్రీలలో కూడా పురుష పైలట్‌లే ఉన్నారు. కాని స్త్రీలు ఈ ఉపాధిలో తప్పక ఉండాలని ప్రభుత్వం ఈ ప్రయత్నం చేసింది. 'మేము విధులు నిర్వర్తిస్తుంటే అందరూ మా యూనిఫామ్‌లు చూసి మెచ్చుకోలుగా మాట్లాడుతున్నారు' అంటుంది అరుణిమ. 'ఉద్యోగంలోకి బెరుగ్గా అడుగు పెట్టాను. కాని మెట్రో ఉద్యోగులు నా బెరుకును కొద్ది రోజుల్లోనే పోగొట్టారు. మేము కలిసి పని చేసే ఒక వాతావరణం ఇక్కడ ఉంది' అంది లక్ష్మి. 'ఫెర్రీ పైలట్ అంటే ఫెర్రీని నడపడమే కాదు... క్రౌడ్‌ను కూడా మేనేజ్ చేయాలి. ఫెర్రీ కదులుతుంటే కొంతమంది అంచుల్లో నిలబడతారు. వారిని హెచ్చరించాలి' అంటుంది స్నేహ. 'మొదటిసారి మేము ఫెర్రీ లోపలికి వచ్చి చూస్తే ఇదో షిప్పేమో అనిపించేంత ఆధునికంగా ఉంది. అన్ని సాంకేతిక రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇందులో వైఫై కనెక్టివిటీ ఉంటుంది. సీటింగ్ ఏరియా అంతా ఏసి ఉంటుంది' అని తెలిపింది అరుణిమ.

విమానాలు, మెట్రో రైళ్లు, మెట్రో ఫెర్రీలు.... దూసుకు పోతున్న మహిళలకు అభినందనలు.

యోగా కాలమ్

ఊపిరితిత్తుల సామర్థ్యం పెరగడానికి...

పొత్తి కడుపు కొవ్వును తగ్గించి, ఛాతీ, ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరచడానికి మత్స్యాసనం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇందులో కఠినమైన విధానం కూడా ఉంది. కానీ, సులువుగానూ ఈ పోజ్‌ను సాధన చేయవచ్చు. త్వరగా శారీరక, మానసిక ప్రశాంతత కలిగించే ఈ ఆసనాన్ని సాధన చేయడానికి..

- మ్యాట్‌పైన వెల్లకిలా పడుకోవాలి.
- అరచేతులను నేల పైన బోర్లా ఉంచాలి.
- కాళ్లను నిటారుగా ఉంచి, పాదాలను స్ట్రెచ్ చేస్తూ సాధ్యమైనంత వరకు వంచాలి.
- తుంటి భాగాన్ని కొద్దిగా ఎత్తి, పిరుదుల కింద చేతులను ఉంచాలి.
- తల వెనుక మెడ భాగాన్ని సాగదీస్తూ, నేలపైకి వంచాలి. బరువు ఎక్కువ లేకుండా భంగిమను సరిచూసుకోవాలి. అదే విధంగా వెన్ను భాగాన్ని కూడా కొంత పైకి ఎత్తాలి. ఈ భంగిమ చేప మాదిరి ఉంటుంది కాబట్టి దీనిని ఫిష్ పోజ్ అంటారు.
- నిదానంగా 5 శ్వాసలు తీసుకుంటూ, వదలాలి. తర్వాత తలను యథాస్థానంలో ఉంచి, వెన్నెముకను చాప మీద నిదానంగా ఉంచాలి. ఆ తర్వాత పాదాలను యథాస్థానంలోకి తీసుకొని, చేతులను తుంటి నుంచి బయటకు తీసి, విశ్రాంతి తీసుకోవాలి.



ఇలా చేయడం వల్ల....

- ఈ ఆసనం వల్ల మెడకు, ఊపిరి తిత్తులకు, పొట్టలోని అవయవాలకు చాలా మేలు కలుగుతుంది.
- ఊపిరి తిత్తులు సాధ్యమైనంతవరకు ప్రాణ వాయువును పీల్చి, కొంత సమయం ఉంచగలిగే సామర్థ్యాన్ని పెంచుకుంటాయి.
- వెన్ను, మెడ భాగాలు స్ట్రెచ్ అవడం వల్ల వాటి బలం పెరుగుతుంది.

ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉన్నవారు నిపుణుల సాయం తీసుకోవడం మేలు.


జి.అనూష, యోగా గురు


గిరీష్ గౌడ వంగ తోట

మట్టి + ఆముదం + కుంకుడు ద్రావణంతో పచ్చని పంటలు!



ద్రావణాన్ని పిచికారీ చేయక ముందు, పిచికారి చేసిన 12 రోజుల తర్వాత నిమ్మ మొక్కల ఆకుల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న మార్పు

మట్టి+ఆముదం+కుంకుడు రసం కలిపి చల్లితే (మల్బరీ తప్ప) అన్ని పంటలకు, తోటలకు మేలు

చీడపీడల నుంచి రక్షణతో పాటు గ్రోత్ ప్రమోటర్‌గా పని చేస్తున్న వైనం

పద్మశ్రీ పురస్కార గ్రహీత చింతల వెంకటరెడ్డి (సివిఆర్) మరో ఆవిష్కరణ

పొలంలోని మట్టినే సేంద్రియ ఎరువుగా, పురుగులను నియంత్రించే ద్రావణం వాడి సత్ఫలితాలు పొందటం ద్వారా ఆరోగ్యదాయకమైన ద్రాక్ష, వరి తదితర పంటలు పండించిన ప్రముఖ రైతు శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత చింతల వెంకటరెడ్డి (సివిఆర్) మరో ద్రావణాన్ని రూపొందించారు. మట్టి+ ఆముదంతో పాటు కుంకుడు రసం కలిపి చల్లితే పంటలకు చీడపీడల నియంత్రణతో పాటు పెరుగుదల బాగుందని గుర్తించారు.

ఈ ద్రావణాన్ని తయారు చేసి మొదట తన పెరట్లోని టొమాటో, మొక్కజొన్న పంటలపై ఆయన ప్రయోగించి చూశారు. కేవలం వారం నుండి 10 రోజుల్లోనే పంటలో విపరీతమైన మార్పును గమనించారు. అంతకు ముందు మొక్కజొన్న ఆకులను పురుగులు తినటం, పంట పసుపు పచ్చగా ఉన్నప్పుడు ఈ ద్రావణం పిచికారీ చేశారు.

కేవలం వారం నుంచి పది రోజుల్లోనే ఆ పంట పచ్చదనంతో కళకళలాడుతూ, ఆకులు కూడా వెడల్పుగా రావటం అంటే పంటలో మంచి ఎదుగుదలను గమనించారు. మరి కొందరు రైతులు కూడా సత్ఫలితాలు సాధించటంతో ఈ ద్రావణం సామర్థ్యంపై సివిఆర్ నిర్ధారణకు వచ్చారు.

మట్టి, ఆముదం, కుంకుడు ద్రావణం తయారీ విధానం

లోపలి మట్టి (బాగా జిగటగా ఉండే మట్టి) 10 కిలోలు (ఒక తట్టెడు) తీసుకొని, గడ్డలు చిదిపి మెత్తని మట్టిని సిద్ధం చేసుకోవాలి. ఆ మట్టిలో 250 మి.లీ. నుంచి 500 మి.లీ. వరకు ఆముదం కలపాలి. 250 నుండి 500 గ్రా. కుంకుడు కాయలు తీసుకొని కొంచెం నీటిలో వాటిని రాత్రంతా నానబెట్టాలి. ఉదయం వాటిని చేతితో బాగా పిసికి, విత్తనాలు తీసివేసి, పేస్టులాగా తయారు చెయ్యాలి. అలా తయారైన పేస్టును అంతకు ముందు రోజు ఆముదం కలిపి పక్కన పెట్టిన మట్టిలో వేసి, బాగా కలియతిప్పాలి. ఈ మిశ్రమాన్ని 200 లీటర్ల నీటి డ్రమ్ములో వేసి కర్రతో బాగా కలపాలి. మట్టి మిశ్రమం అంతా నీటిలో బాగా కలిసిపోయిన తర్వాత కొద్దిసేపటికి నీటిలోని మట్టి రేణువులు నీటి అడుగుకు పేరుకుంటాయి. పైకి తేరుకున్న ద్రావణాన్ని వడకట్టి స్ప్రేయర్లలో పోసుకొని పంటపై పిచికారీ చెయ్యాలి. రైతులు ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే మట్టి ద్రావణం నీటిలో కలిపిన తర్వాత 4 గంటల్లోగా పంటపై పిచికారీ చేయాలి. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది. ఆలస్యం అయితే ఆముదం ప్రభావం తగ్గిపోయే అవకాశం ఉంది.

కుంకుడుతో పచ్చదనం వస్తోంది!



పైకి పురుగు కనిపిస్తూ ఉంటే గతంలో చెప్పినట్లు మట్టి 20 కిలోలు, ఆముదం పావు కిలో నుంచి అర కిలో వరకు కలిపిన ద్రావణం చల్లితే పురుగుల నియంత్రణ బాగుంటుంది. అయితే, పెరుగుదల ఉండేది కాదు. మొలకల ద్రావణం చల్లాల్సి వచ్చేది. ఇప్పుడు కుంకుడు రసం కలపటం వల్ల ఆ కొరత తీరి పచ్చదనం వస్తోంది. తెగుళ్ల నివారిస్తుంది. పురుగులను గుడ్లు పెట్టనివ్వదు. అనేక పంటల్లో మంచి ఫలితాలు వచ్చాయి. ఇది చల్లిన వారం, పది రోజుల్లోనే పంటలు ఆకుపచ్చని రంగులోకి మారి, గ్రోత్ వేగాన్ని అందుకుంటున్నది. మల్బరీ తప్ప ఏ పంటలోనైనా చల్లొచ్చు. పత్తి రైతులు కాయ పగలటానికి ముందు దశలోనే ఈ ద్రావణం వాడాలి. టొమాటోలో ఏ తెగుళ్ల, పురుగులూ రాలేదు. మిర్చిలో తామర పురుగు నియంత్రణకు మట్టి, ఆముదం, కుంకుళ్లతో పాటు అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి కూడా కలిపి తయారు చేసిన ద్రావణం వాడుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఈ ద్రావణాన్ని వర్షాలు బాగా పడే రోజుల్లో వారానికోసారి చల్లాలి. ఇప్పటి నుంచి పది రోజులకోసారి చల్లితే సరిపోతుంది. ఇది చల్లిన 2 గంటల వరకు వర్షం పడకపోతే చాలు, పనిచేస్తుంది.

– చింతల వెంకటరెడ్డి (98668 83336), పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఆల్వాల్, సికింద్రాబాద్


గిరీష్ గౌడ్‌కు చెందిన పత్తిపంట



చాలా పంటలపై చల్లా.. రిజల్టు బాగుంది!



మట్టి, ఆముదం, కుంకుడు రసం ద్రావణం వాడిన వారం రోజుల్లోనే చీడపీడల నియంత్రణతో పాటు పంటల్లో పెరుగుదల బాగా కనిపించింది. 10 కిలోల లోపలి మట్టికి 250 ఎంఎల్ ఆముదం కలిపి పెట్టుకోవాలి. కుంకుడు కాయలను గింజలతో పాటు నలగ్గొట్టి, ఉడక బెట్టాలి. నానబెట్టిన దానికన్నా, కుంకుడు విత్తనాలు కూడా పగులగొట్టి ఉడకబెడితే మరింత ప్రయోజనం ఉంటుందని నాకు అనిపించింది. ఆ తెల్లారి కుంకుళ్లను పిసికి రసం తీసుకోవాలి. ఆముదం కలిపిన మట్టిలో ఈ కుంకుడు రసం కలిపి 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేసుకోవాలి. పసుపు, మామిడి, నిమ్మ, అవకాడో, అరటి తదితర పంటలన్నిటిపైనా ఈ ద్రావణాన్ని పిచికారీ చేశాను. వారంలోనే గ్రోత్ చాలా కనిపించింది. నూనెలు చల్లితే గ్రోత్ వస్తుంది. ఇక్కడ ఆముదం వాడుతున్నందున గ్రోత్‌తో పాటు చీడపీడల నియంత్రణ కూడా జరుగుతుంది. మట్టి ద్వారా మినరల్స్ కూడా పంటకు అందుతున్నాయి. 12–15 రోజులకోసారి అన్ని పంటలపైనే పిచికారీ చేస్తున్నా. ఈ రెండు పిచికారీల మధ్య ఒకసారి వేపనూనె పిచికారీ చేస్తే పురుగుల గుడ్లు నశించి మరింత మెరుగైన ఫలితాలుంటాయి.

– పడాల గౌతమ్ (98497 12341), ఎస్టేట్ మేనేజర్, రుషి వ్యాలీ స్కూల్, మదనపల్లి

పత్తి సహా అన్ని పంటలూ..

దివంగత సంజీవరెడ్డి సూచనలతో 2007 నుంచి మా 20 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. 2014లో 'సాక్షి సాగుబడి'లో సివిఆర్ మట్టి ద్రావణం గురించి చదివినప్పటి నుంచి వంగ, సాంబారు దోస, పూల తోట, వేరుశనగ వంటి అన్ని పంటలకూ లోపలి మట్టి+ ఆముదం ద్రావణం వాడుతూ మంచి ఫలితాలు పొందుతున్నాను. సివిఆర్ కొత్తగా చెప్తున్నట్లు మట్టి, ఆముదంతోపాటు కుంకుడు రసం కూడా కలిపి పత్తి పంట 20 రోజుల దశలో రెండు నెలల క్రితం ఒకసారి, ఆ తర్వాత మరోసారి పిచికారీ చేశాను. పంట ముదురు ఆకుపచ్చగా బలంగా పురుగుల బెడద లేకుండా పెరిగింది. ఇప్పుడు పత్తి తీస్తున్నాను. ఇతర రైతులతో కూడా మట్టి ద్రావణం వాడిస్తున్నాం.



– పి. గిరీష్ గౌడ్ (80732 45976), ఇనగలూరు, అగళి మండలం, సత్యసాయి జిల్లా

సాగుబడి
చిత్త కార్తె : అక్టోబర్ 24 వరకు
స్వాతి కార్తె : అక్టోబర్ 25 నుండి

ప్రకృతి సేద్యం.. గ్రేట్ లెర్నింగ్!

- ఏపీలో ఇటీవల పర్యటించిన నీతి ఆయోగ్, ఐసిఎఆర్ ఉన్నత స్థాయి బృందం
- ప్రకృతి వ్యవసాయదారులకు సబ్సిడీ, మద్దతు ధర ఎలా ఇవ్వాల్లో ఆలోచిస్తాం
- వ్యవసాయ విస్తరణ, పరిశోధన, బోధనల్లో ప్రకృతి సేద్యానికి చోటు కల్పిస్తాం
- ప్రకృతి సేద్యం ఇంత గొప్పగా ఉంటుందని ఊహించలేదన్న నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొ. రమేశ్ చంద్



సుభాష్ పాలేకర్ కృషితో ప్రాథమిక రూపంలో ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయం గత కొన్నేళ్లలో అనేక ఆవిష్కరణలతో శాస్త్రీయతను సంతరించుకుంటూ క్లైమెట్ ఎమర్జెన్సీని తట్టుకునేలా ఆశ్చర్యకరమైన రీతిలో పరిపుష్టమవుతూ, ప్రకృతి వైపరీత్యాలను దీటుగా తట్టుకుంటూ కొత్త పుంతలు తొక్కుతోందని నీతి ఆయోగ్ సభ్యుడు, వ్యవసాయ నిపుణుడు ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్ చంద్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయ వికాసం తీరు తెన్నులను ఇటీవల రెండు రోజుల పాటు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన తమ నీతి ఆయోగ్, ఐసిఎఆర్ నిపుణుల బృందానికి ఒక గొప్ప అభ్యాసం (గ్రేట్ లెర్నింగ్)గా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు.

వినూత్న ఆవిష్కరణలు

ఏడేళ్ల క్రితం తాను ఆంధ్రలో పర్యటించినప్పుడు ప్రకృతి వ్యవసాయం పాలేకర్ పద్ధతికి మాత్రమే పరిమితమైందని, ఇప్పుడు వినూత్న ఆవిష్కరణలతో శాస్త్రీయత ప్రాతిపదికపై పురోగమిస్తోందని, క్షేత్రస్థాయిలో ఇంత గొప్పగా ఉంటుందని తాము ముందుగా ఊహించలేదన్నారు. పర్యటన అనంతరం ప్రొ. రమేశ్ చంద్ ఒక వీడియో సందేశంలో తన స్పందనను వెల్లడించారు.

ఏపీ ప్రకృతి సేద్య ఆవిష్కరణలను వివరిస్తూ, రసాయనిక సేద్యంలో, ప్రకృతి సేద్యంలో పక్క పక్కన పొలాల్లోనే సాగవుతున్న వరి పంటను పరిశీలిస్తే.. కరువు, వరదలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ప్రకృతి సేద్యం ఎంత మెరుగైన ఫలితాలనిస్తోందో అర్థమైందన్నారు. అదేవిధంగా, కూరగాయలు, పండ్ల తోటలను పరిశీలించినప్పుడు కూడా ఆశ్చర్యకరమైన ఫలితాలను కళ్లజూశామన్నారు. అరటి తోట సాగు చేస్తున్న ఒక రైతు జీవామృతం వంటి బయో ఇన్‌పుట్స్ కూడా ఇక వాడాల్సిన అవసరం లేనంతగా తన భూమిని సారవంతం చేసుకోవటం ఆశ్చర్యం కలిగించిందని ప్రొ. రమేశ్ చంద్ తెలిపారు. విత్తనాలకు అనేక పొరలుగా మట్టి, జీవామృతాలతో లేపనం చేసి గుళికలు తయారు చేసి, నేలలో తేమ లేని పరిస్థితుల్లో వర్షం రావటానికి ముందే విత్తుతున్నారన్నారు.

విభిన్నమైన దృష్టికోణం

పంటలతో, ఆచ్ఛాదనతో నేలను కప్పి ఉంచటంతోపాటు అనేక పంటలను కలిపి పండిస్తూ జీవవైవిధ్యాన్ని పెంపొందిస్తున్నారన్నారు. గడ్డిని ఆచ్ఛాదనగా వేస్తే చెదలు సమస్య వస్తుంది కదా అని ఓ ప్రకృతి వ్యవసాయదారుడ్ని ప్రశ్నిస్తే.. చెద పురుగులు తమ మిత్రపురుగులని బదులిచ్చారన్నారు. సాధారణ రైతుల అభిప్రాయానికి ఇది పూర్తిగా విభిన్నమైన దృష్టికోణం అని, అన్ని విషయాల్లోనూ ఈ వ్యత్యాసం ఉందన్నారు. ఈ పర్యటనలో రైతులతో స్వయంగా మాట్లాడి అనేక కొత్త విషయాలను తాము నేర్చుకున్నామని, ఇది గ్రేట్ లెర్నింగ్ అని ఆయన అన్నారు. ఐసిఎఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఫార్మింగ్ సిస్టమ్స్ నిపుణులు, మట్టి నిపుణులు, నీతి ఆయోగ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డా. నీలం పటేల్ కూడా మాతో ఈ పర్యటనలో ఉన్నారన్నారు.

ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా రసాయనిక వ్యవసాయానికి సంబంధించిన పద్ధతులను మాత్రమే విస్తరణ, బోధన, పరిశోధన రంగాల్లో అనుసరిస్తున్నామని, ఇక మీదట ప్రకృతి సేద్యాన్ని కూడా భాగం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సబ్సిడీ ఎలా ఇవ్వగలం?

ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంట రసాయన వ్యవసాయంలో పండించిన పంటతో పోల్చితే చాలా మెరుగైనది. నాణ్యతకు తగిన ధర ఎలా కల్పించగలమో ఆలోచించాలి. యూరియా ధరలో 85–90% సబ్సిడీ ఇస్తున్నాం. ప్రకృతి సేద్యాన్ని దేశంలో విస్తరింపజేయటానికి ప్రోత్సాహకాలు ఎలా ఇవ్వాలో ఆలోచించాల్సి ఉందంటూ కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇస్తామన్నారు ప్రొ. రమేశ్ చంద్.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 211

మంగళవారం 22-10-2024




దీపిక ధమాకా
వరల్డ్‌కప్ ఫైనల్ టోర్నీలో ఐదోసారి రజత పతకం గెలిచిన భారత ఆర్చర్ -12లో



సినిమాల్లోకి 'సీరమ్'
కరణ్ ధర్మ ప్రొడక్షన్స్‌లో రూ.వెయ్యి కోట్లతో 50% వాటా కొనుగోలు -13లో


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రపంచానికి భారత్ ఆశాకిరణం
ప్రగతి పథంలో దూసుకెళ్తూ ప్రపంచానికి భారత్ సరికొత్త ఆశాకిరణంలా కనిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸



ఆర్థిక వనరులపై గురి
లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సంస్థ లక్ష్యంగా ఇజ్రాయెల్ ఆర్మీ దాడులను పెంచింది. తాజాగా ఆర్థిక వనరులపై గురిపెట్టింది.
వివరాలు 6లో ▸



ఉగ్రవాదంపై రాజీలేని పోరు
జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతం, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు.
వివరాలు 6లో ▸



కొంకణే కీలకం
కొంకణ్.. మహారాష్ట్ర ఎన్నికల్లో నాలుగో వంతు అసెంబ్లీ స్థానాలతో ప్రతి ఎన్నికల్లోనూ ఫలితాలను శాసిస్తోంది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పెంచిన సీట్లు భర్తీ చేసుకోండి



ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపుపై తాము ఇచ్చిన గత ఉత్తర్వులను అమలు చేసి తీరాలని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పెంచిన సీట్లకు మాప్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలని స్పష్టం చేసినా నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించింది.

- వివరాలు 3లో ▶

తగ్గిన ఫీజులు.. పెరిగిన సీట్లు



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ప్రత్యేక కోటా ఫీజులను భారీగా తగ్గించారు. మరోవైపు ఈ విద్యా సంవత్సరంలో ప్రత్యేక కోటా కింద బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో అదనంగా 200 సీట్లను పెంచనున్నారు.

- వివరాలు 3లో ▶

15% ప్రవేశాల్లేకుంటే మూతే!



వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కాలేజీల్లో కనీసం 15 శాతం మంది విద్యార్థులు చేరాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే జరిగితే దాదాపు 150 డిగ్రీ కాలేజీలు మూతపడే అవకాశం ఉందని తెలుస్తోంది.

- వివరాలు 3లో ▶

శబరిమలకు 'భారత్‌గౌరవ్'



హైదరాబాద్ నుంచి శబరిమలకు తొలిసారి భారత్‌గౌరవ్ రైలు అందుబాటులోకి రానుంది. సికింద్రాబాద్ నుంచి ఈ రైలు ప్రారంభమవుతుంది. నల్లగొండ, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు స్టేషన్‌లలో హాల్టింగ్ ఉంటుంది.

- వివరాలు 14లో ▶



సోమవారం కోఠి మహిళా కళాశాల వద్ద పరీక్ష రాయడానికి వచ్చిన గ్రూప్ -1 అభ్యర్థులు

గ్రూప్-1 షురూ

మెయిన్స్ పరీక్షలు ప్రారంభం.. తొలిరోజు 72.4 శాతం హాజరు

పరీక్షలు వాయిదా వేయాలంటూ కొన్ని రోజులుగా సాగుతున్న ఆందోళనలు, నిరసనల నేపథ్యంలో గ్రూప్–1 మెయిన్స్ సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం మధ్యాహ్నం వరకు కూడా పరీక్షల విషయంలో సుప్రీంకోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుందోనన్న చర్చ నడిచినా.. ఈ అంశంలో జోక్యం చేసుకోబోమంటూ సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అయితే ఫలితాలు వచ్చేలోపు హైకోర్టులో విచారణ పూర్తి చేయాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఆందోళనకు ముఖ్య కారణమైన జీవో 29 అంశంపై హైకోర్టు ఏం తేల్చుతుందన్నది కీలకంగా మారింది. ఇక అభ్యర్థుల్లో 95శాతానికిపైగా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని అధికారులు పేర్కొనగా.. 72.4 శాతం మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షకు హాజరవడం గమనార్హం. మరోవైపు గ్రూప్–1 మెయిన్స్ అభ్యర్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.


2 లో

జీఓ 29పై న్యాయ పోరాటం

- దీనిపై కేసు తేలేవరకు విద్యార్థులకు అండగా ఉంటామన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణేతరులకు ప్రయోజనాలు కల్పించేలా కాంగ్రెస్ కుట్ర

ఫలితాలకు ముందే.. విచారణ ముగించాలి

- గ్రూప్–1పై రాష్ట్ర హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచన
- పరీక్షలు జరుగుతున్న సమయంలో జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం



- తుది తీర్పునకు లోబడే నియామకాలు జరపాలన్న హైకోర్టు ఉత్తర్వుల ప్రస్తావన
- స్టే ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించిన సర్వోన్నత న్యాయస్థానం

ఉన్మాదంతో దాడులు

ప్రార్థనా మందిరాలపై దాడులతో ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టాలని చూస్తున్నారు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



పోలీస్ అమరుల స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డీజీపీ జితేందర్, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తదితరులు

- ప్రజలు సంయమనంతో వ్యవహరించాలి.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవు
- పోలీసులు గౌరవంగా ఉండాలి.. ఒకరి దగ్గర చేయిచాపే పరిస్థితి వద్దు
- పోలీస్ అమరుల కుటుంబాలకు అండగా ఉంటామని ప్రకటన
- వీర మరణం పొందిన పోలీసుల కుటుంబాలకు భారీగా పరిహారం

సాక్షి, హైదరాబాద్: కొందరు ఉన్మాదం, భావోద్వేగంతో మందిరాలు, మజీద్‌లపై దాడులు చేస్తూ.. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడి సంఘటన సహా ఇటీవల జరిగిన మరికొన్ని ఘటనలు ఆందోళనకరమని పేర్కొన్నారు. నేరాలకు పాల్పడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అదేవిధంగా సమాజానికి చెడు చేసేవారి విషయంలో ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. తెలంగాణ సమాజం

మిగతా 2వ పేజీలో ▶

'పోలీసు స్కూల్'కు సీఎం శంకుస్థాపన 2 లో

చందాదారుల వివరాలు ఎందుకివ్వరు?

- పెన్ డ్రైవ్‌లో ఇవ్వడానికి అభ్యంతరం ఏమిటి? ఎందుకివ్వరని మార్గదర్శిని ప్రశ్నించిన హైకోర్టు
- సమాధానం చెప్పడానికి తటపటాయించిన మార్గదర్శి న్యాయవాది
- తదుపరి విచారణ వరకు గడువు ఇవ్వాలని వినతి.. నవంబర్ 4కు వాయిదా వేసిన ద్విసభ్య ధర్మాసనం
- ఆరోజు చందాదారుల వివరాలను పెన్ డ్రైవ్‌లో తేవాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: చందాదారులకు చెల్లింపులపై సుప్రీం కోర్టుకు అందజేసిన 69,531 పేజీల వివరాలను మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్‌కు ఎలక్ట్రానిక్‌ఫార్మాట్‌లో ఇవ్వడానికి అభ్యంతరం ఏమిటని మార్గదర్శి ఫైనాన్సియర్స్‌ను తెలంగాణ హైకోర్టు నిలదీసింది. ఇప్పటికే ఉండవల్లి వద్ద పేపర్ ఫార్మాట్‌లో వివరాలున్నాయని, కొన్ని ఇబ్బందుల కారణంగా ఎలక్ట్రానిక్ ఫార్మాట్ (పెన్ డ్రైవ్)లో కోరుతున్నారని హైకోర్టు తెలిపింది. దీనికి సమాధానం చెప్పేందుకు మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తటపటాయించారు. కొంత గడువు ఇస్తే మార్గదర్శి ఫైనాన్సియర్స్ నుంచి సూచనలు పొంది

మిగతా 14వ పేజీలో ▶



విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించాలని ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావును కోరుతున్న కేటీఆర్ తదితరులు

ప్రైవేట్ విద్యుత్‌తో ప్రజలపై భారం

అధిక ధరకు విద్యుత్ కొనుగోళ్లతో భారీగా నష్టం

జెన్‌కో విద్యుత్ కేంద్రాల నిర్వహణ, మరమ్మతులు మెరుగుపరచాలి

సంస్థ ప్రతిపాదించిన వ్యయాలు హేతుబద్ధంగా లేవు

సామాన్య ప్రజలకు శాపంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు

ఈఆర్సీ బహిరంగ విచారణలో పలువురి స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) థర్మల్, హైడల్ విద్యుత్ కేంద్రాల్లో స్థాపిత సామర్థ్యం మేరకు విద్యుదుత్పత్తి నిర్వహించకపోవడంతో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ఇతర మార్గాల్లో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి భారీగా నష్టపోతున్నాయని సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎం.వేణుగోపాల్ రావు తప్పుబట్టారు. ప్రైవేటు విద్యుత్ కొనాల్సి రావడంతో తుదకు రాష్ట్ర ప్రజలపై భారం పడుతోందని పేర్కొన్నారు. జెన్‌కో ఉత్పాదక సామర్థ్యం తగ్గిపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జెన్‌కో విద్యుత్ కేంద్రాల నిర్వహణ, మరమ్మతులు మెరుగుపరచాలని సూచించారు. ట్రూఅప్ చార్జీలతో పాటు ఎంవైటీ పిటిషన్‌లోని వ్యయాలు అసాధారణంగా, అవాంఛనీయంగా

మిగతా 5వ పేజీలో ▶

ఎన్‌ఐఏతో విచారణ జరిపించాలి

ముత్యాలమ్మ గుడి ఘటనపై బీజేపీ నేతల డిమాండ్ • గవర్నర్, డీజీపీలకు వినతిపత్రాలు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడిపై దాడి, విగ్రహ ధ్వంసంపై దర్యాప్తును జాతీయ దర్యాప్తు విభాగానికి (ఎన్ఐఏ) అప్పగించేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, డీజీపీ జితేందర్‌కు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన జరిగిన ప్రదేశానికి దగ్గరలోని ఓ హోటల్‌లో దేశ వ్యతిరేక శక్తులు, దాడులకు పాల్పడిన వారు నెలల తరబడి జరిపిన అక్రమ కార్యకలాపాలపై నివేదిక తెప్పించుకోవాలని గవర్నర్‌ను కోరారు. రాష్ట్రంలో మూడునెలలుగా దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసంపై సమగ్ర విచారణ జరిపించాలని డీజీపీని కోరారు. సోమవారం ఈ మేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు, డీజీపీ కార్యాలయంలో వేర్వేరుగా ఎంపీలు ఈటల రాజేందర్,

మిగతా 2వ పేజీలో ▶

'చియోంగ్‌చియాన్'పై అధ్యయనం

దక్షిణకొరియాలోని సియోల్‌లో మంత్రి పొంగులేటి నేతృత్వంలో పర్యటన

- 5 రోజులపాటు ప్రాజెక్టులను పరిశీలించనున్న బృందం
- హాన్ నది తరహాలో మూసీని అభివృద్ధి చేయాలనే ప్రణాళిక
- మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌లో ప్రత్యేక పరిశీలన



ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి చియోంగ్‌చియాన్ నదిని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

(సియోల్ నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి దోమూరి వెంకటేశ్వర్‌రెడ్డి)

'మూసీ' ప్రాజెక్టుకు సంబంధించి దక్షిణ కొరియాలోని సియోల్‌లో నదులను అభివృద్ధి చేసిన తీరుపై రాష్ట్ర మంత్రులు, అధికారుల బృందం అధ్యయనం ప్రారంభించింది. అక్కడి హాన్, చియోంగ్‌చియాన్ నదుల పునరుజ్జీవం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నేపథ్యంలో ప్రత్యక్షంగా పరిశీలన చేపట్టింది. హాన్, చియోంగ్‌చియాన్ నదుల పునరుజ్జీవం కోసం చేపట్టిన ప్రాజెక్టుల వివరాలు, పాటించిన పద్ధతులు, విధానాలను క్షుణ్ణంగా తెలుసుకుని.. అదే తరహాలో రాష్ట్రంలో మూసీ నదికి ప్రాణం పోయాలని భావిస్తోంది. ఈ మేరకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ల నేతృత్వంలోని రాష్ట్ర బృందం.. సోమవారం సియోల్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. మంత్రులు తొలుత చియోంగ్‌చియాన్ నది వెంట కలియదిరుగుతూ.. పునరుద్ధరణ ప్రాజెక్టు వివరాలను అక్కడి అధికారుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం చెత్తను రీసైక్లింగ్ చేసి

మిగతా 14వ పేజీలో ▶



క్లుప్తంగా...

మూసీపై సీఎంది పూటకోమాట: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: మూసీ నది ప్రక్షాళనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూటకోమాట మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా విమర్శించారు. మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి కోసం రూ. 1.50 లక్షల కోట్ల ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జూలై 20న సీఎం ప్రకటించారని ఆయన గుర్తుచేశారు. అలాగే సెప్టెంబర్ 6న సీఎం విడుదల చేసిన 'తెలంగాణ గ్రోత్ స్టోరీ: దిరోడ్ టు వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' అనే విజన్ డాక్యుమెంట్‌లోనూ ఇదే విషయాన్ని పొందుపరిచారని పేర్కొన్నారు. కానీ దీనిపై విపక్షాలు ప్రశ్నిస్తే తాను ఎన్నడూ రూ. 1.50 లక్షల కోట్ల ఖర్చవుతుందని చెప్పలేదంటూ సీఎం ఆవేశంతో ఊగిపోతున్నారని హరీశ్ ఎద్దేవా చేశారు. మూసీ పునరుజ్జీవం పేరిట ప్రజాధనం లూటీ చేయాలనుకొనే ప్రభుత్వ కుట్రను బట్టబయలు చేస్తామనిస్పష్టం చేశారు.

ప్రవీణ్‌ను ఆహ్వానించి అరెస్టు చేస్తారా?

గోషామహల్ స్టేడియంలో జరిగిన పోలీసు అమరుల సంస్మరణ కార్యక్రమానికి మాజీ ఐపీఎస్ అధికారి, తమ పార్టీ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌ను ఓవైపు ఆహ్వానించి మరో వైపు హౌస్ అరెస్ట్ చేయడాన్ని హరీశ్‌రావు ఖండించారు. కాగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రకటన చేశారని.. ఆయన వ్యాఖ్యలు హాస్యాస్పదమని హరీశ్‌రావు ఓ ప్రకటనలో మండిపడ్డారు.

ఈఎస్‌ఐ ఆసుపత్రి పెట్టండి

కేంద్ర కార్మిక శాఖ మంత్రికి బండి సంజయ్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: కరీంనగర్ జిల్లాలో ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్సూక్ మాండవీయకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం మాండవీయను కలిసి కరీంనగర్ జిల్లాలో ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కరీంనగర్ జిల్లా కేంద్రం మెడికల్ హబ్‌గా మారిందని, ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి అత్యధిక మంది ప్రజలు వైద్యం కోసం కరీంనగర్‌కు వస్తున్నారని వివరించారు. ఉత్తర తెలంగాణలో బీడీ, నేత కార్మికులుసహా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య అధికంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయడంవల్ల ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. త్వరలో ఆసుపత్రి ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని మాండవీయ హామీ ఇచ్చినట్లు బండి సంజయ్ తెలిపారు.

రిజర్వుడ్ వర్గాలను రాకుండా చేసే కుట్రలు

బీఆర్‌ఎస్ నేత దాసోజు ఫైర్



సాక్షి, న్యూఢిల్లీ: ఓపెన్ కేటగిరీలో రిజర్వుడ్ వర్గాల వారిని రానివ్వకుండా చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డిలు కుయుక్తులు పన్నుతున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఓపెన్ కేటగిరీలో రిజర్వుడ్ అభ్యర్థులకు రిజర్వేషన్లు ఉంటాయంటూ కేవలం నోటి మాటలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సుప్రీంకోర్టులో జీవో 29పై జరిగిన వాదనలకు దాసోజు హాజరయ్యారు. విచారణ వాయిదా అనంతరం మీడియాతో దాసోజు మాట్లాడారు. జీవో 29 రద్దు విషయంపై దేశంలోనే ప్రఖ్యాత న్యాయవాది కపిల్ సిబల్ సహా సీనియర్ న్యాయవాదులను నియమించినట్లు చెప్పారు. పరీక్షలు నిర్వహించినా ఫలితాలను మాత్రం ప్రకటించవద్దు అంటూ సుప్రీంకోర్టు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

ఏపీలో ఇద్దరు విద్యార్థినులపై గ్యాంగ్‌రేప్

కాశీబుగ్గ: పుట్టినరోజు వేడుకల పేరిట స్నేహితురాళ్లను తీసుకెళ్లిన యువకులు గ్యాంగ్‌రేప్ చేశారు. ఈ అత్యాచారాన్ని వీడియో తీశారు. సంచలనం కలిగించిన ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో సోమవారం బయటకు వచ్చింది. పట్టణానికి చెందిన ముగ్గురు ఇంటర్ విద్యార్థినులు, ఇంటర్ తప్పి ఖాళీగా తిరుగుతున్న ముగ్గురు యువకులు స్నేహితులు. ఈ నెల 19వ తేదీ శనివారం వారిలో ఒక యువకుడి పుట్టినరోజు కావడంతో అందరూ కలిసి పార్టీ చేసుకోవాలనుకున్నారు. పలాస సినిమా థియేటర్ సమీపంలో ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద బిర్యానీలు, స్వీట్‌షాప్‌లో కేక్‌లు, గిఫ్ట్‌లు, మద్యం సీసాలు కొనుక్కుని ద్విచక్ర వాహనాలపై పలాస–కాశీబుగ్గ జంటపట్టణాలకు 5 కిలోమీటర్ల దూరంగా ఉన్న కాలనీకి చేరుకున్నారు. అక్కడ కేక్‌కట్ చేసి మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరు విద్యార్థినులపై అత్యాచారం చేశారు. తనపై అత్యాచారయత్నాన్ని మరో విద్యార్థిని ప్రతిఘటించింది. దీంతో మూడోవాడు తన మిత్రులు అత్యాచారం చేయడాన్ని వీడియో తీశాడు. రాత్రి 11 గంటల సమయంలో వారంతా ఇళ్లకు చేరుకున్నారు. ఆదివారం ఉదయం మూడో విద్యార్థిని తన తల్లిదండ్రులకు ఈ విషయం చెప్పింది. అత్యాచారానికి గురైన విద్యార్థినుల తల్లిదండ్రులకు విషయం తెలిసినా పరువు పోతుందని మిన్నకుండిపోయారు. బాధిత విద్యార్థిని ఒకరు సోమవారం అనారోగ్యానికి గురవడంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫలితాలకు ముందే.. తుది విచారణ ముగించాలి

గ్రూప్-1పై రాష్ట్ర హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచన ● పరీక్షలు జరుగుతున్న సమయంలో జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం

- ఇప్పుడు వాయిదా అనేది అసాధారణ విషయమని స్పష్టీకరణ
- తుది తీర్పునకు లోబడే నియామకాలు జరపాలన్న హైకోర్టు ఉత్తర్వుల ప్రస్తావన
- స్టే ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించిన సర్వోన్నత న్యాయస్థానం

సాక్షి, న్యూఢిల్లీ: ''ఇప్పటికే గ్రూప్-1 అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లిపోయారు, మరికొందరు వెళ్తున్నారు. ఈ సమయంలో మేం స్టే ఎలా ఇస్తాం? స్టే ఇవ్వడం వలన గందరగోళానికి గురిచేసినట్టే అవుతుంది. ఈ సమయంలో మేం జోక్యం చేసుకోలేం'' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పుడు వాయిదా అనేది అసాధారణ విషయమని పేర్కొంది. అయితే గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి ఫలితాలు వెలువడకముందే తుది విచారణ ముగించాలని రాష్ట్ర హైకోర్టుకు సూచించింది. గ్రూప్-1ను వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించింది. గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని.. పరీక్షలను వాయిదా వేసేలా ఆదేశించాలని కోరుతూ రాంబాబు అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అందరికీ వర్తింపజేయాలని, ఓపెన్ కేటగిరీలో మెరిట్‌తో అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను రిజర్వేషన్ కేటగిరీగా పరిగణించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని అందులో పేర్కొన్నారు. దీనిపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్థీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది.



ఇప్పుడు ఎలా స్టే ఇస్తాం?

''వేలాది మంది విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నారు. ఈ సమయంలో పరీక్షలపై ఎలా స్టే ఇస్తాం'' అని పిటిషనర్ తరపు న్యాయవాది కపిల్ సిబల్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 29 తీసుకువచ్చిందని కపిల్ సిబల్ సమాధానమిచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత ఇన్నేళ్లకు తొలిసారి గ్రూప్-1 పరీక్షలు జరుగుతున్నాయని.. మళ్లీ ఇప్పట్లో గ్రూప్-1 నిర్వహించడం, పోస్టులు భర్తీ చేయడం జరగదని ధర్మాసనానికి వివరించారు. అభ్యర్థులు ఈసారి అవకాశం కోల్పోతే, జీవితంలో మరో చాన్స్ ఉండదని.. అందువల్ల జీవో 29పై స్పష్టత వచ్చే వరకు పరీక్షలు నిర్వహించవద్దని కోరుతున్నామని తెలిపారు.

వాయిదా అనేది అసాధారణ విషయం

ఈ సమయంలో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ జోక్యం చేసుకుంటూ.. ''గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని టీజీపీఎస్సీని ఎలా ఆదేశిస్తాం. అది చాలా అసాధారణ విషయం కదా'' అని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కపిల్ సిబల్.. ఇది వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ వర్సెస్ భూపేంద్ర యాదవ్ కేసులోని సుప్రీం తీర్పు వివరాలను ధర్మాసనం ముందుంచారు. దీంతో.. ''మీరు చెబుతున్నవన్నీ ఓకే.. కానీ పరీక్షలు వాయిదా వేయండి అని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఎలా ఆపగలం'' అని ధర్మాసనం ప్రశ్నించింది. అయితే వాయిదా వేయకుంటే వేల మంది అభ్యర్థులు నష్టపోతారని సిబల్ విన్నవించారు.

ఫలితాలకు ముందే హైకోర్టు విచారణ ముగించేలా

గ్రూప్-1 కేసులో హైకోర్టులో టీజీపీఎస్సీ కౌంటర్ దాఖలు చేసిందని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి సుప్రీం ధర్మాసనానికి తెలిపారు. అలాగే ప్రభుత్వం తమ వాదనలను కౌంటర్ రూపంలో అందజేయనుందని వివరించారు. హైకోర్టు విచారణ సందర్భంగా పరీక్షలు పూర్తవడానికి ఎంత సమయం పడుతుందని ప్రశ్నించిందని.. మూడు నెలల సమయం కావాలని టీజీపీఎస్సీ సమాధానం ఇచ్చిందని వెల్లడించారు. ఈ సమయంలో కపిల్ సిబల్ జోక్యం చేసుకుంటూ.. ''ఫలితాలు వెలువడటానికి మూడు నెలలే సమయం ఉన్న కారణంగా ఈ కేసును ఈరోజే విచారించాలి. కేసుపై స్పష్టత రావాలి'' అని కోరారు. ఇందుకు ధర్మాసనం నిరాకరించింది. ప్రస్తుతం తాము ఏ తీర్పు ఇచ్చినా పరీక్షల ప్రక్రియలో చాలా ప్రభావం చూపే అవకాశాలు ఉంటాయని.. అందువల్ల మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ''తమ తుది తీర్పునకు లోబడే నియామకాలు జరపాలని'' హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది. అయితే పరీక్షల ఫలితాల విడుదలకు ముందే ఈ కేసులో తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. పరీక్షలు వాయిదా వేయాలన్న పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్టు పేర్కొంది.

జీఓ 29పై న్యాయ పోరాటం: కేటీఆర్

- కేసు తేలేవరకు విద్యార్థులకు అండగా ఉంటాం
- తెలంగాణేతరులకు పెద్ద ఎత్తున ప్రయోజనాలు కల్పించేలా కాంగ్రెస్ కుట్ర



సాక్షి, హైదరాబాద్: గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షల విషయంలో విద్యార్థుల కోరిక మేరకు బీఆర్‌ఎస్ సుప్రీంకోర్టులో కేసు వేసిందని, జీఓ 29పై న్యాయ పోరాటం చేస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు చెప్పారు. 'మేము లేవనెత్తిన ఏ అంశాన్నీ సుప్రీంకోర్టు వ్యతిరేకించలేదు. జీఓ 29పై తీర్పు వచ్చేంత వరకు ఫలితాలు ఇవ్వవద్దని ఆదేశించడంతో పాటు వేగంగా విచారణ జరపాలని కోరింది. కోర్టు కేసు తేలేదాకా మేము విద్యార్థులకు అండగా ఉంటాం ..'అని స్పష్టం చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు సంజయ్, కోవాలక్ష్మి, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, రసమయి బాలకిషన్, గ్యాదరి కిశోర్, నరేందర్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'జీవో 29 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను తొలగించేందుకు రేవంత్ ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణేతరులకు పెద్ద ఎత్తున ప్రయోజనాలు కల్పించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. జీవో 29 విషయంలోనే కాదు,ం జీవో 48, గ్రూప్ 4 ఉద్యోగుల విషయంలో కూడా కోర్టులో పోరాడతాం.'అని తెలిపారు.

రేవంత్‌రెడ్డికి సంజయ్ రహస్య మిత్రుడు

'విదేశీ పర్యటనకు వెళ్లిన జర్నలిస్టులను అవమానించానని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మూసీ విషయంలో మాకన్నా ఎక్కువ పోరాడాల్సిన బాధ్యత మీడియాదే. కళ్ల ముందే మూసీ పేరిట జరుగుతున్న కుంభకోణాన్ని ప్రశ్నిస్తున్నాం. మూసీ పేరిట లూటీని మరుగు పరిచేందుకు ప్రభుత్వం నానా తంటాలు పడుతోంది. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ నడుమ రహస్య స్నేహం కొనసాగుతోంది. రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ రహస్య స్నేహితుడు. అందుకే రేవంత్ ప్రభుత్వాన్ని మంత్రులు కూల్చేస్తారంటూ బండి సంజయ్ బాధపడుతున్నాడు. పొంగులేటి ఇంటి మీద ఈడీ దాడులు, కర్ణాటకలో వాల్మీకి స్కామ్, అమృత్ కుంభకోణంలో సీఎం బావమరిదికి కాంట్రాక్టు తదితరాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించడం లేదు..'అని కేటీఆర్ అన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు 72.4 శాతం హాజరు

- ప్రశాంతంగా ప్రారంభమైన గ్రూప్-1 పరీక్షలు
- మొత్తం అభ్యర్థులు 31,383 మంది.. తొలి పరీక్షకు హాజరైనది 22,744 మంది
- ఆందోళనల నేపథ్యంలో 46 కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- తొలి రోజున జనరల్ ఇంగ్లిష్ పేపర్.. ప్రశ్నపత్రం మధ్యస్థంగా ఉందన్న అభ్యర్థులు
- ఏకాగ్రతతో పరీక్షలు రాయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి



నడవలేని స్థితిలో ఉన్న అభ్యర్థిని కుర్చీలో కూర్చోబెట్టి థర్డ్ ఫ్లోర్‌కు మోసుకెళ్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వరుసగా వారం పాటు జరిగే ఈ పరీక్షల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జనరల్ ఇంగ్లిష్ (క్వాలిఫయింగ్ టెస్ట్) పరీక్ష జరిగింది. అభ్యర్థులు, నిరుద్యోగుల ఆందోళనల నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని 46 పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. 1.30 గంటలకు కేంద్రాలను మూసివేశారు. ఆలస్యంగా వచ్చినవారిని పరీక్షా కేంద్రంలోనికి అనుమతించలేదు. ఒకచోట నిమిషం ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి చేరుకున్న అభ్యర్థిని లోపలికి అనుమతించకపోవడంతో.. ఆ అభ్యర్థి ప్రహరీగోడ దూకివెళ్లాడు. కానీ పోలీసులు వెంబడించి పట్టుకుని.. బయటికి పంపించేశారు.

22,744 మంది హాజరు

మొత్తం 563 గ్రూప్-1 పోస్టులకు సంబంధించి మెయిన్స్ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా.. సోమవారం జరిగిన జనరల్ ఇంగ్లిష్ పరీక్షకు 22,744 మంది, అంటే 72.4 శాతం మంది హాజరయ్యారు. సరైన సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోకపోవడంతోపాటు ఇతర కారణాలతో చాలా మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకాలేదని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం గట్టి ఏర్పాట్లు చేసింది. ప్రతి పరీక్షా కేంద్రం చుట్టూరా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు.. పరీక్షా కేంద్రాల వద్ద పరిస్థితిని, నిర్వహణ తీరును పర్యవేక్షించారు.

ఉత్కంఠకు తెర

గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయాలని, జీవో 29ను రద్దు చేయాలనే డిమాండ్‌తో అభ్యర్థులు కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనికితోడు తెలుగు అకాడమీ పుస్తకాలు అధికారికం కావని ప్రభుత్వం పేర్కొనడం, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు, పలు ఇతర అంశాలపైనా ఆందోళన వ్యక్తమైంది. అభ్యర్థులకు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు మద్దతుగా నిలవడంతోపాటు ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. మరోవైపు అభ్యర్థులు న్యాయ పోరాటానికి సైతం దిగారు. వారి పిటిషన్లను హైకోర్టు తిరస్కరించగా.. సోమవారం సుప్రీంకోర్టులో జరిగే విచారణపై ఆశలు పెట్టుకున్నారు. కానీ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో.. ఉత్కంఠకు తెరపడింది.

మధ్యస్థంగా జనరల్ ఇంగ్లిష్ ప్రశ్నపత్రం

మెయిన్స్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన తొలి పరీక్ష.. జనరల్ ఇంగ్లిష్ ప్రశ్నపత్రం మధ్యస్థంగా ఉందని అభ్యర్థులు తెలిపారు. పదోతరగతి స్థాయిలోనే ప్రశ్నలు ఇస్తున్నట్టు టీజీపీఎస్సీ పేర్కొన్నా.. కొన్ని ప్రశ్నలు సులభంగా అనిపించినా, అర్థం చేసుకోవడానికి సమయం పట్టిందని పేర్కొన్నారు. క్వాలిఫయింగ్ పరీక్ష అయిన ఈ పేపర్ చాలా మంది అభ్యర్థులు అర్హత సాధించే విధంగానే ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో జనరల్ ఇంగ్లిష్ కీలకమైనది. అభ్యర్థులు ఈ పరీక్షలో అర్హత సాధిస్తేనే.. తదుపరి పరీక్షలకు సంబంధించిన మార్కులను పరిగణనలోకి తీసుకోవడమే దీనికి కారణమని నిపుణులు చెప్తున్నారు.

అభ్యర్థులకు సీఎం శుభాకాంక్షలు

గ్రూప్-1 మెయిన్స్‌కు హాజరవుతున్న అభ్యర్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పరీక్షలకు హాజరవుతున్న వారందరికీ శుభాకాంక్షలు అంటూ సోమవారం 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ఎటువంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలని.. విజయం సాధించి, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అందులో పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రగతిలో భాగస్వామ్యం కావాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మెయిన్స్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు గ్రూప్-1 ఆఫీసర్లుగా ఎంపికై ప్రజాప్రభుత్వంలో, ప్రగతి తెలంగాణలో భాగస్వామ్యం కావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుట్రలు, కుతంత్రాలతో రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షాలు వేస్తున్న ఎత్తుగడల్లో నిరుద్యోగులు చిక్కకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

త్రిశూల్ విధానంతో పెను ప్రమాదం: బృందా కారత్



వేదికపై పుణ్యవతి, పీకే శ్రీమతి, మరియం దావలే, మల్లు లక్ష్మితో కలిసి అభివాదం చేస్తున్న బృందా కారత్

సింగరేణి (కొత్తగూడెం): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభు త్వం త్రిశూల్ విధా నాలు అవలంబిస్తోందని, వీటితో దేశానికి పెను ప్రమాదమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య(ఐద్వా) మహా సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఒక శాతం ఉన్న కార్పొరేట్ అధిపతులు 40 శాతం సంపదను శాసిస్తున్నారని చెప్పారు. సంపన్ను లకు రూ.40 లక్షల కోట్ల రాయితీలు కల్పించిన కేంద్ర ప్రభుత్వం.. వితంతువులు, ఒంటరి మహిళలు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భో జన కార్మికులకు మాత్రం బడ్జెట్‌లో ఒక్క పైసా కూడా కేటాయించడం లేదని విమర్శించారు. పదేళ్ల బీజేపీ పాలనలో 65 వేల మంది మహిళలు వరకట్న హత్యలకు గురయ్యారని చెప్పారు. అంతకుముందు కొత్తగూడెం పట్ట ణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్య క్రమంలో ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలే, జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి, కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌పై బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

అబిడ్స్ (హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్‌కు ఆయన సోమవారం ఫిర్యాదు అందజేశారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ, హరీశ్‌రావు గతంలో శాసన సభ వ్యవహారాల మంత్రిగా చేసిన అనుభవం ఉండికూడా చిల్లరగా మాట్లాడటం తగదన్నారు. రేవంత్‌రెడ్డిపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.

ఎన్‌ఐఏతో విచారణ జరిపించాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఎం.రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వెంకటరమణా రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, రాకేశ్‌రెడ్డి, నేతలు జి.ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, చింతల రామచంద్రారెడ్డి, ఎన్వీఎస్ఎస్.ప్రభాకర్ తదితరులు వినతిపత్రాలు సమర్పించిన వారిలో ఉన్నారు.

హిందువులపై కేసులు పెడుతున్నారు : ఈటల

రాజ్‌భవన్ వద్ద ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ హిందువులపైనే కేసులు పెడుతున్నారు.. ఆత్మగౌరవాన్ని కించపరిస్తే క్షమించేది లేదు అని సీఎంను హెచ్చరించారు. 'హిందూ దేవాలయాల మీద కొంతమంది దాడి చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. నిందితులను కఠినంగా శిక్షించాలని గవర్నర్‌ను కోరాం' అని ఈటల తెలిపారు.

సీఎం ఖండించలేదు : ఏలేటి

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ దేవాలయాల మీద దాడి జరిగితే సీఎం రేవంత్ ఇంతవరకు ఖండించలేదన్నారు. 'నిందితుల మీద ప్రభుత్వం కేసు పెట్టకుండా ఏం చేస్తోంది? నగరంలో దాడులకు కుట్ర చేసినట్టు తెలుస్తోంది. రాష్ట్ర ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోంది? దేవాలయాల మీద దాడి.. మా తల్లి మీద దాడిలా భావిస్తాం.. తిప్పికొడతా' అని మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.



గవర్నర్‌కి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

స్లీపర్ సెల్స్ కుట్రలు : రఘునందన్‌రావు

ఎంపీ రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ 'ముత్యాలమ్మ టెంపుల్ ఎపిసోడ్‌పై పూర్తిస్థాయి విచారణ జరగాలి. సంఘ విద్రోహశక్తులుఏవైనా కుట్రలు చేస్తున్నాయా అన్నది పరిశీలించాలి' అని డిమాండ్ చేశారు.

ఉన్మాదంతో దాడులు

▶ మొదటి పేజీ తరువాయి

ఎంతో తెలివైనదని, మత విద్వేషాలను అరికట్టడంలో ప్రజలు ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తున్నారని చెప్పారు. 'పోలీస్ అమరుల సంస్మరణ దినం (పోలీస్ ఫ్లాగ్ డే)'సందర్భంగా సోమవారం ఉదయం హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోలీసు అమరుల స్మారకం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ''ప్రజల భద్రత కోసం ఉగ్రవాదులు, మావోయిస్టుల చేతుల్లో మరణించిన అధికారులను స్మరించుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకం. పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారు. అయితే ఏ చిన్న తప్పు జరిగినా ప్రభుత్వం, పోలీసుల ప్రతిష్ట పోతుంది. అలాంటి వాటికి అవకాశం ఇవ్వకూడదు. పోలీసులపై ప్రజల్లో గౌరవం పెరిగేలా పనిచేయాలి. ఒకరి దగ్గర చేయి చాచే పరిస్థితి ఉండకూడదు. ఖద్దరు, ఖాకీలను సమాజం నిశితంగా గమనిస్తుంది. ఆ గౌరవాన్ని కాపాడుకునేలా నడుచుకోవాలి..'' అని సీఎం రేవంత్ సూచించారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై కఠినంగా ఉంటాం

సరికొత్త పంథాలో జరుగుతున్న సైబర్ నేరాలు, యువత భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా ఉంటుందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. నేరస్తులతో కఠినంగా వ్యవహరించాలని, బాధితులతో ఫ్రెండ్లీగా ఉండాలని పోలీసులకు సూచించారు. హైదరాబాద్ నగర పరిధిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సిబ్బందిని, కృత్రిమ మేధ (ఏఐ)ను వాడుకోవాలని డీజీపీ, హైదరాబాద్ సీపీలను ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీసు అమరులపై రాసిన 'అమరులు వారు' అనే పుస్తకాన్ని డీజీపీ జితేందర్, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌లతో కలిసి సీఎం ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ ఐపీఎస్ అధికారుల వద్దకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి ఒక్కరిని పలకరించారు. కార్యక్రమంలో హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, సీఐడీ డీజీ శిఖాగోయల్, అడిషనల్ డీజీలు మహేశ్ భగవత్, సంజయ్‌కుమార్ జైన్ ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా పెంపుపై సీఎంకు ధన్యవాదాలు

పోలీసు అమరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంచుతున్నట్టు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసుల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ ఇవ్వడం, పోలీసు అధికారులు, సిబ్బంది పిల్లల కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు.

పోలీసు అమరులకు భారీగా ఎక్స్‌గ్రేషియా..

విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అలా అమరులైన పోలీస్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సైలకు రూ.కోటి.. ఎస్సై, సీఐలకు రూ.1.25 కోట్లు, డీఎస్పీ, ఏఎస్పీలకు రూ.1.50 కోట్లు, ఎస్పీ స్థాయి నుంచి ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించారు. అదేవిధంగా శాశ్వత అంగవైకల్యానికి గురైన కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సైలకు రూ.50 లక్షలు, ఎస్సై, సీఐ, డీఎస్పీ, ఏఎస్పీ వరకు రూ.60 లక్షలు, ఐపీఎస్‌లకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తామని చెప్పారు. ఇక తీవ్రంగా గాయపడిన వారిలో కానిస్టేబుల్ నుంచి ఏఎస్పీ వరకు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇస్తామని.. ఎస్పీ, ఆపై ర్యాంకు అధికారులు తీవ్రంగా గాయపడితే రూ.12 లక్షలు ఎక్స్‌గ్రేషియాగా ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ఇటీవల మృతి చెందిన ఐపీఎస్ రాజీవ్‌రతన్ కుమారుడికి గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్‌గా, కమాండెంట్ మురళి కుమారుడికి డిప్యూటీ ఎమ్మార్వోగా ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు.

పోలీస్ అమరుడు ఆది ప్రవీణ్ కుటుంబానికి అండగా ఉంటాం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ ప్రాంతంలో ఈ ఏడాది ఫిబ్రవరి 11న కూంబింగ్ ఆపరేషన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో మృతిచెందిన గ్రేహౌండ్స్ జూనియర్ కమెండో ఆది ప్రవీణ్ కుటుంబాన్ని గోషామహల్ స్టేడియం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఆది ప్రవీణ్ భార్య రాథోడ్ లత, కుమారులు ఆది హర్ష, ఆది వివాన్‌లకు పోలీసు స్మారక చిహ్నం జ్ఞాపికను అందించారు. ఆది ప్రవీణ్ భార్య లతకు ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు.

'పోలీసు స్కూల్'కు శంకుస్థాపన

- హైదరాబాద్ శివార్లలోని మంచిరేవులలో 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్' ఏర్పాటు
- పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం: సీఎం రేవంత్



సోమవారం పోలీస్ స్కూల్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, డీజీ (ఇంటలిజెన్స్) శివధర్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలసి ఈ 'పోలీస్ స్కూల్'కు శంకుస్థాపన చేశారు. పోలీసు వ్యవస్థలో కొత్త అధ్యాయానికి దీనితో తెరతీసినట్టు సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇక ''యూనిఫాం సర్వీసులవారి కుటుంబ సభ్యుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. అందులో భాగంగానే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు శంకుస్థాపన చేశాం. ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో గత ప్రభుత్వం పోలీసులను వారి పార్టీ శ్రేయస్సు కోసం ఉపయోగిస్తే.. మా ప్రభుత్వం మాత్రం పోలీసు కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం పనిచేస్తోంది..'' అని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశామని.. కులమతాలకు అతీతంగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం పదేళ్లలో పోలీసులకు ఏమీ చేయలేదని విమర్శించారు. కాగా.. పోలీసు కుటుంబ సభ్యులకు స్కూల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని.. ఇవి కేంద్రీయ విద్యాలయాలకు దీటుగా విద్యను అందిస్తాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. కేంద్రీయ విద్యాలయాల్లో మాదిరిగా.. పోలీస్ స్కూళ్లలోనూ ఇతర విద్యార్థులకు 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

యూనిఫాం సర్వీసుల సిబ్బంది అందరికీ..

పోలీస్ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందితోపాటు ఇతర యూనిఫాం సర్వీసులైన అగ్నిమాపక, ఎక్సైజ్, ఎస్పీఎఫ్, జైళ్లశాఖ సిబ్బంది పిల్లలకు విద్య అందించేందుకు 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'ను ఏర్పాటు చేస్తూ.. హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సంక్షేమ విద్యార్థుల డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచండి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల కమిటీ

ఉపముఖ్యమంత్రి భట్టికి పెంపు ప్రతిపాదనల నివేదిక అందజేత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల్లోని విద్యార్థుల డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ప్రస్తుత చార్జీలు, ప్రతిపాదిత చార్జీలతో కూడిన నివేదికను సోమవారం సమర్పించింది. ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 16 ఏళ్ల కిందట సంక్షేమ విద్యార్థుల డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను పెంచగా ఆ తర్వాత నుంచి పెంచలేదు. పెరిగిన ధరల నేపథ్యంలో విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి ఇటీవల వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన సీఎం.. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అధ్యక్షతన ఈ నెల 17న కమిటీ ఏర్పాటు చేశారు. పలు అధ్యయనాలు చేసిన ఈ కమిటీ... ప్రస్తుత ధరలు, 40 శాతం పెంచాల్సిన ధరలతో డైట్, కాస్మొటిక్ చార్జీల ప్రతిపాదనలను డిప్యూటీ సీఎంకు నివేదించింది. ప్రభుత్వం ధరలు పెంచితే 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

ఉన్నతాధికారుల కమిటీ సమర్పించిన ప్రతిపాదనలివే...

డైట్ చార్జీలు (రూ. లలో)

తరగతి	ప్రస్తుతం	ప్రతిపాదన
3- 7 వరకు	950	1,330
8 -10 వరకు	1,100	1,540
ఇంటర్, డిగ్రీ, పీజీ	1,500	2,100

కాస్మొటిక్ చార్జీలు

తరగతి	విద్యార్థినులు		విద్యార్థులకు..	
	ప్రస్తుతం	ప్రతిపాదన	ప్రస్తుతం	ప్రతిపాదన
3 - 7 వరకు	55	175	62	150
8 -10 వరకు	75	275	62	200

విపక్షాల మాటలకు గ్రూప్-1 అభ్యర్థులు మోసపోవద్దు

- ప్రభుత్వంపై బీఆర్‌ఎస్, బీజేపీ విష ప్రచారం
- టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్



నిజామాబాద్ సిటీ: 'పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నామమాత్రంగా ఉద్యోగాలు ఇచ్చారు. కేవలం పది నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 60 వేల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చింది. గ్రూప్–1 అభ్యర్థులు విపక్షాల మాటలు నమ్మి మోసపోవొద్దు' అని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కు మార్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి జీర్ణించుకోలేని బీఆర్‌ఎస్ నాయకులు విష ప్రచారాలు చేస్తున్నారన్నారు. కేటీఆర్, హరీశ్ రావులు గ్రూప్-1 అభ్యర్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న నినాదంతో ప్రజల్లోకి వెళ్లిన కేసీఆర్.. ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. కేవలం కేసీఆర్ కుటుంబంలో ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. సామాన్యులకు రాలేదన్నారు. సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిన ప్రధాని మోదీని బీజేపీ నాయకులు నిలదీయాలని చెప్పారు. నిజామాబాద్ 'స్మార్ట్ సిటీ' ఎందుకు కాలేదో ఎంపీ అర్వింద్ చెప్పాలని సవాల్ విసిరారు. ప్రధాని నరేంద్రమోదీని ఒప్పించి నిజామాబాద్‌కు స్మార్ట్ సిటీ పథకం తీసుకురావాలని సూచించారు. స్మార్ట్‌సిటీ నిధులతో నిజామాబాద్ ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. నిజామాబాద్‌కు ఇంజినీరింగ్ కళాశాల, సీఎస్‌ఐ మెడికల్ కళాశాల తెస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి, మధుయాష్కీగౌడ్, మానాల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జీఓ 29 ద్వారా బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు బీసీ సంక్షేమ సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 29తో గ్రూప్–1 ఉద్యోగ నియామకాల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధుల బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా బీసీలు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పుడు జీఓ 29 ద్వారా మరింత అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 29ని రద్దు చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో బీసీ మేధావుల ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితరులతో కూడిన ప్రతినిధి బృందం సోమవారం రాజ్‌భవన్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసింది. జనాభా లెక్కలు తేల్చకుండా రిజర్వేషన్లు అమలు చేయడం ఆక్షేపించాల్సిందేనని, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల స్ఫూర్తికి ఇది పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. ఈ మేరకు గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాజభవన్ బయట మీడియాతో మాట్లాడుతూ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు, జీవో నంబర్ 29 బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉరితాడుగా మారిందన్నారు. గవర్నర్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్ తదితరులున్నారు.

రోగులకు ఇబ్బంది కలిగిస్తే కఠినచర్యలు

అధికారులకు మంత్రి దామోదర హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: ఆస్పత్రుల్లో రోగులకు ఇబ్బంది కలిగిస్తే సంబంధిత వైద్య సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. బోధనాస్పత్రుల పనితీరుపై మంత్రి సోమవారం సమీక్షించారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో ఆ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కర్ణన్, వైద్యవిద్య సంచాలకులు (డీఎంఈ) వాణి, గాంధీ, ఉస్మానియా సహా వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. బోధనాస్పత్రుల ఔట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ సర్వీసులు, బెడ్ స్ట్రెంత్ తదితర అంశాలపై డీఎంఈ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఆస్పత్రులపై మరింత నమ్మకం, భరోసా కల్పించేలా పనివిధానం ఉండాలన్నారు. ఆస్పత్రుల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేసి, ఎక్కడైనా శానిటేషన్ సరిగ్గా లేకపోతే వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని, డీఎంఈని మంత్రి ఆదేశించారు.

జర్నలిస్టులకు పటిష్టమైన ఆరోగ్య పథకం

ఆరోగ్య పథకం విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ ఉద్యోగులతోపాటు జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని పటిష్టంగా అమలుచేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం సోమవారం బంజారాహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ కార్యాలయంలో మంత్రి దామోదరను, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌ను కలిసి జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుపై చర్చించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ విషయంపై త్వరలో శాఖాపరంగా ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఆరోగ్య పథకాన్ని ట్రస్ట్ లేదా థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారానైనా నిర్వహించేందుకు ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

15% ప్రవేశాలు లేకుంటే మూతే!

డిగ్రీ కాలేజీల విషయంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి నిబంధనలు కఠినంగా అమలు



- ఈ జాబితాలో 150 డిగ్రీ కాలేజీలు
- కొత్త కోర్సులు పెడితేనే అనుమతులు.. ఉన్నత విద్యలో మార్పులకు శ్రీకారం
- సగం కూడా భర్తీ కాని డిగ్రీ సీట్లు... గ్రామీణ, పట్టణాల్లో పరిస్థితి మరీ దారుణం
- రాష్ట్ర ప్రభుత్వానికి అధికారుల సమగ్ర నివేదిక

సాక్షి, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి కట్టుదిట్టమైన నిబంధనలు అమలులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కనీసం 15 శాతం మంది విద్యార్థులు కాలేజీలో చేరాలని, అన్ని విభాగాల్లోనూ ఇదే స్థాయిలో విద్యార్థులు ఉండాలనే నిబంధనను ఏడాది క్రితమే తీసుకొచ్చారు. అయితే ఇది అమలుకు నోచుకోలేదు. విద్యార్థులు డిగ్రీకి కూడా నగరాల బాటపడుతున్నారు. ఫలితంగా జిల్లా, మండల కేంద్రాల్లోని డిగ్రీ కాలేజీల్లో మౌలిక వసతులు, నాణ్యమైన ఫ్యాకల్టీపై డబ్బు వెచ్చించడం కష్టంగా ఉందని యాజమాన్యాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏడాది కాలంగా 15 శాతం చేరికలు ఉండాలన్న నిబంధనను అమలు చేయలేదని అధికారవర్గాలు అంటున్నాయి. వచ్చే ఏడాది నుంచి ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేస్తే దాదాపు 150 డిగ్రీ కాలేజీలు మూతపడే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలకు కష్టకాలం వచ్చే పరిస్థితి నెలకొంది. కొత్త కోర్సులతో విద్యార్థులను ఆకర్షించగలిగి, సరైన ఫ్యాకల్టీ ఏర్పాటు చేసుకుంటేనే అనుమతులు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు సమగ్ర నివేదికను కూడా కొన్ని నెలల క్రితం ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి అందజేసింది.

స్కిల్స్ కోర్సులదే కాలం



డిగ్రీలో కొన్ని కోర్సులకే విద్యార్థులు ప్రాధాన్యమిస్తున్నారు. కంప్యూటర్స్, లైఫ్‌సైన్స్ కోర్సులకు భవిష్యత్ ఉంటుందని భావిస్తున్నారు. ఈ కారణంగానే తొలి ప్రాధాన్యం ఇంజనీరింగ్‌కే ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిగ్రీ కాలేజీలు ఇంకా అప్‌గ్రేడ్ కావాల్సిన అవసరముంది. స్కిల్‌తో పాటు డిగ్రీ వస్తేనే విద్యార్థికీ భవిష్యత్ ఉంటుంది.
– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్

2024లో దోస్త్ ద్వారా డిగ్రీ సీట్ల భర్తీ ఇలా...

కాలేజీలు	సంఖ్య	సీట్లు	భర్తీ	శాతం
ప్రభుత్వ	160	89,337	55,361	61.96
ప్రైవేట్	815	3,44,793	1,32,388	38.39
రెసిడెన్షియల్	79	23,574	8,693	36.87

సగానికి పైగా సీట్లు ఖాళీ

రాష్ట్రవ్యాప్తంగా 1,055 ప్రైవేట్, ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిల్లో 4,57,704 డిగ్రీ సీట్లున్నాయి. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్–తెలంగాణ (దోస్త్) ద్వారా ఈ సీట్లు భర్తీ చేస్తారు. ఈ ఏడాది నిర్వహించిన దోస్త్ ప్రవేశాల తీరును పరిశీలిస్తే 1,96,442 సీట్లు మాత్రమే వివిధ కోర్సుల్లో భర్తీ అయ్యాయి. 2.61 లక్షలకుపైగా సీట్లు మిగిలిపోయాయి. ఇందులో 70 శాతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కాలేజీలే ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఇష్టారాజ్యంగా ప్రైవేట్ డిగ్రీ కాలేజీలకు అనుమతులు ఇచ్చారు. వాటిల్లో ఫ్యాకల్టీ ఉందా? మౌలిక సదుపాయాలు ఉన్నాయా? అనే విషయాలను పరిశీలించలేదు. 816 ప్రైవేట్ కాలేజీల్లో 3,44,793 సీట్లు అందుబాటులో ఉంటే, చేరిన విద్యార్థులు కేవలం 1,32,388 మాత్రమే. కనీసం 40 శాతం కూడా ప్రవేశాలు లేని ఈ కాలేజీలకు అనుమతులు ఇవ్వడం సరికాదని ఉన్నత విద్యామండలి భావిస్తోంది.

కొత్త కోర్సులుంటేనే...

దేశవ్యాప్తంగా డిగ్రీ కోర్సుల ట్రెండ్ మారింది. సంప్రదాయ డిగ్రీ కోర్సులను విద్యార్థులు ఇష్టపడటం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అనేక కొత్త కోర్సులకు అనుమతులు ఇస్తోంది. హిస్టరీ నేపథ్యమున్న వారు కాంబినేషన్‌గా కంప్యూటర్ సబ్జెక్టును ఎంచుకోవచ్చు. సైన్స్ నేపథ్యమున్న విద్యార్థి ఎకనామిక్స్ లేదా హిస్టరీని అదనపు సబ్జెక్టుగా ఎంచుకునే అవకాశం కల్పించారు. క్రెడిట్ విధానం తీసుకొచ్చిన తర్వాత అనేక రాష్ట్రాల్లో సంప్రదాయ డిగ్రీ కోర్సుల స్థానంలో ఆన్‌లైన్, కాంబినేషన్ కోర్సులతో డిగ్రీలు వస్తున్నాయి. మూడేళ్లకు బదులు, నాలుగేళ్ల ఆనర్స్ కోర్సుల ప్రభావం పెరిగింది. వీటిని దృష్టిలో ఉంచుకొని కంప్యూటర్ కోర్సులు, బీకాంలో ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ డేటాసైన్స్ వంటి కొత్త కోర్సులను అనివార్యంగా కాలేజీలు ప్రవేశపెట్టాలి. హైదరాబాద్ నగరానికి పరిమితమైన ఈ కోర్సులు గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా మార్పులు చేసుకున్న కాలేజీలకే మనుగడ ఉంటుందని ఉన్నత విద్యామండలి వర్గాలు చెబుతున్నాయి.

ఏ కోర్సుల్లో ఎంతమంది? (2024 సంవత్సరం డేటా)

కోర్సు	బీకాం	బీఎస్సీ లైఫ్‌సైన్స్	బీఎస్సీ ఫిజికల్ సైన్స్	బీఏ	బీబీఏ	బీసీఏ	బీబీఎం	బీఎస్‌డబ్ల్యూ	బ్యాచ్‌లర్ ఆఫ్ ఒకేషనల్	డిప్లొమా
ప్రవేశాలు	77,469	36,733	32,181	28,362	15,835	5,170	100	25	11	556

11 మంది హెచ్‌ఎంల సస్పెన్షన్

- స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై ప్రభుత్వం చర్యలు
- సస్పెన్షన్‌ను తప్పుబడుతున్న ప్రధానోపాధ్యాయులు
- జిల్లాలో ఏ స్కూల్‌కైనా వెళ్లేందుకు తమకు హక్కు ఉంటుందని వాదన

సాక్షి, హైదరాబాద్: టీచర్ల బదిలీల్లో స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై 11 మంది పాఠశాల ప్రధానోపాధ్యాయులను విద్యాశాఖ సస్పెండ్ చేసింది. వారిపై విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రాంతీయ జాయింట్ డైరెక్టరేట్ కార్యాలయం నిర్ణయించింది. 2023 సెప్టెంబర్‌లో హెచ్‌ఎంల మల్టీ జోనల్ స్థాయి బదిలీలు జరిగాయి. భార్యాభర్తలు ఉద్యోగులైనప్పుడు ఒకేచోట పనిచేసేందుకు నిబంధనలు సహకరిస్తాయి. ప్రభుత్వం అందుకు కొన్ని పాయింట్లు కేటాయిస్తుంది. ఈ విభాగంలో కొందరు దరఖాస్తు చేసుకోగా వారిలో 11 మంది హెచ్‌ఎంలపై విద్యాశాఖకు ఫిర్యాదులు వచ్చాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, జనగాం జిల్లాల్లో కొంత మంది టీచర్లు వాళ్లకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ ఆప్షన్లు ఇచ్చుకున్నారని, దీనికి స్పౌజ్ పాయింట్లు వాడుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణలపై జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు విచారణ జరిపారు. కమిటీ నివేదిక ఆధారంగా 11 మంది హెచ్‌ఎంలను సస్పెండ్ చేశారు. అయితే జిల్లాలో ఎక్కడైనా స్కూల్‌కు వెళ్లేందుకు హెచ్‌ఎంలకు హక్కు ఉంటుందని, విద్యాశాఖ అధికారులు మాత్రం దీన్ని విస్మరించి దగ్గర్లో ఉన్న స్కూల్‌ను కాదని.. ఎక్కువ దూరం ఉన్న స్కూల్‌కు ఎందుకు వెళ్లారని ప్రశ్నించడం సరికాదని హెచ్‌ఎంలు అంటున్నారు. ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ జరిగేటప్పుడు ఏ స్కూల్ ఎంత దూరంలో ఉందని ఎలా చూస్తారని, కేటాయించిన జిల్లానా? కాదా? అనేదే ముఖ్యమని వాదిస్తున్నారు.

ఇది సమంజసం కాదు..

అనవసర కారణాలతో హెచ్‌ఎంలను సస్పెండ్ చేయడం సమంజసం కాదు. హెచ్‌ఎం పోస్టు మల్టీజోనల్. బదిలీల సాఫ్ట్‌వేర్ అనుమతించిన స్కూళ్లనే వాళ్లు ఎంపిక చేసుకున్నారు. ఇది స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేయడం కాదు. వారిపై తక్షణమే సస్పెన్షన్ ఎత్తేయాలి.
– పి. రాజా భానుచంద్రప్రకాశ్, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

వ్యవసాయ వర్సిటీలో తగ్గిన ఫీజులు.. పెరిగిన సీట్లు

- రూ. 10 లక్షల నుంచి రూ. 5 లక్షలకు తగ్గిన ప్రత్యేక కోటా ఫీజు
- అదనంగా 200 వ్యవసాయ డిగ్రీ సీట్లు పెరుగుదల..
- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కీలక నిర్ణయాలు



ఉన్నతాధికారులతో వీసీ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య

సాక్షి, హైదరాబాద్/ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా చేరిన వెంటనే ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య కీలక నిర్ణయాలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా ప్రత్యేక కోటా (సెల్ఫ్ ఫైనాన్స్) ఫీజులను భారీగా తగ్గించారు. ప్రస్తుతం ప్రత్యేక కోటాలో ఉన్న బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సు నాలుగేళ్లకు కలిపి మొత్తం రూ. 10 లక్షల ఫీజు ఉండగా దాన్ని రూ. 5 లక్షలకు తగ్గిస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. అలాగే ప్రవేశ సమయంలో ఒకేసారి రూ. 3 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ. 65 వేలు మాత్రమే చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు ఈ విద్యాసంవత్సరంలో ప్రత్యేక కోటా కింద బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో అదనంగా 200 సీట్లను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సాధారణ కేటగిరీలో 615 సీట్లు, ప్రత్యేక ఫీజుతో సుమారు 227 సీట్లు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో అదనంగా పెంచిన 200 సీట్లను ఈ–కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు సాధారణ సీట్ల ప్రవేశాల కోసం తొలివిడత కౌన్సెలింగ్ పూర్తవగా గ్రామీణ విద్యార్థుల నుంచి అనూహ్యంగా డిమాండ్ పెరగడాన్ని దృష్టిలో ఉంచుకొని సీట్ల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు వీసీ వివరించారు. అదనంగా పెంచుతున్న సీట్ల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో 2–3 రోజుల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. వ్యవసాయ విద్యకు పెరుగుతున్న డిమాండ్‌ను ఆసరాగా తీసుకొని సాంకేతికంగా గుర్తింపులేని కొన్ని ప్రైవేటు సంస్థలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయని, అలాంటి సంస్థలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వీసీ సూచించారు.

ఆ జిల్లాల్లోనూ వ్యవసాయ కళాశాలలు..

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో ప్రవేశపెడుతున్న వివిధ కోర్సులతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన స్వల్పకాలిక కోర్సులను కూడా రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రవేశపెట్టనున్నట్లు వీసీ ప్రొఫెసర్ జానయ్య తెలిపారు. దీంతోపాటు ఉమ్మడి జిల్లాల్లో ప్రస్తుతం వ్యవసాయ కళాశాలలు లేని నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లోనూ వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి వర్సిటీ ప్రతిపాదించిందన్నారు.

'మూసీ' బాధితులకు బీజేపీ భరోసా



- 23,24 తేదీల్లో పరీవాహక ప్రాంతాలు, 18 ప్రదేశాల్లో పర్యటనలు
- 25న ఇందిరా పార్కు వద్ద కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాధర్నా
- వేలాది మంది బాధితులతో ధర్నా ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడికి నిర్ణయం
- పార్టీ నేతల భేటీలో మూసీ ప్రాజెక్టుపై కార్యాచరణ ఖరారు

సాక్షి, హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కారణంగా నష్టపోయే బాధిత ప్రజలకు అండగా నిలిచి భరోసా కల్పించాలని బీజేపీ రాష్ట్ర శాఖ నిర్ణయించింది. ఈ నెల 23, 24 తేదీల్లో మూసీ పరీవాహక ప్రాంతాలతోపాటు 18 ప్రభావిత ప్రదేశాలను 9 బృందాలుగా ఏర్పడి పరిశీలించనుంది. అలాగే ఈ అంశంపై ఆందోళనలో భాగంగా ఈ నెల 25న కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించనుంది. వేలాది మంది మూసీ ప్రాజెక్టు ప్రభావిత ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలతో ధర్నా చేపట్టడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మూసీ ప్రాజెక్టుపై కార్యాచరణ, హిందూ దేవాలయాలపై దాడుల విషయంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరిగింది. ఈ భేటీలో ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, బీజేఎల్పీ నేత ఏలేటి, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పార్టీ నేతలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, గుజ్జుల, కాసం వెంకటేశ్వర్లు, కృష్ణ యాదవ్, కేఎస్ రత్నం పాల్గొన్నారు.

పర్యటన షెడ్యూల్ ఇలా...

రాజేంద్రనగర్, కార్వాన్, అంబర్‌పేట, బహదూర్‌పుర, గోషామహల్, మలక్‌పేట, ఉప్పల్, చార్మినార్, ఎల్బీ నగర్ నియోజకవర్గాల పరిధిలోని మూసీ ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల్లో ఒక్కో చోట ఒక్కో ఎంపీ, ఒక్కో ఎమ్మెల్యే, రాష్ట్ర, స్థానిక నేతలు పాల్గొనేలా షెడ్యూల్ రూపొందించారు.

సియోల్ స్టడీ టూర్ ఉద్దేశం ఏమిటి?: కాసం వెంకటేశ్వర్లు

మూసీ సుందరీకరణ పేరిట తొలుత పనులు ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు పునరుజ్జీవం అంటూ దక్షిణ కొరియా సియోల్ నగరంలో స్టడీ టూర్‌కు బృందాన్ని తీసుకెళ్లడంలో ఆంతర్యం ఏమిటని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల మేర అప్పుల్లో ముంచి దివాలా తీయిస్తే.. ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు ఎడాపెడా ఖర్చులు చేస్తూ విదేశీ టూర్లకు వెళ్తున్నారని విమర్శించారు.

పెంచిన సీట్లు భర్తీ చేసుకోండి



- ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలకు హైకోర్టు అనుమతి
- మెరిట్ పాటించాలని, క్యాపిటేషన్ ఫీజు వసూలు చేయొద్దని ఆదేశం
- రాష్ట్ర ప్రభుత్వ కోర్టు ధిక్కరణపై ఆగ్రహం
- శిక్ష ఎందుకు విధించకూడదో చెప్పాలంటూ నోటీసులు జారీ

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపుపై తమ ఉత్తర్వులను అమలు చేయాలని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై హైకోర్టు మండిపడింది. పెంచిన సీట్లకు మాప్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలన్న ఆదేశాలపైనా నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించింది. ఈ పరిస్థితుల్లో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకుంటే కాలేజీలు నష్టపోతాయని అభిప్రాయపడింది. ఏఐసీటీఈ, జేఎన్టీయూ అనుమతించిన సీట్ల భర్తీకి కాలేజీలకు స్వేచ్ఛనిచ్చింది. అయితే మెరిట్ పాటించాలని, క్యాపిటేషన్ ఫీజు వసూలు చేయవద్దని ఆదేశించింది. ఇక ధిక్కరణ కేసుపైనే విచారణ చేపడతామంటూ తదుపరి విచారణను వాయిదా వేసింది. తమ ఆదేశాలను ఎందుకు పాటించలేదో, ఎందుకు శిక్ష విధించకూడదో చెప్పాలని ఉన్నత విద్యా శాఖ కమిషనర్ దేవసేన, కార్యదర్శి బుర్ర వెంకటేశం, టీజీ ఈఏపీసెట్ కన్వీనర్ బి.డీన్‌కుమార్, శ్రీరామ్ వెంకటేశ్‌కు నోటీసులిచ్చింది. తదుపరి విచారణలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

ఏమిటీ కేసు..

ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ, జేఎన్టీయూ ఆమోదించిన ప్రకారం కంప్యూటర్ సైన్స్, ఐటీ, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సుల్లో సీట్ల సంఖ్య పెంచి, మాప్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించి వాటిని భర్తీ చేయాలని సెప్టెంబర్ 9న హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆ తర్వాత కూడా ప్రభుత్వం సీట్ల పెంపును అనుమతించలేదంటూ హైకోర్టులో విద్యా జ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ సహా పలు కాలేజీలు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి, స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి, కాలేజీల తరఫున సీనియర్ న్యాయవాదులు దేశాయి ప్రకాశ్‌రెడ్డి, ఎస్.నిరంజన్‌రెడ్డి తదితరులు వాదనలు వినిపించారు.

అధికారుల అలసత్వం క్షమించరానిది..

తొలుత రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు పిటిషన్ కొట్టివేతపై రివ్యూ దాఖలు చేశామని, వాదనలు వినిపించడానికి సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాలు ఉల్లంఘించాలనే ఉద్దేశం లేదని, ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తి కావడంతో మాప్ అప్ సాధ్యం కాదని చెప్పారు. అయితే ఏఐసీటీఈ కౌన్సెలింగ్ ప్రక్రియకు విధించిన గడువు ఈ నెల 23తో ముగుస్తుందని కాలేజీల తరఫు న్యాయవాదులు చెప్పారు. కోర్టు ధిక్కరణ కింద అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ అలసత్వం క్షమించరానిదని వ్యాఖ్యానించింది. విద్య, కాలేజీలకు సంబంధించిన అంశాల్లో రాజకీయాలు చూడరాదని, సర్కార్ అందుకే అనుమతి ఇవ్వనట్లుగా భావించాల్సి వస్తోందని చెప్పింది. తదుపరి విచారణలో కోర్టు ధిక్కరణపై వాదనలు విని చట్టప్రకారం శిక్షపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు సర్కారు

నాలుగు ఇంజనీరింగ్ కళాశాలలు తమ సీట్లను భర్తీ చేసుకోవచ్చంటూ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తీర్పు అమలు చేస్తే ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని భావిస్తోంది. సింగిల్ జడ్జి వెలువరించే పూర్తి స్థాయి ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాలని డివిజన్ బెంచ్ పేర్కొందని, ఒకవేళ సింగిల్ జడ్జి తీర్పు ప్రస్తుత తీర్పునకు వ్యతిరేకంగా వస్తే ఇప్పుడు చేరే విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోతారు కాబట్టి సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది.



ఒక ఎద్దు గనక బొమ్మ గీయగలిగితే,
దాని దేవుడు ఎద్దు ఆకారంలో ఉంటాడు.
– జెనోఫనీజ్

సాక్షి
మంగళవారం, 22 అక్టోబర్ 2024

కుట్రకోణం వెలికితీయాలి..

ఇది కనివిని ఎరుగని కథ. వారంరోజుల్లోనే మన విమానాలకు శతాధికంగా బాంబు బెదిరింపు కాల్స్... వివిధ జాతీయ, అంతర్జాతీయ విమానయాన సంస్థలకు చెందిన పలు విమానాలను అర్ధంతరంగా దింపాల్సి రావడం, దారి మళ్ళించడం, చివరకు ఫైటర్ జెట్ల రక్షణ మధ్య తీసుకువెళ్ళాల్సి రావడం జరిగింది. ఈ–మెయిల్, సోషల్ మీడియా అజ్ఞాత పోస్టుల బెదిరింపులతో భారత వైమానిక రంగం ఉలిక్కిపడింది. ఏ బెదిరింపు వచ్చినా నిశితంగా పరీక్షించి, జాగ్రత్త చేపట్టాలన్నది నిబంధన కావడంతో విమానయాన పరిశ్రమపై తాజా బెదిరింపుల ప్రభావం అంతా ఇంతా కాదు. ఖలిస్తానీ తీవ్రవాది గురుపత్‌వంత్ సింగ్ పన్నూ సైతం ఎయిరిండియా విమానంపై దాడి చేస్తామనీ, నవంబర్ 1–19 మధ్య ఎయిరిండియాలో ప్రయాణించవద్దనీ హెచ్చరించడంతో కథ కొత్త మలుపు తిరిగింది. పెరుగుతున్న భద్రతా సమస్యలపై విమానయాన శాఖ మల్లగుల్లాలు పడుతోంది. బెదిరింపులకు పాల్పడినవారిపై తీవ్ర శిక్షలు విధించేలా చట్టంలో మార్పులు చేయాలనీ, దోషుల్ని విమానయానం నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని భావిస్తున్నామనీ కేంద్ర మంత్రి మాట. భవిష్యత్తుకు పనికొచ్చే ఆ చర్యల మాటెలా ఉన్న వర్తమానంలో తక్షణ మార్గాంతరమేమిటన్నదే ఇప్పుడు ప్రశ్న.

2014 – '17 మధ్య అంతా కలిపి 120 బాంబు బెదిరింపులే రాగా, ఇప్పుడు ఒక్కవారంలోనే 100కు పైగా బెదిరింపులు రావడం గమనార్హం. విమానాల దారి మళ్ళింపు, తక్షణ ల్యాండింగ్ వల్ల అయ్యే ఇంధన వృథా ఖర్చు, వగైరాలతో ప్రతి బెదిరింపు కాల్ వల్ల ఎయిర్‌లైన్స్‌కు రూ. 3 కోట్ల పైగా నష్టమట! ప్రయాణికుల్లో భయాందోళనల్ని పెంచడంతో పాటు ప్రయాణంలో ఆలస్యంతో కీలకమైన పనులు దెబ్బతినడం లాంటివి సరేసరి. రద్దీ ఎక్కువగా ఉండే పండగ సీజన్ కావడంతో కష్టం, నష్టం ఎక్కువ. ఒక్క వారంలోనే వంద బెదిరింపులు వచ్చాయంటే భద్రతా వ్యవస్థలు, సైబర్ సెక్యూరిటీలు ఏం చేస్తున్నట్టు? ఇప్పటి వరకు ఒక మైనర్‌నీ, అతని తండ్రినీ మాత్రమే అరెస్ట్ చేసినట్టు వార్త. నిందితుల్ని వేగంగా కనిపెట్టి, కఠినచర్యలకు ఎందుకు దిగడం లేదు? అయితే ముష్కరులు, తీవ్రవాదులు వర్చ్యువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌ల ద్వారా ఈ నకిలీ బెదిరింపు కాల్స్ చేస్తున్నారు. దాంతో, వారున్న లొకేషన్ కనిపెట్టలేని పరిస్థితి. ఈ సవాలును అధిగమించేందుకు మార్గాలు అన్వేషించాలి.

నిజానికి, విమాన సర్వీసులకే కాదు... కొద్ది నెలలుగా రైల్వేలకూ ఈ బెడద తప్పడం లేదు. రైల్వే ట్రాకుల మీద రాళ్ళు, గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్ నింపిన సీసాల లాంటివి దుండగులు పెడుతున్న ఘటనలు చూస్తున్నాం. ఆ మధ్య అనేక చోట్ల వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను లక్ష్యంగా చేసుకొని రాళ్ళు విసిరిన ఉదంతాలూ చూశాం. ఈ చర్యల వెనుక పెద్ద పన్నాగమే ఉందని విశ్లేషకుల మాట. దేశంలో విమానయాన రంగం వేగంగా దూసుకుపోతోంది. ఒక్క 2023లోనే 15.2 కోట్ల మంది దేశంలో విమానయానం చేశారు. అలాంటిది... ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారత వైమానిక రంగాన్నీ, రైల్వేలనూ గనక అప్రతిష్ఠ పాల్జేస్తే, ఆర్థిక నష్టంతో పాటు భూమి మీదైనా, ఆకాశంలోనైనా సురక్షితంగా ప్రయాణం చేయలేమనే భీతిని దేశ, విదేశీ ప్రయాణికుల్లో పెంచాలన్నది కుట్ర. భయం పెంచి, ప్రాణాలతో చెలగాటమాడే ఇలాంటి విద్రోహ చర్యలను తక్షణం అరికట్టాలి. చిత్రమేమిటంటే, ఐరోపా గగనతలంలోనూ భారత విమానయాన సంస్థలకు బెదిరింపులు వస్తున్నాయి.

భారత ప్రభుత్వం, గూఢచర్య వ్యవస్థలు ఈ వ్యవహారాన్ని తేలికగా తీసుకుంటే పెను ప్రమాదమే! భారత్‌కు తీరని నష్టం కలిగించడమే ధ్యేయంగా పెట్టుకొన్న ఖలిస్తానీ తీవ్రవాది గురుపత్‌వంత్ సింగ్ పన్నూ ఎయిరిండియా విమానాలను పేల్చేస్తామంటూ గత ఏడాది నవంబర్‌లోనూ ఇలానే బెదిరింపులకు దిగాడు. అతను, అతని అనుచరుల ఆనుపానులు, దుశ్చర్యలు తెలిసినప్పటికీ అమెరికా గూఢచారి వ్యవస్థ ఎఫ్‌బీఐ లాంటివి కళ్ళు మూసుకొని, వారిని కాపాడుతూ వస్తుండడమే విషాదం. మరోపక్క దేశీయ విమానాల్లో సిక్కు ప్రయాణికులు కృపాణాలతో ప్రయాణించడాన్ని నిరోధించేందుకు సుప్రీమ్ కోర్టు సైతం నిరాకరించడంతో, పన్నూ లాంటి వారు దాన్ని అవకాశంగా తీసుకొంటే కష్టమే. ఈ ఖలిస్తానీ తీవ్రవాదులు ఒకటికి రెండు తీవ్రవాద బృందాలను కలుపుకొనిపోతే పెను ప్రమాదమే. దాదాపు పాతికేళ్ళ క్రితం 2001 సెప్టెంబర్ 11న తీవ్రవాదులు విమానాల హైజాక్‌తో అమెరికాలోని ప్రపంచ వాణిజ్య కేంద్రం జంట భవనాల కూల్చివేతతో సహా 3 వేల మంది మరణానికి కారణమైన '9/11' ఘటనను విస్మరించలేం.

ఈ పరిస్థితుల్లో ఈ ముష్కరమూకలకు పరోక్షంగా అండగా నిలుస్తున్న అమెరికా, కెనడాలకు పరిస్థితిని వివరించి, దేశ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకొనే దిశగా భారత ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. మన ప్రయాణ వ్యవస్థలతో పాటు పౌరుల భద్రత అత్యంత ప్రధానమని తెలియజెప్పాలి. అవసరమైతే అంతర్జాతీయ న్యాయస్థానాన్నీ, ఐరాస భద్రతా మండలినీ ఆశ్రయించాలి. అదే సమయంలో కొద్దివారాల పాటు టెక్నాలజీని తమ చేతుల్లోకి తీసుకోవడం వల్లే ముష్కరులు '9/11' ఘటనకు పాల్పడగలిగారని మర్చిపోరాదు. సాంకేతికంగా ముష్కర చేష్టలకు వీలు కల్పించే ట్రాన్స్‌సీవర్స్ లాంటి సాంకేతిక సామగ్రిని ఆన్‌లైన్‌లో అమ్మడాన్ని తక్షణం నిషేధించడం అవసరమని నిపుణుల సూచన. అన్నిటి కన్నా ముఖ్యంగా యుద్ధ ప్రాతిపదికన మన విమాన, రైల్వే భద్రతా వ్యవస్థలను పునఃపరిశీలించి, సరికొత్త సవాళ్ళకు అనువుగా పటిష్ఠం చేయాలి. అత్యవసర పరిస్థితిలో అనుసరించాల్సిన ప్రామాణిక ఆచరణ విధానాలను (ఎస్‌ఓపీ) సిద్ధం చేయాలి. అదే సమయంలో అన్ని ఎయిర్‌లైన్స్, వివిధ దేశాల వైమానిక రంగాలు ఒక్కటై, సమాలోచనలు జరపాలి. పెరుగుతున్న ముప్పును పరస్పర సహకారం, సమన్వయంతో ఎలా ఎదుర్కోవాలో చూడాలి.

డాలర్ ఆధిపత్యానికి బ్రిక్స్ గండి?

సందర్భం



నైనాల గోవర్ధన్

అక్టోబర్ 22 నుండి 24 వరకు మూడు రోజులపాటు రష్యాలోని కజాన్ పట్టణంలో బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సమావేశం జరుగనుంది. తొలుత బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో మొదలైన ఈ కూటమిలో అనేక దేశాలు చేరడానికి ఉవ్విళ్లూరుతున్నాయి. ముమ్ముందు 130 దేశాలు చేరే అవకాశం ఉందని అంచనా. పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థ పైన ఆధారపడటాన్ని తగ్గించే క్రమంలో ఒక గణనీయమైన మార్పు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంది. బ్రిక్స్ దేశాలు 65 శాతం లావాదేవీలను తమ దేశీయ కరెన్సీలలో జరుపుతున్నాయి. డాలర్‌కూ, బంగారానికీ సంబంధాన్ని తొలగించిన అమెరికాకు భిన్నంగా బంగారం మద్దతు గల ట్రేడింగ్ కరెన్సీతో పాటు, మల్టీ కరెన్సీ ఫ్లాట్ ఫామ్‌ను బ్రిక్స్ ఆవిష్కరించే అవకాశం ఉంది.

2024 సంవత్సర బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు రష్యా అధ్యక్షత వహిస్తోంది. వివిధ దేశాల అత్యున్నత నాయకులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొంటారు. బ్రిక్స్ విస్తరణ తర్వాత జరుగుతున్న కీలకమైన సమావేశం కాబట్టి, బ్రిక్స్‌లో కొత్త సభ్యులను చేర్చడంతో పాటు, బ్రిక్స్ విస్తరణ కోసం యంత్రాంగాన్ని మరింత పటిష్ఠం చేయడం మీద చర్చ ప్రధానంగా ఉంటుంది. ప్రత్యామ్నాయ చెల్లింపుల వ్యవస్థ స్థాపనను ప్రోత్సహించడం, శీతోష్ణస్థితి మార్పులను ఎదుర్కోవడం, ఇంధన సహకారాన్ని పెంపొందించడం, సప్లై చైన్‌ను రక్షించడం, దేశాల మధ్య శాస్త్రీయ సహకారాన్ని పెంపొందించడం వంటి అంశాలు కూడా ఎజెండాలో ఉంటాయని ఒక కీలక చైనా పరిశోధకుడు వెల్లడించారు.

ఎందుకీ ప్రత్యామ్నాయ వ్యవస్థ?

అమెరికా డాలర్ ఆధిపత్యం కింద ప్రపంచం ఎనిమిది దశాబ్దాలుగా నలిగిపోతోంది. 1944లో బ్రెటన్ వుడ్ కాన్ఫరెన్స్ ద్వారా ఉనికిలోకి వచ్చిన ఈ వ్యవస్థపై పశ్చిమ దేశాలు కూడా ప్రబలమైన శక్తి కలిగి ఉన్నాయి. అమెరికా ఆధిపత్యంతో పాటు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో ప్రపంచం బీటలు బారింది. ప్రపంచీకరణను చైనా చక్కగా వినియోగించుకుని అమెరికా, పశ్చిమ దేశాలను వెనక్కు కొట్టింది. అమెరికా స్వదేశీ విదేశీ అప్పు, ప్రమాదకరంగా 50 ట్రిలియన్ డాలర్లకు చేరింది. మరో వైపున చైనా ప్రపంచ రెండవ ఆర్థిక శక్తిగా ఎదిగి, శాస్త్ర సాంకేతిక రంగాలలో అద్భుతాలను నెలకొల్పుతోంది.

ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థల విశ్లేషణ ప్రకారం, బైడెన్ పదవీ కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా వాటా 15% కంటే తక్కువకి పడిపోయింది. 1999లో 21% కంటే ఎక్కువగా ఉన్నది, స్థిరమైన క్షీణత చూసింది. చైనా 18.76%తో పెద్ద వాటాను కలిగి ఉంది. దశాబ్దాల క్రితపు అమెరికా ఆధిపత్య ప్రపంచ క్రమం, నేటి వాస్తవాలకు తగ్గట్టుగా లేదు. సంపన్న దేశాలు, పేద దేశాలను అన్ని విధాలా అణిచివేస్తున్నాయి. ఈ కాలంలో అమెరికా 210 యుద్ధాలు చేసింది. 180 యుద్ధాలలో ప్రత్యక్షంగా పాల్గొంది. ప్రపంచ ప్రజలకు అమెరికా ఆధిపత్య కూటమిపై నమ్మకం పోయింది. అందుకే, ప్రపంచ ప్రజలందరి ప్రయోజనాలకు, సమానత్వానికి ఉపయోగపడేలా, ప్రత్యామ్నాయ ఆర్థిక, రాజకీయ, న్యాయమైన బహుళ ధ్రువ ప్రపంచ వాణిజ్య వ్యవస్థను నెలకొల్పాల్సిన, నేటి అసమాన ప్రపంచ క్రమాన్ని సమగ్రంగా సంస్కరించవలసిన అగత్యం ఏర్పడింది.

బ్రిక్స్ తొలుత బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాతో మొదలై(బ్రిక్), తర్వాత సౌత్ ఆఫ్రికాను కలుపుకొంది. అటుపై ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లను భాగస్వామ్యం చేసుకుంది. ఇంకా అనేక దేశాలు చేరే అవకాశం ఉంది.



బ్రిక్స్ దేశాల 2023 నాటి శిఖరాగ్ర సమావేశం (ఫైల్)

23 దేశాలు అధికారికంగా దరఖాస్తు పెట్టుకున్నాయి. కరేబియన్ దేశాలలో భాగమైన క్యూబా విదేశాంగ మంత్రి తాము కూడా బ్రిక్స్‌లో భాగం అవుతామని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు లేఖ రాశారు. శ్రీలంక విదేశాంగ మంత్రి పాల్గొంటారని ఆ దేశ అధ్యక్షుడు వెల్లడించారు. ఒక విశ్లేషణ ప్రకారం, బ్రిక్స్‌లో 130 దేశాలు చేరే అవకాశం ఉంది.

ఊపందుకున్న డీ–డాలరైజేషన్

బ్రిక్స్ దేశాలు 65 శాతం లావాదేవీలను తమ దేశీయ కరెన్సీలలో జరుపుతున్నాయి. ఈ ధోరణి వేగంగా పెరుగుతూ, ఆధిపత్య దేశాల ఆంక్షలకు, భూ భౌగోళిక ఉద్రిక్తతలకు దారితీస్తోంది. రష్యా ఆర్థిక మంత్రి జాతీయ కరెన్సీలు, రష్యా రూబుల్‌ను బ్రిక్స్‌లో ఉపయోగిస్తున్నామన్నారు. పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థ పైన ఆధారపడటం తగ్గించే క్రమంలో చరిత్రలో ఎన్నడూ లేని ఒక గణనీయమైన మార్పు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంది.

బ్రిక్స్ తర్వాత, మరో కూటమి 'కామన్వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్' (సీఐఎస్) కూడా డీ–డాలరైజేషన్ ప్రక్రియను ప్రారంభించింది. ఆర్మేనియా, అజర్‌బైజాన్, బెలారస్, కజకిస్తాన్, కిర్గిస్తాన్, మాల్దోవా, రష్యా, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ లాంటి దేశాలు ఈ కూటమిలో ఉన్నాయి. ఈ కూటమి తమ జాతీయ కరెన్సీలతో 85% సరిహద్దు లావాదేవీలను జరిపింది. వాణిజ్యంలో అమెరికా డాలర్‌ను ఉపయోగించడం నిలిపివేసింది. సీఐఎస్ దేశాల మధ్య పరస్పర వాణిజ్యం స్థానిక కరెన్సీలలో జరగడంతో, డాలర్ ఉపయోగం 85% తగ్గిపోయిందని బ్రిక్స్, సీఐఎస్ రూపకర్తల్లో కీలకమైన రష్యా ప్రకటించింది. శాశ్వతంగా అమెరికా డాలర్ పైన ఆధారపడటం తగ్గిస్తామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. రష్యా చైనాల మధ్య గత ఏడాది జరిగిన 200 బిలియన్ డాలర్ల వాణిజ్యంలో డాలర్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, యువాన్ రూబుల్‌లలో కొనసాగించాయి.

ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో రష్యాకు చెందిన 300 బిలియన్ డాలర్లకు పైగా కరెన్సీని అమెరికా ప్రపంచ బ్యాంకింగ్ నెట్‌వర్క్ 'షిఫ్ట్' స్తంభింపజేసింది. ఇరాన్, వెనిజువేలా, ఉత్తర కొరియా, అఫ్గానిస్తాన్ లాంటి అనేక దేశాల డాలర్ల డబ్బును అమెరికా భారీగా స్తంభింపజేసింది. ఇది వేగంగా డీ–డాలరైజేషన్‌కు దోహదం చేసింది. డాలర్ నుంచి గ్లోబల్ సౌత్ దూరంగా వెళ్ళింది. ఈ దేశాల మధ్య స్థానిక కరెన్సీ మార్పిడి బాగా పెరిగింది. రూబుల్‌ను 'రబుల్' (నిర్వీర్యం) చేస్తామంటూ రష్యాపై బైడెన్ విధించిన ఆంక్షలు బెడిసి కొట్టాయి.

అమెరికా 1971లో నిక్సన్ కాలంలో డాలర్‌కూ బంగారానికీ మధ్య సంబంధాన్ని తొలగించింది. వాస్తవ ఉత్పత్తితో సంబంధం లేకుండా 'డాలర్ కరెన్సీ'ని పిచ్చి కాగితాల వలె ముద్రించింది. అమెరికాకు భిన్నంగా బంగారం మద్దతు గల ట్రేడింగ్ కరెన్సీతో పాటు, మల్టీ కరెన్సీ ఫ్లాట్ ఫామ్‌ను బ్రిక్స్ ఆవిష్కరించే అవకాశం ఉంది.

'అట్లాంటిక్ కౌన్సిల్' 'డాలర్ డామినెన్స్' మీటర్ ప్రకారం, అమెరికా డాలర్ నిలువలలో బ్రిక్స్ దేశాల వాటా గణనీయంగా తగ్గిపోయింది. 'స్విఫ్ట్' (ప్రపంచవ్యాప్త అంతర్‌బ్యాంకుల ఆర్థిక టెలీ కమ్యూనికేషన్స్ వ్యవస్థ)కు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ చెల్లింపుల వ్యవస్థ కట్టుదిట్టంగా రూపొందింది. బ్రిక్స్ చైనా కేంద్రంగా బ్లాక్ చైన్ టెక్నాలజీతో సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ 'సీబీడీసీ' ఏర్పాటు చేసింది. ఈ డిజిటల్ కరెన్సీతో ఇప్పటికే 60 దేశాల కేంద్ర బ్యాంకుల మధ్య అంతర్జాతీయ స్థాయిలో రిహార్సల్స్ జరిగాయనీ, మరిన్ని దేశాల మధ్య జరుగుతున్నాయనీ వివిధ అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి.

ఇండియా దారి?

ఇజ్రాయిల్– పాలస్తీనా–హెజ్బొల్లా(లెబనాన్) యుద్ధం వల్ల ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ నిధులు చైనాకు తరలిపోవడం, విదేశీ బ్యాంకుల నుంచి అమెరికా కరెన్సీకి డిమాండ్ పెరగడం వంటి కారణాలతో రూపాయి భారీగా పతనమైంది. రూపాయి మారకపు విలువ చరిత్రలో మొట్టమొదటిసారి అమెరికా డాలర్‌తో అత్యంత దిగువ స్థాయికి అంటే 84.08 రూపాయలకు పడిపోయింది. మంద గమనంలో ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు చైనా ప్రకటించిన ద్రవ్య ఆర్థిక చర్యల తర్వాత విదేశీ పోర్ట్ పోలియో పెట్టుబడిదారులు 'ఇండియా స్టాక్స్ విక్రయించండి, చైనా స్టాక్స్ కొనండి' అనే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. చైనా స్టాక్‌లు చౌకగా ఉండటం వల్ల ఇండియా డబ్బంతా చైనాకు తరలిపోతోంది.

ప్రపంచ కరెన్సీగా ఉన్న డాలర్ అమెరికా ప్రయోజనాలకూ, ఇతర దేశాలపై భారీ ఆంక్షలకూ పనికివచ్చింది తప్ప, మరే సమానత్వ ప్రయోజనమూ డాలర్‌లో లేదు. కాబట్టి బ్రిక్స్ కూటమితో కలిసి, అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయ విధానాలను, కరెన్సీని ఆవిష్కరించడం తప్ప, భారత్ బాగుకు మరో దారి లేదు.

వ్యాసకర్త తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్
మొబైల్: 97013 81799

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గొప్ప మనిషి



తీవ్ర బాధాకర వార్త. భిన్న మతాల మధ్య సయోధ్యకు ఫెతుల్లా గులెన్ 6 దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు. ఆయన మానవీయ వైఖరిని ప్రపంచం గుర్తించింది. మరో ప్రపంచంలో ఆయనకు ఘనమైన స్థానం కోసం ప్రార్థిస్తాను. (తుర్కియే బోధకుడు ఫెతుల్లా అక్టోబర్ 20న మరణించారు.) – ఎస్.వై. ఖురేషీ, కేంద్ర మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్

ఈ దేశంలో ఉండనివ్వండి!



డియర్ అమిత్ షాజీ! నమస్కారం. నేను ఇండియాలో నివసించడానికి ఈ గొప్ప దేశాన్ని నేను ప్రేమించడం కారణం. గత 20 ఏళ్లుగా ఇది నా రెండో ఇల్లు. కానీ హోంశాఖ నా నివాస అనుమతిని జూలై 22 నుంచి పొడిగించడం లేదు. నాకు ఆందోళనగా ఉంది. నన్ను ఉండటానికి అనుమతిస్తే మీకు కృతజ్ఞురాలిని. – తస్లీమా నస్రీన్, బంగ్లాదేశ్ రచయిత్రి

రైట్విట్టర్!



స్వతంత్ర వేదికగా ఉండటానికి బదులుగా ట్విట్టర్ ఇప్పుడు ఎలాన్ మస్క్ ఏర్చికూర్చిన ఫీడ్‌తో ట్రంప్‌కు ఓటు వేయించడానికీ, పిచ్చి కుట్ర సిద్ధాంతాలను నమ్మింపజేయడానికీ ప్రయత్నిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ 'ఇన్‌ఫ్లుయెన్సర్' ఉత్పత్తులను అమ్ముతుంది. ట్విట్టర్ రైట్‌వింగ్ భావజాలాన్ని వ్యాపింపజేస్తుంది. – దేవీ శ్రీధర్, యూఎస్ ప్రొఫెసర్

తప్పుడు మనుషులు



ఒక సాధారణ సూత్రం: 'తప్పుడు సమాచారం' అనే మాటను తరచుగా వాడేవాళ్లే దాన్ని వ్యాప్తి చేయడానికి ఎక్కువగా ప్రయత్నిస్తుంటారు. – ఎలాన్ మస్క్, పారిశ్రామికవేత్త

ఎంత దారుణం!



సోన్‌మార్గ్‌ను ఏడాది పొడవునా చేరడానికి వాళ్లు మనకు అందమైన సొరంగం నిర్మించారు. బదులుగా మనం వాళ్లను చంపేశాం. ఎంత బాధాకర పరిహాసం! (కశ్మీర్ తీవ్రవాదుల దాడిలో వలస కార్మికులు మరణించడంపై.) – తాహిర్ పీర్‌జాదా, జమ్ము – కశ్మీర్ ఆంట్రప్రెన్యూర్

ఇన్ బాక్స్

సంక్షేమంపై చెరగని సంతకం

సివిల్ సర్వీస్ అధికారిగా ప్రజల విశేష మన్ననలను అందుకున్నవారు ఎస్.ఆర్. శంకరన్. ఆయన పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించేవారు. చాలామంది ఆయన నుంచి ప్రేరణ పొంది సివిల్ సర్వీస్ ఎగ్జామ్ రాసి విజయం సాధించేవారు. ఆయన ఒక ఐఏఎస్ అధికారిగా పేదలకు, ముఖ్యంగా దళిత, ఆదివాసీలకు ఎంతో మేలు చేసిన ఆచరణవాది.

1991లో నేను గ్రూప్ వన్ అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖలో ట్రైనింగ్ అవుతున్న రోజుల్లో ఎస్ఆర్ శంకరన్ గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను. ఆయన ఇచ్చిన జీవోలు చదివాను. ముఖ్యంగా సఫాయి కర్మచారులకూ, వెట్టి చాకిరీ చేస్తున్నవారి విముక్తికీ, భూసమస్యల మీదా ఆయన చేసిన కృషి కొనియాడతగినది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దళితులకు రాజకీయ స్వాతంత్ర్యం లభించినా ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాలు అనుకున్నంత స్థాయిలో లభించలేదు. ముఖ్యంగా ఈ సమాజంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి భూ సంస్కరణలు ప్రధాన పాత్ర వహిస్తాయని నమ్మిన వ్యక్తి. భూసంస్కరణలు అంటే మిగులు భూమిని పంచడమేకాదు, వాటిని అభివృద్ధిపరచి, వ్యవసాయ యోగ్యంగా తయారు చేసి, భూమి మీద సర్వ హక్కులు పేదవాడికి కల్పించాలని నమ్మిన గొప్ప అధికారి.



ఎస్.ఆర్. శంకరన్

ఎంతోమందికి తన సొంత నిధులతో చదువు చెప్పించారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పటిష్ఠతకు ఆయన చేసిన కృషి మరువలేనిది. 1992లో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా దళిత, గిరిజనుల అభ్యున్నతికి ఆయన ఎనలేని కృషి చేశారు. ఆయన నిరాడంబర జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం. ఆయన ఎవరి నుంచీ ఎలాంటి సహాయం ఎప్పుడూ ఆశించలేదు. ఎవరికీ ఎప్పుడూ భారం కాకూడదనేది ఆయన సిద్ధాంతం. మాములు ప్యాంటు, అర చొక్క, పాదాలకు స్లిపర్స్... ఇదీ ఆయన ఆహార్యం. బంట్రోతు లేకపోతే ఈయన అధికారి అని తెలుసుకోవడం కూడా కష్టం. సొంత ఇల్లు కూడా లేదు.

గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్ గుంటూరు కలెక్టరేట్ భవనాన్ని మరమ్మత్తులు చేయించి, ఆధునీకరించారు. అందులోని సకల వసతులతో నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్‌కు ఎస్.ఆర్. శంకరన్ పేరు పెట్టారు. దాని ముఖద్వారంలో వారి చిత్ర పటాన్ని చిత్రీకరించవలసినదిగా చెప్పడంతో వారి చిత్ర పటాన్ని యాక్రలిక్ రంగులతో చిత్రించి, వారి ఆమోదంతో ప్రధాన ద్వారం దగ్గర అలంకరించడం ఆనందాన్నిచ్చింది. ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా శంకరన్ జయంతి, వర్ధంతులను నిర్వహిస్తున్న శంకరన్ మెమోరియల్ కమిటీ వారికి కృతజ్ఞతలు.

– రేగుళ్ళ మల్లికార్జునరావు
(నేడు ఎస్.ఆర్. శంకరన్ జయంతి)

కస్టడీ కాలం పెంచడం సబబేనా?

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

కేంద్ర ప్రభుత్వం క్రిమినల్ చట్టాలలో తెచ్చిన మార్పులు మంచివేనా? కొత్త చట్టాల వల్ల సమస్యలు తీరుతాయా? అనే ప్రశ్నలు న్యాయనిపుణులనే కాదు, సాధారణ పౌరులనూ వేధిస్తున్నాయి. అందుకే ఈ విషయాలపై లోతుగా పరిశోధించవలసిన అవసరం ఉంది.

భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 187 కింద నిందితుల కస్టడీ కాలాన్ని పాత చట్టం అనుమతిస్తున్న దానికన్నా కొన్ని రెట్లు పెంచుతారు. అంటే నిందితులు ఎక్కువ కాలం కస్టడీలో ఉండాలి అని దర్యాప్తు అధికారి భావిస్తే కస్టడీ కాలం పెరుగుతుందని దీనర్థం. అంటే పోలీసులు నిందితుడి జీవితాన్ని సాధ్యమైనంత వరకు లాకప్‌కు పరిమితం చేయాలనుకుంటే చేయవచ్చన్నమాట. మరో సమస్య ఏమంటే ఎక్కువ కాలం పోలీసు కస్టడీ తర్వాత... కోర్టు కస్టడీ మొదలవుతుంది. కోర్టు కస్టడీ అంటే పోలీసు కస్టడీ కన్నా గొప్పది, సహించగలిగినది అనుకోవలసిన పనిలేదు. లాకప్‌లో ఉంటే పోలీసులు ఏం చేస్తారో ప్రత్యేకంగా చెప్పనసరం లేదు. ఆ తరువాత జైలు కస్టడీ ప్రారంభమయితే పోలీసు అధికారుల బదులు, జైలు అధికారులు పెట్టే బాధలు కొనసాగుతాయి.

దర్యాప్తు కోసం మొదట ఒక రోజన్నా పోలీసు కస్టడీలో ఉండి తీరాల్సిందే. అయితే కచ్చితంగా దర్యాప్తు 24 గంటల్లో పూర్తవ్వదు. లెక్కబెట్టి 24 గంటలు కాగానే ఇంటికి పంపిస్తారని దీనర్థం కాదు. అబద్ధపు ఆరోపణలను భరిస్తూ, అక్రమ నిర్బంధాన్ని అనుభవిస్తూ చట్ట వ్యతిరేకంగా పోలీస్‌లు అనుకున్నంత కాలం లాకప్‌లో ఉండవల్సిందే. ఇప్పుడు కొత్త చట్టం ప్రకారం దర్యాప్తు సమయం లేక లాకప్‌లో ఉండే సమయం 40 రోజులు లేదా 60 రోజులకు పెరుగుతూ ఉంటుంది. అది గొప్ప సంస్కరణ అంటే... ఆలోచించాల్సిందే! చట్టం ప్రకారం 40 లేదా 60 రోజుల లాకప్ కస్టడీ తరువాత మరింత చట్ట వ్యతిరేక (అక్రమ) నిర్బంధం మొదలవుతుందన్న మాట. ఈ సంస్కరణ వల్ల పోలీసు అధికారాలు విస్తారంగా పెరిగిపోయాయి. దీంతో అధికారుల మధ్య నిందితుడు దిక్కులేని పక్షి అవుతాడు. దాని పర్యవసానం ఏమిటంటే మేజిస్ట్రేట్‌కి బెయిల్ ఇచ్చే అధికారం తగ్గిపోయింది. పోలీసులు నిందితుణ్ణి వదిలిపెట్టడం అనేది అతడి అదృష్టం తదితర అంశాల మీద ఆధారపడి ఉంటుంది. చట్టం ప్రకారం కస్టడీకి ఎంతో కొంత పరిమితి ఉంటుంది. కాని, పోలీసుల అక్రమ కస్టడీలపై ఏ పరిమితీ ఉండదు. నిందితుల అదృష్టం, దేవుడి దయ!

15 రోజుల కస్టడీ మంచిదా కాదా అని సుప్రీం

ఇవీ మన కొత్త చట్టాలు-9



కోర్టు అనేక కేసుల్లో చర్చించింది. ఎట్టి పరిస్థితిలో 15 రోజులు కస్టడీ (లాకప్ లేదా జైల్ నిర్బంధం) దాటడానికి వీల్లేదని అనుపమ్ కులకర్ణీ వర్సెస్ సీబీఐ కేసుకు సంబంధించిన తీర్పులో అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఇప్పుడు పార్లమెంట్‌లోని ఉభయ సభలు తెచ్చిన కొత్త నేర చట్టాలు అమలులోకి వచ్చిన తర్వాత ఈ తీర్పు ఇక ఎంతమాత్రం చెల్లనేరదు. ఇదన్నమాట సంస్కరణంటే. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులను ఎవ్వరూ చదవరు, అర్థం చేసుకోరు. పార్లమెంట్ సభ్యులు ఆ యా పార్టీల విప్‌ల ఆధారంగా చట్టసభల్లో ఓటింగ్‌లో పాల్గొని ఓటేస్తారు. ఇలా క్రిమినల్ చట్టాలు చేసుకుంటూ పోతే మరి పౌర హక్కుల మాటేమిటి? రాజ్యాంగానికి ఉన్న విలువెంత?

బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 187 కింద అంత తీవ్రం కాని నేరాల పరిశోధనలో 40 రోజుల కస్టడీ సమయం ఉంటుంది. తీవ్రమైన నేరాల పరిశోధనకు 60 రోజుల సమయాన్ని ఇస్తున్నారు. 10 సంవత్సరాల జైలు శిక్ష విధించదగిన కేసులలో 40 రోజుల దర్యాప్తుకు అవకాశం ఇస్తారు. ఇంత కన్న తక్కువ శిక్షలు విధించే నేరాలకు ఇంతకు ముందు 15 రోజుల కస్టడీ ఉండేది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 167 కింద మొదటి కస్టడీ కాలం 15 రోజులతో మొదలయ్యేది.

ప్రజాహిత స్నేహపూరిత సంస్కరణలంటే ఇవేనా? ఈ ప్రభుత్వం ప్రజల ప్రేమాభిమానాలను కోరుకునేదే అయితే... జనం లాకప్పులు, కోర్టు కస్టడీ కాలాన్ని పెంచడం ఎందుకు? ఇందులో సంస్కరణ ఏముంది? వికాస్ మిశ్రా వర్సెస్ సీబీఐ కేసులో అధికారులు లాకప్ లేదా కస్టడీ నిర్బంధ సమయం పెంచాలని కోరారు. లంచం ఆరోపణలపై దర్యాప్తు కోసం ఈ కస్టడీ పొడిగింపును కోరింది సీబీఐ. అప్పటికి ఏడురోజుల కస్టడీ పూర్తయింది. నిందితులు హాస్పిటల్‌కు రావలసి వచ్చింది. ఆ తరువాత బెయిల్‌పై విడుదల చేశారు.

సెంథిల్ బాలాజీ కేసులో 15 రోజుల కస్టడీని విడి విడి భాగాలుగా మార్చుకోవచ్చు అని సుప్రీం కోర్టు వివరించింది. అప్పుడు ఈ లిటిగేషన్‌లు కొనసాగుతూ సుప్రీం కోర్టుదాకా పోవడానికి వీలవుతుంది. ఇప్పుడు మారిన పరిస్థితుల్లో 40 నుంచి 60 రోజులు ఇచ్చే కస్టడీని మరింత దారుణంగా వాడుకుంటారనే విమర్శలు ఉన్నాయి. దీనివల్ల సుప్రీం కోర్టుదాకా లిటిగేషన్ నడుపుతూ ఉంటే 15, 40, 60 రోజులకు కస్టడీ పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇదే రాజ్యాంగ వ్యతిరేకం అని ప్రశ్నించాల్సి ఉంది.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

కరుణామయుడు

కొన్ని ముఖ్యమైన కార్యాలను మనం చేయవలసిన సమయంలో చేయక నిర్లక్ష్యం వహించి సమయం దాటి పోయిన తర్వాత చింతిస్తాం. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవటం అంటే అదే మరి. గౌతమ బుద్ధుని కాలంలో కూడా ఒక గ్రామంలో అలాంటి వాడుండేవాడు. ఏడాదికొకసారి బుద్ధుడు ఆ గ్రామంలో ఉండి బోధన చేసేవారు. ఎందరో తండోపతండాలుగా వెళ్ళి ఆయన బోధని వినేవారు. ఆ వ్యక్తి మాత్రం ఏ రోజూ వెళ్ళి ఆయన బోధ వినలేదు.



జ్యోతిర్మయం

గ్రామ ప్రజలంతా బుద్ధుని పొగుడుతుంటే తానూ వెళ్ళి ఆయన్ను దర్శించాలని అనేకసార్లు భావించాడు. కానీ ప్రతిసారీ ఏదో ఒక కారణాన వెళ్ళలేక పోయాడు. ఒక రోజు బుద్ధుడు ఆరోజే తనువు చాలించబోతున్నాడని ప్రజలు అనుకుంటుంటే విన్నాడు. ఆ గ్రామానికి దాదాపు 15 మైళ్ళ దూరంలోనే బుద్ధుడు ఉన్నాడని తెలుసుకున్నాడు. అప్పుడు అతడు కళ్ళు తెరిచాడు. ఎలాగైనా బుద్ధుని కలవాలనీ, తన సందేహాలను తీర్చుకోవాలనీ నిర్ణయించుకున్నాడు. వెంటనే గౌతముడున్న చోటికి పరుగులు తీశాడు. బుద్ధుని శిష్యులను చూసి ఆత్రంగా 'అయ్యా! నాకున్న సందేహాలను బుద్ధునికి చెప్పి తీర్చుకోవాలని ఎంతో శ్రమపడి వచ్చాను. ఆయన ఎక్కడ' అన్నాడు.

'ఇప్పుడే కొంతసేపు ముందు ఆ చెట్టు వద్దకు వెళ్ళారు. ఏకాంతంగా ధ్యానిస్తూ శరీర త్యాగం చేయటానికి. 'ఇంకా ఏమైనా అడుగుతారేమో అడగండి. ఇవే నా చివరి క్షణాలు అని చెప్పారు. ఇక ఎవరూ ఆయనతో మాట్లాడటానికి వీలు లేదు' అని శిష్యులు సమాధానం చెప్పారు. 'అయ్యో! ఎంత పనైంది!' అని ఆ వచ్చిన వ్యక్తి బాధ పడుతూ 'ఒక్క క్షణం నేను ఆయనతో మాట్లాడి వస్తా, నన్ను వెళ్ళనివ్వండి' అని శిష్యులను వేడుకున్నాడు. లేదని వారన్నారు. గౌతమ బుద్ధుడు నెమ్మదిగా కళ్ళు తెరచి ప్రశాంత వదనంతో 'ఇలా నేను ఆయన కొరకే వేచి ఉన్నాను. ఆయన్ను నా వద్దకు పంపండి' అన్నారు. ముప్పై ఏండ్లు తనను నిర్లక్ష్యం చేసిన వ్యక్తి చివరి క్షణాల్లో వస్తే కూడా ఆ కరుణామయుడు తన బోధామృతాన్ని ఆయనకు పంచి ఉద్ధరించాడు.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.పంచమి ఉ.7.32 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** మృగశిర ఉ.11.31 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.7.50 నుండి 9.22 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి రా.10.32 నుండి 11.20 వరకు, **అమృతఘడియలు:** రా.1.20 నుండి 2.55 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.57, **సూర్యాస్తమయం:** 5.33.

క్లుప్తంగా...

వ్యవసాయ కమిషన్‌లో ఏడుగురు సభ్యులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌లో ఏడుగురు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. సభ్యులుగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, న్యాయవాది సునీల్ కుమార్ (ల్యాండ్ సునీల్) (హైదరాబాద్), రాంరెడ్డి గోపాల్‌రెడ్డి (ఖమ్మం జిల్లా), గడుగు గంగాధర్ (నిజామాబాద్ జిల్లా), కేవీ నరసింహారెడ్డి (నాగర్‌కర్నూలు జిల్లా), చెవిటి వెంకన్న యాదవ్ (సూర్యాపేట జిల్లా), మరికంటి భవానిలను నియమించారు.

కోతుల నుంచి తప్పించుకోబోయి మహిళ మృతి


లక్ష్మి

ఖానాపూర్: కోతుల నుంచి తప్పించుకోబోయి ఓ మహిళ మృతిచెందిన ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన బొంగోని లక్ష్మి (50) సోమవారం సాయంత్రం ఇంటి ముందు కూర్చునేందుకు గేటు బయటకు వచ్చింది. ఇదే సమయంలో కోతులు పెద్దసంఖ్యలో రావడంతో దాడి చేస్తాయేమోనన్న భయంతో ఆమె లోపలికి వెళ్లే ప్రయత్నం చేసింది. అంతలోనే కోతులు ఒక్కసారిగా ఆమెపైకి రావడానికి యత్నించాయి. దీంతో లోపలికి పరిగెత్తబోయిన లక్ష్మి కిందపడింది. తలకు తీవ్ర గాయం కావడంతో స్పృహ కోల్పోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కోతులను అక్కడి నుంచి తరిమి ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు లక్ష్మి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. లక్ష్మికి భర్త గంగాగౌడ్, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

నారాయణ కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య


అనూష

నిజాంపేట్: నారాయణ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య–అన్నపూర్ణలకు నలుగురు సంతానం. మూడవ కుమార్తె అనూష (16)ను బాచుపల్లిలోని నారాయణ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్(ఎంపీసీ)లో చేర్పించారు. దసరా సెలవుల అనంతరం ఆదివారం సాయంత్రం 4గంటల సమయంలో అనూషను కాలేజీలో వదిలివెళ్లారు. రాత్రి 7 గంటల సమయంలో కాలేజీ నుంచి తల్లిదండ్రులకు ఫోన్ చేసి అనూష స్పృహ తప్పి పడిపోయిందని ఆస్పత్రికి తీసుకెళుతున్నాం.. తొందరగా రండి అంటూ సమాచారం ఇచ్చారని అనూష సోదరుడు శివకుమార్ చెప్పాడు. తాము వచ్చేలోపే అనూష చనిపోయిందన్నాడు. కాలేజీలో చేర్పించిన తర్వాత పిల్లలు ఎలా ఉన్నారని కనీసం ఎవరూ పట్టించుకోలేదని, ఫీజులు మాత్రం ఠంచన్‌గా కట్టించుకుంటున్నారని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అనూష కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీల్లో విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, కాలేజీ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు పట్ల రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద ఇటీవల నారాయణ కాలేజీని సందర్శించి అక్కడి పరిస్థితులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇది జరిగిన కొద్ది రోజుల్లోనే అనూష ఆత్మహత్య చేసుకోవడం విచారకరమని విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి.

రూ. 50 కోసం అమ్మమ్మను చంపిన మనుమడు

బన్సీలాల్‌పేట్: ఓ మనుమడి క్షణికావేశం అమ్మమ్మ ప్రాణం తీసింది. ఈ సంఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం.. కవాడిగూడ ఉన్నికోట ప్రాంతానికి చెందిన కొత్తకోట సుశీలమ్మ(85) మనుమడు నితిన్(కళావతి కుమారుడు) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. డ్యూటీకి వెళ్లడానికి తనకు 50 రూపాయలు కావాలని, తనను డ్యూటీ వద్ద వదలాలని ఇంట్లో గొడవ పడి నానా హంగామా సృష్టించాడు. తనను ఎవరూ పట్టించుకోకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. ఇవేమీ పట్టించుకోకుండా నితిన్ సోదరుడు గోపి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. దీంతో నితిన్ ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో ఇంట్లోని సెకండ్ ఫ్లోర్‌లో కుర్చీలో కూర్చున్న అమ్మమ్మ సుశీలమ్మను కిందకు నెట్టేశాడు. కింద పడిన ఆమె తీవ్రగాయాలతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న గాంధీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. సుశీలమ్మ కుమార్తె కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు నితిన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. మృతురాలు సుశీలమ్మ స్వస్థలం వరంగల్ జిల్లా కాగా, కొడుకు అక్కడే ఉంటుండగా, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉన్నికోటలోనే ఉంది.

కరెంటు చార్జీల పెంపు ప్రతిపాదన తిరస్కరించండి

- ఆమోదిస్తే రాష్ట్ర ప్రజలపై రూ.18,500 కోట్ల భారం
- విద్యుత్ నియంత్రణ మండలికి కేటీఆర్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు సహా అనేక రంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయని విమర్శించారు. తాజాగా పెద్దయెత్తున విద్యుత్ చార్జీలు పెంచేందుకు సిద్ధం కావడం దారుణమని, ఈ ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించాలని కోరారు. సోమవారం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో పాటు ఈఆర్సీ చైర్మన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్థిర చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని పేర్కొన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్ని కష్టాలు వచ్చినా ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపలేదని తెలిపారు. అన్ని వర్గాలకు ఉచిత విద్యుత్ అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఉన్న విద్యుత్తును ఊడగొట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

డిస్కమ్‌ల ప్రతిపాదన ప్రమాదకరం

అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 'గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి 300 యూనిట్లు దాటిన కనెక్షన్లపై ఫిక్స్‌డ్ చార్జీలను రూ.10 నుంచి రూ.50 పెంచాలనే డిస్కమ్‌ల ప్రతిపాదన ప్రమాదకరం. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే సామాన్యులపై భారీగా విద్యుత్ బిల్లుల భారం పడుతుంది. పరిశ్రమలు అన్నింటినీ ఒకే కేటగిరీగా పరిగణించాలనే ప్రతిపాదన కూడా విడ్డూరం. ఇది రాష్ట్ర ప్రగతికి గొడ్డలి పెట్టుగా మారుతుంది. ఇప్పటికే మందగమనంలో ఉన్న పారిశ్రామిక రంగంపై ఈ నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపుతుంది. రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో ఇప్పటికే కేన్స్ వంటి సంస్థలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లగా ఫాక్స్‌కాన్ విస్తరణపై సందిగ్ధత నెలకొంది. గతంలో రూ.1200 కోట్ల ట్రూ అప్ చార్జీల భారం ప్రజల మీద పడకుండా చూశాం. ఈ నెల 23న విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై జరిగే బహిరంగ విచారణలో మా వాదనలు వినిపిస్తాం..' అని చెప్పారు.

యూపీ ఆర్థిక వ్యవస్థతో పోటీ

ఆర్థిక వృద్ధిలో ఉత్తరప్రదేశ్‌తో తెలంగాణతో పోటీ పడుతోందని కేటీఆర్ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు. జీఎస్టీ వసూళ్లలో విధ్వంసకర విధానాలతో రాష్ట్రంలో ఆఖరి స్థానంలో నిలిచిందన్నారు. గతేడాదితో పోల్చితే తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు ఒకశాతం కంటే దిగువకు పడిపోయాయని, గతంలో ఏటా కనీసం 15 శాతం వృద్ధి నమోదయ్యేదన్నారు. ప్రస్తుతం అబ్కారీ శాఖ మాత్రమే మంచి పనితీరు కనబరుస్తూ గొప్పగా ఫలితాలనిస్తోందంటూ పరోక్ష విమర్శలు చేశారు.

ప్రైవేట్ విద్యుత్‌తో ప్రజలపై భారం

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నాయని, ప్రజలపై భారంపడకుండా నియంత్రించాలని ఈఆర్సీని కోరారు. 2022–23కి సంబంధించి జెన్‌కో దాఖలు చేసిన రూ.830.61 కోట్ల ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనలతో పాటు 2024–25 నుంచి 2028–29 మధ్యకాలానికి సంబంధించిన మల్టీ ఇయర్ టారిఫ్ (ఎంవైటీ) పిటిషన్లపై సోమవారం విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) బహిరంగ విచారణ నిర్వహించింది. వేణుగోపాల్‌రావుతో పాటు పారిశ్రామిక, వ్యాపార సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను వెల్లడించారు. ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రాజు, బండారు కృష్ణయ్యలకు తమ సలహాలు, సూచనలు తెలియజేశారు.

దీర్ఘకాలిక ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకోవాలి

'తక్కువ వ్యవధిలో కీలక పిటిషన్లపై నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలి. విద్యుత్ రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న పెట్టుబడిదారీ అనుకూల విధానాలు సామాన్య ప్రజలకు శాపంగా మారుతున్నాయి. విద్యుత్ సంస్థలను నియంత్రించడానికి ఈఆర్సీ తన పరిధిలోని అధికారాలను వినియోగించుకునే విషయంలో వెనుకాడరాదు..' అని వేణుగోపాల్‌రావు సూచించారు.

ఫిక్స్‌డ్ చార్జీలపై ఫ్యాప్సీ అభ్యంతరం: విద్యుత్ కేంద్రాల ఫిక్స్‌డ్ చార్జీలను అసాధారణ రీతిలో పెంచి ప్రతిపాదించడంపై ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్(ఫ్యాప్సీ) ప్రతినిధి రమణ్‌దీప్ సింగ్ అభ్యంతరం తెలిపారు. పలు పారిశ్రామిక సంఘాల తరఫున ఆయన మాట్లాడారు. 'కొత్తగా నిర్మించిన భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ఫిక్స్‌డ్ చార్జీలు భారంగా మారాయి. దీనితో పోల్చితే పాత విద్యుత్ కేంద్రాలు మెరుగ్గా విద్యుదుత్పత్తి చేస్తున్నాయి. జెన్‌కో ప్రతిపాదించిన వివిధ రకాల వ్యయాలు హేతుబద్ధంగా లేవు. జెన్‌కో వార్షిక నిర్వహణ, పర్యవేక్షణ(ఓఅండ్‌ఎం) వ్యయం రూ.792 కోట్లు ఉంటే, అందులో రూ.696.98 కోట్లు వేతన సవరణ వాటా ఉంది..' అని అన్నారు.

ఐదేళ్లలో ఆదాయ అవసరాలు రూ.43,713 కోట్లు: జెన్‌కో

వచ్చే ఐదేళ్లలో రుణాలకు వడ్డీల చెల్లింపులకు రూ.4,789 కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీలు రూ.35,931 కోట్లు, అదనపు పెన్షన్ వ్యయాలు రూ.8,205 కోట్లు, మూలధన పెట్టుబడి వ్యయాలు రూ.1,664 కోట్లు, ఇతరత్రాలు కలిపి మొత్తం రూ.43,713 కోట్ల ఆదాయం అవసరం కానుందని జెన్‌కో తెలియజేసింది. ఆ మేరకు ఆదాయార్జనకు అనుమతిస్తూ ట్రూఅప్, ఎంవైటీ పిటిషన్లను ఆమోదించాలని విజ్ఞప్తి చేసింది. కాగా జెన్‌కో పిటిషన్లపై పలువురి అభిప్రాయాలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఈ నెల 29లోగా ఈఆర్సీ తన నిర్ణయాన్ని ప్రకటించనుంది.

గోదావరి వరదలో మునిగిన ట్రాక్టర్


- ఇసుక నింపుతుండగా పెరిగిన వరద ఉధృతి


గోదావరి ఉధృతిలో మునిగిపోయిన ట్రాక్టర్

మల్లాపూర్: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వాల్గొండ శివారు వద్ద గోదావరికి ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. దీంతో ఇసుక కోసం వెళ్లిన ట్రాక్టర్ సహా, డ్రైవర్, కూలీలు చిక్కుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కుర్ర పోశయ్యకు ఇసుక అవసరం ఉండటంతో సోమవారం తన ట్రాక్టర్‌పై డ్రైవర్‌తోపాటు కూలీలను గోదావరిలోకి పంపాడు. నది మధ్యలోకి వెళ్లి ఇసుక నింపుతుండగా ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. గమనించిన డ్రైవర్ ట్రాక్టర్‌ను ఒడ్డుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. టైర్లు ఇసుకలో కూరుకుపోయి కదలలేదు. దీంతో ట్రాక్టర్‌ను అక్కడే వదిలి కూలీలతో సహా ఒడ్డుకు చేరాడు. ప్రవాహం మరింత పెరగడంతో ట్రాక్టర్ పూర్తిగా మునిగిపోయింది. విషయం తెలుసుకున్న పోశయ్య గ్రామస్తులతో కలిసి గజ ఈతగాళ్ల, జేసీబీ సహాయంతో మునిగిపోయిన ట్రాక్టర్‌కు తాళ్లను కట్టి ఒడ్డుకు చేర్చాడు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఆదివాసీలపై రాజ్య హింస

- ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభలో ప్రొఫెసర్ హరగోపాల్
- చట్టబద్ధ పాలన లేకుండా ఉద్యమకారులు, ఆదివాసీలను హింసకు గురిచేస్తోందని ధ్వజం


సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆదివాసీలను హింసించడమే రాజ్యం పాలసీగా మారిందని ప్రొఫెసర్ హరగోపాల్ ఆరోపించారు. చట్టబద్ధ పాలన లేకుండా ఉద్యమకారులను, ఆదివాసీలను హింసకు గురిచేస్తోందని మండిపడ్డారు. ఇటీవల కన్నుమూసిన ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభను సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం జీఎన్ సాయిబాబా జీవితం–పోరాటాలపై స్మారకోపన్యాసంలో హరగోపాల్ మాట్లాడారు. పౌరహక్కులు, మానవహక్కుల ఉద్యమానికి సాయిబాబా చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. శారీరక వైకల్యాన్ని అధిగమించి ఆయన ప్రజల పక్షాన నిలబడి చరిత్రలో స్ఫూర్తిదాయకమైన వ్యక్తిగా నిలబడ్డారని ప్రశంసించారు. కానీ నేడు ప్రభుత్వాన్ని విమర్శించిన ప్రతి ఒక్కరినీ నక్సలైట్స్ అంటున్నారని.. స్వయాన ప్రధాని మోదీ సైతం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అర్బన్ నక్సల్‌గా అభివర్ణిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని నక్సలైట్లుగా ముద్రవేయడం సరికాదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి. లక్ష్మణ్ మాట్లాడుతూ దేశంలో ఏ నేరం చేయని ఉద్యమకారులను జైల్లో బంధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్బంధ వ్యతిరేక వేదిక నాయకులు ఎం. రాఘవచారి, అమరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలు పద్మకుమారి, రవిచంద్ర, బల్లా రవీందర్, నారాయణరావుల అధ్యక్షతన సాయిబాబా సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సరోజ్ గిరి, వీక్షణం సంపాదకుడు ఎన్. వేణుగోపాల్, నవలా రచయిత్రి మీనా కందస్వామి, సాయిబాబా సహచరి వసంత, కుమార్తె మంజీర, డాక్టర్ జీలకర్ర శ్రీనివాస్, చైతన్య మహిళా సంఘం నాయకులతోపాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు పల్లె నర్సింహ ఆలపించిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి.

డీఏలు ఇప్పించండి

- సీపీఎస్‌ను రద్దు చేయండి: తెలంగాణ ఉద్యోగుల జేఏసీ



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాన్ని (డీఏ) త్వరగా ఇప్పించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కోరింది. ఇప్పటివరకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై ఈనెల 26వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరింది. చైర్మన్ వి.లచ్చిరెడ్డి అధ్యక్షతన జేఏసీ సోమవారం నాంపల్లిలోని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో భేటీ అయింది. ఈ భేటీలో భాగంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి చర్చించింది. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని కోరింది. జీవో 317 కారణంగా రాష్ట్రంలోని ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్‌కమిటీని నియమించడం, ఆ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి అందజేయడం పట్ల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. నివేదిక కూడా వచ్చినందున త్వరగా ఈ జీవోపై నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అదే విధంగా నగదు రహిత హెల్త్ స్కీంను అమలు చేయాలని, రాష్ట్రంలో కంట్రిబ్యూటరీ పింఛన్ విధానం (సీపీఎస్) రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని ఉద్యోగులకు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరింది.

చేతబడి నెపంతో హత్య

పోలీసుల ఎదుట లొంగిపోయిన ఇద్దరు నిందితులు


చెక్‌డ్యాంలో నుంచి మృతదేహాన్ని వెలికితీస్తున్న గ్రామస్తులు

జూలూరుపాడు: చేతబడి నెపంతో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం రాచబండ్ల కోయగూడెంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కుంజా భిక్షం (40)ను అదే గ్రామానికి చెందిన వరుసకు కొడుకు అయ్యే కుంజా ప్రవీణ్, అతని స్నేహితుడు గంగయ్య కలసి ఆదివారం రాత్రి మద్యం సేవించి వద్దామంటూ గ్రామ సమీపంలోని చెక్‌డ్యామ్ వద్దకు తీసుకెళ్లారు. మద్యం సేవించిన అనంతరం ప్రవీణ్, గంగయ్యలు కలిసి భిక్షం మొహంపై బండరాయితో కొట్టి హత్య చేసి చెక్‌డ్యామ్‌లో పడేశారు. ఆ తర్వాత ఇద్దరూ స్టేషన్‌కు వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయారు. మృతుడు కుంజా భిక్షం మంత్రగాడని, చేతబడి చేయడం వల్లే తమ కుటుంబసభ్యులు కొంతకాలంగా అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. అయితే భిక్షం చేతబడి చేశాడనడం అవాస్తవమని ఆయన కుటుంబసభ్యులు అంటున్నారు. భిక్షం గతంలో ఫారెస్ట్ వాచర్‌గా పని చేశాడని గ్రామస్తులు తెలిపారు. అతడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలియగానే జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ బి.రాణాప్రతాప్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తుల సాయంతో చెక్‌డ్యామ్‌లో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. హత్యకు సంబంధించిన ఆధారాలు, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు కుంజా అర్జున్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాణాప్రతాప్ తెలిపారు.

త్వరలో సమగ్ర కుల సర్వే

గవర్నర్‌ను కలిసిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో సమగ్ర కుల సర్వే చేపట్టనున్నట్లు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ స్పష్టం చేశారు. సోమవారం రాజ్‌భవన్‌లో నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, టి.సురేందర్, శ్రీమతి బాలలక్ష్మి తదితరులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయ్యారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను నిర్ధారించేందుకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వే చేపట్టనున్నట్లు గవర్నర్‌కు వివరించారు. ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బీసీ కమిషన్ బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లతో సమావేశమై ఉమ్మడి జిల్లాల వారీగా కుల జనాభా సంఖ్య, ఇతర వివరాలు సేకరిస్తామని, అదేవిధంగా క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి కూడా విజ్ఞాపనలు స్వీకరించనున్నట్లు వివరించారు. రాష్ట్ర బీసీ కమిషన్ చేపడుతున్న కార్యక్రమాలు, పూర్తి చేసిన పనులకు సంబంధించిన అంశాలను కూడా గవర్నర్‌కు నివేదించారు.

విద్యుదాఘాతంతో నలుగురు రైతుల మృతి

- ఉమ్మడి మెదక్ జిల్లాలో ముగ్గురు, సూర్యాపేట జిల్లాలో ఒకరు


దుర్గేశ్


కిషన్


వెంకన్న

హత్నూర/సదాశివపేట రూరల్ (సంగారెడ్డి)/ వెల్దుర్తి(తూప్రాన్)/ఆత్మకూర్.ఎస్(సూర్యాపేట): రాష్ట్రంలో విద్యుదాఘాతం కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లా వాసులు ముగ్గురు ఉండగా, సూర్యాపేట జిల్లా వ్యక్తి ఒకరు ఉన్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నాగులదేవులపల్లి గ్రామానికి చెందిన పడాల మల్లేశ్‌కు దుర్గేశ్ (30), శ్రీకాంత్ అనే కుమారులు ఉన్నారు. వీరికి రెండు ఎకరాల పొలం ఉంది. పంట కోతకు రావడంతో సోమవారం పెద్ద కుమారుడు దుర్గేశ్ వరి కోత మిషన్‌తో పంట కోయిస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం నుంచి బోరు స్టార్టర్ డబ్బా వరకు ఉన్న కరెంటు వైరు తెగి దుర్గేశ్‌పై పడింది. దీంతో కరెంట్ షాక్ తగిలి అతను పడిపోయాడు. వెంటనే దుర్గేశ్‌ను సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

బోర్ మోటార్ ఆన్ చేస్తుండగా

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన రైతు మునిపల్లి బాబు (35) సోమవారం గ్రామ శివారులోని తన పొలం వద్ద బోర్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

కరెంట్ తీగ కాళ్లకు తగిలి

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన రైతు రాసుపల్లి కిషన్ (55) తనకున్న కొద్దిపాటి భూమిలో వరి పంట సాగు చేస్తున్నాడు. గ్రామ శివారులోని గుట్టకింద వేసిన పంటకు అడవి పందుల బెడద ఎక్కువ ఉండడంతో రక్షణ కోసం చుట్టూ విద్యుత్ తీగలను ఏర్పాటు చేశాడు. సోమవారం ఉదయం ఆయన పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. మధ్యాహ్నం సమయంలో ఆయన కుమారుడు వంశీ పొలం వద్ద వెతుకుతుండగా కరెంటు తీగలవద్ద కిషన్ మృతి చెంది కనిపించాడు.

విద్యుత్ తీగలు కిందికి వేలాడడంతో

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం పీపా నాయక్ తండాకు చెందిన గుగులోతు వెంకన్న(46) అనే రైతు సోమవారం తండా సమీపంలో గేదెలను మేపుతుండగా అక్కడ కిందికి వేలాడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో మృతిచెందాడు. ఈ ప్రమాదాలకు సంబంధించి పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఆధార్‌కార్డు ట్యాంపర్ చేసి రూ.20 లక్షల రుణం

- పంట రుణం కోసం బ్యాంకును సంప్రదించగా వెలుగులోకి
- న్యాయం చేయాలంటూ ప్రజావాణికి వచ్చిన బాధితుడు
- సైబర్ క్రైం పోలీసులకు పంపిన కలెక్టర్


కలెక్టరేట్‌లో బాధితుడు ముంజల నారాయణ

జగిత్యాలటౌన్: తనకు తెలియకుండానే తన ఆధార్‌కార్డుతో హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ బ్యాంకుల్లో గుర్తు తెలియని వ్యక్తులు రూ.20 లక్షల రుణం తీసుకున్నారని, పంట రుణం కోసం వెళ్లగా ఈ విషయం తెలిసిందని, కిస్తీలు చెల్లించాలంటూ బ్యాంకర్లు తనపై ఒత్తిడి చేస్తున్నారని జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూరు గ్రామానికి చెందిన ముంజల నారాయణ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సత్యప్రసాద్‌కు మొరపెట్టుకున్నారు. విషయాన్ని పరిశీలించిన కలెక్టర్.. సైబర్ క్రైంకు పంపించారు. వివరాలిలా ఉన్నాయి.. నారాయణ మద్దునూరులో కల్లుగీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పంట రుణం అవసరమై ఇటీవల కెనరా బ్యాంకుకు వెళ్లగా.. భూమి పాస్‌బుక్ పరిశీలించిన బ్యాంకర్లు తొలుత రుణం ఇచ్చేందుకు అంగీకరించారు. తర్వాత సిబిల్ స్కోర్‌ను పరిశీలించగా.. హైదరాబాద్‌లోని వివిధ బ్యాంకుల్లో అతను రూ.20 లక్షలు బాకీ ఉన్నట్లు వెల్లడైంది. కిస్తీలు సకాలంలో చెల్లించని కారణంగా సిబిల్ స్కోర్ పడిపోయిందని, రుణం ఇవ్వబోమని బ్యాంకు అధికారులు చెప్పారు. దీంతో నారాయణ బుగ్గారం పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సైబర్ క్రైం పోలీసుల దృష్టికి తీసు కెళ్లాలని వారు సూచించారు. నారాయణ సైబర్ క్రైం అధికారులను సంప్రదించగా.. సరైన స్పందన లేకపోవడంతో సోమవారం ప్రజావాణికి వచ్చి కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. తన సమస్యను పరిశీలించిన కలెక్టర్ తిరిగి సైబర్ క్రైం విభాగానికి రెఫర్ చేశారని బాధితుడు తెలిపారు. బ్యాంకు అధికారులు ఇచ్చిన డాక్యుమెంట్లలో తన ఆధార్‌కార్డు ఉందని, పాన్‌కార్డు, అడ్రస్ మాత్రం వేరే వ్యక్తిది ఉందని ఆయన తెలిపారు. రుణం కిస్తీలు చెల్లించాలంటూ హైదరాబాద్‌లోని బ్యాంకుల నుంచి ఫోన్‌లో ఒత్తిడి చేస్తున్నారని, కలెక్టర్ తనకు న్యాయం చేయాలని ఆయన వేడుకున్నారు.

నవంబర్ 1-19 తేదీల మధ్య ఎయిరిండియాలో ప్రయాణించొద్దు

ఖలిస్తానీ ఉగ్రవాది పన్నూ హెచ్చరికలు



న్యూఢిల్లీ: నవంబర్ 1-19వ తేదీల మధ్య ఎయిరిండియా విమానాల్లో పర్యటించవద్దని ఖలిస్తానీ ఉగ్రవాది గురు పత్వంత్ సింగ్ పన్నూ సోమవారం ప్రయాణికులకు హెచ్చరికలు చేశాడు. సిక్కు వ్యతిరేక అల్లర్లకు 40 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆయా తేదీల మధ్య ఎయిరిండియా విమానాలపై తాము దాడులు చేస్తామని తెలిపాడు. బాంబులు పెట్టామంటూ ఇటీవల సుమారు వంద దేశీయ విమాన సర్వీసులకు బెదిరింపులు రావడం, అవన్నీ ఉత్తవేనని తేలడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా పన్నూ అలాంటి హెచ్చరికనే జారీ చేశాడు.

సీజేఐపై ఎస్పీ నేత అనుచిత వ్యాఖ్యలు



మైన్‌పురి (యూపీ)/ న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌పై సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ)నేత రాం గోపాల్ యాదవ్ అనుచిత వ్యాఖ్యలకు దిగడం తీవ్ర కలకలం రేపింది. సోమవారం మైన్‌పురిలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా అయోధ్య వివాదం పరిష్కారం కోసం 'దేవుడిని ప్రార్థించాను'అంటూ సీజేఐ చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నలకు రాం గోపాల్ యాదవ్ బదులిస్తూ.. 'దీనిపై నేనేమీ మాట్లాడదలచుకోలేదు. మీరు దయ్యాలకు ప్రాణం పోసినా, చనిపోయిన వారిని బతికించినా, అవి దయ్యాలుగా మారి న్యాయం గురించి మాట్లాడుతుంటాయి. అవి ఇప్పుడెక్కడున్నాయి? వాటిని మర్చిపోండి. కొందరు ఇలాంటివి చెబుతూనే ఉంటారు. వీటిని నేను పట్టించుకోవాలా?'అని మీడియాతో అన్నారు. అనంతరం, ఈ అభ్యంతరకర వ్యాఖ్యలపై వివరణ కోరగా, బహ్రైయిచ్‌లో హింసాత్మక ఘటనను గురించి మాట్లాడానే తప్ప, సీజేఐకి వ్యతిరేకంగా కాదన్నారు.

కెనడా ఆరోపణలు రాజకీయ ప్రేరేపితం

భారత హైకమిషనర్ వర్మ ధ్వజం



ఒట్టావా: ఖలిస్తాన్ వేర్పాటు వాది నిజ్జర్ హత్యకు సంబంధించి తనపై కెనడా చేసిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని అక్కడి భారత హై కమిషనర్ సంజయ్‌కుమార్ వర్మ స్పష్టం చేశారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఇరు దేశాల మధ్య సంబంధాలను నాశనం చేశారని ఆరోపించారు. కెనడా వార్తా సంస్థ సీటీవీ న్యూస్ ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నిజ్జర్ హత్యతో మీకు సంబంధముందా అని యాంకర్ ప్రశ్నించగా అస్సలు లేదని స్పష్టం చేశారు. ''దీనిపై ట్రూడో ఆరోపణలు కేవలం నిఘా సమాచారం ఆధారంగా చేసినవే. వాటికి సాక్ష్యాధారాలేవీ లేవని ఆయనే స్వయంగా అంగీకరించారు'' అని వర్మ గుర్తు చేశారు. ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యతో వర్మకు సంబంధముందన్న కెనడా ఆరోపణలు సంచలనం రేపడం తెలిసిందే. వాటిని భారత్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చడమే గాక ఆరుగురు కెనడా దౌత్యవేత్తలను బహిష్కరించింది. సంజయ్ కుమార్ వర్మను వెనక్కు పిలిపించింది. ప్రతిగా ఆరుగురు భారత దౌత్యవేత్తలను కెనడా బహిష్కరించింది.

నూతన దంపతులు 16 మందిని కనాలి

తమిళనాడు సీఎం స్టాలిన్ వ్యాఖ్య



చెన్నై: నూతన దంపతులు ఎక్కువ మంది పిల్లల్నికనే విషయం ఆలోచించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. 'తమిళ సంప్రదాయంలో పెద్దలు నూతన దంపతులను 16 సంపదలతో వర్ధిల్లాలని ఆశీర్వదిస్తుంటారు. కానీ, నేడు పరిస్థితి మారిపోయింది. 2026 నుంచి చేపట్టనున్న జన గణన, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో పుణ్యమాని చిన్న కుటుంబానికి బదులు, 16 మంది సంతానంతో కళకళలాడాలని ఆశీర్వదించాల్సిన రోజులొచ్చాయి'అని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం చెన్నైలో జరిగిన సామూహిక వివాహ వేదిక కార్యక్రమంలో సీఎం స్టాలిన్ మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా దేశంలో ఎన్నికల ముఖ చిత్రమే పూర్తిగా మారిపోనుందని అన్నారు. 'లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గే అవకాశం ఉన్నందున, మాకు 16 మంది పిల్లలుండాలా అని ఆశ్చర్యపోయే పరిస్థితి ఏర్పడొచ్చు. అయితే, ఈ విషయం మనం మర్చిపోకూడదు' అని ఆయన అన్నారు.

కొంకణే కీలకం

తీర ప్రాంతంపై 'మహా' పార్టీలన్నింటి కన్ను

నాలుగో వంతు అసెంబ్లీ స్థానాలకు నెలవు

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఆ ప్రాంతమే నిర్ణాయకం

ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట ● నేడు 'సేన'ల సమరాంగణం



2019 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు (ప్రాంతాలవారీగా)

(మొత్తం స్థానాలు 288)

ప్రాంతం	స్థానాలు	బీజేపీ	శివసేన	కాంగ్రెస్	ఎన్సీపీ	ఇతరులు
కొంకణ్	75	27	29	4	6	9
విదర్భ	62	30	4	15	5	8
పశ్చిమ మహారాష్ట్ర	58	17	5	11	20	5
ఉత్తర మహారాష్ట్ర	47	16	6	7	13	5
మరాఠ్వాడా	46	16	12	8	8	2

(నోట్: 2019 నాటికి శివసేన, ఎన్సీపీల్లో చీలికలు రాలేదు)

కొంకణ్. మహారాష్ట్రలో రాజధాని ముంబై నుంచి సింధుదుర్గ్ దాకా విస్తరించిన సువిశాల తీరప్రాంతం. నాలుగో వంతు అసెంబ్లీ స్థానాలతో ప్రతి ఎన్నికల్లోనూ ఫలితాలను శాసిస్తూ వస్తున్న ప్రాంతం కూడా. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి, విపక్ష ఎంవీఏ కూటముల భాగ్య రేఖలను కొంకణే నిర్దేశిస్తుందని భావిస్తున్నారు. అసెంబ్లీ స్థానాలపరంగా రాష్ట్రంలో కొంకణే అతి పెద్ద ప్రాంతం. మొత్తం 288 స్థానాల్లో 75 సీట్లు అక్కడే ఉన్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటైన కొంకణ్ అనంతరం శివసేనను ఆదరించింది. ఈ ఎన్నికల్లో శివసేనలోని రెండు వైరి వర్గాల ఆధిపత్య పోరుకు వేదికగా మారింది. కొంకణ్‌లోని 75 అసెంబ్లీ స్థానాల్లో ఏకంగా 36 సీట్లు ఒక్క ముంబై మహానగర పరిధిలోనే ఉండటం విశేషం. శివసేన (షిండే) సారథి, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే స్వస్థలమైన థానే కొంకణ్ ప్రాంత పరిధిలోకే వస్తుంది. దాంతో ఇక్కడ ఉద్ధవ్ సారథ్యంలోని శివసేనపై ఆధిపత్యం చూపి సత్తా చాటడం ఆయనకు కూడా ప్రతిష్టాత్మకంగా మారింది. ఒకప్పుడు ముంబై నుంచి వలస వెళ్లేవారు పంపే మొత్తాలపై ఆధారపడ్డ కొంకణ్‌లో కొన్నేళ్లుగా పరిస్థితి మారింది. చేపలు, మామిడి, కాజు తదితరాల ఎగుమతితో ఈ ప్రాంతం స్వయంసమృద్ధి సాధించింది. యువత వలసలకు స్వస్తి చెప్పి సొంత వ్యాపారాలతో స్థానికంగానే రాణిస్తున్నారు. వాయు, రైలు మార్గాలు ఇతోధికంగా పెరిగాయి. పర్యాటక ఆకర్షణలకు కూడా కొంకణ్ నెలవుగా మారింది.

కమ్యూనిస్టులకు చెక్ పెట్టి...

ముంబై, పరిసర ప్రాంతాల్లోని నూలు మిల్లులు, ఇతర కర్మాగారాల్లో కమ్యూనిస్టులు చాలాకాలం పాటు గణనీయమైన శక్తిగా వెలుగొందారు. 1980ల్లో శివసేన ఆవిర్భావంతో పరిస్థితులు మారాయి. తొలుత కాంగ్రెస్ మద్దతుతో వారి ఆధిపత్యానికి గండి కొట్టిన సేన, ఆ తర్వాత కాంగ్రెస్‌కు కూడా చెక్ పెట్టి కొంకణ్ అంతటా ప్రబల శక్తిగా ఎదిగింది. 1990ల నాటికి బీజేపీతో జట్టు కట్టి హిందుత్వవాదంతో మహారాష్ట్రవ్యాప్తంగా హవా చెలాయించింది. 1995కల్లా బీజేపీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. 1999లో రాజకీయ దిగ్గజం శరద్ పవార్ కాంగ్రెస్‌ను వీడి ఏర్పాటు చేసిన ఎన్సీపీ కూడా కొంకణ్‌లో పోటీదారుగా మారింది. అలా ఈ ప్రాంతంలో మరోసారి రాజకీయ పునరేకీకరణ జరిగింది. అయితే 2014 నుంచీ పరిస్థితి మారుతూ వస్తోంది. మోదీ మేనియా సాయంతో ముంబై, పరిసర ప్రాంతాల్లో బీజేపీ బాగా పుంజుకుంటూ వచ్చింది. ప్రస్తుతం మొత్తం మహారాష్ట్ర తీర ప్రాంతంలోనూ కాషాయ పార్టీ హవా కన్పిస్తోంది. ఆగర్భ శత్రువులైన శివసేన, కాంగ్రెస్ 2019 ఎన్నికల ఫలితాల అనంతరం అనూహ్య పరిస్థితుల్లో చేయి కలపడం, ఎన్సీపీతో కలిసి మహావికాస్ అగాఢీ (ఎంవీఏ) పేరిట ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో కొంకణ్ రాజకీయ ముఖచిత్రం మరోసారి మారిపోయింది. శివసేన అసంతృప్త నేత షిండే బీజేపీ మద్దతుతో పార్టీని చీల్చడమే గాక ఎంవీఏ సంకీర్ణాన్ని కూలదోసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అలా శివసేన కాస్తా షిండే, ఉద్ధవ్ (యూబీటీ) వర్గాలుగా చీలింది. అనంతరం అజిత్ పవార్ కూడా ఎన్సీపీని చీల్చి ప్రభుత్వంలో చేరారు. నాటినుంచీ శరద్ పవార్ వర్గం ఎన్సీపీ (ఎస్పీ)గా కొనసాగుతోంది. ఈ ఎన్నికల్లో పైచేయి సాధించి తమదే నిజమైన పార్టీగా నిరూపించుకోవడం ఈ నాలుగు వర్గాలకూ కీలకంగా మారింది. అలా వీరందరికీ కొంకణ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పట్టణ ప్రాబల్య ప్రాంతం

- మహారాష్ట్రలో అత్యంత పట్టణీకరణ, పారిశ్రామికీకరణ జరిగిన ప్రాంతంగా కొంకణ్ తీరం గుర్తింపు పొందింది.
- సింధుదుర్గ్ నుంచి ముంబై దాకా విస్తరించిన కొంకణ్ పరిధిలో పాల్ఘార్, థానే, రాయ్‌గఢ్, రత్నగిరి జిల్లాలున్నాయి.
- ఇక్కడ 75 అసెంబ్లీ స్థానాలతో పాటు 12 మంది లోక్‌సభ స్థానాలున్నాయి.
- గిరిజన ప్రాబల్య పాల్ఘర్‌లో 6, థానేలో 18, రాయ్‌గఢ్, సింధుదుర్గ్, రత్నగిరిల్లో కలిపి 15 అసెంబ్లీ స్థానాలున్నాయి. మిగతా 36 స్థానాలు ఒక్క ముంబై మహానగరంలోనే ఉన్నాయి.
- ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమిని ఈ ప్రాంతమే ఆదుకుంది. శివసేన (షిండే), బీజేపీ, ఎన్సీపీ కూటమికి ఏడు స్థానాలు దక్కాయి.
- నానాటికీ విపరీతంగా పెరిగిపోతున్న జనాభా, గృహ వసతి, పేదరికం, మౌలిక సదుపాయాల లేమి వంటివి ఇక్కడ ప్రధాన సమస్యలు.
- కొంకణ్‌పై కోల్పోయిన పట్టును ఈసారి ఎలాగైనా సాధించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

మిగతా ప్రాంతాల్లో...

మహారాష్ట్రలో విదర్భ (62 అసెంబ్లీ సీట్లు), మరాఠ్వాడా (46), ఆనియన్ బెల్ట్‌గా పేరొందిన ఉత్తర మహారాష్ట్ర (47), పశ్చిమ మహారాష్ట్ర (58) ప్రాంతాల్లోనూ అధికార, విపక్ష కూటముల మధ్య గట్టి పోరు నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో స్వతంత్ర అభ్యర్థులు కింగ్ మేకర్లుగా మారినా ఆశ్చర్యం లేదంటున్నారు. ఎందుకంటే ఈసారి రాష్ట్రవ్యాప్తంగా బరిలో ఉన్న స్వతంత్రుల సంఖ్య భారీగా పెరిగింది. వారిలో కనీసం 30 మంది దాకా నెగ్గడం ఖాయం. చివరికి ప్రభుత్వ ఏర్పాటులో వారే కీలకంగా మారతారు'' అని మాజీ సీఎం ఛగన్ భుజ్‌బల్ అభిప్రాయపడ్డారు.

ప్రపంచానికి భారత్ ఆశాకిరణం

ఎన్‌డీటీవీ ప్రపంచ సదస్సులో ప్రధాని మోదీ ఉద్ఘాటన

న్యూఢిల్లీ: అద్భుత ప్రగతి పథంలో దూసుకెళ్తూ ప్రపంచానికి భారత్ సరికొత్త ఆశాకిరణంలా కనిపిస్తోందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సోమవారం ఢిల్లీలో ఎన్‌డీటీవీ వరల్డ్ సదస్సులో ప్రధాని ప్రారంభోపన్యాసం చేసి పలు అంశాలపై ప్రసంగించారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

డబుల్ ఏఐ ప్రయోజనాలు

''మూడోసారి అధికారంలోకి వచ్చి దేశాన్ని అద్భుతమైన ప్రగతిపథంలో నడిపిస్తున్నాం. యుద్ధాలు, సంక్షోభాలుసహా ప్రపంచాన్ని పలు సమస్యలు పట్టిపీడిస్తున్న ఈ తరుణంలో ప్రపంచ దేశాలకు భారత్ ఆశాకిరణంలా మారింది. రెండు ఏఐల అదనపు ప్రయోజనాలు భారత్‌సొంతం. ఒకటి ఆశావహ ఇండియా(ఏఐ), కాగా మరోకటి కృత్రిమమేథ(ఏఐ). ఈ రెండింటి కలయికతో భారత్ వేగవంతమైన అభివృద్ధిని సాధిస్తుంది. ఆపత్కాలాల్లో ప్రపంచం భారత్‌ను ఒక స్నేహితునిలా చూస్తుంది. కోవిడ్ మహమ్మారివేళ ఎన్నో దేశాలకు భారత్ కరోనా వ్యాక్సిన్లను సరఫరాచేసింది. ఏ దేశంతోనూ భారత్ బంధం గాలివాటంగా ఏర్పడలేదు. ఎంతో నమ్మకం, సత్సంబంధాలతో బలోపేతమైంది. భారత్ బాగుపడితే అసూయపడే దేశాలు లేవు. ఎందుకంటే భారత దేశ అభివృద్ధి ఫలాలు ప్రపంచదేశాలకూ పనికొస్తాయని అందరికీ తెలుసు. చంద్రయాన్ మిషన్ విజయవంతమైతే ప్రపంచమే సంబరాలు చేసుకుంది. చరిత్రలోకి తొంగిచూస్తే ప్రపంచఅభివృద్ధిలో భారతపాత్ర ఎనలేనిదని స్పష్టమవుతోంది. అయితే గత దశాబ్దాల్లో వలసపాలన కారణంగా ప్రపంచ పారిశ్రామిక విప్లవ ప్రయోజనాలను భారత్ అందుకోలేకపోయింది. ఇప్పుడు ఇండస్ట్రీ 4.0 యుగం మొదలైంది. అవసరమైన మౌలిక సదుపాయాలను పెంచుకుంటూ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటోంది'' అని అన్నారు.

డిజిటల్ ఆవిష్కరణలు, ప్రజాస్వామ్య విలువల్ని మేళవించాం

'' డిజిటల్ ఆవిష్కరణలు, ప్రజాస్వామ్య విలువల్ని సమ్మిళితం చేశాం. అలాంటి సాంకేతికతే సాధికారత, పారదర్శకతలకు పనిముట్టుగా మారుతుంది. సాంకేతిక దన్నుతో ఎదిగిన యూపీఐ, పీఎం గతి శక్తి, ఓఎన్‌డీసీ వంటివి ఇందుకు మేలిమి తార్కాణాలు. ఇప్పుడు భారత్ అభివృద్ధి చెందడం మాత్రమేకాదు ఒక శక్తిగా అవతరిస్తోంది. పేదరికం వంటి సవాళ్లు ఉన్నాయని తెలుసు. త్వరితగతిన నూతన విధాననిర్ణయాలను అమలుచేస్తూ సంస్కరణలు తీసుకొస్తున్నాం'' అని అన్నారు.



ప్రజలు సుస్థిర పాలనను కోరుకుంటున్నారు

''మానవాళి చరిత్రలో 21 శతాబ్దపు ఈ కాలం ఎంతో ముఖ్యమైంది. సమస్యలను పరిష్కరించుకుంటూనే సుస్థిరాభివృద్ధిని సాధించాలి. మానవాళికి మెరుగైన భవిష్యత్తు అవసరం. అందుకోసం భారత్ పాటుపడుతోంది. దేశంలో గత ఆరుదశాబ్దాల్లో తొలిసారిగా వరుసగా మూడుసార్లు ఒకే ప్రభుత్వానికి ప్రజలుపట్టం కట్టారు. ప్రజలు సుస్థిర పాలనను కోరుకుంటున్నారని హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలూ రుజువుచేశాయి. మూడోదఫా కేంద్రంలో అధికారంలోకి వచ్చాక మేం రూ.9 లక్షల కోట్ల విలువైన మౌలికవసతుల ప్రాజెక్టులను ప్రారంభించాం. ఈ 125 రోజుల్లో స్టాక్ మార్కెట్ సైతం ఆరేడు శాతం వృద్ధిని చూపిస్తోంది'' అని మోదీ అన్నారు. మోదీ తర్వాత బ్రిటన్ మాజీ ప్రధాని డేవిడ్ కామెరూన్ సదస్సులో మాట్లాడారు. '' బ్రిటన్‌లో మార్గరేట్ థాచర్, టోనీ బ్లెయిర్ కాలం నుంచి చూసినా మా దేశంలో ఎవరూ మూడోసారి ప్రధాని కాలేదు. మీరు(మోదీ) మూడోసారి అధికారంలోకి వచ్చి మరింత ఉత్సాహంతో పనిచేస్తున్నారు'' అని కామెరూన్ పొగిడారు.

హెజ్‌బొల్లా ఆర్థిక వనరులపై గురి

ఏక్యూఏహెచ్ ఆఫీసులపై ఇజ్రాయెల్ దాడులు

బీరుట్: లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సంస్థ లక్ష్యంగా ఇజ్రాయెల్ ఆర్మీ దాడుల విస్తృతిని మరింతగా పెంచింది. ఇప్పటి వరకు మిలటరీ వనరులనే లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయెల్ తాజాగా ఆర్థిక లక్ష్యాలపైకి గురి పెట్టింది. హెజ్‌బొల్లాకు గట్టి పట్టున్న చోట్ల పౌరులకు ఆర్థిక సేవలందించే అల్-కర్ద్-హస్సన్ అసోసియేషన్(ఏక్యూఏహెచ్) కార్యాలయా లున్న రాజధాని బీరుట్‌తోపాటు దక్షిణ, తూర్పు ప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. ఆయా ప్రదేశాలను ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు జారీ చేసిన 20 నిమిషాలకే ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో దాడులు మొదలయ్యాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బీరుట్ దక్షిణాన ఉన్న దహియెపై 11 దాడులు జరిగినట్లు అధికార వార్తా సంస్థ ఎన్ఎన్ఏ తెలిపింది. లెబనాన్‌లో ఇంకా పనిచేస్తున్న లేలాకి ప్రాంతంలోని ఏకైక విమానాశ్రయం రన్‌వేకు కేవలం 500 మీటర్ల దూరంలోనే పేలుడు సంభవించింది. చిటాయా ప్రాంతంలోని ఏక్యూఏహెచ్ కార్యాలయం నడుస్తున్న 11 అంతస్తుల భవనం బాంబుల తాకిడికి నేలమట్టమైంది. ఇంకా, నబాటియె, టైర్, షెహాబియె, జహ్రానీ, బెకా లోయలోని బాల్బెక్, హెర్మెల్, రయక్ పట్టణ ప్రాంతాల్లోని ఏక్యూఏహెచ్ కార్యాలయాలపైనా దాడులు జరిగాయి. ఈ దాడుల్లో మరణించిన, గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. బాల్బెక్, శ్రీఫాపై దాడుల్లో ఆరుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా 10 మంది చనిపోయినట్లు ఎన్ఎన్ఏ తెలిపింది. ప్రజలకు సేవలందించే పేరుతో ఏక్యూఏహెచ్ హెజ్‌బొల్లాకు దన్నుగా ఉంటోందని ఇజ్రాయెల్, అమెరికా ఆరోపిస్తున్నాయి. ఏక్యూఏహెచ్ కార్యాలయాల్లో హెజ్‌బొల్లా లక్షలాదిగా డాలర్లను దాచి ఉంచిందని, ఈ ధనాన్ని ఆయుధాల కొనుగోలుకు, మిలిటెంట్ల వేతనాలకు వాడుకుంటోందని అంటున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా, యూకే తదితర దేశాలు నిషేధించిన హెజ్‌బొల్లా కేవలం షియా ఇస్లామిస్ట్ సాయుధ గ్రూప్ మాత్రమే కాదు, రాజకీయ పార్టీ కూడా. దీనికి లెబనాన్ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం కూడా ఉండటం గమనార్హం.

జూడాల సమ్మె విరమణ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్లు తమ సమ్మెను విరమించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సోమవారం చర్చల అనంతరం 16 రోజులుగా చేస్తున్న దీక్షను విరమించుకున్నారు. ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై హత్యాచారం నేపథ్యంలో డిమాండ్ల సాధన కోసం బెంగాల్ జూనియర్ డాక్టర్లు గత 16 రోజులు గా నిరాహారదీక్ష చేస్తున్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన సంపూర్ణ విధుల బహిష్కరణను కూడా విరమిస్తున్నట్లు ప్రకటించారు. 'ఈ రోజు సీఎంతో భేటీలో కొన్ని హామీలు లభించాయి. అయితే ప్రభుత్వ వ్యవహార శైలి సరిగా లేదు. ప్రజలు, మా దివంగత సోదరి కుటుంబీకులు దీక్షను విరమించుకోవాలని కోరారు. విషమిస్తు న్న మా ఆరోగ్య పరిస్థితి దృష్టిలో పెట్టు కొని నిరాహారదీక్ష ముగించాలని విజ్ఞప్తి చేశారు. అందుకే దీక్షను ముగిస్తున్నాం అని జూనియర్ డాక్టర్ దేవాశిష్ హల్దర్ వెల్లడించారు.

సరిహద్దు గస్తీపై కీలక పురోగతి

భారత్-చైనా మధ్య ఒప్పందం

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ విషయమై చైనాతో నెలకొన్న నాలుగేళ్ల పై చిలుకు సైనిక వివాదం కొలిక్కి వచ్చింది. ఇరు దేశాల దౌత్య, సైనిక ఉన్నతాధికారులు కొద్ది వారాలుగా జరుపుతున్న చర్చల ఫలితంగా ఈ విషయమై కీలక ఒప్పందం కుదిరింది. విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ సోమవారం ఈ మేరకు ప్రకటించారు. ''తాజా ఒప్పందం ఫలితంగా తూర్పు లద్దాఖ్‌లోని డెస్పాంగ్, డెమ్‌చోక్ తదితర ప్రాంతాల నుంచి చైనా సైన్యం వెనుదిరుగుతుంది. అక్కడ ఇకపై భారత సైన్యం 2020కి ముందు మాదిరిగా గస్తీ కాస్తుంది'' అని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల దిశగా దీన్నో మంచి ముందడుగుగా అభివర్ణించారు. రష్యాలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో భాగంగా మంగళ, బుధవారాల్లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని కీలక భేటీ ఉండొచ్చన్న వార్తల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం విశేషం. ఈ వివాదానికి తెర దించేందుకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా గత వారం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో చర్చలు జరిపారు. చైనాతో సరిహద్దు వివాదానికి సంబంధించి 75 శాతం సమస్యలు ఇప్పటికే పరిష్కారమైనట్టు జైశంకర్ గత నెలలో పేర్కొన్నారు.


ఉగ్రవాదంపై రాజీలేని పోరు: అమిత్ షా



న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్, ఈశాన్య భారతం, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సాపేక్షంగా శాంతిని నెలకొల్పినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఉగ్రవాదం, చొరబాట్లు, మతపరమైన ఉద్రిక్తతలను సృష్టించే కుట్రలపై పోరాటం కొనసాగుతుందన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీసు అమరుల త్యాగం వృథా కాదన్నారు. ''స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశ భద్రత కోసం 36,438 మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారు. గతేడాదే 216 మంది ప్రాణాలు కోల్పోయారు'' అని ఆవేదన వ్యక్తం చేశారు. వారి త్యాగానికి దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. కొత్త నేర న్యాయ చట్టాలతో భారత న్యాయ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత ఆధునికంగా మారిందన్నారు. పోలీసు సిబ్బంది, కుటుంబీకులు ఇక ఏ ఆయుష్మాన్ ఆసుపత్రిలోనైనా ఉచిత చికిత్స పొందవచ్చని హోం మంత్రి తెలిపారు. ''సీఏపీఎఫ్ సిబ్బంది కోసం 13 వేల ఇళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చాం. వచ్చే మార్చి నాటికి 11,276 ఇళ్లు సిద్ధమవుతాయి'' అని వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు సిబ్బందికి ఆయన నివాళులర్పించారు.

బ్రెజిల్ అధ్యక్షునికి గాయం

బ్రిక్స్ సదస్సుకు వర్చువల్‌గా హాజరు



రియోడిజనిరో: బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా (78) బాత్రూంలో జారిపడటంతో గాయపడ్డారు. తలకు దెబ్బ తగిలి చిన్నమెదడులో స్వల్పంగా రక్తస్రావమైంది. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆదివారం ఆయన రష్యా బయల్దేరాల్సి ఉండగా శనివారం రాత్రి ఈ ఉదంతం జరిగింది. సుదూర ప్రయాణాలు చేయొద్దన్న వైద్యుల సలహా మేరకు సిల్వా రష్యా పర్యటన రద్దయింది. అయితే ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భేటీలో పాల్గొంటారని అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అధ్యక్షుడితో మాట్లాడానని, ఆయన బాగున్నారని లులా వర్కర్స్ పార్టీ అధ్యక్షురాలు గ్లీసీ హాఫ్‌మన్ తెలిపారు. అయితే మెదడులో రక్తస్రావం పెరిగే ప్రమాదమున్నట్టు వైద్యులు చెప్పారు. ఈ పరిణామంతో బ్రిక్స్ సదస్సులో బ్రెజిల్ ప్రతినిధి బృందానికి విదేశాంగ మంత్రి మౌరో వియెరాను సారథిగా నియమించినట్లు ప్రభుత్వం తెలిపింది.

కార్మికుల మరణాలకు ప్రతీకారం తప్పదు

జమ్మూకశ్మీర్ ఎల్జీ మనోజ్ సిన్హా



శ్రీనగర్: గండేర్‌బల్‌లో ఆదివారం రాత్రి టన్నెల్ నిర్మాణపనుల్లో ఉన్న కార్మికులను బలి తీసుకున్న ఉగ్రవాదులు త్వరలోనే తగు మూల్యం చెల్లించుకుంటారని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) మనోజ్ సిన్హా స్పష్టం చేశారు. ఈ దారుణాన్ని తాము మర్చిపోలేమన్నారు. అమాయకులను చంపడం ద్వారా ఈ ప్రాంతంలో శాంతికి విఘాతం కలిగించేందుకు పాకిస్తాన్ ఇప్పటికీ ప్రయత్నాలు సాగిస్తూనే ఉందని ఆయన విమర్శించారు. అసువులు బాసిన కార్మికుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని, ఆర్థిక సాయం తక్షణమే అందజేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. శనివారం గుండ్ ప్రాంతంలో ముష్కరుల కాల్పుల్లో స్థానిక వైద్యుడు, ఆరుగురు స్థానికేతర కార్మికులు సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోగా మరో ఐదుగురు గాయపడిన విషయం తెలిసిందే. ఆదివారం నాటి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు టన్నెల్ నిర్మాణం బాధ్యతలను తీసుకున్న కంపెనీ మొత్తం రూ.21 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షలు అందజేస్తుందన్నారు.

రైతుల అతి పెద్ద శత్రువు బీజేపీ: ఖర్గే



న్యూఢిల్లీ: మహారాష్ట్ర రైతుల పాలిట అతిపెద్ద శత్రువు బీజేపీయేనని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని అధికారం నుంచి తొలగించడం ద్వారా మాత్రమే రైతులకు మేలు కలుగుతుందని సోమవారం ఖర్గే 'ఎక్స్'లో స్పష్టం చేశారు. మహారాష్ట్రను కరువు రహితంగా మారుస్తామంటూ బీజేపీ ఇచ్చిన వాగ్దానం బూటకమన్నారు. వ్యవసాయానికి నిధుల్లో ప్రభుత్వం భారీగా కోతపెట్టిందన్నారు. రాష్ట్రంలో 20 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. బీమా కంపెనీలకు రూ.8 వేల కోట్లు అప్పనంగా అప్పగించిన ప్రభుత్వం రైతు కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు కూడా తిరస్కరించిందని తెలిపారు. ఉల్లి, సోయాబీన్ ఎగుమతులపై నిషేధం, అత్యధిక ఎగుమతి సుంకం విధించడం ద్వారా రైతులను తీవ్ర కష్టాల్లోకి నెట్టివేసిందని ఖర్గే ఆరోపించారు.

వయనాడ్‌లో రేపు ప్రియాంక నామినేషన్




సాక్షి, న్యూఢిల్లీ: కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా బుధవారం నామినేషన్ వేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కేంద్రం కాల్పేటలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేయనున్నారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ పాలిత రాష్ట్రాల సీఎంలు, సీనియర్ నేతలు ఉంటారు.

బుద్గాంను వదులుకున్న ఒమర్



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా బుద్గాం సీటును వదులుకున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఒమర్ బుద్గాం, గండేర్‌బల్‌ల నుంచి పోటీచేసి.. రెండు చోట్లా నెగ్గిన విషయం తెలిసిందే. ఒమర్ బుద్గాంను వదులుకున్నారని ప్రొటెం స్పీకర్ ముబారక్ గుల్ సోమవారం అసెంబ్లీలో ప్రకటించారు. 2009-14 మధ్య సీఎంగా పనిచేసిన కాలంలోనూ ఒమర్ గండేర్‌బల్ నియోజకవర్గానికే ప్రాతినిధ్యం వహించారు. బుద్గాంకు ఒమర్ రాజీనామాతో నేషనల్ కాన్ఫరెన్స్ బలం 41కి పడిపోయింది. 95 మంది ఎమ్మెల్యేలున్న జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మెజారిటీకి 48 మంది సభ్యులు అవసరం. ఒమర్‌కు ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఐదుగురు స్వతంత్రులు, ఒక ఆప్ ఎమ్మెల్యే, ఒక సీపీఎం ఎమ్మెల్యే మద్దతు ఇస్తున్నారు.

ఎన్నికల వేళ జార్ఖండ్‌కు కొత్త డీజీపీ



న్యూఢిల్లీ/రాంచీ: జార్ఖండ్ కేడర్ 1989 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి అజయ్‌కుమార్ సింగ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం జార్ఖండ్ డీజీపీగా నియమించింది. జార్ఖండ్ ప్రభుత్వం పంపిన ముగ్గురు ఐపీఎస్ ఆఫీసర్ల ప్యానెల్ నుంచి అజయ్‌ను ఈసీ ఎంపికచేసింది. తాత్కాలిక డీజీపీగా పనిచేస్తున్న అనురాగ్ గుప్తా గత ఎన్నికల్లో బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేదన్న తీవ్ర ఆరోపణల నేపథ్యంలో గుప్తాను తొలగించాలని శనివారం రాష్ట్ర ప్రభుత్వానికి ఈసీ ఆదేశాలు జారీచేయడం తెల్సిందే. దీంతో గుప్తాను జేఎంఎం సర్కార్ తక్షణం తొలగించడం విదితమే. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతల్లో నిర్వహించనున్నారు.

17 రోజుల్లో 640 ప్రాణాలు..!

గాజా: ఉత్తర గాజా ప్రాంతం నుంచి పాలస్తీనియన్లను బలవంతంగా వెళ్లగొట్టే ప్రయత్నాలను ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా కొనసాగిస్తోంది. సోమవారం గాజాపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 33 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒక్క జబాలియా శరణార్థి శిబిరంపై జరిగిన దాడిలోనే 18 మంది చనిపోయినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. 17 రోజుల క్రితం ఉత్తర గాజాలో ఇజ్రాయెల్ చేపట్టిన మిలటరీ ఆపరేషన్‌లో కనీసం 640 మంది ప్రాణాలు కోల్పోయారని సోమవారం గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. ఉత్తర గాజా నుంచి పాలస్తీనియన్లను తుడిచిపెట్టడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమంపై ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024





విద్యార్థులకు అపార్ కార్డు

ప్రతి వ్యక్తికి ఆధార్ కార్డు ఉన్నట్టే.. విద్యార్థి సమగ్ర సమాచారం కోసం కేంద్రం అపార్(ఏపీఏఏఆర్ –ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు రూపొందిస్తోంది. -8లో



లాంగ్వేజ్ ఫర్ ఎర్న్

కొత్త భాషలు నేర్చుకోవడం కొన్నేళ్ల క్రితం వరకూ కేవలం హాబీ. అయితే, ప్రపంచీకరణ నేపథ్యంలో విదేశీ భాషానైపుణ్యం ఆదాయమార్గంగా కూడా అవతరించింది. – సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32 , కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



రామంతాపూర్‌లోని ఆర్యగా ఉమెన్స్ కాలేజీలో..





రామంతాపూర్‌లోని వాగ్దేవి కాలేజీ వద్ద..



కూకట్‌పల్లి డిగ్రీ కాలేజీలో..

గ్రూప్–1 మెయిన్స్ ప్రశాంతం

మహానగరంలో గ్రూప్–1 మెయిన్స్ మొదటిరోజు పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్ జిల్లాలో సుమారు 87.23 శాతం అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 5,613 మంది అభ్యర్థులకుగాను 717 మంది గైర్హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లాలో 8,011 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,157 మంది గైర్హాజరయ్యారు. హాల్‌టికెట్లతో వచ్చిన అభ్యర్థులను అధికారులు క్షుణంగా తనిఖీ చేసి పరీక్షాకేంద్రాల్లోకి పంపారు. పలు కేంద్రాల్లో నిర్దేశిత సమయం దాటిన తర్వాత వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించలేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చినా తమను పరీక్షకు అనుమతించలేదంటూ వారు తీవ్ర నిరాశతో వెనుతిరిగారు. ఈ నెల 27 వరకు ఈ పరీక్షలు కొనసాగనున్న నేపథ్యంలో అధికారులు ఆయా పరీక్షకేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. – సాక్షి, సిటీబ్యూరో

నిర్మాణ వ్యర్థాల తొలగింపు

ఎర్రకుంట చెరువు నుంచి మొదలు పెట్టిన హైడ్రా



సాక్షి, సిటీబ్యూరో: జలవనరుల్లోని అక్రమనిర్మాణాలను కూల్చేస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) వాటి వ్యర్థాల తొలగింపునూ ప్రారంభించింది. ఆయా చెరువుల పునరుజ్జీవనంలో భాగంగా ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది. నిజాంపేట పరిధిలోని ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్)లో ఉన్న వ్యర్థాలను సోమవారం తొలగించింది. ఐదు అంతస్తులతో నిర్మించిన మూడు భవనాలను గత ఆగస్టు 14న కూల్చేయగా ఇనుముతోపాటు ఇతర సామగ్రిని తీసుకువెళ్లిన యజమానులు వ్యర్థాలను అక్కడే వదిలేశారు. దీనిపై వారికి నోటీసులు ఇచ్చిన హైడ్రా అధికారులు వాటి తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మరో మూడు రోజులపాటు ఈ ప్రక్రియ జరగనుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు ఎర్రకుంట చెరువు పునరుజ్జీవన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. చెరువులో అక్రమనిర్మాణాలను తొలగించడమే కాకుండా వ్యర్థాలను తరలించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశలవారీగా ఇతర ప్రాంతాల్లోని నిర్మాణ వ్యర్థాలను హైడ్రా అధికారులు తొలగించనున్నారు.

పరిష్కారం కావాలి

ప్రజావాణి సమస్యలపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

- హెచ్‌వోడీల హాజరు తప్పనిసరి
- అక్రమ నిర్మాణాలపై చర్యలుండాలి



సాక్షి, సిటీబ్యూరో: సమస్యలు ఎక్కడా పరిష్కారం కానందునే ప్రజలు 'ప్రజావాణి'కార్యక్రమానికి హాజరవుతారని, వారికి సాయమందించడమే దీని ముఖ్య ఉద్దేశమని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. ప్రజలెంతో ఆశగా వచ్చే ఈ కార్యక్రమానికి అన్ని విభాగాల హెచ్‌వోడీలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన 'ప్రజావాణి'కి ఆయన హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి మాట్లాడుతూ నగరంలో ఎక్కడ కూడా అక్రమ నిర్మాణాలు జరగకుండా టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల్లో ఎక్కువగా ఈ విభాగానివే ఉండటంతో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్కిళ్ల డీసీలు, సెక్షన్ ఆఫీసర్లతో ప్రతినెలా సమీక్ష సమావేశం నిర్వహించి అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? నిబంధనల మేరకు ఎన్నింటికి నోటీసులు జారీ చేశారు? ఏం చర్యలు తీసుకున్నారు? తదితర విషయాలను తెలుసుకోవాలని సీసీపీకి సూచించారు. సమీక్షకు సంబంధించిన మినిట్స్ నివేదికను తనకు అందజేయాలని ఆదేశించారు. సర్కిళ్ల స్థాయిలో ఫిర్యాదులను పరిశీలించి తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు. కోర్టు కేసులన్నింటినీ సమీక్షించాలని లీగల్ అధికారికి సూచించారు.

అక్రమ నిర్మాణాలపై సీరియస్

ప్రజావాణికి మొత్తం 202 ఫిర్యాదులు వచ్చాయి. హెడ్‌ఆఫీస్‌కు సంబంధించినవి 51 కాగా, వాటిల్లో అక్రమ నిర్మాణాలవే 22 ఉన్నాయి. దీంతో కమిషనర్ ఇలంబర్తి సీరియస్ అయ్యారు. అక్రమ నిర్మాణాలపై చర్యలుండాలని, ఫిర్యాదు అందిన 15 రోజుల్లోగా పరిష్కారం కావాలన్నారు. మిగతావాటిల్లో ట్యాక్స్ విభాగం 9, ఇంజినీరింగ్(నిర్వహణ) పనులు 4 ఫిర్యాదులున్నాయి.

ఏ సర్కిల్‌లో ఎక్కువ సమస్యలున్నాయి..

హెల్త్ విభాగానికి సంబంధించిన జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీ, ఇతర అన్ని అంశాలను రెగ్యులర్ గా సమీక్షించి మినిట్స్ రూపొందించాలని సీఎంవోహెచ్‌ను కమిషనర్ ఆదేశించారు. వెటర్నరీ విభాగానికి వచ్చిన ఫిర్యాదుల వివరాలను, సెంటర్లవారీగా స్టెరిలైజ్ చేసిన కుక్కల వివరాల నివేదికను అందజేయాలని చీఫ్ వెటర్నరీ అధికారిని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులన్నిటినీ విభాగాలవారీగా కంప్యూటరీకరించి ఏ సర్కిల్ నుంచి ఏఏ సమస్యలపై ఎన్ని వచ్చాయో పరిశీలించి వివరాలు తనకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, రఘుప్రసాద్, నళిని పద్మావతి, సత్యనారాయణ, చంద్రకాంత్‌రెడ్డి, సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాష్ డ్రైవ్.. తగ్గేదేలే!

నడిరోడ్డుపై వాహనదారుల ఘర్షణ

ప్రమాదకర స్థాయిలో 'రోడ్‌రేజ్' అసహనం

- గంటలకొద్దీ రోడ్లపై నిలిచిపోతున్న వాహనాలు
- యథేచ్ఛగా రోడ్డు భద్రత నిబంధనల ఉల్లంఘన
- ఒక్కోసారి ప్రాణాలను హరిస్తున్న వైనం



ఇవీ రోడ్‌రేజ్‌లో భాగమే..

- వేగంగా వాహనం నడుపుతూ ఇతర వాహనదారులను, పాదచారులను భయభ్రాంతులకు గురిచేయడం
- అదేపనిగా హారన్ మోగించడం
- ర్యాష్ డ్రైవింగ్..
- హిట్ అండ్ రన్
- రహదారిభద్రత నిబంధనల మేరకు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. కానీ, రోడ్‌రేజ్‌పై ప్రత్యేకంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.



సాక్షి, సిటీబ్యూరో: ఉన్నట్టుండి నడిరోడ్డుపై వాహనాలు స్తంభించిపోతాయి. కొన్నిచోట్ల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతుంది. ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులకు అసలు ఏం జరిగిందో తెలియదు. ఇలాంటి పరిస్థితికి చాలా సందర్భాల్లో కారణం ఒకటే ఉంటుంది. అదే రోడ్‌రేజ్. వేగంగా వస్తూ అదుపుతప్పి ఎదురుగా వచ్చే వాహనాన్ని స్వల్పంగా ఢీకొట్టడం.. దీంతో తగ్గేదేలె... అన్నట్టుగా ఇరు వాహనాల చోదకులు ఢీ అంటే ఢీ అనే లెవల్లో ఘర్షణ పడుతుంటారు. తప్పు తమది కాదంటే తమది కాదంటూ తప్పించుకొనేందుకు ప్రయత్నిస్తుంటారు. తీవ్రమైన ఆగ్రహావేశాలకు గురవుతుంటారు. ఆకస్మికంగా తలెత్తే ఈ కోపం తరచూ భౌతికదాడులకు దారితీస్తోంది. ఫలితంగా ఇతర వాహనదారుల సమయం గంటలకొద్దీ ట్రాఫిక్‌లోనే హరించిపోతుంది. ఈ రోడ్‌రేజ్ ఘటనలు గ్రేటర్‌లో ప్రతిరోజు వందలకొద్దీ చోటుచేసుకుంటున్నాయి. రవాణాశాఖ అంచనాల ప్రకారం... రోడ్డు ప్రమాదాలకు అధిక వేగం, ర్యాష్ డ్రైవింగ్, రోడ్‌రేజ్‌లే కారణాలు. నగరంలో రోజుకు 20 ప్రమాదాలు చోటుచేసుకొంటే వాటిలో కనీసం ఏడు ర్యాష్ డ్రైవింగ్, రోడ్‌రేజ్ కారణాలని రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ఈగో దెబ్బతినడమే కారణమా...

- వారం రోజుల క్రితం సికింద్రాబాద్– అమీర్‌పేట్ రహదారిలోని ఫ్లై ఓవర్‌పై ఓ కారు వేగాన్ని నియంత్రించే క్రమంలో ముందున్న ఆటోరిక్షాను తాకింది. ఈ ఉదంతంలో దానికి ఎలాంటి నష్టం జరగకపోయినా సదరు ఆటోవాలా తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు, కారు నడిపే వ్యక్తిని అసభ్యంగా దూషించాడు. కారు యజమాని సైతం అదేస్థాయిలో ఆటోవాలాపై విరుచుకుపడ్డాడు. ట్రాఫిక్ రద్దీ కారణంగా వాహనాన్ని అదుపు చేసే క్రమంలో స్వల్పంగా తాకిందని కారు యజమాని వివరణ ఇచ్చాడు. ఖరీదైన కారు ఉన్న తాను ఆటోవాలాకు సారీ చెప్పడమేమిటని భావించాడు. కానీ, అతడు క్షమాపణ చెప్పకపోవడంతో ఆటోవాలా ఈగో దెబ్బతిన్నది. ఈ ఘర్షణ చినికి చినికి గాలివానగా మారడంతో వాహనాలు స్తంభించాయి. చివరకు ట్రాఫిక్ పోలీసులు జోక్యం చేసుకోవలసి వచ్చింది.
- ఏడాది క్రితం అత్తాపూర్‌లో ఒక క్యాబ్‌వాలాపై కూడా రోడ్‌రేజ్ దాడి జరిగింది. ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన ఓ కారు క్యాబ్‌ను ఢీకొట్టబోయి త్రుటిలో నిలిచిపోయింది. ఆ క్షణంలో తీవ్రమైన భయాందోళనకు గురైన క్యాబ్‌డ్రైవర్ వారితో గొడవకు దిగాడు. కారులో ఉన్నవాళ్లు సైతం తాము వాహనాన్ని కాస్త దూరంగానే ఆపామని, ఢీకొట్టలేదని వాదనకు దిగారు. క్యాబ్‌వాలా వెనక్కి తగ్గకపోవడంతో కారులోఉన్నవారు అతనిపై దాడి చేసి పరారయ్యారు.
- ఈవిధంగా నగరంలో ఎక్కడో ఒక చోట రోడ్‌రేజ్ ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ పోలీసు రికార్డుల్లో పెద్దగా నమోదు కావడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేవలం సర్దుబాటుతో సద్దుమణిగే దానికి కూడా ఆకస్మిక కోపానికి గురికావడం ఆందోళనకరంగా మారుతోంది.

ప్రాణాలు హరిస్తున్నారు..

ర్యాష్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలపైన నమోదయ్యే కేసుల్లో రోడ్‌రేజ్ కచ్చితంగా ఉంటుంది. కొద్ది రోజుల క్రితం అల్వాల్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఒక ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై దీపక్ అనే వ్యక్తి వెళ్తున్నాడు. అదేమార్గంలో జి.ఆంజనేయులు అనే ఓ పెద్దాయన రోడ్డు దాటుతున్నాడు. కానీ, ఆకస్మికంగా తనముందు నుంచి బండి వేగంగా దూసుకెళ్లడంతో భయాందోళనకు గురయ్యాడు. వాహనదారుడిపైన ఆగ్రహం వ్యక్తం చేశాడు. తప్పిదాన్ని గ్రహించి క్షమాపణ చెప్పి వెళ్లాల్సిన దీపక్ సీనియస్ సిటీజన్‌తో ఘర్షణకు దిగడమే కాకుండా కిందకు తోసివేయడంతో తలకు బలమైన గాయమైంది. రెండు వారాలపాటు చికిత్స తీసుకున్నా ఫలితం దక్కలేదు. చివరకు ఆ పెద్దాయన కన్నుమూశాడు. ఈ సంఘటనపైన పోలీసులు కేసు నమోదు చేశారు.

'బహిరంగ చెత్త'పై అవగాహన

బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా స్థానికులకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సూచించారు. ఆయన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం.13లోని జీవీపీ ఎలిమినేషన్ పాయింట్లను పరిశీలించారు. చెత్తను ఎన్ని గంటలకు సేకరిస్తున్నారు.. చెత్త వాహనాలు సమయానికి వస్తున్నాయా.. ఏవైనా సమస్యలు తలెత్తుతున్నాయా.. అనే అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూసుఫ్‌గూడ డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, సర్కిల్–17 డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో భార్గవ్ నారాయణ పాల్గొన్నారు.



జీవీపీ ఎలిమినేషన్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

విద్యుత్ అంబులెన్స్‌లు ప్రారంభం

- సెంట్రల్ బ్రేక్‌డౌన్ బృందాలకు అప్పగింత
- నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యం: డిప్యూటీ సీఎం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. అంతరాయాలను గుర్తించి, సరఫరాను సత్వరమే పునరుద్ధరించే సెంట్రల్ బ్రేక్‌డౌన్ (సీబీడీ) విభాగాన్ని మరింత పటిష్టపరచడమే కాకుండా ఆ బృందాల చేతికి విద్యుత్ అంబులెన్స్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం నెక్లెస్‌రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం ప్రాంగణంలో విద్యుత్ అంబులెన్స్‌లను ప్రారంభించారు. అనంతరం భట్టివిక్రమార్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అంతరాయాల వేళ 1912 కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను ఈ బృందాలు పరిష్కరిస్తాయన్నారు. హైదరాబాద్‌లోని 57 సబ్ డివిజన్లకు ఒక్కటి చొప్పున వాహనాన్ని సమకూర్చినట్లు పేర్కొన్నారు. ప్రతి వాహనంలో ఒక అసిస్టెంట్ ఇంజనీరు, ముగ్గురు లైన్స్ సిబ్బందిసహా థర్మో విజన్ కెమెరా, రంపపు మిషన్, నిచ్చెన, ఇన్సులేటర్, కండక్టర్లు, కేబుల్స్, ఎర్త్‌రాడ్, హెల్మెట్ ఉంటాయన్నారు. వీటికి ట్రాన్స్‌ఫార్మర్లను లాగే సామర్థ్యం కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇందన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

24న తాగునీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: కృష్ణా వాటర్ ఫేజ్–3 పంపింగ్ మెయిన్ లీకేజీ మరమ్మతు పనుల కారణంగా గురువారం ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు జలమండలి వర్గాల తెలిపాయి. శాస్త్రిపురం, బండ్లగూడ, భోజగుట్ట, షేక్‌పేట్, ఆళ్లబండ, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, ప్రశాసన్ నగర్, తట్టిఖానా, లాలాపేట్, సాహెబ్ నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవి రిజర్వాయర్లు, సైనిక్‌పురి, మౌలాలి, గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కావూరి హిల్స్, స్నేహపురి, కైలాసగిరి, దేవేంద్ర నగర్, మధుబన్, దుర్గానగర్, బుద్వేల్, సులేమాన్ నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, కిస్మత్‌పూర్, గంధంగూడ, బోడుప్పల్, మల్లికార్జున నగర్, మాణిక్ చంద్, చెంగిచెర్ల, భరత్‌నగర్, పీర్జాదిగూడ, పెద్ద అంబర్‌పేట్, ధర్మసాయి(శంషాబాద్) ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

జూ టాయ్‌ట్రైన్.. మళ్లీ జాయ్

ఇంజిన్ రిపేర్ కారణంగా కొన్ని నెలలపాటు నిలిచిన సేవలు

చార్మినార్: కొన్ని నెలలుగా మొండికేసిన జూపార్కు టాయ్ ట్రైన్ మరమ్మతులు పూర్తి చేసుకొని ఎట్టకేలకు తిరిగి సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. దీనిలో జూపార్కును కేవలం 20 నిముషాల్లో చుట్టి రావచ్చు. 2.5 కిలోమీటర్ల దూరం వరకు ఈ ట్రాయ్ ట్రైన్‌లో జూపార్కు మొత్తం ప్రయాణించవచ్చు. చిన్నారులతోపాటు పెద్దలను సైతం ఆకట్టుకునే ఈ ట్రైన్ ఇంజిన్ రిపేర్‌కు రావడంతో కొన్ని నెలలుగా అందుబాటులో లేదు. 1968లో బీహెచ్‌ఈఎల్ వారు దీనిని జూపార్క్‌కు గిఫ్టుగా అందజేశారు. 3 బోగీలతో 90 సీట్లు కలిగిన ఈ ట్రైన్ ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుంది. పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20 టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ట్రైన్‌లో ప్రయాణిస్తూ జూపార్క్‌లోని పులులు, ఏనుగులు, కోతులు, జింకలు, తాబేలు, పక్షులు..ఇలా ముఖ్యమైన, అరుదైన జంతువులను కనులారా దగ్గర నుంచి చూడవచ్చు. అందుకే జూను సందర్శించే ప్రతి ఒక్కరూ టాయ్ ట్రైన్‌లో వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు.



రయ్ మంటూ పరుగులు తీస్తున్న టాయ్ ట్రైన్

ఆమోదిత ప్రాజెక్టులపై దుష్ప్రచారం తగదు

నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు మేకా విజయ సాయి

లక్డీకాపూల్: ఆమోదం పొందిన ప్రాజెక్టులను అక్రమంగా నిర్మించారనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఇది సరికాదని నారెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు మేకా విజయసాయి అన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నారెడ్కో సభ్యులెవరూ ప్రాజెక్టులు చేపట్టరని స్పష్టం చేశారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెల్లుబాటయ్యే అనుమతులు ఉన్న అన్ని ప్రాజెక్టులను ప్రభుత్వం పరిరక్షిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని గుర్తు చేశారు. స్థలాలు, ఇళ్ల కొనుగోలుకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నగరంలోని చెరువులు, ప్రభుత్వ భూములను పరిరక్షించా లనే హైడ్రా లక్ష్యాలను నారెడ్కో తెలంగాణ స్వాగతిస్తుందన్నారు. రాబో యే సంవత్సరాల్లో తెలంగాణలో రియల్ ఎస్టేట్ వృద్ధికి మూసీ ప్రక్షాళన తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. నారెడ్కో ప్రాపర్టీ షో ఈ నెల 25న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమవుతుందన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విభిన్న ప్రాపర్టీలను ప్రదర్శిస్తున్నట్టు విజయసాయి తెలిపారు. సమావేశంలో నారెడ్కో ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వై.కిరణ్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్ రెడ్డి, కోశాధికారి ఆర్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'మకుటం' లేని మహిళామణులు!

రాష్ట్రంలో దాదాపు 30 మంది మహిళా ఐపీఎస్‌లు

- కేవలం ముగ్గురు మాత్రమే యూనిట్ ఆఫీసర్లుగా
- వీరిలో ఇద్దరు ఎస్పీలు కాగా ఒకరు కమిషనర్
- పత్తా లేని '33 శాతం' ఫోకల్ పోస్టింగ్స్ అంశం
- ఈసారి బదిలీల్లో అయినా పరిస్థితులు మారేనా?



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఏర్పడిన తర్వాత మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వచ్చిన ప్రభుత్వం, ఉన్నతాధికారులు వివిధ కోణాల్లో చర్యలు తీసుకున్నారు. వీటిలో భాగంగా పోలీసు విభాగంలో మహిళల సంఖ్య పెంచాలని టార్గెట్ పెట్టుకున్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర పోలీసు విభాగంలోని మహిళా ఐపీఎస్‌ల పరిస్థితి మకుటం లేని మహిళామణుల మాదిరిగా మారింది. ఇక్కడ పని చేస్తున్న ఉమెన్ ఐపీఎస్‌ల సంఖ్య దాదాపు 30 వరకు ఉంది. అయితే యూనిట్ ఆఫీసర్లుగా పిలిచే కీలకమైన ఫోకల్ పోస్టుల్లో ఉన్న వారు మాత్రం కేవలం ముగ్గురే. త్వరలో ప్రభుత్వం భారీ స్థాయిలో ఐపీఎస్‌ల బదిలీలకు కసరత్తు చేస్తోంది. ఇప్పుడైనా ఈ పరిస్థితులు మార్చే ప్రయత్నం చేస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఫోకల్‌లోనూ రెండు రకాలైన పోస్టులు..

పోలీసు శాఖలో సాధారణంగా రెండు రకాలైన పోస్టులు ఉంటాయి. శాంతిభద్రతల విభాగం వంటి ప్రాధాన్యం గల వాటిని ఫోకల్ అని, సీఐడీ, ట్రాఫిక్ వంటి ప్రాధాన్యం లేని వాటిని నాన్–ఫోకల్ పోస్టులని వ్యవహరిస్తుంటారు. అయితే ఈ ఫోకల్ పోస్టుల్లోనూ రెండు రకాలైనవి ఉన్నాయి. ఏదైనా జిల్లా లేదా కమిషనరేట్‌కు నేతృత్వం వహించే అవకాశం ఉన్న ఎస్పీ ఆపై స్థాయి హోదాలోని పోస్టులను యూనిట్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారు. ఎస్పీ హోదాలోనే ఉన్నప్పటికీ... కమిషనరేట్లలోని జోన్లకు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసుగా (డీసీపీ) పని చేసే వారికి సొంతంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం, అధికారం ఉండదు. ఈ నేపథ్యంలో ఇవీ ఫోకలే అయినప్పటికీ అక్కడి పని చేసే వారిని యూనిట్ ఆఫీసర్‌గా పరిగణించరు.

'33' కాదు కదా '10' కూడా లేదు...

పోలీసు విభాగంలో వివిధ స్థాయిల్లో జరిగే రిక్రూట్‌మెంట్‌లో సైతం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారు. అయితే వీరికి పూర్తిస్థాయిలో న్యాయం జరగాలంటే పోస్టింగ్స్ లోనూ అదే స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వాలని గతంలో భావించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 33 జిల్లాలు, 9 కమిషనరేట్లు ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే మొత్తం మీద ఉన్న 39 యూనిట్లలో పదికి పైగా మహిళా ఐపీఎస్ అధికారుల నేతృత్వంలో పని చేయాలి. అయితే వాస్తవానికి పది శాతం కూడా యూనిట్ ఆఫీసర్లుగా మహిళా ఐపీఎస్‌లు లేరు. నిర్మల్ జిల్లాకు జానకీ శర్మిల, కామారెడ్డి జిల్లాకు సీహెచ్ సింధు శర్మ ఎస్పీలుగా ఉండగా... సిద్ధిపేట కమిషనరేట్‌కు బి.అనురాధ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ ముగ్గురూ మినహా మరే ఇతర యూనిట్‌కు మహిళా ఐపీఎస్ నేతృత్వంలో లేదు. కేవలం సీఐడీ, ఎస్ఐబీ వంటి విభాగాలు మాత్రమే ఉన్నాయి.

ఈసారైనా ఈ సీన్ మారేనా..?

ఈ ముగ్గురు మహిళా ఐపీఎస్‌ల్లోనూ కేవలం సింధు శర్మ మాత్రమే డైరెక్ట్ ఐపీఎస్ కావడం గమనార్హం. మిగిలిన ఇద్దరూ రాష్ట్ర పోలీసు విభాగంలో అడుగుపెట్టి, నిర్ణీత కాలం పని చేసిన తర్వాత ఐపీఎస్ హోదా పొందిన వారే. సింధు శర్మ ప్రస్తుతం నిజామాబాద్ కమిషనరేట్‌కు సైతం ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. రాజకీయపరంగా అత్యంత సున్నితమైన ఈ రెండు యూనిట్లను ఆమె సమర్థంగా నిర్వహిస్తున్నారనే పేరు పొందారు. ఈ నెలాఖరులోపు లేదా వచ్చే నెల మొదటి వారంలో పెద్ద స్థాయిలో ఐపీఎస్‌ల బదిలీలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వీటి నేపథ్యంలో మహిళా ఐపీఎస్ అధికారులకు సముచిత ప్రాధాన్యం లభిస్తుందని ఆయా అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సైతం ఈ కోణంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

విద్యార్థులకు అపార్ కార్డు

- వ్యక్తికి ఆధార్ కార్డు తరహాలో.. విద్యార్థి సమగ్ర సమాచారం కోసం అపార్ కార్డు.
- జాతీయ విద్యా విధానంలో భాగంగా అమలుకు విద్యాశాఖ చర్యలు
- గ్రేటర్ సహా శివారుల్లో 9 నుంచి ఇంటర్ వరకూ తరగతుల వారీగా వివరాల సేకరణ.
- తల్లిదండ్రుల అనుమతితో వారు సూచించిన సవరణలతో..
- హెచ్‌ఎమ్ ధృవీకరణ తప్పని సరి



సాక్షి,సిటీబ్యూరో: వ్యక్తికి ఆధార్ కార్డు ఎలాగో విద్యార్థి సమగ్ర సమాచారం కోసం ఇకపై అపార్(ఏపీఏఏఆర్ –ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) ఉపయోగపడనుంది. జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి ఒక్కో నంబరు కేటాయించి తదనుగుణంగా వారి సమగ్ర సమాచారం నిక్షిప్తం చేస్తారు. 'వన్ నేషన్– వన్ స్టూడెంట్' నినాదంలో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. జాతీయ నూతన విద్యావిధానం–2020 అమలులో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

తల్లిదండ్రుల సమ్మతితో...

తొలుత 9, 10, 11, 12 తరగతుల వారి వివరాలు సేకరించాలని నిర్ణయించారు. రానున్న రోజుల్లో కేజీ నుంచి అమలు చేస్తారు. అపార్ కార్డు వివరాలు గోప్యంగా ఉంచుతామని కేంద్రం చెబుతోంది. తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే అన్ని పాఠశాలల యాజమాన్యాలకు అవగాహన కల్పించిన విద్యాధికారులు పీటీఎం(తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల)తో జూమ్ మీటింగ్‌లు నిర్వహించారు. విద్యార్థి ఆధార్, బోనఫైడ్ వివరాలు అక్షరం తప్పులేకుండా ఉంటేనే అపార్ సంఖ్య జనరేట్ అవుతుంది. ఒకసారి కార్డు వచ్చిందంటే మార్పులకు అవకాశం ఉండదు.

నగరంతో సహా శివారు జిల్లాల్లో..

హైదరాబాద్ నగరంతో సహా శివారు జిల్లాల పరిధిలో 7,597 పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 9,10 తరగతి చదువుతున్న విద్యార్థులు సుమారు 7.87 లక్షల మంది ఉన్నారు. అలాగే, గ్రేటర్‌తోసహా శివారుల్లో 806 ఇంటర్ కళాశాలలు ఉండగా ఆయా కాలేజీల్లో సుమారు 3.66 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటివరకు పిల్లలకు పాఠశాల స్థాయిలో, కళాశాల స్థాయిలో వేర్వేరు ఐడీలు కేటాయించేవారు. అపార్ కార్డు వస్తే ఒకే కార్డులోనే సకల సమాచారం ఉంటోంది.

పొందటం ఇలా..

ప్రతి విద్యార్థి వివరాలు ఇప్పటికే యూడైస్ ప్లస్‌లో నమోదు చేసినందున.. అందులోనే తల్లిదండ్రులు సూచించిన సవరణలు చేసి ఆన్‌లైన్ లో అపార్ కార్డుకు దరఖాస్తు చేయాలి. ప్రధానోపాధ్యాయుడి ధ్రువీకరణ తప్పనిసరి. ఆధార్ అనుసంధానమైన మొబైల్ ఫోన్ ఓటీపీ వస్తుంది. అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది. ఆన్‌లైన్ కార్డు వెలువడిన తర్వాత సవరణలకు అవకాశం ఉండదు.

అకాడమీపరంగా ప్రయోజనకరం..

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి. అకాడమీ సమాచారం, విద్యార్థి విజయాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. అకాడమీ పరంగా జీవితకాల గుర్తింపు కార్డుగా పరిగణిస్తారు. విద్యార్థి సంబంధిత మొత్తం (సర్వ) సమాచారం సమీకృతంగా ఒకేచోట లభిస్తోంది. ఆన్‌లైన్ నంబరు నమోదు లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా పూర్తి వివరాలు తెలుస్తాయి.

భవిష్యత్తులో కీలకం..



అపార్ కార్డు విద్యార్థులకు కీలకం, ఇందుకు తల్లిదండ్రుల అనుమతి పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని హెచ్ ఎంలకు సూచించాం. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది. అపార్ కార్డుకు సంబంధించి ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేశాం. ఇందులో ప్రధానోపాధ్యాయులు,సీనియర్ టీచర్ ,పేరెంట్, స్టూడెంట్ ఉంటారు.

విజయకుమారి,
డీఈఓ,మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

విద్యుదాఘాతంతో బాలకార్మికుడి మృతి

కంటోన్మెంట్: విద్యుదాఘాతంతో ఓ బాలకార్మికుడు మృతి చెందిన సంఘటన మారేడుపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘోరఖ్‌పూర్ జిల్లాకు చెందిన వినయ్ నిషాద్ (17) రెండేళ్ల క్రితం బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి, హఫీజ్‌పేటలో నివాసం ఉంటూ కొంతకాలంగా ఇంటీరియర్ కాంట్రాక్టర్ దినేష్ లుంగానీ వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం అతను వెస్ట్ మారేడుపల్లిలోని ఓ నిర్మాణానికి సంబంధించిన ఇంటీరియర్ పని నిమిత్తం ఇనుప స్టూల్ పైకి ఎక్కి పని చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడటంతో తోటి కార్మికులు, యజమానికి సమాచారం అందించి అతడిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఓ ప్రైవేటు కారులో అతడి మృతదేహాన్ని తరలించేందుకు యత్నిస్తుండగా స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాంట్రాక్టర్ దినేష్ లుంగానీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడి అరెస్ట్

శంషాబాద్: బాలికను వేధిస్తున్న యువకుడిని స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ మున్సిపాలిటీలోని నక్షత్ర కాలనీలో పనిచేస్తున్న తోటమాలి కుమారుడు గణేష్(20) కాలనీలోని ఓ బ్లాక్‌కు చెందిన బాలిక(15) కొంతకాలంగా ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. దీనిపై బాధితురాలు పలుమార్లు తల్లిదండ్రులకు పలుమార్లు ఫిర్యాదు చేసింది. గత కొద్ది రోజులుగా అజ్ఞాతంలో ఉన్న గణేష్ ఆదివారం రాత్రి కాలనీలోకి రావడంతో కాలనీ వాసులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి దుర్మరణం

సికింద్రాబాద్: రైలు ఢీకొని వేర్వేరు ఘటనల్లో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ రైల్వే స్టేషన్ ఎండ్‌సైడ్ వద్ద మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు బూడిద కలర్ షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో పెయింటర్ మృతి

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌కు చెందిన అల్లాపాల్(28) 15 రోజుల క్రితం మౌలాలిలోని తన అన్న ఇంటికి వచ్చి అక్కడే ఉంటూపెయింటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం అతను తన స్వగ్రామానికి వెళ్లేందుకు మౌలాలి నుంచి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు పట్టాల పక్కన నడుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ఉత్సాహంగా 'ఎస్ఎఫ్ఏ చాంపియన్‌షిప్–2024'

గచ్చిబౌలి, ఎల్‌బీ , కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలలో పోటీలు..





సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గచ్చిబౌలి స్టేడియం, లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియం , శ్రీ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంతో పాటు వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఎస్ఎఫ్ఏ (స్పోర్ట్స్ ఫర్ ఆల్) చాంపియన్‌షిప్–2024'లో అథ్లెట్లు తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. పోటీల్లో భాగంగా 7 రోజు లాంగ్ జంప్, షాట్‌పుట్‌లో ఉత్కంఠభరితమైన ఫైనల్స్, 100 మీటర్ల స్ప్రింట్‌లు ముగిశాయి. బాస్కెట్‌బాల్, చెస్‌తో పాటు హ్యాండ్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ జోరు పెంచగా, అండర్–11 బాలుర విభాగంలో చెస్ క్రీడాకారులు వ్యూహాత్మక ముఖాముఖీలతో తలపడ్డారు. హ్యాండ్‌బాల్, వాలీబాల్ మొదటి, రెండవ రౌండ్లు ప్రారంభమయ్యాయి. బాలుర అండర్–12 లాంగ్ జంప్‌లో విజ్ఞాన్స్ బో ట్రీ స్కూల్‌కు చెందిన హర్వీష్ శ్రీ చిరి స్వర్ణం సాధించింది. సన్‌సిటీ గ్లెన్ డేల్ అకాడమీకి చెందిన ఒమర్ అలీ బాలుర అండర్–18 షాట్‌పుట్ (5 కేజీలు)లో స్వర్ణం, బాలికల అండర్–12 లాంగ్ జంప్‌లో సెయింట్ జోసెఫ్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన శ్రీ సాయి అనన్య ఒడియాల స్వర్ణం సాధించారు. ఇతర ఈవెంట్‌లలో భాగంగా మంగళవారం 100మీ స్ప్రింట్ ఫైనల్స్ జరగనున్నాయి. శ్రీ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో బ్యాడ్మింటన్ క్వార్టర్ ఫైనల్స్‌తో పాటు టైక్వాండో బౌట్‌లు జరిగాయి. తైక్వాండోలో బాలుర అండర్–14 విభాగంలో ది ఇంటిగ్రల్ స్కూల్‌కు చెందిన సల్మాన్ మాలిక్, బాలికల అండర్–14 విభాగంలో న్యూటన్ హైస్కూల్ (మోతీనగర్)కు చెందిన తిరుమణి గెలుపొందారు. 22 క్రీడా విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో 920 పాఠశాలల నుంచి దాదాపు 23,000 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఛాంపియన్‌షిప్‌లు అక్టోబరు 28 వరకు కొనసాగనున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్లేస్‌మెంట్ పేరుతో మోసం చేశారు

- పలు పోలీస్ స్టేషన్లలో విద్యార్థుల ఫిర్యాదు..
- కేసులు నమోదు



పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో బాధిత విద్యార్థులు

పంజగుట్ట, మూసాపేట: గుర్తింపు లేకపోయినా అడ్మిషన్లు తీసుకుని విద్యార్థులను మోసం చేసిన అమ్రిత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్ కాలేజీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధిత విద్యార్థులు సోమవారం పంజగుట్ట, మూసాపేట పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. విద్యార్థులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన ఆకాశ్ అమీర్‌పేటలో అమ్రిత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) పేరుతో ఇనిస్టిట్యూట్ ప్రారంభించాడు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు బీఎస్సీ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ మూడేళ్ల కోర్సు కోసం దరఖాస్తులకు ఆహ్వానించాడు. తమ కాలేజీలో చేరితే కోర్సు పూర్తయ్యేలోపే ప్లేస్‌మెంట్‌లు కల్పిస్తామని నమ్మబలికారు. దీంతో సుమారు 300 మంది విద్యార్థులు ఇందులో అడ్మిషన్లు తీసుకుని సంవత్సరానికి రూ. 55 వేల చొప్పున ఫీజు చెల్లించడంతో పాటు, ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా ఇచ్చారు. అయితే రెండేళ్ల కోర్సు పూర్తయిన తర్వాత మీకు డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ కోర్సు కాకుండా డిప్లొమా ఇన్ ఒకేషనల్ కోర్సు సర్టిఫికెట్ ఇస్తామని చెప్పడంతో విద్యార్థులు ఖంగు తిన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్‌ల కోసం వెళితే అసలు వెంకటేశ్వరా యూనివర్సిటీకి తెలంగాణలో రిజిస్ట్రేషన్ లేదని, కేవలం ఉత్తరప్రదేశ్‌లోనే ఉందని తెలుసుకున్నారు. దీంతో బాధిత విద్యార్థులు పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా, వీరిపై చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పబ్‌ను డ్యాన్స్ ఫ్లోర్‌గా మార్చిన యజమానుల రిమాండ్



నిందితులు బలరాం, శ్రీనివాస్

బంజారాహిల్స్: అడ్డదారుల్లో డబ్బులు సంపాదించేందుకు పబ్‌ను డ్యాన్స్ ఫ్లోర్‌గా మార్చి అశ్లీల నృత్యాలను ప్రోత్సహిస్తున్న పబ్ యజమానులను బంజారాహిల్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని టేల్స్ ఓవర్ ద స్పిరిట్ (టాస్) పబ్‌లో గత కొంతకాలంగా యువతులను ఎరగా వేసి యువకులతో భారీగా మద్యం తాగిస్తూ వారు మద్యం మత్తులో ఉండగా ఇష్టానుసారంగా బిల్లులు వేసి వసూలు చేస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు రోజుల క్రితం ఈ పబ్‌పై దాడులు చేసి అర్ధనగ్న నృత్యాలు చేస్తూ యువకులకు ఎరవేస్తున్న 47 మంది యువతులను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు 95 మంది యువకులను అదుపులోకి తీసుకుని నోటీసులు ఇచ్చి పంపించారు. పబ్ యజమానులు బింగి బలరాం గౌడ్, బింగి శ్రీనివాస్‌గౌడ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరితో పాటు డీజే ప్లేయర్ ఆసిఫ్, నలుగురు బౌన్సర్లు, మేనేజర్, బార్‌టెండర్లను కూడా అరెస్ట్ చేశారు. అదుపులోకి తీసుకున్న 42 మంది యువతుల్లో 10 మంది తరచూ పట్టుబడుతుండటంతో వారిని అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా పబ్‌ను డ్యాన్స్‌ఫ్లోర్‌గా మార్చి నిబంధనలు అతిక్రమించిన యజమానులు బింగి బలరాంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లను అరెస్ట్ చేయడమే కాకుండా పబ్‌ను సీజ్ చేయాలని ఆర్డీవోకు లేఖ రాశారు. లైసెన్స్‌ను రద్దు చేయాలని కూడా ఎక్సైజ్ అధికారులకు లేఖ రాసినట్లు పోలీసులు తెలిపారు.

నిరుపయోగ బోర్లను గుర్తించండి

- పని చేయని వాటిని ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మార్చండి.!
- వాణిజ్య సముదాయాల్లో సిల్ట్ చాంబర్స్ తప్పనిసరి
- సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలి
- జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను గుర్తించి ఇంజక్షన్ బోర్ వెల్‌గా మార్చాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మహానగర పరిధిలో భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టిన 'ప్రతి ఇంటా ఇంకుడు గుంత' 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం ఆయన గౌలిగూడలో పర్యటించి నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను పరిశీలించారు. ఇంజక్షన్ బోర్ వెల్‌గా మార్చడానికి ఇలాంటి నిరుపయోగంగా బోర్ వెల్‌లను గుర్తించాలన్నారు. రోడ్లపై పారే వరదనీటిని కూడా మళ్లించి నిరుపయోగంగా ఉన్న బోర్‌వెల్స్ రీచార్జి చేసుకోవచ్చన్నారు. వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న బోర్లు భవిష్యత్తులో పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాల పెంపు కోసం ఇంజక్షన్ బోర్‌వెల్‌గా పనిచేసే అవకాశాలున్నాయన్నారు. ప్రతి వర్షపు చుక్కను రక్షించుకుంటే నీటి సమస్య ఉండదన్నారు.

సీవరేజీ కనెక్షన్లు తప్పనిసరి

కొత్తగా నిర్మిస్తున్న భవనాలకు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు సీవరేజీ కనెక్షన్లు తప్పనిసరి అని ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. సుల్తాన్‌బజార్ లో డీసిల్టింగ్ పనులను పరిశీలించిన ఆయన మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను (సిల్ట్)ను ఎప్పటికప్పుడు సిల్ట్ కార్టింగ్ వాహనాల ద్వారా తరలించాలన్నారు. వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, వసతి గృహాలు తదితర యజమానులకు సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సూచనలు పాటించని పక్షంలో.. వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. అంతకు ముందు మాదాపూర్, అయ్యప్ప సొసైటీ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన 1200 ఎంఎం డయా ట్రాన్స్ మిషన్ లైన్ లీకేజీ గుర్తించి దానికి మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. పైప్‌లైన్ కు సంబంధించిన ఏవైనా ఇతర పనులుంటే ఏకకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. మరమ్మతుల సమయంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే ప్రాంతాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.



పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషీన్ తో కలుషిత నీటి సమస్యను గుర్తిస్తున్న జల మండలి ఎండీ

పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషీన్

గౌలిగూడలో వినియోగదారులకు కలుషిత నీరు సరఫరా అవుతుందని ఫిర్యాదులు రావడంతో సమస్యను గుర్తించడానికి పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ యంత్రం పనితీరును పరిశీలించారు. కలుషిత నీటి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్–1 విజయ రావు, సీజీఎం ప్రభు, జీఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర వైద్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు వినతి


కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో వైద్యుల బృందం

బంజారాహిల్స్: దేశంలో ఫ్యామిలీ మెడిసిన్‌ను ప్ర త్యేక రంగంగా అధికారికంగా గుర్తించాలని, కమ్యూనిటీ స్థాయిలోనే వ్యాధుల నివారణ, అనారోగ్య సమస్యలకు సమగ్ర వైద్యసేవల్ని అందించడం జరగాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి జేపీ నడ్డా, నీతి ఆయోగ్ అధికారులకు వివరించామని అపి (అమెరికా అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియా) అధ్యక్షులు డాక్టర్ సతీష్ కత్తుల వెల్లడించారు. మూడు రోజులపాటు ఢిల్లీ ఎయిమ్స్‌లో జరిగిన 18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ద్వారా నిపుణులు వెల్లడించిన అనేక విషయాలను సోమవారం కలిసి వివరించడం జరిగిందన్నారు. ముఖ్యంగా మన దేశంలో కేన్సర్, హార్ట్ ఎటాక్స్ కేసులు విస్తృతంగా పెరుగుతున్నందున కేంద్ర ప్రభుత్వం ప్రివెంటీవ్ మెడిసిన్‌పై దృష్టిపెట్టి ప్రజల్లో ఆరోగ్య చైతన్యానికి తక్షణం కృషి చెయ్యాల్సిన ఆవశ్యకత గురించి తెలియజేయడం జరిగిందన్నారు. అలాగే ఇండియాలో డాక్టర్లపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని, కేన్సర్ స్క్రీనింగ్, ట్రీట్మెంట్‌తో పాటు పాల్లియేటివ్ కేర్‌ను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరామన్నారు. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, నీతి ఆయోగ్ బందాన్ని కలిసిన వారిలో ఆపి ప్రెసిడెంట్ డాక్టర్ సతీష్‌కత్తుల, డాక్టర్ అమిత్ చక్రవర్తి, బీఓటీ చైర్మన్ డాక్టర్ సునిల్ ఖాజా, రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వాసు సింగ్, గ్లోబల్ మెడికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ డా క్టర్ లోకేశ్ తదితరులు పాల్గొన్నారని వెల్లడించారు. అదే విధంగా ఎయిమ్స్‌లో గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మెడికల్ స్టూడెంట్స్, ఎయిమ్స్, అపిలు సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహించాయని, ఈ వర్క్‌షాప్స్‌లో స్టూడెంట్స్‌కు ప్రాక్టికల్ స్కిల్స్‌ను, మెడికల్ ప్రాక్టీస్‌లో టెక్నిక్స్‌ను సమకూర్చడం జరిగిందని డాక్టర్ సతీష్ కత్తుల తెలిపారు. తొలిసారిగా 'అపి' ఫెలోషిప్ అవార్డులను ముగ్గురికి గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌లో అందజేసామన్నారు.

యువతలో సామాజిక బాధ్యత పెరగాలి

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న బి.చంద్రకుమార్

కాచిగూడ: యువతలో సామాజిక బాధ్యత పెంపొందితే దేశంలో యువశక్తి బలోపేతమవుతుందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. ఆల్ ఇండియా జైహింద్ పార్టీ, సమాజ్ వాది పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో ఆజాద్ హింద్ ప్రభుత్వ 82వ వ్యవస్థాపక వార్షికోత్సవం సందర్భంగా సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దశరథ రామిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశ స్వాతంత్ర్యం కోసం అవిశ్రాంత పోరాటం చేశారని అన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన సుభాష్ చంద్రబోస్ అడుగు జాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ స్థానం ప్రత్యేకమన్నారు. భారతీయ సైన్యాన్ని స్థాపించి బ్రిటీష్ వారితో పోరాడిన ధీరుడన్నారు. యువత మానవత విలువలను పెంపొందించుకోవాలని, అవినీతి, డ్రగ్స్ మాఫియా, దురలవాట్లపై పోరాటం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా జైహింద్ పార్టీ అధ్యక్షుడు ఎస్.దశరథ రాంరెడ్డి మాట్లాడుతూ ఐఎన్ఏ సేనల పట్ల ప్రభుత్వ వివక్షత తగదని, ఆజాద్ హింద్ ఫౌజ్ సేనలను సోల్జర్స్ బోర్డులో చేర్చి మిగతా సైనికులతో సమానంగా పెన్షన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యంపై నియమించిన షానవాజ్ ఖాన్ కమిటీ, ముఖర్జీ కమిషన్ల రిపోర్టులను బహిర్గతం చేయాలని అన్నారు. ఢిల్లీ పార్లమెంట్ భవనంలో, హైదరాబాద్ నగరంలో నేతాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 23వ తేదీన నేతాజీ జయంతి సందర్భంగా విద్యా సంస్థలలో నేతాజీ గూర్చి తెలియజేస్తూ పాఠ్యాంశాలలో ఆయన చరిత్రను చేర్చాలని అన్నారు. జాతీయ స్థాయిలో నేతాజీ పేరున ఒక అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అకేళ్ల రాఘవేంద్ర రావు, శ్రీనివాసరావు, శ్రీకాంత్ చారి, చింత రాజశేఖర్, శ్రీకాంత్ స్వామిజీ, తదితరులు పాల్గొన్నారు.

మాకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించండి

తహసీల్దార్‌కు బాధితుల వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న షేక్ హైదర్

రహమత్‌నగర్: కమలానగర్ టుబీహెచ్‌కే డిగ్నిటీ హౌజింగ్ కాలనీలో ఇళ్లు రాని 56 మందికి డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలని బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ హైదర్ ఖైరతాబాద్ మండల తహసీల్దార్ నయీముద్దీన్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హైదర్ మాట్లాడుతూ 56 మంది బాధితులకు ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర మంత్రులు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇదే విషయమై తాము హై కోర్టును కూడా ఆశ్రయించామని చెప్పారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివాసాలు కోల్పోయిన వారి కంటే ముందుగానే తమకు నివాసాలు కేటాయించాలని ఆయన కోరారు. విజయ్, సయ్యద్ ఖలీల్, హనుమంతు, యాదగిరి, ఇబ్రహీం ఖాన్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: అంబేడ్కర్ వర్సిటీ స్థలాన్ని (జె.ఎన్.ఎఫ్.ఏ.యూ)కి కేటాయించొద్దని అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సోమవారం డా.బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పది ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జె.ఎన్.ఎఫ్.ఏ.యూ) కేటాయించొద్దని అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగ సంఘాల నేతలు ఉద్యోగులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విశ్వవిద్యాలయ పరిపాలన భవనం ముందు, అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్యోగులు అంతా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ. పల్లవీకాబ్డే, కన్వీనర్ ప్రొ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ మహేష్ గౌడ్, డా.వై. వెంకటేశ్వర్లు, రుశేంద్ర మణి, అధ్యాపకేతర ఉద్యోగుల సంఘం నేతలు ఎండి హబీబుద్దీన్, షబ్బీర్, డా.యాకేష్ దైద, డా.అవినాష్, డా.రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


కార్యక్రమంలో డాక్టర్ భీశ్వ సురేఖ, భీశ్వ ఓంప్రకాష్

అబిడ్స్: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ భీశ్వ ఓంప్రకాష్, రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్ పేర్కొన్నారు. బషీర్‌బాగ్, గన్‌ఫౌండ్రీ ప్రాంతాల్లో బీజేపీ సభ్యత్వం నిర్వహించారు. అనంతరం జరిగిన ఎస్సీ మోర్చా సమావేశంలో వారు ప్రసంగిస్తూ..సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో పెద్ద ఎత్తున ప్రతిరోజూ అక్రమంగా సమావేశమైన వారి పట్ల ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. నగరంలోనే కాక పలు ప్రాంతాల్లో ఆలయాలపై కొంతమంది పనికట్టుకొని దాడులు చేస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం లేదన్నారు. ప్రజలంతా ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించదలన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే తెలంగాణ రాష్ట్రం శాంతి సామరస్యంగా ఉంటుందన్నారు.

బస్తీల్లో సమస్యలు కనిపించొద్దు..!

- సీవరేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించండి
- నియోజకవర్గం మొత్తం 30 ఆర్‌వో ప్లాంట్ల ఏర్పాటు
- ఒక్కో డివిజన్‌కు రూ. 2 కోట్ల వరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే దానం నాగేందర్


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న దానం నాగేందర్

బంజారాహిల్స్: బస్తీల్లో సీవరేజీ, మంచినీటి, సీసీ రోడ్ల సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అందుకు సంబంధించిన నిధుల మంజూరు విషయం తాను చూసుకుంటానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో హిమాయత్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాలకు చెందిన జలమండలి, జీహెచ్ఎంసీ, శానిటేషన్, వెటర్నరీ, వీధి దీపాల విభాగం అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జలమండలి అధికారులతో మా ట్లాడుతూ ఒక్కో డివిజన్‌కు రూ. 2 కోట్లకు తగ్గకుండా ప్రతిపాదనలు సిద్ధం చేసుకొని తన వద్దకు రావాలని త్వరలోనే ఆ ప్రతిపాదనలన్నింటికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించాలని అన్నారు. ముఖ్యంగా హిమాయత్‌నగర్ డివిజన్‌లోని గాంధీ కుటీర్, విఠల్‌వాడి, షేరిగేట్, పర్దాగేట్‌లలో సీవరేజీ సమస్యలతో పాటు సీసీ రోడ్ల సమస్యలున్నట్లు స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారని సంబంధిత అధికారులు అక్కడ పర్యటించి సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలను చూపించాలని సూచించారు. షంషీర్‌బాగ్‌లో ఫేవర్ బ్లాక్స్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. త్వరలోనే తాను అన్ని శాఖల అధికారులతో కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తామని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు హిమాయత్‌నగర్ డివిజన్‌లోని మహేశ్వరి థియేటర్ వద్ద షేరిగేట్‌లో ఇంజెక్షన్ బోర్‌వెల్ వేయిస్తే మంచి ఫలితం ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అందుకు సంబంధించి విశ్లేషణ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అన్ని డివిజన్లలో వీధి దీపాల ఫిర్యాదులు పెద్దఎత్తున వస్తున్నాయని వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని నిధులలేమి ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తొలి ప్రాధాన్యతగా బస్తీల్లో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. స్పెషల్ బడ్జెట్ కింద వచ్చే డబ్బును దీని కోసం మంజూరు చే స్తామని తెలిపారు. డివిజన్‌కు రెండు కోట్ల చొప్పున జలమండలి సీవరేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సింగాడికుంట, ఉద యన్‌నగర్, అంబేడ్కర్‌నగర్, గౌరీశంకర్ కాలనీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని ప్రతిపాదనలు రూపొందించాల్సిందిగా ఈఈ విజయ్‌కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం హరి శంకర్, ఈఈ విజయ్‌కుమార్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి, రామన్‌గౌడ్, హిమాయత్‌నగర్ ఏఎంహెచ్‌వో హేమలత తదితరులు పాల్గొన్నారు.

నియోజక వర్గ వ్యాప్తంగా 30 ఆర్‌వో ప్లాంట్లు

ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా 30 చోట్ల ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు తగిన స్థలాలను గుర్తించడంతో పాటు ప్రతిపాదనలు రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. బస్తీవాసులకు మరింత నాణ్యమైన నీటిని అందించేందుకు ఈ ఆర్‌వో ప్లాంట్లు దోహదం చేస్తాయని అన్నారు.

త్వరలోనే కమిషనర్‌ను కలుస్తా

ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: కొంతమంది వాట్సాప్ రిపోర్టర్లు, నకిలీ రిపోర్టర్లు, యూ ట్యూబ్ రిపోర్టర్లు టౌన్‌ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఇప్పటికే వారి లిస్టును తాము సేకరించామని సిటీ కమిషనర్‌ను కలిసి ఆ లిస్టును అందజేస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సోమవారం ఆయన నివాసంలో జరిగిన అధికారులతో జరిగిన రివ్యూ మీటింగ్‌లో ఆయన అంశంపై మాట్లాడారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు తాము ఫిర్యాదు చేస్తూ పట్టించుకోకుండా ఆ నకిలీ రిపోర్టర్లతో చేతులుకలిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులను ఎవరైనా రిపోర్టర్ల పేరుతో బెదిరిస్తే తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే వారిపై కేసులు నమోదు చేయిస్తామని అన్నారు. నకిలీ రిపోర్టర్లు బెదిరిస్తే భయపడాల్సిన అవసరం లేదని గతంలో తాను ఇదే అంశాన్ని అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు.

పోలీసుల సేవలు ఎంతో గొప్పవి

లిబర్టీ: పోలీసులు అందిస్తున్న ఎంతో గొప్పవని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పీ.వీ.రాజేశ్వరరావు అన్నారు. రాష్ట్ర భద్రత ప్రజల రక్షణ కోసం నిరంతరం సేవలు అందించడం అభినందనీయమన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ సభను పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేశారు. ముందుగా అమర పోలీసులకు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రింబవళ్లు పోలీసులు ప్రజలకు ఎప్పటికప్పుడు సేవలు అందిస్తూ ప్రాణాలను సైతం ఫణంగా పెడుతున్నారని పేర్కొన్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో పోలీసులు నిఘావేసి ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫ్రెండ్లీ పోలీసులుగా వివరిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పీ.వీ.శ్రీనివాస రావు, పీ.వీ.సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకెళ్లాలి

పంజగుట్ట: రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి, ఆత్మగౌరవం లభిస్తుందని బీసీ కులాల ఐక్య వేదిక గౌరవాధ్యక్షులు నరహరి అన్నారు. సోమవారం ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆర్థిక సమానత్వం, విద్య, ఉద్యోగాలు, ఉపాధి రంగాల్లో బీసీలు సమున్నతంగా తలెత్తుకుని అగ్రకులాలతో సమానంగా జీవించగలగాలని, కానీ ప్రస్తుతం రెండో శ్రేణి ప్రజలుగా జీవించడం బాధాకరమన్నారు.

బీసీ మేధావులు, కుల సంఘాల నాయకులు, యువకులు బీసీలను చైతన్యపరుస్తూ ఓటు అనే ఆయుధంతోనే మనకు ఆత్మగౌరవం , అభివృద్ధి వస్తుందని చైతన్యపరచాలని సూచించారు. జనాభాలో 7 శాతం కూడా లేని వారు ఇచ్చేవారు అయ్యారని, 60 శాతం ఉన్న బీసీలు అడుక్కునే వారు కావడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా బీసీలు చైతన్యవంతులై రాజ్యాధికారం దిశగా అడుగులు వెయ్యాలని సూచించారు. ఈ సమావేశంలో పి.వినయ్ కుమార్, బీసీ నాయకుడు ఎర్ర సత్యనారాయణ, డి.శంకర్, బాబుగౌడ్, జగన్‌మోహన్ ముదిరాజ్, నిమ్మల వీరన్న, కాశీనాథ్, విజయ్, సంధ్యారాణి, అరుణ్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్ మేళా ప్రారంభం


హెల్పింగ్ హ్యాండ్ మేళాను ప్రారంభిస్తున్న నటి గీతా భాస్కర్

పంజగుట్ట: దేశవ్యాప్తంగా చేతివృత్తి కళాకారులకు తమవంతు సహకారం అందించడం కోసం హెచ్ఎస్‌బీసీ బ్యాంకు ప్రతీ సంవత్సరం హెల్పింగ్ హ్యాండ్ మేళా నిర్వహించడం అభినందనీయమని సినీనటి గీతా భాస్కర్ అన్నారు. సోమవారం సోమాజిగూడలోని బ్యాంకులో హెల్పింగ్ హ్యాండ్ మేళాను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు సేవా కార్యక్రమాలు చెయ్యడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. డిజిటల్ ట్యాక్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పర్యావరణంపై కూడా శ్రద్ధచూపడం మంచి పరిణామమన్నారు. బ్యాంకు మేనేజర్ సంతోష్, వైస్ ప్రెసిడెంట్ సౌమ్య, సేల్స్‌హెడ్ ప్రవల్లికలు మాట్లాడుతూ తమ హెల్పింగ్ హ్యాండ్ మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో తమ ఖాతాదారులు వివిధరకాల చేనేత ఉత్పత్తులు కొనుగోలు చెయ్యడం ద్వారా చేనేత కళాకారులకు కొంత మేలు చేకూరుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల్లో హెల్పింగ్ హ్యాండ్ మేళా నిర్వహిస్తున్నామని, ఇది ఇరవై రెండో మేళా అని చెప్పారు. ఈ మేళాలో డిజిటల్ వ్యర్థాలపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్స్ సమస్యలను పరిష్కరించాలి


ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్

వెంగళరావునగర్ : మినీ టీచర్స్ నుంచి మెయిన్ టీచర్స్‌గా పదోన్నతి పొందిన వారి వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాట ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక మహిళా శిశుసంక్షేమశాఖ స్టేట్‌హోం ప్రధాన గేటు వద్ద సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పదోన్నతి పొందిన మినీ టీచర్స్ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పదోన్నతి పొందిన మినీ టీచర్స్‌కు అధికారులు గత ఐదు నెలలుగా సగం జీతం మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. మినీ టీచర్స్‌ను మెయిన్ టీచర్స్‌గా ప్రామోట్ చేసిన సమయంలో రూ.13650 ఇస్తామని జీవోలో చెప్పారని, అయితే ప్రస్తుతం రూ.7800 మాత్రమే చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. వాస్తవానికి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో రూ.18వేలు ఇస్తామని చెప్పారని, ఆ జీతాన్ని వీరికి తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ కాంతి వెస్లీకి వినతిపత్రాన్ని అందించారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ కార్యదర్శి సీతా మహాలక్ష్మి, డిప్యూటీ కార్యదర్శి ఎం.నర్సింహ, నాయకులు వి.మల్లిఖార్జున్, పార్వతి, సరోజ, అనిత, శ్రీదేవి, ముత్తమ్మ, రాజేశ్వరి, సరస్వతి, వసంత, కైక తదితరులు పాల్గొన్నారు.


భాగ్యనగరం సర్వమత సమ్మేళనం


ప్రార్థనల్లో నవీన్‌యాదవ్

వెంగళరావునగర్: హైదరాబాద్ మహానగరం సర్వమత సమ్మేళనమని, ఇక్కడ ప్రతి ఒక్కరూ తమ ఇష్ట దైవాన్ని పూజిస్తూ ప్రార్థనలు చేస్తూ అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండటం ఇతర దేశాలకే ఆదర్శంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు వి.నవీన్‌యాదవ్ అన్నారు. శ్రీగురు రాందాస్ జీ మహరాజ్ 490 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నవీన్‌యాదవ్ సిక్కు సోదరునుద్దేశించి మాట్లాడుతూ భక్తితో నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలకైనా సత్ఫలితాలు అందుతాయని అన్నారు. తొలుత భారీఎత్తున తరలివచ్చిన ర్యాలీకి ఆయన ఘన స్వాగతం పలికారు. తొలుత గురుద్వార్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గురుద్వార్ కమిటీ నేతలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మత పెద్దలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

జన సంచారాల వద్ద అసభ్యకర ప్రవర్తన

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు


నిందితుడు బూత్కూరి రమేష్

ఫిల్మ్‌నగర్: జన సంచారాల వద్ద దుస్తులు విప్పేసి నగ్నంగా తిరుగుతూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న నిందితున్ని ఫిల్మ్‌నగర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే .. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం, శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన బూత్కూరి రమేష్ (34) షేక్‌పేట చెరువు వద్ద జెల్లీ,బెల్లి ఫుడ్స్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 16వ తేదీన సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో టోలీచౌకీ, అజీజ్‌బాగ్‌లో ఉన్న హెల్త్ అండ్ గ్లో స్టోర్ వద్దకు వెళ్లి అక్కడ గ్లాసుల నుంచి స్టోర్‌లో పనిచేస్తున్న వారు చూస్తుండగా ప్యాంట్ విప్పేసి అసభ్యకరంగా ప్రవర్తించాడు. యాక్టివా బైక్‌పై వచ్చిన నిందితుడు అక్కడ నుంచి ఇంటర్నేషనల్ స్కూల్ బస్‌స్టాప్ వద్ద మళ్లీ అలానే ప్రవర్తించాడు. ఈ రెండు చోట్ల నుంచి బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిల్మ్‌నగర్ పోలీసులు రంగంలోకి దిగి సీసీ ఫుటేజీల ఆధారంగా బైక్‌ను గుర్తించి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా చెఫ్‌గా పనిచేస్తున్న రమేష్‌గా గుర్తించారు. 2019లో రమేష్ వివాహం అయ్యిందని, ఓ కూతురు కూడా ఉందని, భార్యాభర్తల మధ్య గొడవలతో ఆరునెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిందని దర్యాప్తులో తేలింది. అప్పటి నుంచి తన మొబైల్ ఫోన్‌లో అశ్లీల వీడియోలకు అలవాటు పడి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు. నిందితునిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు



బంజారాహిల్స్: గోల్కొండ హోటల్ చైర్మన్ రామిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. గోల్కొండ హోటల్ డైరెక్టర్ ఆపరేషన్స్ శ్యామల శ్రీనివాస్‌రెడ్డి, జీఎం రమేష్, ఫైనాన్స్ మేనేజర్ శ్రీనివాస్, గోల్కొండ రిసార్ట్స్ టీమ్ ఈ కార్యక్రమంలో పాల్గొని సర్కారు బడి విద్యార్థులతో కలిసి సామూహిక భోజనాలు చేశారు. ఈ పాఠశాలలో తరచూ గోల్కొండ హోటల్స్ అండ్ రిసార్ట్స్ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు సన్నిహితం అయింది. ఇందులో భాగంగానే సోమవారం విందు ఏర్పాటు చేశారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి


జీఎం హరి శంకర్‌తో భేటీ అయిన కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్‌నెం. 10 సింగాడికుంట, జహీరానగర్, ఓల్డ్ వెంకటేశ్వరనగర్ బస్తీల్లో పెండింగ్‌లోని సీవరేజీ పనులను వెంటనే పూర్తిచేయాలని కార్పొరేటర్ కవితారెడ్డి జలమండలి జీఎం హరి శంకర్‌ను కోరారు. సోమవారం కార్పొరేటర్ హరి శంకర్‌తో బంజారాహిల్స్ సెక్షన్ మేనేజర్ శివకుమార్‌తో కలిసి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా ఉన్న బస్తీల్లో సీవరేజీ సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలని కోరారు.

సీఎం ఇంటి ముట్టడికి యత్నం

లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్


పోలీసుల అదుపులో నిరసనకారులు

బంజారాహిల్స్: రాష్ట్ర మంత్రి వర్గంలో లంబాడీలకు మంత్రి పదవి కేటాయించాలంటూ గిరిజన విద్యార్థి సంఘం, లంబాడీ హక్కుల పోరాట సమితి నేతలు సోమవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు నిరసనకారులు లంబాడీ హక్కుల సమితి నాయకులు ఇందల్ రాథోడ్, వెంకట్ బంజారా, వడ్త్యావత్ రమేష్ నాయక్, డాన్ శ్రీను, హాని బాయి, అచ్చిబాయి, సుధీర్, కోట్యా నాయక్, రాజ్‌కుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని సాయంత్రం సొంత పూచికత్తుపై వదిలేశారు.

అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం


సమీక్ష సమావేశంలో సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: రహమత్ నగర్ డివిజన్‌లో పెండింగ్‌లోని అభివృద్ధి పనులపై కార్పొరేటర్ సీఎన్ రెడ్డి యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లోని పనుల నివేదికలు వెంటనే రూపొందించాలని ఆయన అధికారులకు సూచించారు. నిధులు విడుదల కోసం తాను కమిషనర్ కలువనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎంసీ బాలరాజు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్ రూం పేరుతో రూ.1.4 కోట్లు వసూలు

నిందితుడి రిమాండ్


నిందితుడు నరసింహ

రహమత్‌నగర్ (బోరబండ): డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని రూ.1.4 కోట్లు వసూలు చేసిన ఓ వ్యక్తిని బోరబండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎస్పీఆర్‌హిల్స్ ప్రతిభానగర్ బస్తీకి చెందిన నర్సింహ డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇప్పిస్తానని సుమారు 19 మంది నుంచి రూ. 1.4 కోట్లు వసూలు చేశాడు. బాధితులు ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు నరసింహను అదుపులోకి తీసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

పెట్టుబడుల పేరుతో మోసం

రూ.37.443 పోగొట్టుకున్న యువతి

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే నగదు రెట్టింపు అవుతాయని నమ్మించి యువతిని మోసగించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. నిజామాబాద్‌కు చెందిన టి. వేదిక స్థానిక మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసిస్తుంది. ఈనెల 17న ఇన్‌స్టాగాంలో మెసేజ్ వచ్చింది. యాడ్స్ ట్రేడింగ్‌లో నగదు పెడితే రెట్టింపు అవుతాయని పేర్కొన్నారు. ఈ మెసేజ్‌ను నమ్మిన వేదిక రూ.37,443 వరకు జీపే ద్వారా చెల్లించింది. అయితే రిటర్న్ రాలేదు. దీంతో తాము మోసపోయానని గ్రహించి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్ : ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ గోదావరికి చెందిన టి.ధన్‌రాజ్ వీడియోగల్లీలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. గత శనివారం ద్విచక్ర వాహనాన్ని తాను ఉంటున్న ఇంటి ముందు పార్క్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. అనేక ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎరుకల కార్పొరేషన్‌కు రూ. 5వేల కోట్లు కేటాయించాలి

కాచిగూడ: ఏకలవ్య కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, పాలక వర్గంలోకి ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి ప్రతినిధులను తీసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు ఎరుకల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరుకల కార్పొరేషన్‌కు రూ.5వేల కోట్ల నిధులను కేటాయించాలని అన్నారు. ఎరుకల ప్రజల పక్షాన నిలబడి నిజాయితీగా, నిస్వార్థంగా 27 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న సంఘం ఎరుకల హక్కుల పోరాట సమితి అని అన్నారు. ఈ సమావేశంలో వోలుగుమాను బలరాం ఎరుకల, మానుపాటి కృష్ణ ఎరుకల, రుద్రాక్ష భాస్కర్, రవి ఎరుకల తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మంగళవారం । 22 । అక్టోబర్ । 2024

నగరంలో నేడు

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం బేగంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుంది.
- ట్రాన్స్‌జెండర్స్‌కు ఆధార్ కార్డుల జారీ కేంద్రం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవన్‌లో మంగళవారం ప్రారంభవుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.



కీసరలో ఒక నిర్మాణ సంస్థ లేఅవుట్‌లో క్రీడా ప్రాంగణం



జవహర్‌నగర్ నగర పాలక సంస్థలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

ఆటంకాలెన్నో?

ఆట వస్తువులున్నా.. వసతులు లేక నిరుపయోగం

ఒక్కో క్రీడా ప్రాంగణం అభివృద్ధి ఖర్చు రూ.4 లక్షలు

పట్టణాలు, గ్రామాల్లో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచి, మానసిక ఉల్లాసం, ఉత్సాహాన్ని కలిగించి వారిలో నైపుణ్యాన్ని వెలికి తీయాలన్న లక్ష్యం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో నీరు గారుతోంది. ప్రజాప్రతినిధుల అలసత్వం.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా క్రీడా ప్రాంగణాల పరిస్థితి తయారైంది. వీటి నిర్వాహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలకు అప్పగించినప్పటికీ పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఎందుకు అక్కరకు రాని స్థితికి చేరుకున్నాయి.

- గ్రేటర్ శివారుల్లోని పంచాయతీలు, పట్టణాల్లో వెలసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మొక్కుబడిగా పలుచోట్ల లేఅవుట్లు, పార్కు స్థలాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడం వల్ల నిరుపయోగంగా మారాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై ప్రత్యేక దృష్టి సారించి క్రీడాకారులను ప్రోత్సహించేలా చూడాలని కోరుతున్నారు.
- 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీల్లో అప్పటి బీఆర్ఎస్ సర్కారు హడావుడిగా పల్లె, పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. వీటిల్లో 259 క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించినప్పటికీ, 145 ప్రాంతాలకే పరిమితమైంది. మొక్కుబడిగా వసతుల లేమితో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది.
- క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి డిజైన్ రూపకల్పన చేయడంతో పాటు క్రీడా పరికరాలు, మౌలిక వసతుల కల్పనకు ఒక్కో ప్రాంగణానికి రూ.4 లక్షల చొప్పున ఖర్చు చేసింది. ఇందులో 40 శాతం క్రీడా ప్రాంగణాలను లేఅవుట్లు, పార్కు స్థలాల్లో ఏర్పాటు చేసినట్లు క్రీడాకారులు పేర్కొంటున్నారు.
- క్రీడా ప్రాంగణాల్లో 23 రకాల స్పోర్ట్స్ పరికరాలను సమకూర్చినప్పటికీ సరిపడా సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. పలుచోట్ల పూర్తిస్థాయిలో క్రీడా సామగ్రి అందజేయకపోవడంతో పాటు శిక్షకుల నియామకం ఇప్పటి వరకు జరగలేదు. ముఖ్యంగా క్రీడా ప్రాంగణాలకు చాలాచోట్ల ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది.

- పలు గ్రామ పంచాయతీల్లో బిల్డర్లు, పలు సంస్థలతో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయించి, పరికరాలు సమకూర్చినట్లు పత్రాలు చూపించి బిల్లులు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- క్రీడా ప్రాంగణాల నిర్వహణ బాధ్యత, బాగోగులు చూడాల్సిన గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలు పూర్తిగా విస్మరించాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖల అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో చెట్ల పొదలు, పిచ్చి మొక్కలకు నిలయంగా క్రీడా ప్రాంగణాలు మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి క్రీడాకారులను పోత్సహించాలని కోరుతున్నారు.

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి

ఇండియన్ బ్యాంక్ ఎఫ్‌జీఎం జి.రాజేశ్వర్‌రెడ్డి


అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ ఎఫ్‌జీఎం జి.రాజేశ్వర్ రెడ్డి

కాచిగూడ: కొంత కాలంగా రూ.10 నాణేలపై ప్రజల్లో, చిల్లర వ్యాపారుల్లో అపోహ ఉందని, ఆ అపోహను తొలగించడానికి ఇండియన్ బ్యాంక్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆ బ్యాంక్ ఎఫ్‌జీఎం జి.రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ బ్యాంక్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.10 నాణేలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, అవి ఖచ్చితంగా చెల్లుబాటు అవుతాయని పేర్కొన్నారు. వీటిని రోజువారి లావాదేవీలకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే 2 వేల కరపత్రాలను, స్టిక్కర్స్‌ను పంపిణీ చేశామని, మరో 10 వేల స్టిక్కర్స్‌ను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. స్థానిక కిరాణ షాపుల్లో, ఆటో డ్రైవర్లు, పెట్రోల్ బంకుల్లో, హోటళ్ల నిర్వాహకులకు అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్‌రావు, ఏజీఎం స్వర్ణ ప్రవ సౌందర్య, తదితరులు పాల్గొన్నారు.

తూంకుంటకు చేరుకున్న సీఎం కప్ టార్చ్



తూంకుంటలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ

శామీర్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ ఈ నెల 3న ప్రారంభం కాగా 32 జిల్లాలు తిరుగుతూ సోమవారం మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీకి చేరుకుంది. కాగా మేడ్చల్ జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో తూంకుంట చౌరస్తా నుంచి తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ వరకు నిర్వహించిన టార్చ్ ర్యాలీకి ముఖ్యఅతిథిగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీనియర్ ప్లేయర్ మర్రి లక్ష్మారెడ్డి, 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ అభివృద్ధిలో పోస్టుమేన్ల పాత్ర అమోఘం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పోస్టల్ శాఖ అభివృద్ధి పథంలో నడుస్తుందంటే పోస్టుమేన్ల పాత్ర అమోఘమని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ పి.విద్యాసాగర్‌రెడ్డి ప్రశంసించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ పోస్టుమేన్, ఎంటీఎస్ తెలంగాణ సర్కిల్ మహాసభ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పి.విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎలక్షన్ సమయంలో పోస్టుమేన్లు ఓటరు గుర్తింపు కార్డులను సకాలంలో డెలివరీ చేసి మన డిపార్టుమెంటుకు మంచిపేరు తెచ్చారని ప్రశంసించారు. రాష్ట్రంలో 92శాతం ఓటరు కార్డులను సకాలంలో బట్వాడా చేసినందుకు ఎలక్షన్ కమిషన్ కూడా పోస్టుమేన్ల సేవలను ప్రశంసించిందని గుర్తుచేశారు. అయితే నిన్న మీడియాలో తాను మాట్లాడినట్లు వచ్చిన వార్తలు అవాస్తవం అని, దీన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. పాత పెన్షన్ విధానం కొనసాగించాలని, 8వ వేతన సంఘం గురించి కానీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఆల్ ఇండియా సెక్రెటరీ జనరల్ ఎఫ్ఎన్‌పీవో శ్రీనివాస్ రెడ్డి శివాజీ, ఆలిండియా జనరల్ సెక్రెటరీ నిసార్ ముజావర్, యూనియన్ సర్కిల్ సెక్రెటరీ ఎం.కృష్ణ, సర్కిల్ ప్రెసిడెంట్ మహ్మద్ క్వలీల్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ వైద్యుడికి గోల్డ్‌మెడల్స్


గోల్డ్‌మెడల్స్‌తో భూపేందర్‌సింగ్ రాథోడ్

గాంధీఆస్పత్రి: గాంధీ ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగాధిపతి ప్రొఫెసర్ భూపేందర్‌సింగ్ రాథోడ్ అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. నగరంలోని ఓ రిసార్ట్‌లో జరిగిన 19వ సౌత్‌ఇండియా, అసోషియేషన్ ఆఫ్ ఓటోలారింగోలజిస్ట్స్ (ఏఐఓ) సదస్సులో బెస్ట్ సర్జికల్ వీడియో ప్రజంటేషన్, బెస్ట్ పేపర్ బై సీనియర్ టీచింగ్ ఫ్యాకల్టీ విభాగాల్లో ప్రొఫెసర్ భూపేందర్‌సింగ్ రాథోడ్ ప్రతిభ ప్రదర్శించి బంగారు పతకాలు సాధించారు. సదస్సులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన పలువురు వైద్యనిపుణులు పాల్గొన్నారు. గోల్డ్‌మెడల్స్ సాధించిన భూపేందర్‌సింగ్ రాథోడ్‌ను పలువురు వైద్య ఉన్నతాధికారులు, గాంధీ వైద్యులు అభినందించారు.

ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ స్మారక చిహ్నాలు ఏర్పాటు చేయాలి



పంజగుట్ట: గత ప్రభుత్వంలో నికార్సయిన తెలంగాణ ఉద్యమకారులను విస్మరించారని, కనీసం ప్రజా ప్రభుత్వంలో అయినా వారికి తగిన గుర్తింపు కల్పించాలని పలువురు ఉద్యమకారులు ప్రభుత్వాన్ని కోరారు. ముల్కి ఉద్యమం నుంచి తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో ఎంతో ప్రముఖ పాత్ర పోషించి చనిపోయే వరకు తెలంగాణ కోసం పోరాడిన ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్(టఫ్) ప్రతినిధులు మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్, విమలక్క, హనుమాండ్లు, పాశం యాదగిరి, సోగరాబేగం, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడారు. 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమంలోనే చార్మినార్ నుంచి అసెంబ్లీ వరకు లక్షలాది మందితో ర్యాలీ నిర్వహించి పోలీసు కాల్పులను ఎదుర్కొని ఎంతో ధైర్యంగా నిలబడ్డ వ్యక్తి ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ అని గుర్తుచేసుకున్నారు. ప్రజా ప్రభుత్వంలో కోఠి ఉమెన్స్ కాలేజీకి చాకలి ఐలమ్మ పేరును పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని, అదే తరహాలో జాదవ్ ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజీకి ఆయన పేరును పెట్టాలని కోరారు. భవిష్యత్ తరాలకు జాదవ్ చరిత్ర తెలిసేందుకు ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో పొందుపర్చాలని, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం స్థాపించాలని విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లో కేబీఆర్ పార్క్ వద్ద ఉన్న బ్రహ్మానందరెడ్డి విగ్రహం ధ్వంసం కేసులో మొదటి ముద్దాయిగా జాదవ్ ఉన్న నేపథ్యంలో కాసు బ్రహ్మానందరెడ్డి పార్క్ పేరును ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ పార్క్‌గా మార్చి అక్కడ జాదవ్ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. చంద్రశేఖర్, డి.రాజు గౌడ్, స్నేహ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్‌లో 78 క్యాడర్లలో సుమారు 17,541 వేల మందికి క్యాడర్ ఫిక్షేషన్ చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ కన్న డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు బేసిక్ పే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, 35 రోజుల క్యాజువల్ లీవ్స్ మంజూరు చేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడా సెలవులు మంజూరు చేయాలని కోరారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న ఖాళీల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలను వచ్చేనెల 16లోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

డీడీ రెనోవా కేన్సర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స


రోగి లలితతో రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వైద్యుల బృందం

నల్లకుంట: లక్షల్లో ఒకరికి వచ్చే వ్యాధికి రెనోవా కేన్సర్ సెంటర్ వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన నాయిని లలిత(52) 4 నెలలుగా కడుపు ఉబ్బరం, ఆయాసం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి సమస్యతో బాధపడుతోంది. చికిత్సల కోసం ఖమ్మం, హైదరాబాద్‌లోని ప్రముఖ ఆస్పత్రుల్లోని వైద్యులను సంప్రదించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు సూడోమైక్సోమా పెరిటోరి అనే అరుదైన వ్యాధితో బాధపడుతోందని నిర్ధారించారు. ఆమె కుటుంబ సభ్యులు విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్(డీడీ) రెనోవా కేన్సర్ సెంటర్ వైద్యులను సంప్రదించారు. ఆమెను పరీక్షించిన అక్కడి వైద్యులు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. 10 నుంచి 12 గంటల పాటు శ్రమించి సైటోరేడక్షన్ విత్ హైపెక్ శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. వారం రోజుల్లోనే ఆమె కోలుకున్నారు. లలితకు పెరిటోనెక్టమీ, కోలాసిస్టెక్టమీ, గ్యాస్ట్రెక్టమీ, జేజునల్ రెసెక్షన్, టోటల్ కోలెక్టమీ, గ్యాస్ట్రోజెజునోస్టోమీ, ఇలియా అనస్టోమోసిస్, పేపర్లెర్మిక్ ఇంట్రాపెర్టోనియల్ కిమోథెరపీ వంటి పలు రకాల శస్త్ర చికిత్సలు చేయాల్సి వచ్చిందని, రోగి ఆర్థిక స్థితిని పరిగణలోకి తీసుకుని తక్కువ ఖర్చుతో నాణ్యమైన చికిత్స అందించినట్లు డాక్టర్ యు.ఆజాద్ చంద్రశేఖర్, మెడికల్ డైరెక్టర్ తెలిపారు. లక్షలో ఒకరికి సూడోమైక్సోమా పెరిటోరి సమస్య తలెత్తే అవకాశం ఉందని, ఈస్ట్ హైదరాబాద్‌లోనే తొలిసారిగా సంక్లిష్టమైన ఈ హైపెక్ సర్జరీని విజయవంతంగా పూర్తిచేసినట్లు రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీవోవో రవీంద్రనాథ్ అన్నారు. డాక్టర్లు సమంత, కన్సల్టెంట్ అనస్తీషియాలజిస్ట్ డాక్టర్ రవికుమార్‌రెడ్డి, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఉల్లాస్, డాక్టర్ రాకేష్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ పోస్టులను భర్తీ చేయండి

- బ్యాక్‌లాగ్‌లను జనరల్ కేటగిరీలోకి మార్చాలి
- గాంధీ భవన్ ఎదుట ట్రైనీ టీచర్ల ఆందోళన



గాంధీ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉర్దూ ట్రైనీ టీచర్లు

సాక్షి, సిటీబ్యూరో: డీఎస్సీ–2024లో ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అర్హులైన అభ్యర్థులు లేక మిగిలిపోయిన పోస్టులను జనరల్ కేటగిరికి కేటాయించి తిరిగి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని ఉర్దూ ట్రైనీ టీచర్స్ డిమాండ్ చేశారు. ప్రత్యేక ఉర్దూ మీడియం నోటిఫికేషన్ సాధన కోసం చలో గాంధీ భవన్ పిలుపు మేరకు సోమవారం రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థులు తరలివచ్చి గాంధీభవన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిసారి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ అవుతున్నా రిజర్వేషన్ కేటగిరి పోస్టులు 90 శాతం వరకు బ్యాక్‌లాగ్ కింద పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉర్దూ మీడియంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల ఆధారంగా పోస్టులు కేటాయిస్తుండటంతో ఆ కేటగిరిలో అభ్యర్థులు లేక పోస్టులు భర్తీ కావడం లేదన్నారు. జనరల్ కేటగిరిలో అర్హులైన అభ్యర్థులు ఉన్నప్పటికీ రిజర్వేషన్ల మెలిక దెబ్బతీస్తుందన్నారు. డీఎస్సీ–2024లో 1183 ఉపాధ్యాయ పోస్టులకు గాను కేవలం 517 పోస్టులను మాత్రమే భర్తీ చేశారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ కేటగిరిలో గల సుమారు 666 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేక భర్తీ పెండింగ్‌లో పడిపోయిందన్నారు. గతంలో సైతం రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థులు లేక పోస్టులు బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోయాయని గుర్తు చేశారు. ఉర్దూ మీడియం ఖాళీలను డీ–రిజర్వ్ చేసి జనరల్ కేటగిరి కింద మర్చాలన్నారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఉర్దూ మాట్లాడేవారికి న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. తక్షణమే ప్రత్యేక నోటిఫికేషన్ల ద్వారా తమకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గాంధీ భవన్ వర్గాలకు వినతి పత్రం సమర్పించారు.

ఎస్సీ మోస్ట్ బ్యాక్‌వర్డ్ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం

కవాడిగూడ: ఎస్సీ జాబితాలోని మోస్ట్ బ్యాక్‌వర్డ్ ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా ఎస్సీ కులాల జనగణన జరిగిన తర్వాతే ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును యథాతంగా అమలు చేయాలన్నారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మోస్ట్ బ్యాక్ వర్డ్ ఎస్సీ కులాలకు మాల మాదిగ కార్పొరేషన్లతో సంబంధం లేకుండా ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరిగే విధంగా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బైరి వెంకటేశం మాట్లాడుతూ.. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ జాబితాలోనే అత్యంత వెనుకబడ్డ ఉపకులాలకు కార్పొరేషన్ హామీ అమలును నిలబెట్టుకొని కాంగ్రెస్ చిత్తశుద్ధిని చాటాలన్నారు. ఎస్సీ ఉపకులాల న్యాయమైన డిమాండ్లపై వచ్చేనెల 1వ తేదీ వరకు ప్రభుత్వం స్పందించకపోతే 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎంఆర్‌వో కార్యాలయాల ముట్టడి, వచ్చేనెల 24న ఎమ్మెల్యే కార్యాలయాలను ముట్టడి చేస్తామని, డిసెంబర్ 14న అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నిరసన దీక్షకు ప్రొఫెసర్ గాలివినోద్‌కుమార్ మద్దతు ప్రకటించారు. నిరసన దీక్షలో రాష్ట్ర అధ్యక్షుడు నీరగొండ బుచ్చన్న, ప్రధాన కార్యదర్శి టీఎస్ స్వామి, మహిళా కన్వీనర్ టి.శోభాబాయి, యూత్ కో కన్వీనర్ జే.రాజ్‌కుమార్, ఏపీ గౌరవ అధ్యక్షుడు డి.సత్యం, ఏపీ అధ్యక్షుడు గంటా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుంకన్న, ఉపాధ్యక్షులు సీజే శివయ్యతో పాటు ఎస్సీ ఉపకులాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన స్విమ్మింగ్ పోటీలు



పతకాలతో విజేందర్‌సింగ్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ నిర్వహించిన 9వ తెలంగాణ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన విజేందర్ సింగ్ సత్తాచాటారు. వివిధ విభాగాల్లో మూడు బంగారు, ఒక సిల్వర్ పతకాలను సాధించారు. ఈ పోటీల్లో సత్తాచాటిన మహిళ, పురుష క్రీడాకారులు వచ్చే నెల మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

'గాంధీ'లో నీటి కష్టాలు

సర్జరీల్లో జాప్యం • వార్డుల్లో రోగుల ఇబ్బందులు

గాంధీఆస్పత్రి: తెలంగాణ వైద్యప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో నీటి కష్టాలతో వైద్యులు, రోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సంపు నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని ఎత్తిపోసే మోటారు కాలిపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. నీటి సమస్యతో ఆపరేషన్ థియేటర్లలో నిర్వహించే సర్జరీల్లో జాప్యం నెలకొంది. ఆస్పత్రి పాలన యంత్రాంగం, టీజీఎంఎస్ఐడీసీ అధికారులు స్పందించి సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో సమస్యను పరిష్కరించారు. వివరాలు.. గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ సంపులోకి జలమండలి నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా ప్రతిరోజూ 7.2 లక్షల నీరు చేరుతుంది. ఆస్పత్రి ప్రధాన భవనం, ఓపీ బిల్డింగ్, నూతనంగా నిర్మించిన ఎంసీహెచ్ భవనాలపైన గల సుమారు 15 ఓవర్ హెడ్ ట్యాంకులకు సంపు నుంచి ఆరు మోటార్ల ద్వారా 6 లక్షల లీటర్ల నీటిని పంపింగ్ చేస్తారు. ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి పైప్‌లైన్ల ద్వారా ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, విభాగాలకు నీరు సరఫరా అవుతుంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం నీటిని ఎత్తిపోసే ప్రధాన మోటారు మరమ్మతులకు గురికాగా, సోమవారం నీటి పంపింగ్‌కు ఆటంకం కలగడంతో ప్రధాన భవనానికి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇన్‌పేషెంట్ విభాగంలోని పలు విభాగాలు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లలో వైద్యసేవలకు అంతరాయం కలిగింది. రోగులు ఇబ్బందులకు గురయ్యారు. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో మోటార్లకు మరమ్మతులు పూర్తిచేసి సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో నీటి సరఫరాను పునరుద్ధరించారు. సర్జరీలు, వైద్యసేవల్లో ఎటువంటి జాప్యం జరగలేదని డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ–1 శేషాద్రి స్పష్టం చేశారు.


నూతనంగా ఏర్పాటు చేస్తున్న 15హెచ్‌పీ మోటార్లు


గాంధీలో మొరాయించిన నీటి పంపింగ్ మోటారుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రూ.50 లక్షలతో నూతన మోటార్ల కొనుగోలు

గాంధీ ఆస్పత్రికి నీటిని ఎత్తిపోసేందుకు రూ.50 లక్షల వ్యయంతో ఆరు మోటార్లను కొనుగోలు చేసినట్లు తెలంగాణ వైద్యవిద్య మౌలిక సదుపాయాల కల్పనసంస్థ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం గాంధీ ఆస్పత్రి నిర్మించినప్పుడు ఏర్పాటు చేసిన 7.5 హెచ్‌పీ కెపాసిటీ కలిగిన మోటార్లే ఇప్పటి వరకు వినియోగించామని, అవి తరచూ మొరాయించడంతో ఇటీవలే 15 హెచ్‌పీ కెపాసిటీ కలిగిన ఆరు మోటార్లను కొనుగోలు చేశామని సంబంధిత అధికారులు వివరించారు. నూతన మోటార్ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోందని, రెండు రోజుల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. నూతన మోటర్ల ద్వారా గంటకు 2.5 లక్షల లీటర్ల నీటిని పంపింగ్ చేయవచ్చని తెలిపారు.

కొత్త భాషలు నేర్చుకోవడం కొన్నేళ్ల క్రితం వరకూ కేవలం హాబీగా భావించేవారు. అయితే, ప్రపంచీకరణతో విదేశీ భాషా నైపుణ్యం ఆదాయమార్గంగా కూడా అవతరించింది. దీంతో వయసుతో సంబంధం లేకుండా నగరవాసుల్లోనూ విదేశీ భాషలపై ఆసక్తి పెరుగుతోంది. సంపాదన కోసమో, మరేదైనా లక్ష్యాలతోనో సీరియస్‌గా ఫారిన్ లాంగ్వేజెస్‌కు జై కొడుతున్నారు. ప్రస్తుతం ఫ్రెంచి, రష్యన్, స్పానిష్, చైనీస్ అరబిక్ వంటి అనేక విదేశీ భాషలు బాగా డిమాండ్‌లో ఉన్నాయి. ఇటీవలే కొరియన్ వెబ్‌సిరీస్, మ్యూజిక్‌కూ పెరిగిన ఆదరణ కొరియన్ భాషా పరిజ్ఞానంపై యువత ఆసక్తిని పెంచింది. - సాక్షి, సిటీబ్యూరో



లాంగ్వేజ్ ఫర్ ఎర్న్

విదేశీ భాష.. విజయాలు లెస్స

బహుభాషా పరిజ్ఞానంపై నగరవాసుల ఆసక్తి

కెరీర్, ఉపాధి అవకాశాలు విస్తృతమనే ఆలోచన

ఓటీటీ ప్రభావంతో సరదాగానూ నేర్చుకుంటున్న వైనం

డిమాండ్‌లో ఫ్రెంచ్.. క్రేజీగా కొరియన్..

విదేశీ భాషని అధ్యయనం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. మన రెస్యూమ్‌ను బలోపేతం చేయడంతో పాటు పర్యాటక రంగంలో, గైడ్స్‌గా ఇతరత్రా రంగాల్లో రాణించడానికి, ట్రావెల్, బ్లాగులను తయారు చేయడం తదితర ఎన్నో రంగాల్లో ఉపాధి అవకాశాలను అందిస్తోంది. అంతేకాకుండా ప్రపంచం నలుమూలలకూ కమ్యూనికేట్ చేయగలిగేలా చేస్తుంది. విదేశీ విశ్వవిద్యాలయలో ప్రవేశాలకు కూడా ఉపయుక్తం అవుతున్నాయి.. ప్రస్తుతం వర్క్ కల్చర్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు మారడంతో విదేశీ భాషా నైపుణ్యాలతో ఫ్రీలాన్సర్‌గా అవకాశాలు పెరిగాయి. ఓటీటీ తదితర వేదికల విజృంభణతో అనువాదకులకు భారీగా డిమాండ్ పెరగడం కూడా విదేశీ భాషలను క్రేజీగా మార్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అనేక ఉద్యోగ అవకాశాలతో జాతీయ, అంతర్జాతీయ బ్యాంకులు దేశ విదేశాలలో రాయబార కార్యాలయాలు, హై-కమిషన్‌లలో విదేశీ భాషా ఉపాధ్యాయులుగా కొనసాగడానికి వీలైన కోర్సులకు డిమాండ్ సంతరించుకుంటున్నాయి.

ఫ్రెంచ్ పట్ల ఆసక్తి..

ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మంది పైగా మాట్లాడే ఫ్రెంచ్ అత్యధికంగా మాట్లాడే భాషగా ఆరో స్థానంలో ఉంది. ఇది ఫ్రాన్స్, కెనడాతో సహా 29 దేశాల్లో అధికారిక భాష. ఫ్యాషన్, హాస్పిటాలిటీ, టూరిజంలో కెరీర్‌కు ఉపకరించే ఫ్రెంచ్ నేర్చుకోవడానికి విశ్వవ్యాప్తంగా విలువైన భాష.



స్పానిష్.. జోష్..

దాదాపు 50 కోట్ల మందికి పైగా మాట్లాడే వారితో స్పానిష్ ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా మాట్లాడే భాషలలో రెండో స్థానంలో ఉంది. స్పానిష్ మాట్లాడే దేశాలతో మన దేశానికి ఇటీవల పెరుగుతున్న వాణిజ్యం దృష్ట్యా నేర్చుకోవడానికి అత్యధికులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రత్యేకించి అంతర్జాతీయ వ్యాపారం, ఆతిథ్యం పర్యాటక రంగంలో ఆసక్తి ఉన్న వారికి ఇది బెస్ట్.

విన్.. జపాన్..

సాంకేతిక హబ్ హోదా, భారతదేశంతో బలమైన వాణిజ్య సంబంధాలు కలిగిన జపాన్ జపనీస్ అత్యధికులు కోరుకునే భాషగా మార్చాయి. ప్రపంచవ్యాప్తంగా 13 కోట్ల మందికి పైగా మాట్లాడే ఈ భాష సాంకేతికత, యానిమేషన్, గేమింగ్‌లో కెరీర్‌ను ఎంచుకున్న సిటీ యూత్ ఎంపికగా మారింది.

మాండరిన్.. మంచిదే..

మనదేశపు అతిపెద్ద వ్యాపార భాగస్వామిగా చైనాను దృష్టిలో ఉంచుకుంటే.. అంతర్జాతీయ వ్యాపారం, దౌత్యం పర్యాటక రంగం కోసం మాండరిన్ నేర్చుకోవడం అవసరంగా మారింది.

కో అంటే కొరియన్..

ప్రపంచవ్యాప్తంగా 75 కోట్ల మందికి పైగా మాట్లాడే కొరియన్‌కు నగరంలో బాగా డిమాండ్ ఉంది. ఆసియాలో మనదేశానికి మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి కొరియా కావడం సాంకేతిక, వినోద పర్యాటక రంగాల్లో ఈ భాషా నైపుణ్యానికి డిమాండ్ పెంచుతోంది.



జర్మన్‌కు జై..

ప్రపంచవ్యాప్తంగా 10 కోట్ల మందికి పైగా, యూరోపియన్ యూనియన్‌లో అత్యధికంగా మాట్లాడే భాష జర్మన్. జర్మన్ నేర్చుకోవడం ఇంజినీరింగ్, సాంకేతిక రంగాల్లో విభిన్న అవకాశాలకు తలుపులు తెరుస్తోంది.

ఇదీ..ఇటాలియన్..

యూరోపియన్ యూనియన్‌లో అత్యధికంగా మాట్లాడే నాల్గో భాష ఇది. పర్యాటక కేంద్రంగా మరియు ఫ్యాషన్ మరియు డిజైన్‌కు కేంద్రంగా ఇటలీకి ఉన్న ప్రాచుర్యంతో ఫ్యాషన్, డిజైన్, హాస్పిటాలిటీలో కెరీర్‌ను లక్ష్యంగా చేసుకున్న సిటీ విద్యార్థులకు రైట్ ఛాయిస్‌గా నిలుస్తోంది.

గ్రేస్.. పోర్చుగీస్..

బ్రెజిల్ పోర్చుగల్‌తో సహా ఎనిమిది దేశాల్లో మాట్లాడేది పోర్చుగీస్. ఈ దేశాలతో మనకు విస్తరిస్తున్న సంబంధాల కారణంగా పోర్చుగీస్ భాషలో ప్రావీణ్యం అనేది భవిష్యత్తు విజయాలకు బాట వేస్తుంది.

శిక్షణా తరగతులు..

ఈ నేపథ్యంలో విదేశీ భాష నేర్చుకోవడంలో సహాయపడే అనేక అకాడమీలు, సంస్థలు నగరంలో వెలుస్తున్నాయి. ఆయా భాషల కోర్సు వ్యవధి సాధారణంగా ఆరు నుంచి 12 నెలల్లో పూర్తి చేసి ప్రొఫెషనల్ డిగ్రీని అందుకుంటారు. అయితే అనర్గళంగా మాట్లాడడం, చదవడం, రాయడం అర్థం చేసుకోవడంపై పూర్తి పట్టు సాధించేందుకు మరింత వ్యవధి అవసరం అవుతుందని శిక్షకులు అంటున్నారు. ఇవి కాకుండా ఒక విద్యార్థి ఆ భాష చరిత్ర, భాష సంస్కృతి సంబంధిత దేశాల ప్రజలు, అర్థం చేసుకునే పద్ధతి, ఆ భాష యాస, డిక్షన్ గురించి కూడా నేర్చుకుంటేనే పూర్తి అవగాహన వస్తుందని సూచిస్తున్నారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత సర్టిఫికెట్ డిప్లొమా స్థాయి కోర్సు లేదా పన్నెండో తరగతి పూర్తి చేసిన తర్వాత విదేశీ భాషలో డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సును అభ్యసించవచ్చు. నగరంలో ఇంగ్లిష్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, హైదరాబాద్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయాలు వంటివి విదేశీ భాషల్లో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నాయి. అలాగే పలు ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో విదేశీ భాషా కోర్సులను సులభంగా యాక్సెస్ చేయవచ్చు.



పలు భాషల్లో ప్రావీణ్యం కోసం..



విదేశీ భాషా పరిజ్ఞానం వల్ల ఉపాధి అవకాశాలతో పాటు మరెన్నో ప్రయోజనాలను యువత ఆశిస్తున్నారు. గతంలో పదుల సంఖ్యలో మాత్రమే విద్యార్థులు కనిపించేవారు. ఇప్పుడు ఆ సంఖ్య వందలకు చేరింది. కెనడాలో ఉండే భారతీయులు కూడా ఆన్‌లైన్ ద్వారా మాకు స్టూడెంట్స్‌గా ఉన్నారు. నేర్చుకోవడం అనేది ఇలా సులభంగా మారడం కూడా విదేశీ భాషల పట్ల ఆసక్తిని పెంచుతోంది.

- ఎం.వినయ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఫ్రెంచ్ భాషా విభాగం, ఉస్మానియా వర్సిటీ

ఎన్ఏయులో సమ్మర్ స్కూల్

సాక్షి, సిటీబ్యూరో: నార్తర్న్ అరిజోనా యూనివర్సిటీ (ఎన్ఏయు) క్యాంపస్‌లో భారతీయ విద్యార్థులకు సమ్మర్ స్కూల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు ఎన్ఏయు రిసాయా అకాడమీ ప్రతినిధులు వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని హయత్‌ప్లేస్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆ విశేషాలు వివరించారు. నగరంలోని మల్లారెడ్డి వర్సిటీతో ఒప్పందం కలిగిన బెంగళూరుకి చెందిన రిసాయా అకాడమీ భాగస్వామ్యంతో ఈ స్కూల్ ఏర్పాటైందని, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బ్లాక్‌చెయిన్, ఏఐ/ఎంఎల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) వంటి రంగాల్లో డిగ్రీ విద్యార్థులు ఎదుర్కొంటున్న క్లిష్టమైన నైపుణ్య అంతరాన్ని పరిష్కరించడమే లక్ష్యంగా రూపుదిద్దుకుందని వివరించారు. వచ్చే ఏడాది జులైలో ప్రారంభమయ్యే ఈ సమ్మర్ స్కూల్, పార్ట్-స్టడీ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులు స్వీకరణ ప్రారంభమైందని, సమ్మర్ స్కూల్ ఐదు వారాల పాటు కొనసాగుతుందన్నారు. అకడమిక్ క్రెడిట్‌లు, ఎన్ఏయు సర్టిఫికేషన్‌ను పొందే అవకాశాన్ని ఇది అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు హైబ్రిడ్ లెర్నింగ్ మోడ్‌లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. సమాచారం కోసం ఎన్ఏయు అధికారిక వెబ్‌సైట్ లేదా రిసాయా అకాడమీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని సూచించారు. ఎన్ఏయు గ్లోబల్ అఫైర్స్ అసోసియేట్ వైస్ ప్రోవోస్ట్ సీజర్ ఫ్లోర్స్, రిసాయా అకాడమీ సీఈఓ రతీష్ బాబు, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ వీఎస్కే రెడ్డి పాల్గొన్నారు.



26న టాలీవుడ్ థీమ్ పార్టీ

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ యాంకర్, సినీనటి అనసూయ భరద్వాజ్.. నగరంలో సందడి చేయనున్నారు. గచ్చిబౌలిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న పార్టీ వేదిక ఓడియం బై ప్రిజ్మ్‌లో టాలీవుడ్ ఐకానిక్ థీమ్ పార్టీలో అనసూయ ప్రధాన ఆకర్షణగా నిలువనున్నారు. ఈ నెల 26న రాత్రి 8గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుంది. బుక్ మై షో ద్వారా ఎంట్రీలను బుక్ చేసుకోవచ్చు.



నెక్సస్ మాల్లో కాంటినెంటల్ కాఫీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నెక్సస్ హైదరాబాద్ మాల్ వేదికగా ఏర్పాటు చేసిన 'కాంటినెంటల్ కాఫీ' నగరవాసులను అలరిస్తోంది. 100 కిలోల కాఫీ గింజలతో రూపొందించిన ప్రవేశ ద్వారం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నెక్సస్ సెలెక్ట్ ట్రస్టులో భాగమైన నెక్సస్ హైదరాబాద్, ప్లాటినమ్ అవుట్‌డోర్‌తో కలిసి కాంటినెంటల్ కాఫీ కోసం భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇది వినూత్న క్రాస్ ఫంక్షనల్ మార్కెటింగ్‌కు ఉదాహరణగా నిలుస్తుందని నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిశాంక్ జోషి అన్నారు. కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్‌తో ఈ భాగస్వామ్యం, అందరికీ ప్రీమియం షాపింగ్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యానికి అనుగుణంగా ఉందన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన కాఫీ థీమ్ అనుభవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. కాఫీని ఆస్వాదిస్తూ.. తమ అనుభూతులను క్షణాల్లో సోషల్ మీడియాలో షేర్ చేయడానికి కాఫీ కప్పు ఆకారంలో ప్రత్యేక ఫొటో బూత్ ఏర్పాటు చేశామని చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రాజా చక్రవర్తి వెల్లడించారు.

లిటిల్ చెఫ్..

బుజ్జి చేతులతో ఘుమఘుమలాడే వంటకాలు

ఐదేళ్ల వయసు నుంచే వంటకాలు ఆరంభం

ఇన్‌స్టా, యూట్యూబ్‌లో ప్రశంసల వర్షం

చిన్నారి చెఫ్ శ్రీనిత్యను మెచ్చుకుంటున్న నెటిజన్స్



చిన్నారులకు అన్నం తినిపించాలంటే తల్లులకు పెద్ద టాస్క్. కథలు చెప్పాలి.. బుజ్జగించాలి.. లాలించాలి.. అంత చేసినా చివరకు సగం వదిలేస్తుంటారు. ఇప్పుడైతే మొబైల్ ఫోన్‌లో ఏదో ఒక కార్టూన్లు, రైమ్స్ పెట్టి తినిపించేస్తున్నారు. అసలు పిల్లలు ఏం తింటున్నారో కూడా వారికి తెలియట్లేదు. అలా వారిపై ఫోన్ల ప్రభావం ఉంటోంది. ఇలాగే ఈ చిన్నారి కూడా అన్నం తిననంటూ మారాం చేస్తుండేదట. కానీ ఆ పాప తల్లిదండ్రులు మాత్రం కాస్త వెరైటీగా ఆలోచించారు. ఆ పాపతోనే వంటలు చేయించడం ప్రారంభించారు. వాటిని షూట్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టి పలువురి ప్రశంసలు పొందుతున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో



తినేటప్పుడు ఏడుపు మానిపించడానికి చేసిన ప్రయత్నం ఆ పాపకు వంటలపై మక్కువను పెంచేలా చేశాయి. దీంతో ప్రస్తుతం ఆ పాప మరింత యాక్టివ్‌గా తన హావభావాలతో వీక్షకులను ఆకట్టుకుంటోంది. ఆ పాప పేరే శ్రీనిత్య. బాచుపల్లిలో నివాసం ఉంటున్న నవీన్ చారి, శైలజ కూతురైన శ్రీనిత్య వయసు 8 ఏళ్లు. ప్రస్తుతం మూడో తరగతి చదువుకుంటోంది. కానీ వంటలతో పెట్టే వీడియోలతో యూట్యూబ్‌లో స్టార్‌గా మారింది.

చిన్నప్పటి నుంచే ఆసక్తి..

నాలుగేళ్ల వయసు నుంచే పాప కిచెన్‌లోని వస్తువులతో గడిపేదట. పాప ఆసక్తి చూసిన తండ్రి కిచెన్ సెట్ కొనిచ్చాడు. ఇక ఎప్పుడూ వాటితోనే కాలం గడుపుతూ ఉల్లాసంగా ఉండేదట. అయితే అన్నం తినకపోయేదట. దీంతో పాపకు అన్నంపై ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతో చిన్న చిన్న వంట పాత్రల్లో వంటకాలు చేయించడం నేర్పించారట. ఆ పాప చేసిన వంటకాలను చాలా ఇష్టంతో తినడం గుర్తించిన నవీన్.. ఓ రోజు పాప వంటలు తయారుచేస్తున్న సమయంలో వీడియోలు తీసి, ఇన్‌స్టాలో పెట్టాడు. బంధువులు, స్నేహితుల నుంచి ప్రశంసలు రావడంతో వీడియోలు తీయడం కొనసాగించాడు. అందుకోసం డ్రెస్‌లతో పాటు అన్ని రకాల మినియేచర్ వంట పాత్రలనూ కొనుగోలు చేశాడు. దాదాపు 5 ఏళ్ల వయసు నుంచే పాపతో వెరైటీ వంటకాలు చేయించడం, వాటిని అప్‌లోడ్ చేయడం చేస్తున్నాడు. శ్రీనిత్య చిన్నప్పటి నుంచే బుజ్జిగా మాట్లడటమే కాకుండా ముఖంలో హావభావాలు అద్భుతంగా పలికిస్తోంది. దీంతో వీక్షకులు కూడా పాప వంటకాలకే కాకుండా ఆమె ముఖ కవళికలకు కూడా ఫిదా అవుతున్నారు.

ఆహారంపై ఆసక్తి పెంచాలి..

శ్రీనిత్యకు ఎలాగైనా ఆహారంపై ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతో పాటు, వంటలు చేయడం ఎంత కష్టమో తెలియజేసేందుకు ఇలా వంటకాలు నేర్పించాం. వీడియోలు తీసేటప్పుడు ఎలా చెబితే అలా చేస్తుంటుంది. అస్సలు అలిసిపోదు. వీడియో షూటింగ్ అనగానే చాలా ఉత్సాహంగా ఉంటుంది. అటు స్కూల్‌లో కూడా బాగా చదువుకుంటుంది. వారాంతాల్లో ఎక్కువగా వంటలు చేయిస్తూ వీడియోలు తీస్తుంటాం. పాప వంటలు చేస్తుంటే ముద్దుముద్దుగా అనిపిస్తుంటుంది. వంటలు చేసుకుంటూ పిల్లలకు ఆసక్తి కలిగించే కథలు, మంచి మాటలు చెప్పిస్తుంటాం.



- నవీన్ చారి నారోజు, నిత్య తండ్రి

'కూచిపూడి'లో రివర్స్ స్కేటింగ్

పది ప్రపంచ రికార్డులు సృష్టించిన కట్ట సమన్వితారెడ్డి

25 కేజీల బరువు మోస్తూ 12.30 నిమిషాల పాటు ప్రదర్శన

నాంపల్లి: మునుపెన్నడూ లేని రీతిలో.. సరికొత్త విధానంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన కూచిపూడి శైలిలో హైదరాబాదుకు చెందిన నృత్యకారిణి కుమారి కట్ట సమన్వితా రెడ్డి వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో రివర్స్ స్కేటింగ్ చేస్తూ రికార్డు సృష్టించారు. వేదికపై 25 కేజీలు బరువును మోస్తూ 12 నిమిషాల 20 సెకండ్ల నిడివితో నర్తించి ఔరా అనిపించింది. ఆద్యంతం నర్తకి నృత్యం చేస్తుంటే సభికులు చప్పట్ల వర్షాన్ని కురిపించారు. కుమారి సమన్వితా చేసిన సోలో కూచిపూడి నృత్య ప్రదర్శనను మెచ్చుకుని 10 ప్రపంచ రికార్డులను ప్రపంచ రికార్డుల ప్రతినిధి డాక్టర్ లయన్ కెవి రమణారావు ప్రకటించారు. నాంపల్లి పబ్లిక్‌గార్డెన్ రోడ్డులోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో స్పందనా నృత్యకేళి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ వ్యవస్థాపకులు డాక్టర్ నామని రవికుమార్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరైన తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, సీఎస్‌డబ్ల్యూ డీసీపీ గిరిరాజు, విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు, నాట్య గురువు డాక్టర్ నామని రవికుమార్, సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్ యస్ జంగారెడ్డి రికార్డుల ధృవీకరణ పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. మిస్ కట్ట సమన్విత రెడ్డి సాధించిన 10 ప్రపంచ రికార్డుల్లో భారత్ వరల్డ్ రికార్డ్, తెలుగు వరల్డ్ రికార్డ్, విశ్వ గురు వరల్డ్ రికార్డ్, నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ రికార్డ్ హోల్డర్స్ బుక్, జీనియస్ గ్లోబల్ రికార్డ్, ఫ్యూచర్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డ్, వరల్డ్ రికార్డు, వండర్ ఇండియా (భారత్) రికార్డ్, హై రేంజ్ వరల్డ్ రికార్డ్ ఇంటర్నేషనల్, అమేజింగ్ కిడ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా సమన్వితా రెడ్డి తల్లిదండ్రులు తన కుమార్తెకు దక్కిన గౌరవానికి ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు.





కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో రిత్విక్

అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో పలువురు భారత క్రీడాకారులు పురోగతి సాధించారు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్‌కు చెందిన యువతార బొల్లిపల్లి రిత్విక్ చౌదరి, మహారాష్ట్ర ప్లేయర్ అర్జున్ ఖడే, తమిళనాడు ఆటగాడు శ్రీరామ్ బాలాజీ తమ కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంక్‌ను అందుకున్నారు. ఆదివారం కజకిస్తాన్‌లో ముగిసిన అల్మాటీ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో రిత్విక్-అర్జున్ జోడీ డబుల్స్ టైటిల్‌ను సాధించింది. ఈ విజయం వారిద్దరి ర్యాంక్‌లపై సానుకూల ప్రభావం చూపింది. రిత్విక్ 17 స్థానాలు ఎగబాకి 85వ ర్యాంక్‌లో, అర్జున్ ఖడే 15 స్థానాలు ఎగబాకి 77వ ర్యాంక్‌లో నిలిచారు. అల్మాటీ ఓపెన్ టోర్నీలోనే సెమీ ఫైనల్ చేరుకున్న శ్రీరామ్ బాలాజీ మూడు స్థానాలు పురోగతి సాధించి 61వ ర్యాంక్‌లో నిలిచాడు. రోహన్ బోపన్న 8వ ర్యాంక్‌లో, యూకీ బాంబ్రీ 44వ ర్యాంక్‌లో ఎలాంటి మార్పు లేదు. తమిళనాడుకే చెందిన జీవన్ నెడుంజెళియన్ మూడు స్థానాలు, విజయ్ సుందర్ ప్రశాంత్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకొని వరుసగా 87వ, 92వ ర్యాంక్‌ల్లో నిలిచారు. ఫలితంగా టాప్-100లో భారత్ నుంచి ఏడుగురికి స్థానం లభించింది.

ఒకే రోజు 16 వికెట్లు

- తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 106 ఆలౌట్
- దక్షిణాఫ్రికా 140/6


తైజుల్

మిర్పూర్: బౌలర్ల ఆధిపత్యంతో బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్టు సమరం మొదలైంది. దీంతో మొదటి రోజు ఇరు జట్ల బ్యాటర్లు కలిసి 246 పరుగులే (106; 140) చేయగా... ఏకంగా 16 వికెట్లు నేలకూలాయి. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 40.1 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ హసన్ (30; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. రబడ, ముల్డర్, కేశవ్ మహరాజ్ తలా 3 వికెట్లు పడగొట్టారు. లంచ్ లోపలే 6 వికెట్లను కోల్పోయిన ఆతిథ్య జట్టు... రెండో సెషన్‌లో మిగతా నాలుగు వికెట్లను సమర్పించుకుంది. తొలి ఇన్నింగ్స్ మొదలు పెట్టిన పర్యాటక దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి 41 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. ఓపెనర్ టోని డి జోర్జి (30; 4 ఫోర్లు), రికెల్టన్ (27; 4 ఫోర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (23; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ (5/49) సఫారీ జట్టును ఇబ్బంది పెట్టాడు.

షకీబ్ అనుకూల, వ్యతిరేకుల బాహాబాహి

మ్యాచ్‌కు వేదికైన షేర్-ఎ-బంగ్లా స్టేడియం వెలుపల బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ ఉల్ హసన్ అభిమానులు, ఆందోళనకారులు బాహాబాహికి దిగారు. నిజానికి రిటైర్మెంట్‌కు సిద్ధమైన ఈ క్రికెటర్‌ను ద్వైపాక్షిక సిరీస్‌కు ఎంపిక చేసినప్పటికీ... ప్రస్తుతం న్యూయార్క్‌లో ఉంటున్న షకీబ్ ఈ మ్యాచ్ ఆడేందుకు స్వదేశం వెళ్లనే లేదు. మ్యాచ్‌లో భాగం కాలేదు. దీంతో అతని అనుకూలురు, అభిమానులు ఓ వైపు... వ్యతిరేకిస్తున్న వారు మరోవైపు ఇలా ఇరు వర్గాల మధ్య మైదానం బయట నిరసన కార్యక్రమం జరిగింది. అయితే పోలీసులు, భద్రతా సిబ్బంది ఎవరిని స్టేడియం లోపలికి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మాజీ ప్రధాని షేక్ హసీనా సర్కారులో షకీబ్ ఎంపీగా ఉన్నాడు. అయితే హింసాత్మక ఘటనల్లో వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ఓ వ్యక్తి తన కుమారుడి మృతికి షకీబే కారణమంటూ కేసు పెట్టారు.


మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



వినేశ్, బజరంగ్, సాక్షి మలిక్ (ఫైల్)

'వారిద్దరి' స్వార్థం చెడ్డ పేరు తెచ్చింది!

- రెజ్లర్ల నిరసన పోరాటంపై సాక్షి మలిక్ తీవ్ర వ్యాఖ్యలు
- వినేశ్, బజరంగ్‌లపై విమర్శలు



న్యూఢిల్లీ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు నిరసనగా కొన్నాళ్ల క్రితం ఢిల్లీ వీధుల్లో సీనియర్ రెజ్లర్లు పోరాడారు. రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌కు వ్యతిరేకంగా వీరంతా సమష్టిగా ఉద్యమంలో పాల్గొన్నారు. ఇందులో ప్రధానంగా ముగ్గురు రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పూనియా, సాక్షి మలిక్ నిరాటంకంగా పాల్గొని పోరాటాన్ని ముందుండి నడిపించారు. అయితే ఇప్పుడు సాక్షి మలిక్ నాటి ఘటనపై పలు భిన్నమైన విషయాలు చెప్పింది. తన పుస్తకం 'విట్‌నెస్'లో సహచర రెజ్లర్లు వినేశ్, బజరంగ్‌లపై ఆమె విమర్శలు కూడా చేసింది. ఆసియా క్రీడల సెలక్షన్స్ నుంచి తమకు మినహాయింపు కోరడం వినేశ్, బజరంగ్ చేసిన పెద్ద తప్పని ఆమె వ్యాఖ్యానించింది. ఈ సడలింపు వల్లే తమ నిరసనకు చెడ్డ పేరు వచ్చిందని ఆమె అభిప్రాయ పడింది. భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం తర్వాత బాధ్యతలు తీసుకున్న తాత్కాలిక కమిటీ హాంగ్జౌ ఆసియా క్రీడల సెలక్షన్స్‌లో పాల్గొనకుండా నేరుగా పాల్గొనే అవకాశం వినేశ్, బజరంగ్‌లకు కల్పించింది. సాక్షి మాత్రం దీనికి అంగీకరించలేదు. 'వినేశ్, బజరంగ్ సన్నిహితులు కొందరు వారిలో స్వార్థం నింపారు. వారిద్దరు తమ సొంత ప్రయోజనాల కోసమే ఆలోచించేలా చేయగలిగారు. వినేశ్, బజరంగ్‌లకు సడలింపు ఇవ్వడం మేలు చేయలేదు. మా నిరసనకు అప్పటి వరకు వచ్చిన మంచి పేరును ఇది దెబ్బ తీసింది. ఒక దశలో సెలక్షన్స్ కోసమే ఇదంతా చేస్తున్నారా అని అంతా అనుకునే పరిస్థితి వచ్చింది' అని సాక్షి వెల్లడించింది. మరోవైపు బబిత ఫొగాట్ తమ నిరసనకు మద్దతు పలకడంలో కూడా స్వార్థమే ఉందని ఆమె పేర్కొంది. 'మేమందరం బ్రిజ్‌భూషణ్‌ను పదవి నుంచి తప్పించేందుకు పోరాడుతూ వచ్చాం. బబిత ఫొగాట్ మరోలా ఆలోచించింది. బ్రిజ్‌భూషణ్‌ను తొలగించడమే కాదు. అతని స్థానంలో తాను రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షురాలు కావాలనుకుంది. అందుకే మా శ్రేయోభిలాషి తరహాలో ఆమె ప్రవర్తించింది' అని సాక్షి వ్యాఖ్యానించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో సాక్షి కాంస్య పతకం గెలుచుకుంది.

హైదరాబాద్ ఎఫ్‌సీ జట్టుకు మూడో ఓటమి

జంషెడ్‌పూర్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఖాతాలో మూడో పరాజయం చేరింది. జంషెడ్‌పూర్ ఎఫ్‌సీతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 1-2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. జంషెడ్‌పూర్ తరఫున జోర్డాన్ ముర్రే (44వ ని.లో), రె టెచికావా (29వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. హైదరాబాద్ జట్టుకు గొడార్డ్ (50వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. నేడు జరిగే మ్యాచ్‌లో ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీతో ఒడిశా ఎఫ్‌సీ తలపడుతుంది.

దీపిక ధమాకా

ఐదోసారి వరల్డ్‌కప్ ఫైనల్ టోర్నీలో రజత పతకం గెలిచిన భారత ఆర్చర్



ట్లాక్స్‌కాలా (మెక్సికో): ప్రపంచ మాజీ నంబర్‌వన్, భారత మహిళా స్టార్ ఆర్చర్ దీపిక కుమారి ఈ ఏడాదిని ఘనంగా ముగించింది. మూడేళ్ల తర్వాత సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్ కప్ ఫైనల్లో ఆడిన దీపిక రజత పతకాన్ని సొంతం చేసుకుంది. చైనా ప్లేయర్ లీ జియామన్‌తో జరిగిన మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో 30 ఏళ్ల దీపిక 0-6 (26-27, 28-30, 25-27)తో ఓడిపోయింది. 'బెస్ట్ ఆఫ్ ఫైవ్ సెట్స్' పద్ధతిలో ఫైనల్ మ్యాచ్ జరిగింది. ప్రతి సెట్‌లో ఇద్దరు ఆర్చర్లు మూడు బాణాల చొప్పున సంధించారు. అనంతరం ఎక్కువ పాయింట్లు సాధించిన వారు సెట్ దక్కించుకున్నారు. సెట్ గెలిస్తే రెండు పాయింట్లు లభించాయి. స్కోరు సమమైతే చెరో పాయింట్ కేటాయిస్తారు. మూడు సెట్‌ల తర్వాత ఫలితం తేలిపోవడంతో మిగతా రెండు సెట్‌లు నిర్వహించలేదు. దీపిక సంధించిన మొత్తం 9 బాణాల్లో ఒక్కటి మాత్రమే 10 పాయింట్ల వృత్తంలోకి వెళ్లడం తుది ఫలితంపై ప్రభావం చూపింది. తొలి సెట్‌లో దీపిక వరుసగా 8, 9, 9 పాయింట్లు... లీ జియామన్ 8, 9, 10 పాయింట్లు సాధించారు. రెండో సెట్‌లో దీపిక 10, 9, 9 పాయింట్లు... లీ జియామన్ 10, 10, 10 పాయింట్లు సంపాదించారు. మూడో సెట్‌లో దీపిక 9, 7, 9 పాయింట్లు... లీ జియామన్ 9, 9, 9 పాయింట్లు స్కోరు చేశారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-8లో ఉన్న ప్లేయర్లు వరల్డ్ కప్ ఫైనల్ టోర్నీలో పాల్గొన్నారు. క్వార్టర్ ఫైనల్లో దీపిక 6-0 (27-23, 29-22, 29-27)తో యాంగ్ జియోలె (చైనా)పై, సెమీఫైనల్లో 6-4 (29-28, 26-26, 26-29, 28-28, 28-27)తో అలెజాండ్రో వాలెన్సియా (మెక్సికో)పై గెలుపొందింది. కాంస్య పతక మ్యాచ్‌లో అలెజాండ్రో 6-2తో హన్‌యంగ్ జియోన్ (దక్షిణ కొరియా)పై నెగ్గింది. స్వర్ణం సాధించిన లీ జియామన్‌కు 30 వేల స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 29 లక్షల 16 వేలు), రజతం నెగ్గిన దీపిక కుమారికి 15 వేల స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 14 లక్షల 58 వేలు), కాంస్యం గెలిచిన అలెజాండ్రోకు 8 వేల స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 7 లక్షల 77 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.



6 ఇప్పటి వరకు దీపిక తొమ్మిదిసార్లు వరల్డ్ కప్ ఫైనల్ టోర్నీల్లో పోటీపడింది. మొత్తం ఆరు పతకాలు గెలిచింది. ఇందులో ఐదు రజతాలు (2024, 2015, 2013, 2012, 2011లో) ఉన్నాయి. ఒక కాంస్యం (2018లో) కూడా ఆమె సాధించింది.

1 వరల్డ్‌కప్ ఫైనల్ టోర్నీ చరిత్రలో భారత్‌కు ఒక్క స్వర్ణ పతకమే లభించింది. 2007లో దుబాయ్ వేదికగా జరిగిన టోర్నీలో డోలా బెనర్జీ పసిడి పతకాన్ని సాధించింది.

38 ఓవరాల్‌గా ప్రపంచకప్ టోర్నీలలో దీపిక గెలిచిన పతకాలు. ఇందులో 11 స్వర్ణ పతకాలు, 19 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు ఉన్నాయి.



అభిషేక్ శర్మ

సెమీఫైనల్లో భారత్ 'ఎ'

యూఏఈపై 7 వికెట్లతో గెలుపు

అల్ అమెరత్ (ఒమన్): ఎమర్జింగ్ జట్ల ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌లో భారత్ 'ఎ' జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుపై విజయం సాధించింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 16.5 ఓవర్లలో 107 పరుగులకే ఆలౌటైంది. రాహుల్ చోప్రా (50 బంతుల్లో 50; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. కెప్టెన్ బాసిల్ హమీద్ (12 బంతుల్లో 22; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. మిగతా బ్యాటర్లను భారత బౌలర్లు సమష్టిగా దెబ్బతీశారు. రసిఖ్ సలామ్ 3, రమణ్‌దీప్ 2 వికెట్లు తీయగా, అన్షుల్, వైభవ్, అభిషేక్, నేహల్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం సులువైన లక్ష్యాన్ని భారత్ 'ఎ' జట్టు 10.5 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 111 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (24 బంతుల్లో 58; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. కెప్టెన్ ఠాకూర్ తిలక్‌వర్మ (18 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్)తో రెండో వికెట్‌కు చకచకా 73 పరుగులు జోడించాడు. యూఏఈ బౌలర్లలో ఒమిద్ షఫీ, ఫరూఖ్, విష్ణు సుకుమారన్ తలా ఒక వికెట్ తీశారు. గ్రూప్ 'బి'లో నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న భారత్... తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో రేపు ఒమన్‌తో తలపడుతుంది.

సినిమా





• శోభిత ధూళిపాళ్ల

పెళ్లి పనులు మొదలు

హీరో అక్కినేని నాగ చైతన్య, హీరోయిన్ శోభితా ధూళిపాళ్ల కుటుంబాల్లో పెళ్లి పనులు మొదలయ్యాయి. నాగ చైతన్య, శోభిత త్వరలో ఏడడుగులు వేయనున్న సంగతి తెలిసిందే. ఆగస్టు 8న వీరి నిశ్చితార్థం జరిగింది. అయితే పెళ్లి ముహూర్తం ఎప్పుడన్నది వెల్లడించలేదు. దీంతో వీరి పెళ్లి తేదీపై అక్కినేని అభిమానుల్లో క్యూరియాసిటీ నెలకొంది. కాగా సోమవారం పెళ్లి పనులు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని శోభిత ధూళిపాళ్ల సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. పసుపు దంచుతున్న ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన శోభిత..'గోధుమరాయి పసుపు దంచడంతో పనులు ప్రారంభం అయ్యాయి' అని క్యాప్షన్ ఇచ్చారు. ఎరుపు రంగు, గోధుమ వర్ణం పట్టు చీరలో శోభిత మరింత అందంగా కనిపించారు. ప్రస్తుతం ఆ ఫోటోలు వైరల్‌గా మారాయి. అయితే పెళ్లి ఎప్పుడు? ఎక్కడ? అనేది మాత్రం ఆమె వెల్లడించలేదు. వివాహం ఎప్పుడో చెప్పండి అంటూ నాగచైతన్య, శోభిత అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.


• ప్రభాస్

రాజా సాబ్ అదుర్స్

'కల్కి 2898 ఏడీ' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ప్రభాస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. కాగా బుధవారం (అక్టోబరు 23) ప్రభాస్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా నుంచి మోస్ట్ అవేటెడ్ అప్డేట్ ఇవ్వనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, 'రాజా సాబ్' నుంచి ప్రభాస్ అల్ట్రా స్టైలిష్ లుక్‌ను రిలీజ్ చేసింది. ఆయన లుక్ అదుర్స్ అంటూ అభిమానులు పోస్టులు పెడుతున్నారు. ''పీరియాడికల్ హారర్ కామెడీ నేపథ్యంలో 'రాజా సాబ్' రూపొందుతోంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో 2025 ఏప్రిల్ 10న మా మూవీ రిలీజ్ కానుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

లక్కీ భాస్కర్ నాకు చాలా ప్రత్యేకం

- దుల్కర్ సల్మాన్


• నాగవంశీ, మీనాక్షీ చౌదరి, దుల్కర్ సల్మాన్

''దాదాపు 14 నెలల తర్వాత నా నుంచి వస్తున్న సినిమా 'లక్కీ భాస్కర్'. ఇది నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. ఇందులో వినోదం, భావోద్వేగాలు, సంగీతం బాగుంటాయి. కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలు ఉంటాయి. ట్రైలర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. అలాగే ఈ సినిమా కూడా అన్నివర్గాల వారికి నచ్చుతుందని నమ్ముతున్నాను'' అని దుల్కర్ సల్మాన్ తెలిపారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. దుల్కర్ సల్మాన్, మీనాక్షీ చౌదరి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 31న తెలుగు, మలయాళ, తమిళ, హిందీ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మీనాక్షీ చౌదరి మాట్లాడుతూ-''ఇప్పటివరకు నేను చేసిన పాత్రల్లో ఈ చిత్రంలో చేసిన సుమతి నాకు బాగా ఇష్టమైన పాత్ర'' అన్నారు. ''బ్యాంకింగ్ నేపథ్యంలో కుటుంబ భావోద్వేగాలతో నడిచే ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది'' అని సూర్యదేవర నాగవంశీ తెలిపారు.

కొత్త ప్రపంచంలోకి...

రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ప్రధాన పాత్రల్లో నటించిన సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'రహస్యం ఇదం జగత్'. కోమల్ ఆర్.భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మించిన ఈ చిత్రం నవంబరు 8న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కోమల్ ఆర్.భరద్వాజ్ మాట్లాడుతూ-''ఇండియన్ మైథాలజీ ఆధారంగా శ్రీచక్రం ప్రేరణతో ఈ చిత్రం తీశాం. పురాణాలు, మూలాల గురించి ప్రేక్షకులకు ఓ కొత్త విషయాన్ని చెప్పబోతున్నాం. మా చిత్రం ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళుతుంది. 'కల్కి 2898ఏడీ, కార్తికేయ, హనుమాన్' చిత్రాల తరహాలో మా చిత్రం హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఎంతో తపనతో కష్టపడి ఈ సినిమా చేశాం. మా చిత్రం మెప్పిస్తుంది'' అని మానస, స్రవంతి తెలిపారు. సంగీత దర్శకుడు గ్యానీ, గీత రచయిత రమేష్ మాట్లాడారు.


• స్రవంతి, కోమల్, మానస



వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మట్కా'. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించారు. కరుణ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం నవంబరు 14న రిలీజ్ కానుంది. ఈ సినిమాలో పద్మ అనే కీలక పాత్రలో నటి సలోని నటించినట్లు వెల్లడించి, ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

మత్స్యకారుల జీవితం

రమాకాంత్ హీరోగా, అవంతిక, భానుశ్రీ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సముద్రుడు'. నగేష్ నారదాసి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సుమన్ ముఖ్య పాత్ర పోషించారు. కీర్తన ప్రొడక్షన్స్‌పై బధావత్ కిషన్ నిర్మించిన ఈ సినిమా ఈనెల 25న విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథులుగా దర్శకుడు వి.సముద్ర, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ టి. ప్రసన్నకుమార్ హాజరై, సినిమా విజయం సాధించాలన్నారు. నగేష్ నారదాసి మాట్లాడుతూ-''మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లినప్పుడు పడే కష్టాలు, వారి జీవితాలను ఈ మూవీలో చూపించాం'' అన్నారు. ''మా చిత్రానికి వచ్చే కలెక్షన్స్‌లో 20 శాతం మత్స్యకారులకు అందజేస్తాం'' అని నిర్మాత కీర్తన తెలిపారు. ''ఈ మూవీలో మంచి పాత్ర చేశా'' అని సుమన్ అన్నారు. ''నేను టీచర్‌గా చేశాను'' అన్నారు అవంతిక. ''ఛత్రపతి' సినిమాలా మా మూవీ కూడా విజయం సాధిస్తుంది'' అని రమాకాంత్ చెప్పారు. సహ నిర్మాతలు రామోజీ జ్ఞానేశ్వర్, సోములు నాయక్ పాల్గొన్నారు.


• రమాకాంత్, అవంతిక

బౌండరీయే చెరిగిపోతుంది


• ప్రతాని రామకృష్ణ గౌడ్, సుమన్

లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో గురు ప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన ద్విభాషా (తమిళ, కన్నడ) చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. ఈ సినిమా తెలుగు రిలీజ్ హక్కులను ఆర్‌కే ఫిలింస్ అధినేత ప్రతాని రామకృష్ణ గౌడ్ దక్కించుకున్నారు. త్వరలోనే విడుదల కానున్న ఈ సినిమా తెలుగు ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి నటుడు సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'ఝాన్సీ... చరిత్రలోనే అది చాలా గొప్ప పేరు, రేయ్.. కళింగా... నేను రంగంలోకి దిగితే బౌండరీయే చెరిగిపోతుంది' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. సుమన్ మాట్లాడుతూ-''లక్ష్మీరాయ్ ప్రతిభగల నటి. 'ఝాన్సీ ఐపీఎస్' ట్రైలర్ బాగుంది. తమిళ, కన్నడ భాషల్లో విజయం సాధించిన ఈ చిత్రం తెలుగులోనూ హిట్ కావాలి'' అన్నారు. ''విద్యార్థులను మాదక ద్రవ్యాలకు అలవాటు చేసి, యువత భవిష్యత్‌ను పెడదారి పట్టించే డ్రగ్స్ ముఠా ఆటకట్టించే ఐపీఎస్ ఆఫీసర్ ఝాన్సీగా లక్ష్మీరాయ్ నటించారు'' అని తెలిపారు ప్రతాని రామకృష్ణ గౌడ్. తెలుగు నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్, నటి ఆక్సాఖాన్, నటుడు జీవీఆర్ మాట్లాడారు.

క్రైమ్ కామెడీ థ్రిల్లర్

సన్నీ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'తస్కరించుట'. శివప్రసాద్ చలువాది దర్శకత్వం వహిస్తున్నారు. రెచెల్ పిక్చర్స్‌పై షేక్ అఫ్రీన్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. అతిథులుగా విచ్చేసిన నటుడు ఆకాష్ పూరి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత బెల్లంకొండ సురేష్ క్లాప్ ఇచ్చారు. బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ-''చిన్న చిత్రాలు ఆదరణ పొందాలి. అప్పుడే ఇండస్ట్రీ బాగుంటుంది'' అన్నారు. ''తస్కరించుట' టైటిల్, పోస్టర్ బాగుంది'' అని ఆకాష్ పూరి చెప్పారు. ''ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేస్తున్నాం'' అని పేర్కొన్నారు సన్నీ. ''క్రైమ్ కామెడీ థ్రిల్లర్ చిత్రమిది. నవంబరు 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అని శివప్రసాద్ తెలిపారు. ''మా సంస్థకు ఈ సినిమా మంచి పేరు తెస్తుంది'' అన్నారు షేక్ అఫ్రీన్. ఈ చిత్రానికి కెమెరా: అజయ్ ఎర్రగుంట్ల, సంగీతం: రోహిత్.


• సన్నీ, బెల్లంకొండ సురేష్

అందుకు సంతోషంగా ఉంది

- అనన్య నాగళ్ల



''ఇండస్ట్రీలో తెలుగు హీరోయిన్లకు సుదీర్ఘమైన ప్రయాణం ఉంటోంది. ఈషా రెబ్బా, చాందినీ చౌదరిలాంటి వారు ఎప్పట్నుంచో సినిమాలు చేస్తున్నారు. కొందరు హీరోయిన్లు టాప్ లీగ్‌లో ఉండి, కొంతకాలం తర్వాత వెళ్లిపోతున్నారు. కానీ, తెలుగువారికి మాత్రం కెరీర్ పరంగా ఎక్కువ కాలం ఉంటోంది. ఇందుకు సంతోషంగా ఉంది'' అని హీరోయిన్ అనన్య నాగళ్ల అన్నారు. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా, అజయ్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా అనన్య నాగళ్ల మాట్లాడుతూ- ''తమిళ, మలయాళ, కన్నడ పరిశ్రమల్లో అక్కడి స్థానిక హీరోయిన్లు 60-70 శాతం ఉంటే, మిగతా వారు ఇతర పరిశ్రమల వారు ఉంటారు. కానీ మన దగ్గర 80 శాతం మంది ఇతర ఇండస్ట్రీ హీరోయిన్లు ఉన్నారు. కంటెంట్ బేస్డ్ చిన్న సినిమాలు, పరిమిత బడ్జెట్‌తో సినిమాలు చేసే దర్శక-నిర్మాతలు మాత్రమే తెలుగు హీరోయిన్లను ప్రిఫర్ చేస్తున్నారు. 'పొట్టేల్' సినిమాలో బుజ్జమ్మ అనే బలమైన తల్లి పాత్ర చేశాను. నటనకు అవకాశం ఉండి, నాకు నచ్చిన పాత్రలు చేస్తున్నాను. తోటి హీరోయిన్లతో పోటీ గురించి ఆలోచించే సమయం లేదు. నాకు ఓ మంచి కమర్షియల్ సక్సెస్ ఉండి ఉంటే నా కెరీర్ మరింత బాగుండేది. కోవిడ్ టైంలో నాకు పెద్దగా చాన్స్‌లు రాలేదు. ఉద్యోగాన్ని మానేసి ఇండస్ట్రీకి ఎందుకు వచ్చానని అప్పుడు పశ్చాత్తాప పడ్డాను. 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్, 'కథకళి, లేచింది మహిళా లోకం' సినిమాలు చేస్తున్నా'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	73	81,151
నిఫ్టీ ▽	73	24,781

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,495	△ 6
డోజోన్స్	42,967	▽ 309
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,318	▽ 40
డాక్స్	19,461	▽ 196
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,268	△ 7
నికాయ్	38,955	▽ 27

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	78,214
బంగారం (99.5 స్వచ్ఛత)	77,901
వెండి (కేజీ)	97,254

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	83.66	84.68
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	108.18	111.05
€	యూరో	ఒకటికి	89.92	92.55
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	55.44	56.87
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	55.36	57.56
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	61.64	66.33
SAR	సౌదీ రియాల్	ఒకటికి	21.52	23.07
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటికి	22.00	23.78
¥	చైనా యువాన్	ఒకటికి	10.96	12.79

బంగారం రూ. 80,000 పైకి..

ఆల్‌టైమ్ రికార్డు ధరలు ● లక్షకు రూ.500 దూరంలో వెండి



న్యూఢిల్లీ: అటు బంగారం, ఇటు వెండి.. రెండు విలువైన మెటల్స్ ధరలు సోమవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆల్‌టైమ్ రికార్డును తాకాయి. 99.9 స్వచ్ఛత 10 గ్రాముల బంగారం ధర క్రితం ముగింపు రూ.79,900తో పోల్చితే సోమవారం రూ.750 పెరిగి రూ. 80,650కి చేరింది. 99.5 స్వచ్ఛత ధర రూ.750 ఎగసి, రూ.80,250కి చేరింది. ఇక కేజీ వెండి ధర క్రితం ముగింపుతో పోల్చితే రూ.5,000 పెరిగి రూ99,500కి ఎగసింది.

కారణాలు ఇవీ...

అమెరికా సరళతర వడ్డీరేట్ల విధానం, డాలర్ బలహీనత, భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి వంటి అంశాలతో ఇన్వెస్టర్లను బంగారం ఆకర్షిస్తోంది. దీనికితోడు దేశీయంగా పండుగల సీజన్ నేపథ్యంలో ఆభరణాల వ్యాపారులు, రిటైలర్ల భారీ కొనుగోళ్లు, రూపాయి బలహీన ధోరణి విలువైన మెటల్ ధరలు పెరగడానికి కారణమని బులియన్ వ్యాపారులు తెలిపారు. పారిశ్రామిక డిమాండ్ వెండికి కలిసి వస్తున్న అంశం.

అంతర్జాతీయంగా రికార్డులు

పశ్చిమ దేశాల సెంట్రల్ బ్యాంకుల సరళతర ఆర్థిక విధానాల నేపథ్యంలో సోమవారం యూరోపియన్ ట్రేడింగ్ గంటల్లో పసిడి ఔన్స్ (31.1గ్రాములు) ధర 2,730 డాలర్ల స్థాయికి చేరింది. వెండి సైతం 3 శాతం పెరిగి 12 సంవత్సరాల గరిష్ట స్థాయి 34.20 డాలర్లకు ఎగసింది. ఈ వార్త రాస్తున్న రాత్రి 9 గంటల సమయంలో అంతర్జాతీయ కమోడిటీ ఫ్యూచర్స్ మార్కెట్- నైమెక్స్‌లో చురుగ్గా ట్రేడవుతున్న పసిడి డిసెంబర్ కాంట్రాక్ట్ ధర రికార్డు ధర వద్ద 2,752 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో 2,755 డాలర్ల ఆల్‌టైమ్ రికార్డు స్థాయిని తాకింది. గత ముగింపుకన్నా ఇది 25 డాలర్లు అధికం. దేశీయ ఫ్యూచర్స్ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పసిడి ధర క్రితం ముగింపుతో పోల్చితే రూ.650 లాభంతో రూ. 78,380 రికార్డు ధర వద్ద ట్రేడవుతోంది. వెండి ధర రూ.2,500 లాభంతో రూ.98,000 వద్ద ట్రేడవుతోంది.

అల్ట్రాటెక్‌లాభం రూ. 825 కోట్లు

క్యూ2 ఆదాయం రూ. 15,635 కోట్లు



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.825 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది (2023-24) ఇదే కాలంలో కంపెనీ నికరలాభం రూ. 1,280 కోట్లు. మొత్తం ఆదాయం సైతం రూ.16,012 కోట్ల నుంచి రూ. 15,635 కోట్లకు తగ్గింది. మొత్తం వ్యయాలు రూ. 14,837 కోట్లను దాటాయి. అయితే వైట్ సిమెంట్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్(ఆర్‌ఏకేడబ్ల్యూ) కోసం యూఏఈ సంస్థ అల్ ఖైమాలో అదనపు వాటా కొనుగోలు చేసిన కారణంగా గత క్యూ2తో ఈ ఫలితాలను పోల్చడం సరికాదని అల్ట్రాటెక్ పేర్కొంది. సంస్థలో అల్ట్రాటెక్ వాటా 54.79 శాతానికి బలపడినట్లు వెల్లడించింది. దీంతో జూలై నుంచి యూసీఎంఈఐఎల్‌కు అనుబంధ సంస్థగా ఆర్‌ఏకేడబ్ల్యూ అవతరించినట్లు వెల్లడించింది. కాగా.. స్టాండెలోన్ నికర లాభం 35 శాతం క్షీణించి రూ. 797 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం 4% నీరసించి రూ. 14,905 కోట్లను తాకింది. సిమెంట్ విక్రయాలు 3 శాతం పుంజుకుని 25.75 మిలియన్ టన్నుల(ఎంటీ)కు చేరాయి. కన్సాలిడేటెడ్ అమ్మకాల పరిమాణం 27.84 ఎంటీకి చేరింది. గతేడాది మొత్తం సిమెంట్ తయారీ సామర్థ్యం 146 ఎంటీని అధిగమించింది. మరోపక్క కేశోరామ్ సిమెంట్ నుంచి వార్షికంగా 10.75 ఎంటీ, ఇండియా సిమెంట్స్ నుంచి 14.45 ఎంటీని జత కలుపుకోనుంది.

ఫలితాల నేపథ్యంలో అల్ట్రాటెక్ షేరు 2 శాతం నష్టంతో రూ. 10,839 వద్ద ముగిసింది.

ఒడిదుడుకుల్లో స్వల్ప నష్టాలు

- కోటక్ బ్యాంకు షేరు అనూహ్య పతనం
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస అమ్మకాల ప్రభావం
- 959 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్
- 24,800 దిగువకు నిఫ్టీ



ముంబై: రోజంతా తీవ్ర ఒడిదుడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో సూచీలు సోమవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. కోటక్ మహీంద్రా బ్యాంకు షేరు(-4%) అనూహ్య పతనం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు ప్రతికూల ప్రభావం చూపాయి. కీలక కార్పొరేట్ కంపెనీల సెప్టెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపరిచాయి.

ఇంట్రాడేలో 959 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 73 పాయింట్లు నష్టపోయి 81,151 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 73 పాయింట్లు కోల్పోయి 24,781 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 24,680 వద్ద కనిష్టాన్ని, 24,978 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆటో మినహా అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సర్వీసెస్, ఆయిల్‌అండ్‌గ్యాస్, రియల్టీ, మెటల్ షేర్లు భారీ నష్టాలు చవిచూశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.63%, 1.5% నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- సెన్సెక్స్ పతనంతో బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ సోమవారం ఒక్కరోజే రూ.5.06 లక్షల కోట్లు హరించుకుపోయింది. దీంతో బీఎస్ఈలో మార్కెట్ విలువ రూ. 453.09 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు 3% పెరిగి రూ.1729 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 4% ఎగసి రూ.1,748 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. మార్కెట్ విలువ రూ.36,361 కోట్లు పెరిగి రూ.13.19 లక్షల కోట్లకు చేరింది.

యూనియన్ బ్యాంక్ లాభం 34 శాతం అప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 4,720 కోట్ల లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో నమోదైన రూ. 3,511 కోట్లతో పోలిస్తే ఇది 34 శాతం అధికం. మరోవైపు, మొత్తం ఆదాయం రూ. 28,282 కోట్ల నుంచి రూ. 32,036 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ. 24,587 కోట్ల నుంచి రూ. 26,708 కోట్లకు చేరినప్పటికీ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం రూ. 9,126 కోట్ల నుంచి రూ. 9,047 కోట్లకు తగ్గింది. నికర వడ్డీ మార్జిన్ కూడా 3.18 శాతం నుంచి 2.9 శాతానికి తగ్గింది. నికర మొండిబాకీలు (ఎన్‌పీఏ) 1.30 శాతం నుంచి 0.98 శాతానికి దిగి వచ్చాయి.

ఫలితాల నేపథ్యంలో యూనియన్ బ్యాంక్ షేరు ధర స్వల్పంగా తగ్గి రూ. 112 వద్ద ముగిసింది.

సినిమాల్లోకి ‘సీరమ్’!

- కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్‌లో పెట్టుబడులు
- 50 శాతం వాటా కొనుగోలుకి రూ.1,000 కోట్లు



న్యూఢిల్లీ: కోవిడ్ వ్యాక్సిన్‌తో చిరపరిచితమైన వ్యాక్సిన్ల తయారీ దిగ్గజం సీరమ్ ఇన్‌స్టిట్యూట్ సినిమాల నిర్మాణంలోకి ప్రవేశిస్తోంది. కంపెనీ సీఈవో అదార్ పూనావాలా ఏర్పాటు చేసిన సిరీన్ ప్రొడక్షన్స్ కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్‌లో 50 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. ఇందుకు రూ. 1,000 కోట్లు వెచ్చించనుంది. ధర్మ ప్రొడక్షన్స్, ధర్మాటిక్ ఎంటర్‌టైన్‌మెంట్‌లలో రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సిరీన్ ప్రొడక్షన్స్ వెల్లడించింది. దీంతో ధర్మలో 50 శాతం వాటాను సిరీన్ ప్రొడక్షన్స్ సొంతం చేసుకోనుంది. మిగిలిన 50 శాతం వాటాతోపాటు యాజమాన్యాన్ని కరణ్ జోహార్ కలిగి ఉంటారని సిరీన్ స్పష్టం చేసింది. వెరసి పూనావాలా పెట్టుబడులు ధర్మ విలువను రూ. 2,000 కోట్లుగా నిర్ధారించాయి. ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమలోని అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా ధర్మ, సిరీన్ సంస్థల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటైనట్లు సిరీన్ పేర్కొంది. సినిమాల నిర్మాణంలో ధర్మకున్న నైపుణ్యం, అదార్ పూనావాలాకున్న వనరులు ఇందుకు తోడ్పాటునివ్వగలవని అభిప్రాయపడింది. ధర్మ మరింత పురోభివృద్ధిని సాధిస్తుందని, మరింత ఎత్తుకు ఎదుగుతుందని ఆశిస్తున్నట్లు తాజా పెట్టుబడులపై స్పందిస్తూ పూనావాలా పేర్కొన్నారు. భవిష్యత్ దృక్పథ వ్యూహాలు, నైపుణ్యంతోకూడిన సినిమాల నిర్మాణాల సక్రమ కలయికను తాజా భాగస్వామ్యం ప్రతిఫలిస్తున్నదని కరణ్ జోహార్ వ్యాఖ్యానించారు.

బాధ్యతలు ఇలా: కంపెనీ నూతన ఏర్పాటులో భాగంగా ధర్మకు ఎగ్జిక్యూటివ్ చైర్మన్ హోదాలో కరణ్ జోహార్ సృజనాత్మక కార్యక్రమాలను రూపొందిస్తారు. సీఈవోగా అపూర్వ మెహతా వ్యూహాత్మక మార్గదర్శకుడిగా కరణ్‌తో కలిసి బాధ్యతలు నిర్వహిస్తారు. కంటెంట్ నిర్మాణం, పంపిణీ, ఆధునిక టెక్నాలజీలను ఏకీకృతం చేయడం, ప్రొడక్షన్ విధానాలను మెరుగుపరచడం, ఆడియన్స్‌ను ఆకట్టుకోవడం తదితర కార్యకలాపాలపై దృష్టి పెట్టనున్నట్లు సిరీన్ వివరించింది. దేశీయంగా ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో తాజా డీల్‌కు ప్రాధాన్యత ఏర్పడింది.

బజాజ్ పల్సర్ ఎన్125

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం బజాజ్ ఆటో పల్సర్ శ్రేణిలో కొత్తగా ఎన్125 ప్రవేశపెట్టింది. 124.59 సీసీ ఎయిర్ కూల్డ్, సింగిల్ స్పార్క్, 2 వాల్వ్ ఇంజన్ పొందుపరిచారు. 8,500 ఆర్‌పీఎం వద్ద 12 పీఎస్ పవర్, 6,000 ఆర్‌పీఎం వద్ద 11 ఎన్ఎం టార్క్ అందిస్తుంది. ఎల్ఈడీ డిస్క్ బీటీ, ఎల్ఈడీ డిస్క్ వేరియంట్లలో లభిస్తుంది. హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో ధర రూ.98,707 ఉంది. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, బ్లూటూత్ కనెక్టివిటీతో పూర్తి డిజిటల్ ఎల్‌సీడీ స్పీడోమీటర్, మోనోషాక్ సస్పెన్షన్, ఐఎస్‌జీ సైలెంట్ స్టార్ట్ సిస్టమ్, 5 స్పీడ్ ట్రాన్స్‌మిషన్, యూఎస్‌బీ చార్జింగ్ పోర్ట్ వంటి హంగులు జోడించారు. ఇంధన ట్యాంక్ సామర్థ్యం 9.5 లీటర్లు.



‘సాక్షి ప్లస్’ ఈ-పేపర్‌లో ..

- ప్రపంచ ఎకానమీ వృద్ధికి ఏఐ కీలకం: సునీల్ మిట్టల్
- జోరుగా లగ్జరీ ఇళ్ల విక్రయాలు

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-ఈఎస్ఈ-2025

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా రైల్వే, టెలికాం, డిఫెన్స్ సర్వీస్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో ఇంజనీరింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 457.
» **అర్హత:** పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్శిటీ బీఈ/బీటెక్ చదివి ఉండాలి. లేదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) ఇన్‌స్టిట్యూట్ ఎగ్జామినేషన్స్ ఎ, బి విభాగాలు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అసోసియేట్ మెంబర్‌షిప్ ఎగ్జామినేషన్ పార్ట్స్ 2/3 సెక్షన్లు ఎ, బి అర్హత ఉండాలి. లేదా ఎలక్ట్రానిక్స్-టెలిక మ్యూనికేషన్ ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూషన్(ఇండియా) గ్రాడ్యుయేట్ సభ్యత్వ పరీక్ష పాసై ఉండాలి. లేదా ఎంఎస్సీ(వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఎలక్ట్రానిక్స్, రేడియో ఫిజిక్స్, రేడియో ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 01.01.2025 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్టేజ్-1(ప్రిలిమినరీ/స్టేజ్-1) ఎగ్జామ్, స్టేజ్-2(మెయిన్/స్టేజ్-2)ఎగ్జామ్, స్టేజ్-3(పర్సనాలిటీ టెస్ట్),మెడికల్ ఎగ్జామినేషన్,సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.11.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 23.11.2024 నుంచి 29.11.2024 వరకు.
» **ప్రిలిమినరీ/స్టేజ్-1 పరీక్ష తేది:** 09.02.2025.
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

సీఏపీఎఫ్-ఐటీబీపీలో 345 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ).. అస్సాం రైఫిల్స్‌లో ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ) గ్రూప్-ఏ పోస్టులు సూపర్ స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్, స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 345.
» **పోస్టుల వివరాలు:** సూపర్ స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్(సెకండ్-ఇన్-కమాండ్)-05,స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ (డిప్యూటీ కమాండెంట్)-176, మెడికల్ ఆఫీసర్(అసిస్టెంట్ కమాండెంట్)-164.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, పీజీ, డిప్లొమా,డీఎం/ఎంసీహెచ్ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.78,800 నుంచి 2,09,200
» **వయసు:** సూపర్ స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 50 ఏళ్లు, స్పెషలిస్ట్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 40 ఏళ్లు, మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), మెడికల్ ఎగ్జామినేషన్ టెస్ట్(ఎంఈటీ), ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.11.2024
» **వెబ్‌సైట్:** https://recruitment.itbpolice.nic.in

ఎన్‌టీపీసీలో 50 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌టీపీసీ)..ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50.
» **వేతనం:** నెలకు రూ.40,000.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ డిగ్రీ(అగ్రికల్చరల్ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 27 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.10.2024
» **వెబ్‌సైట్:** https://ntpc.co.in

డీఎంహెచ్‌వో గుంటూరు జిల్లాలో 40 పోస్టులు

గుంటూరు జిల్లా డీఎంహెచ్‌వోలో అర్బన్ క్లినిక్‌లు/యూపీహెచ్‌సీల్లో ఒప్పంద/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40.
» **పోస్టుల వివరాలు:** ల్యాబ్ టెక్నీషియన్-03, ఫార్మసిస్ట్-11, డేటా ఎంట్రీ ఆపరేటర్-11, శానిటరీ అటెండెంట్-15.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, పీజీడీసీఏ,డీఫార్మసీ/బీఫార్మసీ/ఎంఫార్మసీ, డీఎంఎల్‌టీ, బీఎస్సీ(ఎంఎల్‌టీ) ఉత్తీర్ణులై ఉండాలి.
» **గరిష్ట వయో పరిమితి:** 01.09.2024 నాటికి 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత పరీక్ష మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, గుంటూరు జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.10.2024.
» **వెబ్‌సైట్:** https://guntur.ap.gov.in

ఐఎఫ్‌ఎస్ మెయిన్స్‌లో రాణించేలా!

» నవంబర్ 24 నుంచి ఐఎఫ్‌ఎస్ మెయిన్స్ పరీక్షలు
» మెయిన్‌లో ప్రతిభ ఆధారంగానే ఇంటర్వ్యూకు ఎంపిక
» సబ్జెక్ట్, సమకాలీన అంశాలపై పట్టుతోనే విజయం
» ఇంటర్వ్యూలోనూ నెగ్గితే ఐఎఫ్‌ఎస్ ఖరారు

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్..సంక్షిప్తంగా ఐఎఫ్‌ఎస్. సివిల్ సర్వీసెస్ తర్వాత అఖిల భారత సర్వీసుల్లో..అత్యంత ఆదరణ కలిగిన సర్వీస్! ఐఎఫ్‌ఎస్‌కు ఎంపికైతే అటవీ శాఖలో.. డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించి.. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ స్థాయికి చేరుకోవచ్చు! అందుకే ఈ పరీక్షకు ఏటా లక్షన్నర మందికిపైగా పోటీ పడుతున్నారు. మూడు దశల ఎంపిక ప్రక్రియలో.. తొలిదశ ప్రిలిమ్స్ ఫలితాలను ఇటీవలే యూపీఎస్సీ విడుదల చేసింది. రెండో దశ మెయిన్ పరీక్షలు నవంబర్ 24 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. ఐఎఫ్‌ఎస్ మెయిన్ పరీక్ష విధానం, రాణించేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..



- 150: ఐఎఫ్‌ఎస్-2024 నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఖాళీల సంఖ్య.
- 2,158: ఎంపిక ప్రక్రియలోని తొలి దశ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారు.
- వీరిలో 300 నుంచి 325 మందికి మెయిన్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుపు వచ్చే అవకాశం.

మెయిన్‌లో ఆరు పేపర్లు

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ మెయిన్ పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. అభ్యర్థులు జనరల్ ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్‌తోపాటు రెండు ఆప్షనల్ సబ్జెక్ట్‌లలో నాలుగు పేపర్లు..మొత్తంగా ఆరు పేపర్లలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. పేపర్-1 జనరల్ ఇంగ్లిష్ 300 మార్కులు,పేపర్-2లో జనరల్ నాలెడ్జ్ 300 మార్కులు,పేపర్-3 ఆప్షనల్ సబ్జెక్ట్(1) పేపర్-1, 200 మార్కులకు, పేపర్-4లో ఆప్షనల్ సబ్జెక్ట్(1)పేపర్-2, 200 మార్కులకు, పేపర్-5లో ఆప్షనల్ సబ్జెక్ట్ (2)పేపర్-3, 200 మార్కులకు,పేపర్-6 ఆప్షనల్ సబ్జెక్ట్(2)పేపర్-4, 200 మార్కులకు ఉంటాయి. ✦ అభ్యర్థులు ఏవైనా రెండు సబ్జెక్ట్‌లను ఆప్షనల్స్‌గా ఎంపిక చేసుకోవాలి. వీటిల్లో ఒక్కో సబ్జెక్ట్ నుంచి రెండు పేపర్లు చొప్పున మొత్తం నాలుగు పేపర్లలో పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు యూపీఎస్సీ పేర్కొన్న జాబితాలోని సబ్జెక్ట్‌లనే ఆప్షనల్స్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది.

అనుమతించని కాంబినేషన్లు

ఆప్షనల్ సబ్జెక్ట్‌ల ఎంపిక విషయంలో కొన్ని సబ్జెక్ట్ కాంబినేషన్లను అనుమతించరు. అవి..✦ అగ్రికల్చర్ అండ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ✦ అగ్రికల్చర్ అండ్ యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్ ✦ అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ ✦ కెమిస్ట్రీ అండ్ కెమికల్ ఇంజనీరింగ్ ✦ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్. ఇంజనీరింగ్‌కు సంబంధించి సబ్జెక్ట్‌నే ఆప్షనల్ సబ్జెక్ట్‌గా ఎంచుకునే అవకాశం కల్పిస్తున్నారు.రెండో ఆప్షనల్ సబ్జెక్ట్‌గా..వేరే విభాగాల్లోని సబ్జెక్ట్‌ను ఎంచుకోవాలి.

అకడమిక్ + కాంటెంపరరీ

ఐఎఫ్‌ఎస్ మెయిన్‌లో విజయం సాధించాలంటే.. అకడమిక్, సమకాలీన అంశాలపై పట్టు తప్పనిసరి. అభ్యర్థులు అకడమిక్‌గా బ్యాచిలర్, పీజీ స్థాయిలో తాము చదివిన స్పెషలైజేషన్లపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా వాటిని సమకాలీన పరిస్థితులతో అన్వయం చేసుకునే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

రెండు ఆప్షనల్స్

పరీక్ష విధానంలో భాగంగా రెండు ఆప్షనల్ సబ్జెక్ట్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది. వాటి నుంచి నాలుగు పేపర్లకు హాజరవ్వాల్సి ఉంటుంది. అంటే ఆప్షనల్ పేపర్లకు అత్యధిక వెయిటేజీ ఉందనే విషయం స్పష్టమవుతోంది. కాబట్టి ఇప్పటి నుంచే ఆప్షనల్ సబ్జెక్ట్‌లపై పట్టు సాధించే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.

రెండో ఆప్షనల్‌పై ప్రత్యేక శ్రద్ధ

ఐఎఫ్‌ఎస్ మెయిన్‌లో అభ్యర్థులు ముందుగా రెండో ఆప్షనల్ సబ్జెక్ట్‌పై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.సాధారణంగా ఒక ఆప్షనల్‌ను తమ అకడమిక్ నేపథ్యంలోని సబ్జెక్ట్‌ల నుంచి ఎంపిక చేసుకుంటారు. మరో ఆప్షనల్ పూర్తిగా కొత్త సబ్జెక్ట్. ఒకే స్వరూపం ఉండే సబ్జెక్ట్‌లను రెండు ఆప్షనల్స్‌గా తీసుకోకూడదని నిబంధన ఉంది.-ఉదాహరణకు.. అగ్రికల్చర్ సబ్జెక్ట్‌ను ఆప్షనల్‌గా ఎంపిక చేసుకున్న అభ్యర్థులు రెండో ఆప్షనల్‌గా అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌ను ఎంపిక చేసుకునే వీలు లేదు. అదే విధంగా బీటెక్ అర్హతతో పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు రెండు ఆప్షనల్స్‌ను ఇంజనీరింగ్ నేపథ్యం సబ్జెక్ట్‌ల నుంచి ఎంపిక చేసుకునే వీలు లేదు. కాబట్టి అభ్యర్థులు ముందుగా తమ అకడమిక్ నేపథ్యానికి సంబంధంలేని, కొత్తగా ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌తో మెయిన్స్ ప్రిపరేషన్ ప్రారంభించాలి.

అన్వయ దృక్పథం

ప్రిపరేషన్‌లో అప్లికేషన్ ఓరియెంటేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. బేసిక్స్, కాన్సెప్ట్స్‌పై పట్టు సాధిస్తూనే వాటిని వాస్తవ పరిస్థితుల్లో అన్వయించే విధంగా నైపుణ్యం సొంతం చేసుకోవాలి. ముఖ్యంగా జియాలజీ, సివిల్ ఇంజనీరింగ్, జువాలజీ సబ్జెక్ట్‌లను ఆప్షనల్స్‌గా ఎంపిక చేసుకున్న అభ్యర్థులకు ఇది చాలా అవసరం. ఆయా రంగాల్లో తాజా పరిణామాల గురించి తెలుసుకుంటూ వాటికి సబ్జెక్ట్ నేపథ్యాన్ని అన్వయించే నైపుణ్యం సాధించాలి. తమ అకడమిక్ నేపథ్యం ఉన్న సబ్జెక్ట్‌ను ఆప్షనల్‌గా ఎంచుకున్న అభ్యర్థులు.. బేసిక్స్, కాన్సెప్ట్స్, ఫార్ములాస్,థీరమ్స్ వంటి వాటిపై అవగాహన పొందాలి. దీంతోపాటు ప్రాక్టికల్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి.

షార్ట్ కట్ మెథడ్స్

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులకు తాము చదివే అంశాలను ఫ్లో చార్ట్స్, డయాగ్రమ్స్ విధానంలో సొంత నోట్లు రూపొందించుకోవాలి. ముఖ్యంగా మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్, జువాలజీ, బోటనీ సబ్జెక్ట్‌లలో ఇది ఎంతో ఉపకరిస్తుంది. అంతేకాకుండా రివిజన్ పరంగా సమయం ఆదా అవుతుంది.

జనరల్ నాలెడ్జ్

ఐఎఫ్‌ఎస్ మెయిన్‌లో అభ్యర్థులు ఎక్కువగా శ్రద్ధ పెట్టాల్సిన పేపర్.. జనరల్ నాలెడ్జ్. ఇందులో హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ తదితర కోర్ సబ్జెక్ట్‌లు మొదలు కాంటెంపరరీ ఇష్యూస్ వరకూ.. అన్నింటిపైనా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి లోతైన అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఇంగ్లిష్

జనరల్ ఇంగ్లిష్‌కు సంబంధించి ఎస్సే రైటింగ్, కాంప్రహెన్షన్, ప్యాసేజ్ రీడింగ్, వొకాబ్యులరీ తదితర నైపుణ్యాలు అలవర్చుకోవాలి. అదే విధంగా ప్రెసిస్ రైటింగ్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం కాంపిటీటివ్ పరీక్షలకు నిర్దేశించిన ప్రామాణిక ఇంగ్లిష్ పుస్తకాలను, అదే విధంగా ఇంగ్లిష్ న్యూస్ పేపర్లను పరిశీలించడం ఉపయుక్తంగా ఉంటుంది.

రైటింగ్ ప్రాక్టీస్

ప్రిపరేషన్ పరంగా అనుసరించాల్సిన మరో వ్యూహం.. రైటింగ్ ప్రాక్టీస్. అభ్యర్థులు ప్రతి రోజు ఒక సబ్జెక్ట్‌కు సంబంధించి ఒక టాపిక్‌ను చదవడం పూర్తి చేశాక.. ఆ టాపిక్‌ను ‘ప్రశ్న-సమాధానం’ విధానంలో స్వయంగా విశ్లేషణ రాసే లక్షణం అలవర్చుకోవాలి. ఫలితంగా తాము సదరు సబ్జెక్ట్, టాపిక్ పరంగా ఏ స్థాయిలో ఉన్నామో తెలుసుకునే అవకాశం ఉంటుంది. అదే విధంగా తాము మెరుగుపరచుకోవాల్సిన నైపుణ్యాలపైనా అవగాహన ఏర్పడుతుంది.

ప్రతి సబ్జెక్ట్‌కు ప్రాధాన్యం

అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో అన్ని సబ్జెక్ట్‌లకు సమయం కేటాయించేలా టైం ప్లాన్ రూపొందించుకోవాలి. కనీసం రోజుకు పది గంటలు చదివేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. ప్రతి సబ్జెక్ట్‌కు నిర్దిష్టంగా సమయం కేటాయించుకుని.. ఆ సమయంలోపు దాన్ని పూర్తి చేయాలి. వెంటనే మరో సబ్జెక్ట్‌వైపు దృష్టి పెట్టాలి. ఇలా.. అక్టోబర్ చివరి వారం నాటికి సబ్జెక్ట్ ప్రిపరేషన్ పూర్తి చేసుకుని.. తర్వాత సమయం రివిజన్‌కు కేటాయించాలి.

సైన్స్ విద్యార్థులు

ఐఎఫ్‌ఎస్ మెయిన్స్‌లో విజయానికి సైన్స్ నేపథ్యం ఉన్న విద్యార్థులు మరింత ప్రత్యేకంగా అడుగులు వేయాలి. వాస్తవానికి సైన్స్ బ్యాచిలర్ డిగ్రీనే కాకుండా.. బీటెక్‌లోకి కొన్ని బ్రాంచ్‌ల విద్యార్థులకు ఐఎఫ్‌ఎస్‌కు అర్హత కల్పిస్తున్నారు. సక్సెస్ రేట్‌లో ఇంజనీరింగ్ అభ్యర్థులు కొంత ముందంజలో నిలుస్తున్నట్లు గత ఫలితాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సైన్స్ నేపథ్యం ఉన్న విద్యార్థులు ఈ విషయంలో ఆందోళన చెందకుండా.. ప్రత్యేకంగా దృష్టిపెడితే విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు. సైన్స్ ఆప్షనల్ సబ్జెక్ట్స్‌లో కాన్సెప్ట్స్ నుంచి కాంటెంపరరీ ఇష్యూస్ వరకూ.. నైపుణ్యాలు పెంచుకోవాలి.

ఇంజనీరింగ్ విద్యార్థులు సైతం ఒక ఆప్షనల్‌ను తమ అకడమిక్ నేపథ్యమైన ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌ల నుంచి ఎంపిక చేసుకుంటున్నా.. మరో ఆప్షనల్ విషయంలో ఎక్కువగా సైన్స్‌పై దృష్టి పెడుతున్నారు. కాబట్టి సైన్స్, మ్యాథ్స్ నేపథ్యం ఉన్న అభ్యర్థులు ఆందోళన చెందక్కర్లేదు.

తెలంగాణలో రెండు గనులకు 5 స్టార్ రేటింగ్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు



సాక్షి, న్యూఢిల్లీ/ గోదావరిఖని: కోల్ మైనింగ్‌లో సుస్థిర పద్ధతులను అవలంబిస్తున్న మైన్ డెవలప్‌మెంట్ ఆపరేటర్లకు (ఎండీఓ) కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్టార్ రేటింగ్ అవార్డులు అందించారు. ఎండీఓల స్టార్ రేటింగ్స్ అవార్డుల్లో తెలంగాణకు రెండు అవార్డులు లభించాయి. రామగుండంకు చెందిన సింగరేణి మైన్స్ ఓపెన్ కాస్ట్ –1కు, జవహర్ ఖని ఓపెన్ కాస్ట్ –5కు 5 స్టార్ రేటింగ్ లభించాయి. కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఓసీపీ–1 అధికారి రాధాకృష్ణ సోమవారం అవార్డులు అందుకున్నారు.



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు

యాదాద్రిలో ఫొటోలు, వీడియోల చిత్రీకరణపై ఆలయ ఈవో సూచన

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తుల మనోభావాలు, విశ్వాసం దెబ్బతినే విధంగా వ్యక్తిగత ఫొటోలు, వీడియోల చిత్రీకరణ చేయొద్దని దేవస్థానం ఈవో భాస్కర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. యాదాద్రీశుడి ఆలయ మాఢవీధుల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి రీల్స్ చేయడంపై ఆయన స్పందించారు. ఈ నెల 3న పాడి కౌశిక్‌రెడ్డి తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలసి వచ్చారని పేర్కొన్నారు. ఆ సమయంలో ఆలయ పరిసరాల్లో డ్రోన్ కెమెరా ద్వారా ఫొటోలు చిత్రీకరించేందుకు అనుమతి కోరగా ఇవ్వలేదని చెప్పారు. ఆలయం లోపల సైతం ఫొటోలు తీయడానికి అనుమతి ఇవ్వాలని కోరారని, కానీ తాము అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. అయితే ఈ నెల 20న సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రీల్స్ రూపంలో వాటిని పోస్టు చేశారని, వాటిని తిలకించిన భక్తులు అభ్యంతరం తెలిపారని ఈవో వివరించారు. ఆలయం వెలుపల ఫొటోలు తీసుకొనే భక్తులు ఇతర భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కోర్టు నోటీసులు

సిటీ కోర్టులు: జంతుకొవ్వు పదార్థాలు కలిసిన నెయ్యితో తయారైన తిరుమల లడ్డూలను జనవరిలో అయోధ్యకు పంపారంటూ సినీ నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలపై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశిస్తూ విచారణను నవంబర్ 22కు వాయిదా వేసింది. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయంటూ న్యాయవాది ఇమ్మనేని రామారావు సిటీ సివిల్ కోర్టులో సివిల్ దావా వేశారు. పవన్ కల్యాణ్ ఆరోపణలు సరైనవి కావని పిటిషన్‌లో పేర్కొన్నారు. తిరుపతి లడ్డూను భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారని... అలాంటి లడ్డూ విషయంలో పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలతో భక్తులు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. అలాగే ఆయన చేసిన వ్యాఖ్యలతో కూడిన వీడియోలు, షార్ట్స్ యూట్యూబ్‌తో పాటు పలు సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో ప్రసారమవుతున్నాయని.. వాటిని వెంటనే తొలగించేలా తెలంగాణ సీఎస్‌తోపాటు హోంశాఖను ఆదేశించాలంటూ మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై సిటీ సివిల్ కోర్టులోని ప్రధాన కోర్టు జడ్జి వై.రేణుక సోమవారం విచారణ చేపట్టారు. ప్రతివాదులైన పవన్ కల్యాణ్‌తోపాటు తెలంగాణ సీఎస్ శాంతి కుమారి, హోంశాఖ అధికారిని తదుపరి విచారణకు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.

'డీజీపీ'ల నియామకంపై సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: తాత్కాలిక డీజీపీల నియామకంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఏడు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కొన్ని రాష్ట్రాలు నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక ప్రాతిపదికన డీజీపీలను నియమిస్తున్నాయంటూ సావిత్రి పాండే అనే న్యాయవాది వేసిన పిటిషన్‌పై ఈ నోటీసులు ఇచ్చింది. తెలంగాణ, ఏపీ, పంజాబ్, యూపీ, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లలో తాత్కాలిక డీజీపీలు ఉన్నారని పిటిషనర్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి ఏడు రాష్ట్రాలు, కేంద్ర హోంశాఖకు నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లోగా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 19కి వాయిదా వేసింది.



మీకో విషయం తెలుసా? ఏటా అమెరికాలో వసంత కాలంలో అలాగే ఆహారం కోసం వలస వెళ్లే కాలంలో కేవలం అద్దాల తలుపులను ఢీకొనడం వల్ల 100 కోట్ల పక్షులు చనిపోతాయట. అద్దాల తలుపులు పారదర్శకంగా ఉండటం వల్ల పక్షులు వాటిని గుర్తించలేక ఢీకొంటుంటాయి. అయితే, ఇలాంటి ఘటనల్లో తీవ్ర గాయాలైన పక్షులను రక్షించడానికి 'ఫ్లాప్' అనే సంస్థకు చెందిన వాలంటీర్లు ఉదయాన్నే బయలుదేరుతారట. ఇలాంటి పక్షులను గుర్తించి.. బతికి ఉంటే.. చికిత్స అందిస్తారు. చనిపోయి ఉన్నా.. వాటిని అక్కడే వదిలేయరు. వాటికి గౌరవప్రదమైన రీతిలో అంత్యక్రియలు జరిపిస్తారు. అలా చనిపోయిన పక్షులే ఇవి. ఏటా ఈ సంస్థ వలంటీర్లు పక్షులు ఎదుర్కొంటున్న సమస్యను ఎత్తిచూపడానికి చనిపోయినవాటిని వివిధ నగరాల్లో ఇలా ప్రదర్శిస్తారు. ఈ ఫొటో తీసిన పాత్రికా సీటుస్ కూడా 'ఫ్లాప్' సంస్థ సభ్యురాలు. ఈ ఏడాది బర్డ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీలో మొత్తం 23 వేల ఎంట్రీలు రాగా.. పాత్రికా తీసిన ఈ చిత్రం ఓవరాల్ విన్నర్‌గా నిలవడంతోపాటు పక్షుల పరిరక్షణ కేటగిరీలో విజేతగా ఎంపికైంది.

మురికి కాలువ నుంచి జీవనదిగా..

- సియోల్‌లోని చియోంగ్‌చియోన్ నది పునరుజ్జీవన స్ఫూర్తి ప్రయాణమిదీ..
- ఒకప్పుడు మురికి కాలువ కన్నా అధ్వానం.. ఇప్పుడు అందంగా ఆకట్టుకునే జీవ నది
- వందల ఏళ్ల కంపును మూడేళ్లలో కడిగేసిన అధికారులు



(సియోల్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి దోమూరి వెంకటేశ్వర్‌రెడ్డి)

అది అద్భుతమైన నదీ ప్రవాహం.. కానీ పట్టణీకరణ కారణంగా మురికి కాలువగా మారిపోయింది. నగరంలోని వ్యర్థ జలాలన్నీ అందులోకే చేరేవి. పక్క నుంచి వెళ్తే భరించలేని దుర్గంధం. మెల్లగా కాంక్రీట్ వ్యర్థాలు, చెత్తాచెదారంతో మొత్తంగా పూడుకుపోయింది. చివరికి దానిపై ఓ రోడ్డు వెలిసింది. ఏకంగా ఎక్స్‌ప్రెస్ వేగా మార్చేశారు. కానీ.. ఆ రోడ్డు, దానికింద ఒకప్పుడు ఉన్న మురికి కాలువ కాస్తా.. ఇప్పుడొక చిన్నపాటి జీవనదిలా మారింది. ఇదంతా దక్షిణ కొరియాలోని సియోల్‌లో ఉన్న చియాంగ్‌చియోన్ నది ప్రత్యేకత. అంతర్ధానమైన స్థితి నుంచి జీవనదిలా మార్చేందుకు అక్కడి ప్రభుత్వం చేపట్టిన.. పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రపంచ దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తుండటం గమనార్హం.

ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని..

దక్షిణ కొరియాలోని సియోల్ పట్టణంలో చియోంగ్‌చియాన్ నది ఉంది. పట్టణం పక్కనే ఉన్న ఇన్వాంగ్‌సాన్‌లోని సుసెంగ్‌డాంగ్ లోయ వద్ద మొదలై నగరం మధ్యలో ప్రవహిస్తుంది. నగరం విస్తరించినకొద్దీ.. మురుగు నీరంతటినీ ఇందులోనే వదలడం మొదలుపెట్టారు. దాంతో నది మురికి కాసారంగా మారిపోయింది. చాలా వరకు పూడ్చివేతకు గురైంది. దానిపై చియోంగ్ ఎక్స్‌ప్రెస్ వేను కూడా నిర్మించారు. అయితే 2003లో నగర పాలక సంస్థ అర్బన్ రెన్యూవల్ ప్రాజెక్టును చేపట్టింది. కానీ ఆ నదిని పునరుజ్జీవింప చేయడంపై అక్కడి ప్రభుత్వం కొన్నేళ్ల కింద ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. సుమారు 10.9 కిలోమీటర్ల పొడవున భారీ రహదారి, ఫ్లైఓవర్లు, ఇతర నిర్మాణాలను తొలగించి మరీ.. నదికి జీవం పోసింది. ఎంతోమంది పాలకులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యం, పరస్పర సహకారంతో.. సుమారు రూ.2,400 కోట్ల (281 మిలియన్ డాలర్లు) వ్యయంతో 2005లో ప్రాజెక్టు పూర్తయింది. అంకిత భావంతో మనసు పెట్టి ముందుకు వెళ్తే ఎంత కష్టమైనదైనా సుసాధ్యం చేయవచ్చనేందుకు చియోంగ్‌చియాన్ నది పునరుజ్జీవనం గొప్ప ఉదాహరణగా నిలిచిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఒక ఐకాన్‌గా పేరుపొందింది.

ఎన్నో విమర్శలు వచ్చినా..

చియోంగ్‌చియాన్ పునరుద్ధరణ ప్రాజెక్టు చేపట్టిన మొదట్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. భారీగా రోడ్లను, నిర్మాణాలను తొలగించడాన్ని తప్పుపట్టారు. కానీ అధికారులు పట్టుదలగా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లారు. 2005లో ప్రాజెక్టు పూర్తయిన తర్వాత అందరూ ప్రశంసించడం మొదలుపెట్టారు. ఆ ప్రాంతమంతా పర్యాటక ప్రాంతంగా మారింది. పరీవాహక ప్రాంతంలో అద్భుతమైన నివాసాలు వెలిశాయి. ఇదే తరహాలో మూసీని కూడా ప్రక్షాళన చేస్తే బాగుంటుందని సియోల్ పర్యటనలో ఉన్న అధికార బృందం భావిస్తోంది. నది ఒడ్డున పర్యాటక ప్రాంతాలు ఏర్పాటు చేస్తే.. వ్యాపార, వాణిజ్యాలు పెరిగి, స్థానికులకు జీవనోపాధి కలుగుతుందని చెప్తున్నారు.

ట్రాఫిక్‌కు చెక్ పెట్టారిలా..

భారీగా రోడ్ల తొలగింపుతో ఏర్పడే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చియోంగ్‌చియాన్ పునరుద్ధరణ ప్రాజెక్టు హెడ్‌క్వార్టర్స్‌లో ఓ కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. పునరుద్ధరణ పనులు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడమే కాకుండా.. ట్రాఫిక్ వ్యవస్థలో మార్పులు చేశారు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి.. తగినమేర రోడ్లు, ఇతర ఏర్పాట్లు చేశారు. పురాతన గ్వాంగ్‌టాంగ్యో, సుప్యోగ్యో బ్రిడ్జిలను పునరుద్ధరించారు.

'చియోంగ్‌చియాన్'పై అధ్యయనం

▶ మొదటి పేజీ తరువాయి

విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న 'మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్'ను సందర్శించారు. ఐదు రోజుల దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లిన ఈ బృందంలో మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తోపాటు ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

రోజూ వెయ్యి టన్నులు రీసైక్లింగ్

మాపో రిసోర్స్ రికవరీ ప్లాంటులో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తున్నారు. 'వేస్ట్ టు ఎనర్జీ' సాంకేతికత వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని రాష్ట్ర బృందానికి సియోల్ నగరపాలక సంస్థ అధికారులు వివరించారు. పర్యావరణంపై ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని తెలిపారు. మరో పదేళ్లలో భూఉపరితలం నుంచి ఈ ప్లాంటును తొలగించి, భూగర్భంలో అతిపెద్ద ప్లాంట్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. సియోల్ నగరానికి పశ్చిమాన ఉన్న ఈ ప్లాంట్‌ను 2005లో ప్రారంభించారు. ఇందులో ఏటా 2 లక్షల టన్నుల వ్యర్థాలను వినియోగిస్తూ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఇలాంటి మరో నాలుగు ప్లాంట్లను కూడా అక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.



నదిని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

మూసీ అభివృద్ధి కోసం..

సియోల్‌లో నదులకు పునరుజ్జీవం కల్పించినట్టే మూసీ నదిని కూడా ప్రక్షాళన చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సియోల్‌లోని చియోంగ్‌చియాన్ నది పరీవాహక ప్రాంతాల్లో పర్యటించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. హన్ పరీవాహక ప్రాంతాలను రాష్ట్ర బృందంతో కలిసి పరిశీలించానని తెలిపారు. అక్కడ ఒకప్పుడు తీవ్ర కాలుష్యంతో జీవించలేని పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు నూతన కళను సంతరించుకుందని చెప్పారు.

సచివాలయంలో సోలార్ కార్ పార్కింగ్

వెయ్యి కార్లను నిలిపేందుకు వీలుగా నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: సచివాలయంలో సౌర ఫలకాలతో కూడిన కార్ల పార్కింగ్ కేంద్రం ఏర్పాటు కానుంది. ప్రస్తుతమున్న కార్ల పార్కింగ్ యార్డు ఇరుకుగా ఉండటంతోపాటు పైకప్పు లేకపోవడంతో వాహనాలను ఎండా, వానలోనే నిలపాల్సి వస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశంతో ఇప్పుడు అక్కడ దాదాపు వెయ్యి కార్లను నిలపగలిగే సామర్థ్యంతో పైకప్పుతో కూడిన పార్కింగ్ యార్డును నిర్మించనున్నారు. గ్రిల్‌తో కూడిన ప్రహరీ ఎలివేషన్‌కు ఇబ్బంది కలగకుండా లోపలి భాగంలో పార్కింగ్ కేంద్రాన్ని నిర్మించనున్నారు. పైకప్పు మీద సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్యానల్స్ ద్వారా ఉత్పత్తి అయ్యే సౌర విద్యుత్‌ను అంతర్గత అవసరాలకు వినియోగించుకోనున్నారు. త్వరలోనే ఈ పనుల కోసం టెండర్లు పిలవనున్నారు. మరోవైపు సచివాలయంలో ఈశాన్యం, ఆగ్నేయం వైపు రెండు ప్రధాన గేట్లను అనుసంధానిస్తూ అంతర్గత రోడ్డు రోడ్డును నిర్మించాలని నిర్ణయించారు.

చందాదారుల వివరాలు ఎందుకివ్వరు?

▶ మొదటి పేజీ తరువాయి

చెబుతానని బదులిచ్చారు. దీంతో తదుపరి విచారణను నవంబర్ 4కు వాయిదా వేసింది. ఆరోజున అన్ని వివరాలతో విచారణకు హాజరు కావాలని ఆర్‌బీఐ, మార్గదర్శితో పాటు ఇరు రాష్ట్రాల న్యాయవాదులను ఆదేశించింది. చందాదారుల వివరాలను పెన్ డ్రైవ్‌లో తీసుకురావాలని ఆదేశించింది. ఈమేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. చట్ట నిబంధలను ఉల్లంఘించినందుకు మార్గదర్శి, దాని కర్త రామోజీరావుపై డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018 డిసెంబర్ 31న తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ఉండవల్లి, ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. అలాగే తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు కూడా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్లన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. ఈ ఏడాది ఏప్రిల్ 9న హైకోర్టు తీర్పును కొట్టివేసింది. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ.. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని చెప్పింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు మార్గదర్శి ఫైనాన్సియర్స్ పిటిషన్లపై మరోసారి విచారణ ప్రారంభించింది.

లూథ్రా వాదనకు ధర్మాసనం అభ్యంతరం: ఈ వ్యవహారంపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. ఈ విచారణకు ఉండవల్లి అరుణ్‌కుమార్ వర్చువల్‌గా హాజరయ్యారు. సుప్రీం కోర్టుకు మార్గదర్శి అందజేసిన 69,531 పేజీల చందాదారుల వివరాలను పెన్‌డ్రైవ్‌లో ఇచ్చేలా ఆదేశించాలని ఆయన కోర్టును కోరారు. పేపర్ ఫార్మాట్‌లో వివరాలు తన వద్ద ఉన్నప్పటికీ, పరిశీలనకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. కొన్ని అంశాలను ఇప్పటికే పరిశీలించానని, ఆ వివరాలన్నీ డొల్లగానే ఇచ్చారని అన్నారు. ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లో ఇస్తే అక్రమాలు తెలియజేస్తానన్నారు. తాను ఎవరి తరఫున వకాలత్ తీసుకోలేదని, సుప్రీం కోర్టు సూచన మేరకు హైకోర్టుకు సాయం మాత్రమే చేస్తున్నా అని చెప్పారు. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది లూథ్రా వాదనలు వినిపిస్తూ.. చందాదారుల వివరాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు చెప్పలేదన్నారు. దీనికి ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. పేపర్ ఫార్మాట్‌లో ఉన్న వివరాలనే పెన్‌డ్రైవ్‌లో కోరుతున్నారు కదా అని ప్రశ్నించింది. దీంతో గడువిస్తే సంస్థ నుంచి సూచనలు పొంది చెబుతానని లూథ్రా బదులిచ్చారు. కాగా, ఈ కేసులో పిటిషనర్–2 (రామోజీరావు) మృతి చెందారని తెలంగాణ పీపీ పల్లె నాగేశ్వర్‌రావు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీన్ని కూడా ధర్మాసనం నమోదు చేసుకుంది.

శబరిమలకు భారత్ గౌరవ్ రైలు

నవంబర్ 16న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరనున్న రైలు

ఐఆర్‌సీటీసీ నుంచి అయ్యప్ప భక్తుల కోసం మొదటిసారి..

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం ఐఆర్‌సీటీసీ మొట్టమొదటిసారి భారత్‌గౌరవ్ రైలును అందుబాటులోకి తేనుంది. సోమవారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే జనరల్‌మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, ఐఆర్‌సీటీసీ జనరల్‌మేనేజర్ పి.రాజ్‌కుమార్‌తో కలిసి శబరిమల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. భారత్‌గౌరవ్ టూరిస్ట్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అనూహ్యమైన ఆదరణ లభిస్తోందని జీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో ఆధ్యాత్మిక టూరిజం వృద్ధికి భారత్‌గౌరవ్ రైళ్లు పెద్దపీట వేస్తున్నాయన్నారు. అయ్యప్ప భక్తులు శబరిమలతోపాటు ఈ పర్యటనలో ఇతర యాత్రా స్థలాలను కూడా సందర్శించొచ్చని చెప్పారు.

శబరిమల పర్యటన ఇలా...

- ఈ యాత్ర మొత్తం 5 పగళ్లు, 4 రాత్రులు ఉంటుంది. రోడ్డు రవాణాతోపాటు అన్ని ప్రయాణ సదుపాయాలు ఈ ప్యాకేజీలో ఉంటాయి. ఉదయం టీ, అల్పాహారం, లంచ్, డిన్నర్–ఆన్–బోర్డు, ఆఫ్–బోర్డ్ సర్వీసులు ఉంటాయి. భక్తులకు వసతి కూడా ఐఆర్‌సీటీసీయే ఏర్పాటు చేస్తుంది.
- రైలులో ప్రయాణికుల భద్రతకు సీసీటీవీ కెమెరాలను అన్ని కోచ్‌లకు ఏర్పాటు చేశారు. పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సదుపాయం, ప్రయాణబీమా కూడా ఉంది.
- స్నేహపూర్వక ఐఆర్‌సీటీసీ టూర్ మేనేజర్ల సేవలు అందుబాటులో ఉంటాయి.
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఈ రైలు ప్రారంభమవుతుంది. అయ్యప్పస్వామి ఆలయంతోపాటు చొట్టనిక్కరలోని చొట్టనిక్కరదేవి ఆలయాన్ని సందర్శించొచ్చు. నల్లగొండ, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు స్టేషన్‌లలో హాల్టింగ్ సదుపాయం ఉంటుంది.



ప్యాకేజీ వివరాలు

ఈ రైలు నవంబర్ 16వ తేదీన ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతుంది. స్లీపర్ చార్జీ రూ.11,475, థర్డ్ ఏసీ రూ.18,790, సెకండ్ ఏసీ రూ.24,215 చొప్పున చార్జీలు ఉంటాయి. ఈ చార్జీల్లోనే అన్ని సదుపాయాలు అందజేస్తారు.



పొలం గట్టే.. బడికి దారి

పొలాల మధ్య పాఠశాల భవనం

కేసముద్రం: పొలాల మధ్యలో బడి.. ఆ బడికి పొలం గట్టే దారి. ప్రతీరోజు విద్యార్థులు ఆ దారి గుండానే పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధర్మారం తండా జీపీలో ప్రాథమిక పాఠశాల భవనాన్ని పంట పొలాల మధ్య నిర్మించారు. అయితే పాఠశాలకు వెళ్లేందుకు మాత్రం దారిని ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు పొలం గట్టుమీద నుంచే వెళ్లి వస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు విద్యార్థులు, టీచర్లు గట్టుమీద నుంచి జారి పడిన ఘటనలు ఉన్నాయి. అలాగే పాఠశాల భవనం పక్కనే ప్రమాదకరంగా రెండు వ్యవసాయ బావులు ఉన్నాయి. బడికి చుట్టూరా పొలాలు ఉండటంతో పాములు, విష పురుగుల భయం ఉంది. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కూర్చోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ పాఠశాలలో మొత్తం 12 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇప్పటికైనా పాఠశాలకు దారిని ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మక్కలు, ధాన్యం వర్షార్పణం..





సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లాలో సోమవారం కురిసిన వర్షానికి భారీ ఎత్తున పంట నీటిపాలైంది. సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం, మక్కలు వరద ప్రవాహానికి కొట్టుకొని పోయాయి. తేమ శాతం నేపథ్యంలో ఆరుబయట ధాన్యం, మక్కలను ఆరబో శారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వర్షం కురవడంతో తడిసిముద్దవగా, కొంత కొట్టుకుపోయింది. అప్పటికే అప్రమత్తమైన రైతులు పంటను కాపాడుకునేందుకు ప్రయత్నం చేసినప్పటికీ భారీ వర్షం వల్ల ఫలితం లేకుండా పోయింది.



ముగ్గురు కొడుకులున్నా.. పట్టెడన్నం పెట్టలేదు

సూర్యాపేట: ముగ్గురు కుమారులున్నా ఆ తండ్రి తిండి లేక అవస్థ పడుతున్నాడు. ఏ కొడుకూ చేరదీయకపోవడంతో దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన మామిడి అంజయ్యగౌడ్‌కు ముగ్గురు కొడుకులు. భార్య మూడేళ్ల క్రితం మృతి చెందింది. పెద్ద కుమారుడు అరవింద్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, రెండో కుమారుడు చంద్రం కూలీగా, మూడో కుమారుడు కృష్ణయ్య ఫైర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అంజయ్య తనకున్న కొద్దిపాటి వ్యవసాయభూమితోపాటు గీతకార్మికుడిగా పనిచేసి కుమారులను చదివించాడు. ఆ తర్వాత ఆ భూమిని మూడు భాగాలు చేసి కుమారులకు ఇచ్చి, తన పేరిట 10గుంటల భూమిని ఉంచుకున్నాడు. ముగ్గురు కుమారులు నెలకు ఒకరు చొప్పున అంజయ్యగౌడ్‌కు భోజనం పెట్టేలా నిర్ణయించుకున్నారు. కానీ ఇప్పుడు కుమారులు పట్టించుకోకపోవడంతో అంజయ్యగౌడ్ అవస్థలు పడుతున్నాడు. తన కుమారులు తన బాగోగులు చూడడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదు. దీంతో సోమవారం సూర్యాపేటలోని ఎల్ఐసీ ఆఫీసు వద్ద నివాసముంటున్న తన మూడో కుమారుడు కృష్ణయ్య ఇంటి ముందు రోడ్డుపై అంజయ్యగౌడ్ పడుకొని తనకు న్యాయం జరిగే విధంగా స్థానికులు సహకరించాలని కోరాడు.



అధికారుల ఇళ్లలో పనులు చేయించుకుంటున్నారు

టీజీఎస్‌పీ బెటాలియన్ వద్ద పోలీసు కుటుంబ సభ్యుల ధర్నా

నల్లగొండ క్రైం: అన్నెపర్తి టీజీఎస్‌పీ (తెలంగాణ ప్రత్యేక పోలీసు) 12వ బెటాలియన్ వద్ద పోలీస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు సోమవారం ధర్నా నిర్వహించారు. డ్యూటీల విషయంలో కింది స్థాయి ఉద్యోగులను ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఇంట్లో పనికి ఉపయోగించుకుంటున్నారని, చెప్పినట్లు వినకపోతే వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కొత్తగా అమల్లోకి వచ్చే రికార్డు పద్ధతిని ఉపసంహరించుకోవాలని, పని భారాన్ని తగ్గించాలన్నారు. ఫ్యామిలీ కన్వీనెంట్‌గా ఐదు సంవత్సరాలు ఫిక్స్‌డ్ పోస్టింగ్ ఇవ్వాలని, ఆర్డర్లీ వ్యవస్థను రద్దు చేయాలని కోరారు. కామన్ మెస్‌ను తీసివేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల కుటుంబ సభ్యులు అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై ధర్నా చేయడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో నార్కట్‌పల్లి, నల్లగొండ రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నా చేస్తున్న వారితో మాట్లాడారు. అదే సమయంలో గ్రూప్–1 పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు సమయం దాటిపోతోందని, భవిష్యత్తు కోల్పోతామని, తమకు సహకరించాలని హాల్ టికెట్లు చూపించడంతో వారు ధర్నా విరమించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాద పూర్వకంగా కలిసిన జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య



పోలీస్ అమరవీరులకు బండి సంజయ్ నివాళి

సాక్షి, న్యూఢిల్లీ: పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని నేషనల్ పోలీస్ మెమోరియల్ వద్ద కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నివాళులర్పించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్‌లో వీడియోను పోస్ట్ చేశారు. 'మన దేశ సేవలో అత్యున్నత త్యాగం చేసిన అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నాను. వారి అసమానమైన అంకిత భావం, ధైర్యం మనకు స్ఫూర్తినిస్తూనే ఉంది. అది మన దేశ భద్రతకు భరోసా ఇస్తోంది. మన దేశ భద్రతకు మూల స్తంభాలుగా నిలుస్తున్న మన పోలీసు బలగాలు, వారి కుటుంబ సభ్యుల తిరుగులేని సేవకు హృదయపూర్వక వందనం' అంటూ ఆయన పేర్కొన్నారు.

చెరకు రాష్ట్ర సరిహద్దులు దాటనివ్వొద్దు

- కేన్ కమిషనరేట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు
- వీలైనంత ఎక్కువ రాష్ట్రంలోనే క్రషింగ్ జరగాలి
- ఏటా కర్ణాటక, మహారాష్ట్రలకు 2.50 లక్షల టన్నుల చెరకు



చెరకు నరుకుతున్న కూలీలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ఆదాయపెంపు మార్గాలపై మరింత దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలో పండిన చెరకును సాధ్యమైనంత ఎక్కువగా ఇక్కడే క్రషింగ్ జరిపి తద్వారా చక్కెరతోపాటు ఇథనాలు, మొలాసిస్ వంటి ఉపఉత్పత్తులపై ఆదాయాన్ని మరింత పెంచుకోవాలని భావిస్తోంది. అందుకు తగిన ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది. రాష్ట్రంలో పండిన చెరకు పంటను ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే కేన్ కమిషనరేట్‌కు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని చక్కెర కర్మాగారాల ద్వారా వీలైనంత ఎక్కువగా చెరకు క్రషింగ్‌ను జరపాలని ఆ ఆదేశాల్లో పేర్కొంది. సాధారణంగా దీపావళి తర్వాత నుంచి చక్కెర కర్మాగారాలు క్రషింగ్‌ను ప్రారంభిస్తుంటాయి. రాష్ట్రంలో మరో పక్షం రోజుల్లో క్రషింగ్ సీజన్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.



ఇతర రాష్ట్రాలకు సుమారు 2.5 లక్షల టన్నులు..

ఏటా క్రషింగ్ సీజన్‌లో రాష్ట్రంలో పండిన చెరకు కర్ణాటక, మహారాష్ట్రలకు రైతులు తరలిస్తుంటారు. కర్ణాటకలో యాద్గిరి జిల్లాలో ఉన్న చక్కెర కర్మాగారాలకు, మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలోని కర్మాగారాలకు చెరకు రవాణా అవుతుంది. ఇలా ప్రతీ క్రషింగ్ సీజనులో సుమారు 2.50 లక్షల మెట్రిక్ టన్నులు ఇతర రాష్ట్రాలకు తరలిపోతుంది. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జహీరాబాద్ నుంచి ఆయా రాష్ట్రాలకు ఎక్కువగా వెళుతుంది. అసలే రాష్ట్రంలో ఇప్పటికే చెరకు సాగు విస్తీర్ణం సగానికి పైగా పడిపోయింది. దీనికి తోడు ఇక్కడి చెరకు ఇతర రాష్ట్రాలకు తరలిపోతే రెండు రకాలుగా నష్టం జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

క్రషింగ్ సామర్థ్యంలో సగమే సాగు

చక్కెరశాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 42 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు సాగవుతుందని అంచనా. సుమారు 16.80 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో సుమారు 20 వేల ఎకరాలకు మించి చెరకు విస్తీర్ణం ఉంటుంది. రాష్ట్రంలో పండే చెరకులో సుమారు 50% విస్తీర్ణం ఈ ఒక్క జిల్లాలోనే ఉంటుంది. ఈసారి అధిక వర్షాలు ఇతర పంటలకు నష్టం చేసినా, చెరకు పంటకు మాత్రం కొంత మేలు జరిగింది. అధిక వర్షాలతో దిగుబడి పెరిగే అవకాశాలున్నట్లు భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏడు ప్రైవేటు రంగంలో నడుస్తున్న చక్కెర ఫ్యాక్టరీల పరిధిలో సాగవుతున్న ఏరియాను ఆయా జోన్‌ల వారీగా కేటాయించారు.

సామర్థ్యంలో సగమే సాగు..

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ఎనిమిది చక్కెర కర్మాగారాలు ఉండగా..ఇందులో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ట్రైడెంట్ చక్కెర కర్మాగారం ఇటీవలే మూతపడింది. ఈ ఫ్యాక్టరీ జోన్ పరిధిలో సాగవుతున్న చెరకును రాష్ట్రంలోనే ఇతర ఫ్యాక్టరీలకు కేటాయిస్తున్నారు. దీంతో మిగిలిన ఏడు కర్మాగారాల క్రషింగ్ జరగనుంది. అయితే ఆయా ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యంలో సుమారు 53 శాతమే చెరకు అందుబాటులో ఉన్నట్లు చక్కెర శాఖ అధికారులు గుర్తించారు. కర్మాగారాల వారీగా వివరాలను పరిశీలిస్తే...


తరలిపోకుండా చర్యలు చేపట్టాం

కొన్ని ప్రాంతాల నుంచి చెరకును కర్ణాటక, మహారాష్ట్రలోని చక్కెర కర్మాగారాలకు రైతులు తరలిస్తుంటారు. ఈసారి ఇలా తరలిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. మూతపడిన ఫ్యాక్టరీ పరిధిలో సాగవుతున్న చెరకును సమీపంలో ఉన్న ఫ్యాక్టరీకి అలాట్ చేస్తున్నాము. రైతులు తమ చెరకును ఇతర రాష్ట్రాలకు తరలించి ఇబ్బంది పడవద్దు.

- రాజశేఖర్, కేన్ అసిస్టెంట్ కమిషనర్



ఫ్యాక్టరీ వద్ద చెరకు బండి



కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే వివేకానంద్

సాక్షి, హైదరాబాద్: తన పుట్టిన రోజు సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సోమవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావును ఎర్రవల్లి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వివేకానంద్‌ను కేసీఆర్ ఆశీర్వదించారు. వివేకానంద్‌తో పాటు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కూడా కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శతాబ్ది స్ఫూర్తి కొనసాగించేలా స్మృతి మందిరం

కందకుర్తిలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ పూర్వీకుల ఇంటి స్థానంలో నిర్మాణం

- ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100వ ఏట అడుగుపెట్టిన నేపథ్యంలో కేశవ స్ఫూర్తి కేంద్రానికి శ్రీకారం
- భరతమాత ఆలయం, పాఠశాల, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఉండేలా నిర్మాణం
- 1989 నుంచి శ్రీ కేశవ శిశుమందిర్ ద్వారా విద్యాబోధన, గోదావరి హారతి కార్యక్రమం
- 168 ఏళ్ల క్రితం కందకుర్తి నుంచి నాగ్‌పూర్ వలస వెళ్లిన హెడ్గేవార్ తాత నరహరిశాస్త్రి



పాత స్మృతిమందిరంలో విగ్రహాలు



హెడ్గేవార్ స్మృతిమందిరం (పూర్వీకుల ఇల్లు)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్)ను 1925 విజయదశమి రోజున నాగ్‌పూర్‌లో డాక్టర్ కేశవరామ్ బలిరామ్‌పంత్ హెడ్గేవార్ ప్రారంభించారు. హెడ్గేవార్ తాత నరహరిశాస్త్రి సరిగ్గా 168 సంవత్సరాల క్రితం నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి నుంచి వేదపండితులకు ప్రాధాన్యం ఇచ్చే భోంస్లే సంస్థానమైన నాగ్‌పూర్‌కు వలస వెళ్లారు. ఈ క్రమంలోనే కందకుర్తిలో స్మృతిమందిరంగా ఉన్న వారి ఇంటి వద్ద ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 1989 నుంచి శ్రీ కేశవ శిశు విద్యామందిర్ పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భరతమాత విగ్రహం, హెడ్గేవార్ కులదైవమైన చెన్నకేశవనాథ్ విగ్రహం, హెడ్గేవార్ విగ్రహం ప్రతిష్ఠించారు. కేశవ సేవాసమితి ఆధ్వర్యంలో గోదావరి హారతి కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ఆర్ఎస్ఎస్ 100వ ఏట అడుగు పెట్టిన నేపథ్యంలో హెడ్గేవార్ పూర్వీకుల ఇంటి స్థానంలో రూ.12 కోట్ల వ్యయంతో భారీ స్మృతి మందిరం నిర్మిస్తున్నారు. వచ్చే ఉగాదికి దీని నిర్మాణం పూర్తి చేస్తారు. దీని వద్దనే గోదావరి ఒడ్డున మరో 10 ఎకరాల్లో కేశవ స్ఫూర్తి కేంద్రం, పాఠశాల, వసతిగృహం, భరతమాత ఆలయం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. పేద పిల్లలు, రైతులు, మహిళలకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు. శ్రీ కేశవ శిశు విద్యామందిర్‌లో ముస్లిం విద్యార్థులు సైతం విద్యనభ్యసిస్తుండడం గమనార్హం. కేశవ సేవాసమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్న కందకుర్తి గ్రామాన్ని ఇప్పటికే పలువురు సర్‌సంఘ్ చాలక్ (ఆర్ఎస్ఎస్ చీఫ్)లు సందర్శించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న భారీ స్మృతిమందిరం ప్రారంభానికి ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భగవత్‌జీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం హాజరు కానున్నట్టు తెలుస్తోంది.



నిర్మాణంలో స్మృతిమందిరం

రెంజల్ మండలంలో అక్షరాస్యత పెంచడంలో కేశవ సేవాసమితి కీలకపాత్ర

1989లో శ్రీ కేశవ శిశు విద్యామందిర్ ప్రారంభం కాగా, 2004లో పాఠశాల నూతన భవనాన్ని శ్రీరాంబావ్ హల్దేకర్ జీ ప్రారంభించారు. 2013 నుంచి కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ ల్యాబ్, ఈ-తరగతులు, ఎల్ఈడీ టీవీ సౌకర్యం కల్పించారు. ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్నారు. మరోవైపు కందకుర్తి చుట్టుపక్కల గ్రామాల యువతీయువకులకు ఎండాకాలంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తున్నారు. కందకుర్తి గ్రామం నుంచి మొదటి సైనికుడిగా ఎంపికైన జుబెర్ బాషా, రెంజల్ మండలం నుంచి మొదటిసారిగా నావికాదళానికి ఎంపికైన శశివర్ధన్ ఈ పాఠశాలలోనే విద్యనభ్యసించారు. ఇక కేశవ సేవాసమితి పాఠశాలతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతోంది. చుట్టుపక్కల 19 గ్రామాల్లో బాలబాలికలలో సంస్కారం, చదువుకు బాల సంస్కార కేంద్రాలు, బాలికలకు కిశోరి వికాస్ కేంద్రాలు, ట్యూషన్ సెంటర్లు, పెద్దవారికి భజన మండళ్లు, గృహిణులకు మాతృమండళ్లు, యువకులకు క్రీడాకేంద్రం, గ్రంథాలయం, నారాయణ సేవ లాంటి కార్యక్రమాలు కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. వీటి వల్ల రెంజల్ మండలంలో అక్షరాస్యత గణనీయంగా పెరిగింది. పేద కుటుంబాల యువతకు చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తున్నారు.



త్రివేణి సంగమం వద్ద.....

తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నడుమ కందకుర్తి వద్ద గోదావరి, మంజీర, హరిద్ర నదుల సంగమం ఉంది. ఈ ప్రాంత ప్రజలు తెలుగు, కన్నడ, మరాఠీ, హిందీ, ఉర్దూ భాషలు మాట్లాడతారు. భిన్న సంస్కృతులకు నిలయంగా ఈ ప్రాంతం మారింది. త్రివేణి సంగమ ప్రాంతానికి కొన్ని అడుగుల దూరంలోనే కందకుర్తి (తెలంగాణ)-బెల్లూర్ (మహారాష్ట్ర)లను అనుసంధానం చేసే వంతెనను 1992లో నిర్మించారు. ఇక్కడికి 15 కిలోమీటర్ల దిగువన బాసర పుణ్యక్షేత్రం ఉంది. కందకుర్తిలో ఉన్న రామాలయానికి సైతం గొప్ప ప్రాశస్త్యం ఉంది. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ, ఆయన గురువు సమర్థ రామదాసు ఈ ఆలయాన్ని సందర్శించారు. గతంలో ఇక్కడ ప్రాచీన స్కంధ (కుమారస్వామి) మందిరం ఉండేది. మూడు నదులు కలిసే కూడలి కావడంతో కూడతి అనేవారు. కాలక్రమంలో కందకుర్తి పేరు వచ్చినట్టు చరిత్రకారులు చెబుతున్నారు. పూర్తిగా కూలిపోయిన స్కంధ మందిరం స్థానంలో కొత్త మందిర నిర్మాణం చేస్తున్నారు. త్రేతా యుగంలో ఇక్కడ శ్రీరాముడు శివాలయాన్ని నిర్మించినట్టు చెబుతున్నారు. దీన్ని తర్వాత రాణి అహల్యాబాయి మందిరాన్ని పునరుద్ధరించారు.

తెలంగాణలో పర్యటిస్తున్న జమ్మూకశ్మీర్ మీడియా ప్రతినిధి బృందం

సాక్షి, హైదరాబాద్: జమ్మూకశ్మీర్‌కు చెందిన 14 మంది మీడియా ప్రతినిధుల బృందం ఐదు రోజుల తెలంగాణ పర్యటన కోసం సోమవారం హైదరాబాద్ చేరుకుంది. తెలంగాణలో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు ద్వారా జరుగుతున్న అభివృద్ధిని జమ్మూకశ్మీర్ మీడియా బృందం పరిశీలించేందుకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) జమ్మూకశ్మీర్ విభాగం ఈ పర్యటన ఏర్పాటు చేసింది. పీఐబీ శ్రీనగర్ డిప్యూటీ డైరెక్టర్ తారిఖ్ నేతృత్వంలో అక్కడి మీడియా బృందం సోమవారం కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్కోయిస్)ను సందర్శించింది. ఫిషింగ్ జోన్ల సామర్థ్యంపై సలహాలు, తుపాన్లు, సునామీలపై హెచ్చరికలు, సముద్ర స్థితిపై అంచనాలు సహా 'ఇన్కోయిస్' అందిస్తున్న సేవలను ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల శ్రీనివాస కుమార్ ప్రతినిధి బృందానికి వివరించారు. సునామీలు, తుపాను, ఉప్పెనల వంటి విపత్కర పరిస్థితుల్లో సముద్ర సమాచారం, సలహాలు అందించడంలో సంస్థ పాత్ర గురించి ఇన్కోయిస్ శాస్త్రవేత్త డి. అజయ్ నుంచి ప్రతినిధి బృందం వివరాలు తెలుసుకుంది. అంతకుముందు హైదరాబాద్‌లోని పీఐబీ కార్యాలయాన్ని సందర్శించిన మీడియా ప్రతినిధి బృందానికి అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ తెలంగాణలో పీఐబీ పనితీరు గురించి వివరించారు. మీడియా ప్రతినిధి బృందం వెంట పీఐబీ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, పీఐబీ అధికారి శివచరణ్‌రెడ్డి ఇతర అధికారులు ఉన్నారు.

ప్రారంభమైన ఎస్ఏ-1 పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్ఏ-1) పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇవి ఈ నెల 28వ తేదీ వరకూ జరుగుతాయి. నవంబర్ 2వ తేదీన ఫలితాలు వెల్లడిస్తారు. క్లాస్ టీచర్లు 16వ తేదీన తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి, విద్యార్థి పురోగతిని చర్చించాల్సి ఉంటుంది. జిల్లా పరీక్షల బోర్డులు ఇందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ప్రతీ స్కూలుకు పంపాయి. ఈ పరీక్షలను వార్షిక పరీక్షలకు రిహార్సల్‌గా భావిస్తారు. కాబట్టి ఈ పరీక్షలు కీలకమని టీచర్లు చెబుతున్నారు. ఎస్ఏ-1 పరీక్షలకు సగం సిలబస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ సబ్జెక్టులోనూ రెండు, మూడు మినహా ఇతర చాప్టర్ల సిలబస్ పూర్తి కాలేదని విద్యార్థులు అంటున్నారు. దీంతో ఎస్ఏ-1 పరీక్షలు ఎలా రాస్తామని ప్రశ్నిస్తున్నారు. మార్కులు పెద్దగా పరిగణనలోనికి రావు కాబట్టి, సిలబస్‌తో సంబంధం లేకుండా పరీక్షలు రాయాలని టీచర్లు సూచిస్తున్నారు. ఉన్నత క్లాసులకు గత ఏడాది వరకూ ఆరు పరీక్షలు నిర్వహించారు. ఈ సంవత్సరం నుంచి సైన్స్‌లో రెండు పేపర్లను, వేర్వేరు రోజుల్లో నిర్వహిస్తారు. ఈ మార్పును ఎస్ఏ పరీక్షల ద్వారా విద్యార్థులు అనుభవపూర్వకంగా తెలుసుకుంటారని చెపుతున్నారు.



కమలా హారిస్ విజయాన్ని కాంక్షిస్తూ మహాయాగం

పాల్వంచ: అమెరికా అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న కమలా హారిస్ విజయాన్ని కాంక్షిస్తూ రాజశ్యామలాంబ మాలామంత్ర జపయజ్ఞ పూర్వక శత చండీ సహిత సుదర్శన మహాయాగం నిర్వహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లా సురేష్‌రెడ్డి దంపతుల నేతృత్వాన ఆదివారం మొదలైన యాగం ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ యాగంలో కందాళ సింహాద్రి ఆనంద్‌శర్మ, ఇంద్రగంటి చైతన్య, బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కొడమంచిలి సత్యనారాయణ శర్మ సారథ్యాన 31 మంది రుత్వికులు పాలుపంచుకుంటున్నారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ, భారతీయ సంతతికి చెందిన కమలా హారిస్ అమెరికా అధ్యక్షురాలిగా గెలవాలని ఆకాంక్షిస్తూ యాగం చేపట్టామని తెలిపారు.

క్లుప్తంగా...

గోబెల్స్ ప్రచారంలో సీఎం చంద్రబాబు దిట్ట

వైఎస్సార్ సీపీ నాయీబ్రహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పుల్లయ్య



భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో హామీలు గుప్పించిన టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలయినా ఒక్క హామీ కూడా అమలుచేయలేదని వైఎస్సార్‌సీపీ నాయీబ్రహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తొండమల్ల పుల్లయ్య విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదలచేశారు. గోబెల్స్ ప్రచారంలో దిట్ట అయిన సీఎం చంద్రబాబు గత పాలన లోనూ గ్రాఫిక్స్‌తో ప్రజలను మభ్యపెట్టారని గుర్తు చేశారు. టీడీపీ కార్యాలయంలో నిన్న జరిగిన సమావేశంలో మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పుకోవడం గోబెల్స్ ప్రచారంలో భాగమేనని అన్నారు. విద్యార్థులకు వసతి దీవెన ఇవ్వలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు, అమ్మకు వందనం ఇవ్వలేదు, అయినా ఇచ్చినట్లు బిల్డప్ ఇవ్వటం చంద్రబాబుకే చెల్లిందని ఎద్దేవా చేశారు. ప్రముఖ దేవాలయాల్లో పని చేస్తున్న నాయీబ్రాహ్మణులకు ఉద్యోగ భద్రత కల్పించి వారిని ఎండోమెంట్ ఉద్యోగులుగా పరిగణించి రూ.20వేలు వేతనం ఇచ్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించాలి

ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం డిమాండ్

మైలవరం: ఏపీ రెడ్డి కార్పొరేషన్‌కు చైర్మన్‌ను ప్రభుత్వం వెంటనే నియమించాలని ఆంధ్ర ప్రదేశ్ రెడ్డి సంఘం డిమాండ్ చేసింది. రెడ్డి సామాజికవర్గ సంక్షేమం కోసం నిధులు కేటాయించాలని కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు బిక్క నరసింహారెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, పి.తిరుపతిరెడ్డి, ఎ.సుబ్బారెడ్డి, జి.మహేందర్, డి.రాజశేఖరరెడ్డి, ఎస్.సూర్యనారాయణ సోమవారం తెలిపారు. రాష్ట్రంలో 70లక్షలకు పైగా ఉన్న రెడ్డి సామాజికవర్గంలో 80 శాతం మంది పేద, మధ్య తరగతి వారేనన్నారు. రెడ్డి సామాజికవర్గ రైతులు, విద్యార్థులు, వ్యాపారులకు ఆర్థిక సాయాన్ని ఏపీ రెడ్డి కార్పొరేషన్ ద్వారా అందించాలని కోరారు.

విద్యలో నాణ్యత పెంపునకు ఉపాధ్యాయ శిక్షణ

సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు జరిగే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను సోమవారం విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యత పెంచడమే ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని, దీనిని ఎన్ఈపీ-2020 విధానానికి, నిపుణ్ భారత్‌కు అనుగుణంగా రూపొందించినట్టు చెప్పారు. రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రేడ్-1, గ్రేడ్-2 కేటగిరీలో ఉన్న 34 వేల మంది ఉపాధ్యాయులకు 14 విడతల్లో ఈ శిక్షణ ఇస్తామని తెలిపారు. కాగా సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, రాజమహేంద్రవరం, ఎన్టీఆర్, గుంటూరు, తిరుపతి, వైఎస్సార్, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో మొదటి విడతలో 1700 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభమైంది.

చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్లు ధరఖాస్తు చేసుకోవాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్న చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూషన్లు అనుమతి కోసం ధరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిని నడుపుతున్న సంస్థలు, వ్యక్తులు వివరణాత్మకంగా ధరఖాస్తును ఏపీ జువైనల్ వేల్ఫేర్ కరక్షనల్ సర్వీసెస్, వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్ శాఖ డైరెక్టర్‌కు సమర్పించాలి. ప్రభుత్వ, ప్రభుత్వేతర, సచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సంరక్షణ-రక్షణ కేంద్రాలు, పిల్లల గృహాలు జువైనల్ చట్టం ప్రకారం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

అమూల్య విజ్ఞాన భాండాగారం

'అపూర్వ' చరిత్ర...అరుదైన పుస్తకాలు

రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల 1855లో జిల్లా పరిషత్ పాఠశాలగా ప్రారంభమైంది. 1873లో కళాశాలగా మారింది. 1891లో మద్రాస్ యూనివర్సిటీ అఫిలియేషన్ పొందింది. అదే సమయంలో ఆర్ట్స్ కళాశాలలో గ్రంథాలయం రూపుదిద్దుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యార్థులకు కేరీర్ గైడ్‌గా ఆవిర్భవించి సేవలు అందిస్తోంది. ఇక్కడి లైబ్రరీలో అనేకమంది ప్రముఖులు పుస్తక పఠనం కోసం పోటీ పడేవారు. నాటి నుంచి నేటి వరకు అత్యంత ఆదరణ కలిగిన పుస్తక భాండాగారం ఇదే. విజ్ఞాన భాండాగారం అరుదైన పుస్తకాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఖ్యాతి గడించింది. ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ, తమిళ్, శాంస్క్రీట్, ఒరియా లిటరేచర్, హిస్టరీ, పొలిటిక్స్, సోషియాలజీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, కామర్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ సబ్జెక్టులకు చెందిన పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. బయట ఎక్కడా లభ్యం కాని అరుదైన, అత్యంత ప్రాచీన పుస్తకాలు ఈ గ్రంథాలయంలో కొలువుదీరడం ప్రత్యేకం. 30 వేలకు పైగా అరుదైన పుస్తకాలు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. మెడిటేషన్‌కు సంబంధించి 1635లో లండన్‌కు చెందిన ఓ ఆంగ్ల కవి రచించిన పుస్తకం ఇక్కడ తొలి పుస్తకం. అనంతరం అనేక పుస్తకాలు ఇక్కడకు వచ్చి చేరాయి. లండన్ నుంచి వచ్చినవే అత్యధిక శాతం ఇక్కడ ఉంటాయి. జియాలజికల్ సర్వే, కూరగాయలతో వచ్చిన రంగులతో పెయింట్స్ వేసిన పుస్తకాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. ఆస్ట్రేలియన్ రిసోర్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ నేషనల్ డెవలప్‌మెంట్, సెనేటర్ లాంటి పుస్తకాలు భాండాగారం సొంతం. 1800 కాలం నాటి వాస్కోడిగామా పుస్తకం సైతం అందుబాటులో ఉంది. ప్రపంచంలో ఎక్కడా లభించని అరుదైన పుస్తకాలు ఇక్కడ ఉన్న విషయాన్ని గ్రహించిన విదేశీయులు వాటిని చదివేందుకు లైబ్రరీని ఆశ్రయిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తున్న విదేశీయుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

డబుల్ డెక్కర్ నిర్మాణం..లక్షల పుస్తకాలు

భారతదేశ వ్యాప్తంగా **ఏ కళాశాలలో లేని విధంగా ఆర్ట్స్ కళాశాల గ్రంథాలయం నిర్మితమైంది.** 56 మీటర్ల పొడవు.. 25 **మీటర్ల వెడల్పుతో** నిర్మించిన లైబ్రరీ కింద, పైన రెండు ర్యాకులుగా ఉంటుంది. పైన **ర్యాకులో సైతం నడుచుకుంటూ వెళ్తూ పుస్తకం చదివేలా** ఏర్పాట్లు చేశారు. చూ**డముచ్చటగా దర్శనమిచ్చే విజ్ఞాన భాండాగారం** పైకి ఎక్కేందుకు మెట్లను ఏ**ర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు** చెక్కు చెదరని నిర్మాణం ఈ **లైబ్రరీ సొంతం.** గ్రంథాలయంలో ప్రస్తుతం 1.26 లక్షల పుస్త**కాలున్నాయి. 1.37 లక్షల ఈ బుక్స్,** 37,000 ఈ-జర్నల్స్ పాఠక**ులకు అందుబాటులో ఉంచారు.** అత్యంత పురాతన పుస్తకాలు **ఉండటం, వాటి పేపర్లు** ముట్టుకుంటే పాడైపోతున్న **కారణంతో పుస్తకాలను** భద్రంగా పెట్టాలన్న తలం**పుతో ఇతరులకు** గ్రంథాలయంలోకి అనుమతి ఇ**వ్వడం లేదు. ఐడీ** కార్డ్స్ ఉన్న ఆర్ట్స్ కళాశాల **పూర్వ విద్యార్థులు,** ప్రస్తుతం చదువుతున్న **విద్యార్థులకు** మాత్రమే అనుమతి ఇస్తు**న్నారు.**



ఆర్ట్స్ కళాశాల గ్రంథాలయం



పురాతన కాలం నాటి లిపి



క్రీస్తుపూర్వం 1800 కాలంలో వాస్కోడీగామా రచించిన పుస్తకం

గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల్లో మచ్చుకుకొన్ని...

సబ్జెక్టు	పుస్తకాల సంఖ్య
ఇంగ్లిష్	20,421
తెలుగు	15,607
హిందీ	3,692
ఉర్దూ	1,971
సంస్కృతం	2,699
హిస్టరీ	8,027
పొలిటిక్స్	3,002
ఎకనామిక్స్	2,668
గణితం	6,346
ఫిజిక్స్	6,797
రెఫరెన్స్	2,007
ఎంబీఏ	1,977
ఎంసీఏ	1,409

దేశంలోనే అతి పెద్ద లైబ్రరీగా 'ఆర్ట్స్ కళాశాల గ్రంథాలయం' ప్రతీతి

- డబుల్ డెక్కర్ విధానంలో రూపుదిద్దుకున్న పుస్తక ప్రపంచం
- 1891లో ప్రారంభమైన అత్యంత చారిత్రక లైబ్రరీగా ప్రఖ్యాతి
- 56 మీటర్ల పొడవు.. 25 మీటర్ల వెడల్పుతో నేటికీ చెక్కు చెదరని నిర్మాణం
- అందుబాటులో 1,800 ఏళ్ల కాలం నాటి పురాతన పుస్తకాలు
- ప్రపంచంలో ఎక్కడా లభించని 35,000 అరుదైన పుస్తకాలు లైబ్రరీ సొంతం
- 1.26 లక్షల పుస్తకాలు లభ్యం.. 1.37 లక్షల ఈ-బుక్స్.. 37 వేల జర్నల్స్‌కు కేంద్రం

సాక్షి, రాజమహేంద్రవరం: విభిన్న పాఠ్యాంశాలు, జీవన విధానం, చారిత్రక ఆనవాళ్లు కళ్లకు కట్టినట్లు రూపుదిద్దుకున్న పుస్తక భాండాగారంగా ఆర్ట్స్ కళాశాల గ్రంథాలయం విరాజిల్లుతోంది. అత్యంత ప్రాచీన విజ్ఞాన కేంద్రంగా ప్రఖ్యాతి గడించిన పుస్తక ప్రపంచం ఎంతోమంది విద్యార్థులకు విజ్ఞానం పంచుతోంది. బహిరంగ విపణిలో కూడా లభించని పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. దేశవ్యాప్తంగా అనేక కళాశాలలున్నా.. ఈ స్థాయి గ్రంథాలయం ఏ కళాశాలలో లేదన్న భావన పాఠకుల్లో వ్యక్తమవుతోంది. 1891లో ప్రారంభమైన విజ్ఞానాలయం నేటికీ చెక్కుచెదరని నిర్మాణంతో ప్రత్యేకతను చాటుతోంది. నాటి నుంచి నేటి వరకు లక్షల విద్యార్థులకు విజ్ఞానం పంచుతోంది.

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



లైబ్రరీ మాలాంటి విద్యార్థులకు ఎం**తో** ఉపయోగపడుతోంది. బయట ఎక్క**డా** లభించని అరుదైన పుస్తకాలు ఇక్క**డ** అందుబాటులో ఉంటున్నాయి. క**ళాశాల** లేని సమయంలో సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలు **చది**వేందుకు అనువైన వాతావరణం కల్పించారు.

– డి.సౌందర్య, బీఎస్సీ ఆక్వా కల్చర్, ద్వితీయ సంవ**త్సరం**

లైబ్రరీలో అరుదైన పుస్తకాలు

క్లాసులు అయిపోయిన వెంటనే సెల్‌ఫోన్లలో మునిగిపో**తున్నారు.**



లైబ్రరీ ఉండటం వల్ల సెల్‌ఫోన్ జోలి**కి వెళ్లకుండా** ఉంటున్నాం. అత్యంత అరుదైన పుస్త**కాలు లభిస్తుం**డటంతో గత పరిస్థితులు, ప్రస్తుతం **చోటు చేసుకుం**టున్న అంశాలను బేరీజు వేసుకుంటు**న్నాం. ఈ-లైబ్రరీ** ఎంతో ఉపయోగపడుతోంది.

– సీహెచ్ పూజిత, బీఎస్సీ జువాలజీ, **ద్వితీయ సంవత్సరం**

ఆహ్లాదకర వాతావరణం

గ్రంథాలయంలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణం దర్శనమిస్తుంది. విద్యార్థులకు అవసరమైన రీడింగ్ చైర్స్, ఈ-లైబ్రరీ సదుపాయం కల్పించారు. అందుకు అవసరమైన కంప్యూటర్లూ, దినపత్రికలు అందుబాటులో ఉంచారు. ఉదయం తరగతులకు హాజరయ్యే విద్యార్థులు మధ్యాహ్నం, మధ్యాహ్నం తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఉదయం గ్రంథాలయంలో పుస్తకాలు చదివే అవకాశం కల్పిస్తున్నారు. ఇళ్లకు తీసుకెళ్లేందుకు సైతం అనుమతి కల్పిస్తున్నారు.



డిజిటల్ లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులు

మంత్రి గారికి ‘ఫార్మాలిటీస్’ కావాలంట!

రామచంద్రపురం ఆక్వా రైతులను కోరిన వాసంశెట్టి సుభాష్

- అక్రమ చెరువులను సర్వేచేయాలని ఆదేశించానని బెదిరింపు
- అడ్డం తిరిగిన ఆక్వా రైతులు.. అన్ని అనుమతులతోనే సాగుచేస్తున్నామని వెల్లడి
- ఫార్మాలిటీస్ ఇచ్చేది లేదని స్పష్టీకరణ..
- లోకేశ్ దృష్టికి వెళ్లడంతో తూచ్ తూచ్ అన్న సుభాష్

రామచంద్రపురం : 'అనుకున్నదొక్కటి.. అయినదొక్కటి.. బోల్తాకొట్టిందిరో బుల్‌బుల్ పిట్ట'.. అన్నట్లుగా తయారైంది రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరిస్థితి ఇప్పుడు. తాను చేసిన తప్పును ఎదుటివారి మీద తోసేసే ప్రయత్నంలో ఆయన బొక్కబోర్లా పడి అభాసుపాలయ్యారు. ఆక్వారైతుల నుంచి 'ఫార్మాలిటీస్' కొట్టేద్దామని ఆయన వేసుకున్న స్కెచ్ బూమరాంగ్ అవడంతో ఇది వైఎస్సార్‌సీపీ పేటీఎం బ్యాచ్ దుష్ప్రచారం అంటూ బుకాయిస్తూ నవ్వులపాలవుతున్నారు. గతంలో మాదిరిగానే తనకూ 'ఫార్మాలిటీస్' ఇవ్వాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు తూచ్ చెబుతూ.. లేదు లేదు.. అభివృద్ధి కోసమే అడిగానంటూ మంత్రి చేస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు నియోజకవర్గంలో దుమారం రేపుతున్నాయి. ఈ 'ఫార్మాలిటీస్' విషయం టీడీపీ అధిష్టానం వద్దకు చేరడంతో దీనిని వైఎస్సార్‌సీపీ మీదకు నెట్టేందుకు మంత్రి ఆపసోపాలు పడుతున్నారు.



ఆక్వా రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్ (ఫైల్)

నాకూ 'ఫార్మాలిటీస్' ఇవ్వండి..

నిజానికి.. డా. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని ఒక కళ్యాణ మండపంలో మంత్రి సుభాష్ జూలై 19న ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా చాలాచోట్ల ఆక్వా చెరువులు ఉన్నాయని, వాటిని సర్వే చేయాలని ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించినట్లు బెదిరింపు ధోరణిలో చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాగైతే ఫార్మాలిటీస్ ఇచ్చారో.. తనకు కూడా అలాగే ఇవ్వాలన్నారు. మీరిచ్చిన సొమ్ముకు నా వంతు కూడా వేసి ఆక్వాసాగు వల్ల దెబ్బతింటున్న గ్రామాల అభివృద్ధికి ఖర్చుచేస్తానని చెప్పారు. అయితే.. తాము అన్ని అనుమతులతో ఆక్వాసాగు చేస్తున్నామని ఫార్మాలిటీస్ ఇచ్చేది లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న చెరువులను తొలగించుకోండని రైతులు తెగేసి చెప్పేశారు. అయినా మంత్రి సుభాష్ తన అనుచరులతో ఇబ్బందులు పెడుతుంటే ఆక్వారైతులు ఈ విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. దీంతో.. మంత్రి వెంటనే మాట మార్చేసినట్లు సమాచారం. అభివృద్ధి కోసం అడిగానే తప్ప తన కోసం కాదంటూ మంత్రి తాజాగా ముక్తాయింపు ఇస్తున్నారు.

ముడుపుల మంత్రి రాజీనామా చేయాలి..



అక్రమ రొయ్యల చెరువుల రైతుల నుంచి బాహాటంగా ముడుపులు కావాలని కోరిన మంత్రి సుభాష్ తన పదవికి రాజీనామా చేయాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక కె.గంగవరం మండలం కోట గ్రామానికి ఆనుకుని ఉన్న అక్రమ రొయ్యల చెరువులను తొలగించాలని ఆ గ్రామ పెద్దలు, మహిళలు ధర్నా చేశారు. వాటిని తక్షణమే తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చినా ఇప్పటివరకూ పట్టించుకోలేదు. ఆయన బాహాటంగానే ముడుపులు చెల్లించండని చెప్పడం చూస్తుంటే రాబోయే రోజుల్లో ఇంకెన్ని దారుణాలకు ఒడిగడతారోనని జనం భయపడుతున్నారు.

– పిల్లి సూర్యప్రకాశ్, వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్, రామచంద్రపురం

పలువురు ఐఏఎస్‌లకు హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ

సాక్షి, అమరావతి: కాలువ గట్లపై పిచ్చి మొక్కలను తొలగించినందుకు అయిన బిల్లులు చెల్లించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడమే కాకుండా, వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరు కానందుకు పలువురు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. వారెంట్ జారీ అయిన వారిలో అప్పటి జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ రాంగోపాల్ ఉన్నారు. ఈ వారెంట్లను అమలు చేయాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశిస్తూ విచారణను నవంబర్ 27కి వాయిదా వేసింది.

రూ.66.36 లక్షల చెల్లించండి

కాలువ గట్లపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించినందుకు పీవీఆర్ స్ట్రక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెల్లించాల్సిన రూ.66.36 లక్షలను చెల్లించాలని హైకోర్టు గత డిసెంబర్‌లో ఉత్తర్వులిచ్చింది. ఆ చెల్లింపులు చేయకపోవడంతో కంపెనీ ఎండీ శ్రీహర్ష అధికారులపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. అందులో అధికారులందరినీ వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై గత నెలలో విచారణ జరిపిన న్యాయమూర్తి తన ఉత్తర్వులను అక్టోబర్ 15 లోపు అమలు చేయాలని, లేని పక్షంలో ఆ రోజున కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. 15న జరిగిన విచారణకు ధవళేశ్వరం జలవనరుల శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు తప్ప మిగిలిన అధికారులెవ్వరూ హాజరు కాలేదు. దీనిపై న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

'కేసుల' సత్వర విచారణకు ఏం చేయాలో చెప్పండి

ఏజీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులపై దాఖలైన కేసుల సత్వర విచారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చెప్పాలని హైకోర్టు సోమవారం రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ)కి సూచించింది. తదుపరి విచారణకు తగిన సూచనలతో రావాలని ఏజీకి స్పష్టం చేసింది. కొన్ని కేసుల్లో హైకోర్టు స్టేలు జారీ చేసినందున, అలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో చెప్పాలంది. ఈ కేసుల్లో స్టే ఎత్తివేతకు పిటిషన్లు దాఖలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. స్టేలు ఉండగా కేసుల్లో చేయడానికి ఏమీ ఉండదని తెలిపింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ కంచిరెడ్డి సురేష్ రెడ్డి, జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 73,926 మంది స్వామిని దర్శించుకున్నారు. 23,726 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.3.87 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైభవంగా ముక్కంటి కల్యాణం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

కిటకిటలాడిన పంచారామ క్షేత్రం

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారుజామున తొలి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. తొలిపూజ, అభిషేకాలను తిలకించడానికి తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు.

ఘనంగా 1008 కలశాల పూజ



సఖినేటిపల్లి: మోరి వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం వద్ద సోమవారం పేరాబత్తుల సుబ్బారాయుడు గురుస్వామి పీఠం ఆధ్వర్యంలో పల్లపోతు పూర్ణయ్య గురుస్వామి పర్యవేక్షణలో అయ్యప్ప భక్తులు 1008 కలశల పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో తొలుత పేరాబత్తుల వెంకటరత్నం-లక్ష్మీ పోసికుమారి, ఆకుల నరేష్-ఊర్వశి కనకదుర్గ ధనలక్ష్మి దంపతులు, అయ్యప్ప స్వాములతో లక్ష్మీ గణపతి హోమం చేయించారు. దీపారాధన, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత కలశారాధన, చతుర్ద కలశారాధన, అగ్ని మథనం, అగ్నిప్రతిష్ఠాపన, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కలశాలతో అయ్యప్ప భక్తులు ఊరేగింపు నిర్వహించారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.

డిజిటల్ టెక్నాలజీపై మహిళలకు ప్రత్యేక శిక్షణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు, ఎన్జీఓలకు ఆధునిక సాంకేతిక, డిజిటల్ టెక్నాలజీపై మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వీసీ వీ.ఉమ తెలిపారు. సోమవారం వర్సిటీలోని సావేరి సెమినార్ హాల్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళా వర్సిటీ, యునైటెడ్ నేషన్స్ ఏషియన్ అండ్ పసిఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఫర్ డెవలప్మెంట్ (ఏపీసీఐసీటీ) సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ నైపుణ్యాభివృద్ధిపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు.



తిరుపతి అర్బన్: డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 25 వరకు గడువు పెంచినట్టు ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య సోమవారం తెలిపారు. ముందుగా 21వ తేదీ వరకు గడువు ఇచ్చామని, కానీ అందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో మరో నాలుగు రోజులు పొడిగించినట్లు ఆయన వెల్లడించారు. ఆసక్తి గల వారు జన్మభూమి.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు .

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ (సంగీతం), మాస్టర్ ఆఫ్ కామర్స్, డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం)లో ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయ డైరెక్టర్ తెలిపారు. దరఖాస్తు ఫారం, అర్హత, ఫీజు వివరాలు వంటి సమాచారం వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఈనెల 31వ తేదీలోపు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నవంబర్ 15న స్పాట్ అడ్మిషన్ల చేపట్టనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 0877-2284524, 8121787415 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి త్రైక్వాండో జట్ల ఎంపిక

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మంగళవారం నుంచి కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో త్రైక్వాండో వర్సిటీ టీం సెలక్షన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.జగదీష్‌బాబు మాట్లాడుతూ జేఎన్టీయూ పరిధిలోని అన్నిజిల్లాల కళాశాలల నుంచి వర్సిటీ టీం కోసం సెలక్షన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఏయూను సందర్శించిన 'జీఎంఆర్' డైరెక్టర్

మద్దిలపాలెం: ఏయూ సోమవారం జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ డైరెక్టర్ స్మిత రాజు సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుతో భేటీ అయ్యారు. యువతలో నైపుణ్యాలను పెంపొందిస్తూ మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించే కోర్సుల రూపకల్పన దిశగా చర్చించారు.

సాక్షి ప్లస్
మంగళవారం ॥ 22-10-2024



ఇటీవల గుండె జబ్బుల తర్వాత చాలామందికి స్టెంట్ వేయడం, ఇక కొందరిలోనైతే బైపాస్ అని పిలిచే సీఏబీజీ సర్జరీ చేయాల్సి రావడం మామూలే. గుండెకు నిర్వహించే ఇలాంటి ప్రొసిజర్ తర్వాత, ఆ బాధితుల్ని ఎప్పట్నుంచి నార్మల్‌గా పరిగణించవచ్చు, లేదా ఎప్పట్నుంచి వారు తమ రోజువారీ పనులు చేసుకోవచ్చు అన్న విషయాలు తెలుసుకుందాం...

• గుండె కలుక్కుమనొద్దు

స్టెంటేశాక రెస్టెంత? బెస్టెంత?

నిజానికి ఓ ప్రొసిజర్ తర్వాత నార్మల్ కావడం అన్నది వారివారి శరీర ధర్మం, ఫిట్‌నెస్, గాయం పూర్తిగా తగ్గేందుకు పట్టే సమయం... ఇలా అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. కానీ సగటు కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే... తమ ఫిట్‌నెస్, తమ పనులు ఇక తాము చేసుకోగలమనే ఆత్మవిశ్వాసాన్ని బట్టి ఈ సమయం కాస్త అటు ఇటుగా ఉంటుందని తెలుసుకోవాల్సి ఉంటుంది.

సాధారణంగా సర్జరీ జరిగినప్పుడు వీలైనంత తర్వాత సాధారణ స్థితికి రావాలని బాధితులందరికీ ఉంటుంది. అంతేకాదు... గాయమంతా పూర్తిగా మానేవరకు అందరూ విశ్రాంతి తీసుకుంటూ ఉండరు. అంతకంటే చాలా ముందుగానే... అంటే 80 శాతం తగ్గేనాటికే తమతమ మామూలు పనులు మొదలుపెట్టేస్తుంటారు. బాధితులు తమ ప్రొసీజర్ అయిన ఆరు వారాల తర్వాత నుంచి నిరభ్యంతరంగా పనులు మొదలు పెట్టవచ్చు. అయితే అప్పటికి తగ్గింది కేవలం 80శాతం మాత్రమే కావడం వల్ల కొన్ని బరువైన పనులు చేయడం మాత్రం అంత మంచిది కాకపోవచ్చు.

డిశ్చార్జీ అయిన ఆరువారాల తర్వాతి నుంచి...

చేయదగిన పనులు : • తేలికపాటి నడక / (వాకింగ్) • బట్టలు ఉతకడం (మెషీన్ ఉపయోగించి మాత్రమే) • శ్రమలేనంతవరకు అంట్లు తోముకోవడం / పాత్రలు శుభ్రం చేసుకోవడం • శ్రమ లేనంతవరకు వంట చేసుకోవడం • శ్రమ లేనంతవరకు / తేలికపాటి శారీరక శ్రమతో ఇల్లు శుభ్రం చేసుకోవడం • శ్రమ లేనంతవరకు మెట్లు ఎక్కడం (ఈ ప్రక్రియలో శ్రమగా అనిపించినా / ఆయాసం వచ్చినా మళ్లీ ఈ పని చేయకూడదు. ఆమాటకొస్తే... శ్రమ అనిపించిన లేదా ఆయాసంగా అనిపించిన ఏ పనినైనా బలవంతంగా చేయకూడదని గుర్తుంచుకోవాలి).

చేయకూడని పనులు : • బరువైనవి ఎత్తడం (ప్రధానంగా 5 కిలోలకు మించినవేవీ ఎత్తడం సరికాదు) • బరువైన వాటిని అటు ఇటు లాగడం లేదా తోయడం • వాహనం నడపడం.

ఎనిమిది వారాల తర్వాత : • మనకు జరిగిన ప్రొసిజర్‌లో... శస్త్రచికిత్సలో భాగంగా ఎదురొమ్ము ఎముకకు గాటు పెట్టి విడదీసి ఉంటే... అది ఆరు నుంచి ఎనిమిది వారాల నాటికి 80 శాతం తగ్గుతుంది. ఆరు / ఎనిమిది వారాలు దాటాక వాహనాన్ని నడపడం (డ్రైవింగ్) మొదలుపెట్టవచ్చు.
• మనం చేసే పని భౌతికమైన శ్రమతో కూడుకున్నది కాకపోతే మన వృత్తులకు / కార్యాలయానికి వెళ్లవచ్చు.

ఆరు వారాలు దాటాక మళ్లీ యథాతథ స్థితిలోకి వచ్చేందుకు అవసరమైన కార్యకలాపాలు చేయడానికి (కార్డియాక్ రీహ్యాబిలిటేషన్‌కు) ఇది అనువైన సమయమని తెలుసుకోవాలి. ఈ సమయంలో గుండెపై ఒత్తిడి పడకుండానే... దాని పనితీరు / సామర్థ్యం (ఎండ్యూరెన్స్) పెంచుకునే వ్యాయామాలు మొదలుపెట్టాలి. అలా తేలిగ్గా మొదలుపెట్టి శ్రమతెలియనంత వరకు ఆ వ్యాయామాల తీవ్రతను పెంచుకుంటూ పోవచ్చు. శ్రమ అనిపించగానే మళ్లీ తగ్గిస్తూ... అలా క్రమంగా మీ యథాపూర్వక స్థితిలోకి వెళ్లడం మంచిది. ఇది చేస్తున్న క్రమంలో మనకు ఏ శ్రమ తెలియకపోతే... మనం అన్ని పనులూ ఎప్పుడెప్పుడు చేయవచ్చో మనకే క్రమంగా అర్థమవుతూ ఉంటుంది.

పది, పన్నెండు వారాల తర్వాత

అది శస్త్రచికిత్సా / మరో ప్రక్రియా... అది ఏదైనప్పటికీ... పది, పన్నెండు వారాలు గడిచాక... అంతకు మునుపు చేసిన పనులన్నీ ఎలాంటి శ్రమ లేకుండా చేయగలుగుతుంటే... ఆపై ఇక నిర్భయంగా... తేలికపాటి పరుగు (జాగింగ్), టెన్నిస్ లాంటి ఇతరత్రా ఆటలు ఆడుకోవచ్చు. (అయితే ఆడే సమయంలో శ్రమ ఫీల్ అవ్వకుండా తేలిగ్గా చేయగలిగితేనే ఆ పనులు కొనసాగించాలి).

రోజూ 30 నిమిషాల చొప్పున కనీసం వారంలో ఐదు రోజులు వ్యాయామాలు చేయాలి. దాని గుండెకు తగినంత బలం చేకూరి... దీర్ఘకాలంలో మేలు జరుగుతుంది.

మానడానికి టైమ్ ఇవ్వండి :

ఏదైనా గాయం మానడానికి పట్టే సమయం... ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. అందుకే ఏ కొద్దిపాటి శ్రమ అనిపించినా మళ్లీ తేలికపనులకు వచ్చేసి మళ్లీ శ్రమ కలిగించే పనులవైపునకు మెల్లగా క్రమక్రమంగా వెళ్తుండాలి. బాధితులకు డయాబెటిస్ లేదా ఇతరత్రా ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే గాయం మానడం మరింత ఆలస్యమవుతుంది. అందుకే ఆరువారాల సమయాన్ని ఒక సాధారణ ప్రామాణిక సమయంగా మాత్రమే పరిగణించాలి. ఎవరిలోనైనా ఏదైనా గాయం పూర్తిగా అంటే 100 శాతం మానడానికి కనీసం ఏడాది సమయం తీసుకుంటుందని గుర్తుంచుకోవాలి. అందుకే ఏదైనా పనిని చేయడచ్చా లేదా అన్న విషయాన్ని ఎవరికి వారు తెలుసుకోడానికి ఉన్న ఒకే ఒక మార్గం... 'ఆ పనిని తేలిగ్గానే చేయడానికి సాధ్యమవుతోందా, లేదా' అనే విషయాన్ని చూసుకోవాలి. అలా ఏదైనా పని చేస్తున్నప్పుడు నొప్పి అనిపించినా, ఆయాసం వచ్చినా లేదా గాయం వద్ద అసౌకర్యంగా ఉన్నా ఆ పనిని వెంటనే ఆపేయాలి.

ఏదైనా పని సరికాదని గుర్తుపట్టడం ఎలా?

• అసాధారణమైన / తట్టుకోలేనంతగా నొప్పి వచ్చినప్పుడు • ఏదైనా పనిచేస్తున్నప్పుడు ఎదుర్రొమ్ము వద్ద 'కలుక్కు'మని అనిపించినా లేదా అలాంటి శబ్దం వచ్చినా • ఏదైనా పనిచేస్తున్నప్పుడు ఎదుర్రొమ్ము గాయం ఎర్రబారినా లేదా ఆ గాయం నుంచి స్వల్పంగానైనా రక్తం / చీము లాంటి స్రావాలు వస్తున్నా • దగ్గినప్పుడు 'కలుక్కు'మన్నా • సుదీర్ఘంగా శ్వాస తీసుకున్నప్పుడు 'కలుక్కు'మన్నా.

(ఇలా జరిగినప్పుడు ఎదుర్రొమ్ముకు వేసిన కుట్లు తెగాయేమోనని అనుమానించి, వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షింపజేసుకోవాలి).

ఈ విషయాలన్నింటినీ ఎవరికి వారు గమనించుకుంటూ స్వీయ పరిశీలన ద్వారా రొటీన్ పనుల్లోకి క్రమక్రమంగా ప్రవేశించాలి.

మెడ పట్టేసిందా?



చాలామందికి నిద్రలోగాని, లేదా ప్రయాణంలో గానీ లేదా సుదూర ప్రయాణాల తర్వాత గాని మెడ పట్టుకుంటుంది. ఇలా మెడ పట్టేయడాన్ని ఇంగ్లిష్‌లో రై నెక్ (wry neck) అంటారు. ఇలా మెడ పట్టేస్తే, నిద్రలో దానంతట అదే వదిలేస్తుందని, లేదా తలదిండు తీసేసి పడుకోవడం వల్ల త్వరగా తగ్గుతుందని అనుకుంటారు. ఇది అపోహ మాత్రమే. మెడపట్టేసినప్పుడు ఆ పరిస్థితి త్వరగా సర్దుకునేందుకు పాటించాల్సిన సూచనలివి...

• మెత్తటి టవల్‌ను తీసుకుని, దాన్ని గుండ్రంగా చుట్టి (రోల్ చేసుకుని) మెడ కింద దాన్ని ఓ సపోర్ట్‌గా పెట్టుకోవాలి. లేదా తలగడనే భుజాల వరకు లాగి పడుకోవాలి. అంటే తలగడ అన్నది కేవలం తలకు మాత్రమే కాకుండా... భుజాలకు కూడా సపోర్ట్ ఇచ్చేలా అమర్చుకోవాలి. దీనివల్ల మెడ నొప్పి ఒకటి రెండు రోజుల్లో తగ్గుతుంది.
• వ్యాయామాలు చేసేవారు మెడకు సంబంధించిన ఎలాంటి ఎక్సర్‌సైజ్ చేయకూడదు. పైగా మెడ పరిస్థితి సర్దుకునేందుకు ఎలాంటి వ్యాయామాలూ చేయకూడదు. ఇలా చేస్తే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది.
• కుడి చేత్తోగాని లేదా ఎడమ చేత్తో గానీ ఐదు కిలోలకు మించి బరువు అకస్మాత్తుగా గబుక్కున ఎత్తకూడదు. అంతకు మించిన బరువులు అసలే ఎత్తకూడదు.
• కొందరు సెలూన్ షాప్‌లో మెడను రెండుపైపులా అకస్మాత్తుగా కటకటమని శబ్దం వచ్చేలా విరిచేస్తున్నట్లుగా తిప్పేస్తుంటారు. ఇలాంటి మొరటు పద్ధతుల్ని ఏమాత్రం అనుసరించకూడదు. దీనివల్ల పరిస్థితి మరింతగా ప్రమాదకరంగా మారవచ్చు.
• నొప్పి మరీ ఎక్కువగా ఉంటే పారాసిటమాల్ లేదా ప్రమాదం లేని నొప్పినివారణ మందును రెండు రోజుల కోసం మాత్రమే వాడాలి. సాధారణంగా రెండు రోజుల్లో తగ్గిపోయే ఈ సమస్యతో అప్పటికీ ఉపశమనం కలగకపోతే అప్పుడు డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి.



కంటిపై సోరియాసిస్ ప్రభావం!

ఒళ్లంతా పొడిబారిపోయి చర్మంపైనుండే కణాలు పొట్టులా రాలిపోయే చర్మవ్యాధి సోరియాసిస్ గురించి తెలియనివారుండరు. తమ సొంత వ్యాధినిరోధక వ్యవస్థ తమ సొంత కణాలపైనే ప్రతికూలంగా పనిచేయడం (ఆటో ఇమ్యూన్ డిసీజ్) వల్ల ఇలా పొట్టురాలిపోతూ ఉంటుంది. చర్మవ్యాధిగానే చూసే దీని ప్రతికూల ప్రభావాలు కొంతవరకు కంటిపైనా ఉంటాయి. అదెలాగో చూద్దాం.

ఈ జబ్బు ఉన్నవాళ్లలో కంటికి సంబంధించిన కొన్ని సమస్యాత్మక కండిషన్లు తలెత్తవచ్చు. అవి...
- కంటిలోని ఐరిస్, కోరాయిడ్, సీలియరీ బాడీ అనే నల్లపొరలో ఇన్‌ఫ్లమేషన్ (మంట, వాపు) రావచ్చు. (ఇలా జరగడాన్ని 'యువైటిస్' అంటారు).
- కార్నియాకు ఇన్‌ఫ్లమేషన్ రావచ్చు (కెరటైటిస్).
- కంజెంక్టివా అనే పొరకు ఇన్ఫెక్షన్ (కంజంక్టివైటిస్) వచ్చే అవకాశాలున్నాయి.
- కన్ను పొడిబారడం (డ్రై ఐ) వంటి సమస్యలూ రావచ్చు.

జాగ్రత్తలు / చికిత్స : గతంతో పోలిస్తే ఇప్పుడు సోరియాసిస్‌కు అత్యంత అధునాతనమైన చికిత్స ప్రక్రియలు అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు పూవా, గతంలో మాదిరిగా అల్ట్రావయొలెట్ రేడియేషన్ కిరణాలతో ఇచ్చే చికిత్సలు, ఇమ్యూనోమాడ్యులేటర్స్ తరహా ఆధునిక చికిత్సలతో సోరియాసిస్‌ను వీలైనంతగా అదుపులో పెట్టడం సాధ్యమవుతోంది. పైన పేర్కొన్న కంటికి సంబంధించిన లక్షణాలు కనిపించినప్పుడు సోరియాసిస్‌కు చికిత్సలు తీసుకుంటూనే... ఒకసారి కంటి వైద్యుడిని కూడా సంప్రదించడం చాలా అవసరం.

డార్క్ చాక్లెట్స్‌తో గుడ్ మూడ్స్... గుడ్ హెల్త్!



డార్క్ చాక్లెట్లు గుండెకు మేలు చేస్తాయనేది ఇప్పటికే పలు పరిశోధనల్లో తెలిసింది. అదే విషయం దక్షిణ-కొరియన్ పరిశోధనల్లో మరోసారి వెల్లడైంది. చాక్లెట్స్‌లోని కొన్ని పోషకాలు గట్ బ్యాక్టీరియా / గట్ మైక్రోబియమ్ పెంచడం వల్ల మంచి వ్యాధి నిరోధకత పెరుగుతుందనీ, అలాగే... తక్కువ మోతాదులో చక్కెర ఉండే డార్క్ చాక్లెట్స్ తినేవారిలో వాటిలో ఉండే ఫైబర్, ఐరన్‌తో పాటు ఫైటోకెమికల్స్ వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు, మతిమరపు (డిమెన్షియా), ఆర్థరైటిస్, గుండెజబ్బులు, పక్షవాతం వంటి అనేక ఆరోగ్య సమస్యల నివారణ జరుగుతుందంటూ దక్షిణకొరియాలోని సియోల్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన కాలేజ్ ఆఫ్ హ్యూమన్ ఎకాలజీలోని ఫుడ్ అండ్ న్యూట్రిషన్ విభాగం నిర్వహించిన పరిశోధనల్లో వెల్లడైంది. అంతేకాదు... డార్క్ చాక్లెట్లు మూడ్స్‌ను బాగుపరచి తినేవారు ఉల్లాసంగా, ఆహ్లాదంగా ఉంచేందుకు సహాయపడతాయని తేలింది. ఇక డార్క్‌చాక్లెట్స్ తినేవారి మల పరీక్షల్లో తేలిన విషయం ఏమిటంటే... వాళ్ల పేగుల్లో 'బ్లావుషియా' అనే ప్రోబయాటిక్ బాక్టీరియా కారణంగానే కడుపు ఆరోగ్యం బాగుండటంతో పాటు వాళ్ల మూడ్స్ మరింత మెరుగయ్యాయని తేలింది. ఈ ఫలితాలన్నీ ''ద జర్నల్ ఆఫ్ న్యూట్రిషనల్ బయోకెమిస్ట్రీ'' అనే మెడికల్ జర్నల్‌లోనూ ప్రచురితమయ్యాయి.

ఇటీవల వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. వాతావరణపు నాణ్యతను 'ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్' అనే సూచికతో నిర్ణయిస్తారు. సంక్షిప్తంగా 'ఏక్యూఐ' అంటూ పిలిచే వాతావరణ నాణ్యత బాగుంటే మన ఆరోగ్యాలూ బాగుంటాయి. వాతావరణ కాలుష్యం పెరుగుతున్న కొద్దీ... అంటే ఏక్యూఐ తగ్గుతున్న కొద్దీ ఊపిరితిత్తులకు సంబంధించిన అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. ఇలా వాతావరణపు నాణ్యత తగ్గడం వల్ల వచ్చే వ్యాధుల్లో ముఖ్యమైనది 'రియాక్టివ్ ఎయిర్‌వేస్ డిస్‌ఫంక్షన్ సింద్రోమ్ (ర్యాడ్స్). ఈ ర్యాడ్స్ గురించి తెలుసుకుందాం.

• లంగ్స్ కాలుష్యం మంటొద్దు

బ్యాడ్ ఎయిర్ ర్యాడ్స్ ఫైర్...



వాయు కాలుష్యం లేదా వాతావరణంలో సరిపడని పదార్థాలతో ఆస్తమా లాంటి జబ్బులు వస్తాయన్న విషయం తెలిసిందే. కానీ అందరికీ అంతగా తెలియని, ఆస్తమాలాగే అనిపించే మరో జబ్బే 'రియాక్టివ్ ఎయిర్‌వేస్ డిస్‌ఫంక్షన్ సింద్రోమ్' (ర్యాడ్స్). ఇందులోనూ ఆస్తమాలోలాగే దగ్గు ఆయాసం వస్తుంటాయి. అయితే ఈ వ్యాధి లక్షణాలలో ప్రధానంగా పొడిదగ్గు కనిపిస్తుంటుంది.

ర్యాడ్స్ ముప్పు ఎక్కడెక్కడంటే...

గతంతో పోలిస్తే ఇటీవల ఇది ఎక్కువగా కనిపిస్తోంది. వాతావరణ కాలుష్యం ఎక్కువగా ఉండే పారిశ్రామిక వాడలతో పాటు కాలుష్యం ముప్పు పెరుగుతున్న కొద్దీ నివాసప్రాంతాల్లోనూ ఇది కనిపిస్తోంది.

పారిశ్రామిక ప్రాంతాల్లో ఎక్కడైనా ప్రమాదాలు జరిగినప్పుడల్లా ర్యాడ్స్ తన ప్రతాపం చూపుతుంటుంది. ఉదాహరణకు... చాలా ఏళ్ల కిందట భోపాల్‌లో మిథైల్ ఐసోసయనేట్ విషవాయువుల లీకేజీ జరిగినప్పుడు ఆ ప్రమాదం దాదాపు రెండువేల మంది ప్రాణాలను తీసుకుంది. నేరుగా విషవాయువులు పీల్చడం మాట అటుంచి... ఆ వాయువుల ప్రభావంతో పల్మునరీ కణజాలంలో వాపు (పల్మునరీ ఎడిమా)తో పాటు 'ర్యాడ్స్' వ్యాధి కూడా అక్కడి మరణాలకు ఓ ప్రధాన కారణం. కేవలం పారిశ్రామిక ప్రమాదాలే కాకుండా రైతులు వేసే మంటలు కూడా ఈ వ్యాధికి కారణమవుతాయి. దీనికి ఉదాహరణ చెప్పాలంటే... కొన్నాళ్ల కిందట పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో గోధుమ పంట కోతల తర్వాత మిగిలిపోయిన గడ్డిని కాల్చినప్పుడు ఢిల్లీలోని వాతావరణం భారీగా కలుషితమైపోయి, పట్టపగలు సైతం వీధులూ, రోడ్లూ కనిపించనంతటి దట్టమైన కాలుష్యం పేరుకుపోయిన సంగతి చాలామందికి తెలిసిందే. ఇలాంటి కాలుష్య వ్యాప్తి సందర్భాల్లోనూ ర్యాడ్స్ విజృంభించింది. అలాగే కొన్ని మిల్లుల నుంచి క్లోరిన్ గ్యాస్ విడుదలైనప్పుడూ ర్యాడ్స్ తన ప్రతాపం చూపింది. అనేక అధ్యయనాల ప్రకారం అలాంటి ప్రమాదాలు చోటు చేసుకున్న అనేక ప్రాంతాల్లో ర్యాడ్స్ విజృంభించింది.

కేవలం పారిశ్రామిక ప్రమాదాలప్పుడే కాకుండా వాతావరణం బాగా కలుషితమైనప్పుడు కూడా ఇది కనిపిస్తుండటం మామూలే. మరి వాతావరణం కలుషితమైనట్లు ఎలా నిర్ణయిస్తారో చూద్దాం.

కాలుష్య తీవ్రత తెలుసుకోవడం ఇలా...

వాతావరణపు నాణ్యతను ఈ కింద పేర్కొన్న ఐదు అంశాలు నిర్ణయిస్తాయి. అవి...

1) కింది వాతావరణంలో ఉండే ఓజోన్ (గ్రౌండ్ లెవల్ ఓజోన్)

2) గాలిలో ఉండే రేణువులు (పార్టిక్యులేట్ మ్యాటర్ - పీఎం). (గాలిలో ఓ మోస్తరు సన్నటివి మొదలుకొని, అతి సన్నగా ఉండే రేణువులు ఉంటాయి. ఉదాహరణకు 10 మైక్రాన్ల సైజు మొదలుకొని 2.5 మైక్రాన్ల సైజు వరకు).
3) కార్బన్ మోనాక్సైడ్ 4) సల్ఫర్ డై ఆక్సైడ్
5) నైట్రోజన్ డై ఆక్సైడ్

గాలి/వాతావరణ నాణ్యత తాలూకు ప్రామాణికతను నిర్ణయించేందుకు... ఏఐక్యూ స్కేల్ మీద 0 - 500 వరకు కొలత ఉంటుంది. ఉదాహరణకు ఆ కొలత 0 - 50 వరకు ఉంటే అక్కడి గాలి నాణ్యత 'చాలా బాగుంద'ని చెప్పుకోవచ్చు. అదే 51 - 100 ఉంటే 'ఓ మోస్తరు'గా ఉందని చెబుతారు. ఇక ఆ కొలత 100కు పైగా ఉంటే అది ఆరోగ్యానికి అంత మంచిది కాదని చెప్పవచ్చు. గాలి కాలుష్యాల తీవ్రత 100కు మించి ఉన్నప్పుడు... వాతావరణంలోని చిన్నపాటి తేడాలకే స్పందించేవారి ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలు ఎక్కువ. ఒకవేళ ఆ కొలతగానీ 300కి మించితే అది ఎవరికైనా ప్రమాదకరం అని చెప్పవచ్చు.

గాలిలోని కాలుష్యం తీవ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు అవి యుక్తవయస్కులు (అడల్ట్స్) మొదలుకొని అందరిలోనూ శ్వాస, గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతాయి. ఉదాహరణకు 2012లో జరిగిన కొన్ని సైంటిఫిక్ అధ్యయనాల ప్రకారం... కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ వంటి కాలుష్యాల వల్ల గుండెపోటు వచ్చే ముప్పు 4.5% అధికంగా ఉంటుందని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2016లో వెలువరించిన ఓ నివేదిక ప్రకారం ఆ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 42 లక్షల మరణాలు కేవలం వాయుకాలుష్యం కారణంగానే జరిగాయంటూ పేర్కొంది.

పిల్లలకూ తప్పని కాలుష్య కాటు...

చిన్నారుల్లో దీని ప్రభావం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశాలుంటాయి. కాలుష్య తీవ్రత ఎక్కువగా ఉన్న చోట్లలో నివసించే పిల్లల్లో లంగ్స్, మెదడు ప్రభావితమైనందున శిశుమరణాల రేటూ పెరుగుతోందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. అంతేకాదు... చిన్నపిల్లల్లో వచ్చే ఆస్తమా కారణంగా ఆ ముప్పు మరింత ఎక్కువగా ఉంటుంది అని కొన్ని నివేదికలు వెల్లడిస్తున్నాయి. యూనిసెఫ్ నివేదికల ప్రకారం... దాదాపు 30 కోట్ల మంది పిల్లల వాతావరణ పరంగా అత్యంత ప్రమాదకరమైన కాలుష్య ప్రాంతాల్లో నివసిస్తున్నారు. దిగ్భ్రాంతి కలిగించే వాస్తవం ఏమిటంటే... ఇందువల్ల ఏటా ఆరు లక్షల మంది ఐదేళ్లలోపు పిల్లలు ఊపిరితిత్తుల వ్యాధుల బారినపడుతున్నారని అంచనా.

ర్యాడ్స్ నిర్ధారణ ఇలా : ఛాతీ ఎక్స్-రే, స్పైరోమెట్రీ, రక్త పరీక్షలతో 'ర్యాడ్స్'ను నిర్ధారణ చేస్తారు.

చికిత్స : కాలుష్యానికి గురికాకుండా ఉండటమే 'ర్యాడ్స్'కు ప్రధాన చికిత్స. ఒకవేళ కాలుష్యానికి గురైతే గ్లూకోకార్టికాయిడ్స్, బ్రాంకోడయలేటర్స్ వాడుతూ ఆస్తమా తరహాలోనే దీనికి చికిత్స అందించాల్సి ఉంటుంది.

బిజినెస్ రీల్

ఎస్‌ఎంపీపీ రూ.4,000 కోట్ల ఐపీవో

న్యూఢిల్లీ: రక్షణ రంగానికి అవసరమైన విడిభాగాల తయారీలో ఉన్న ఎస్‌ఎంపీపీ ఐపీవోకు వస్తోంది. రూ.4,000 కోట్ల నిధులను సమీకరించనుంది. ఈ మేరకు సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. ఇందులో ఫ్రెష్ ఇష్యూ రూ.580 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూ.3,420 కోట్లు ఉంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా అందుకున్న మొత్తంలో రూ.437 కోట్లను మూలధన వ్యయాలకు వినియోగిస్తారు. ఇందులో భాగంగా భవనాల నిర్మాణం, స్థలం అభివృద్ధి, ప్రతిపాదిత ఆయుధ తయారీ కేంద్రం ఏర్పాటుకై ప్లాంట్, మెషినరీ కొనుగోలుకు వెచ్చిస్తారు.

లెండింగ్‌కార్ట్‌లో టెమసెక్ మరింత వాటా

ముంబై: నియంత్రిత వాటా కోసం మరో రూ.252 కోట్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు టెమసెక్ కట్టుబడి ఉందని డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ లెండింగ్‌కార్ట్ తెలిపింది. సింగపూర్‌కు చెందిన టెమసెక్ కంపెనీ అయిన ఫులటన్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు లెండింగ్‌కార్ట్‌లో ఇప్పటికే 38.16 శాతం వాటా ఉంది. నాలుగేళ్ల క్రితం లెండింగ్‌కార్ట్ తన చివరి నిధుల రౌండ్‌లో 350 మిలియన్ డాలర్ల విలువను కలిగి ఉంది. నగదు కొరత కారణంగా ప్రస్తుతం కంపెనీ విలువను 100 మిలియన్ డాలర్లుగా లెక్కించారు.

సహకరిస్తే.. రుణాలు తీర్చేయడానికి సిద్ధమే: రవీంద్రన్

న్యూఢిల్లీ: రుణదాతలు తమకు సహకరించేందుకు ముందుకు వస్తే .. తాను పైసా తీసుకోవడానికి ముందే రుణాలన్నింటినీ తీర్చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ వ్యవస్థాపకుడు బైజూ రవీంద్రన్ చెప్పారు. కంపెనీకి వ్యతిరేకంగా వేసిన దివాలా పిటీషన్ కొనసాగిన పక్షంలో రుణదాతలకు వచ్చేదేమీ ఉండదని దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన మీడియా సమావేశంలో ఆయన తెలిపారు. ఇప్పటికే 140 మిలియన్ డాలర్లు చెల్లించినప్పటికీ రుణదాతలు మొత్తం 1.2 బిలియన్ డాలర్లు కావాల్సిందేనని పట్టుబడుతున్నారని రవీంద్రన్ చెప్పారు. అయితే, ఆ మొత్తాన్ని అప్పటికే తాము ఇన్వెస్ట్ చేసేయడం వల్ల కొన్నాళ్లు పోతే గానీ పూర్తిగా చెల్లించలేని పరిస్థితి నెలకొందని తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-10-2024	
విశాఖ	530-00
చిత్తూరు	558-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

నేటి బోర్డు సమావేశాలు

బజాజ్ ఫైనాన్స్, జొమాటో, పేటీఎం, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, వరుణ్ బేవరేజెస్, మాక్స్ ఫైనాన్షియల్, ఎంఅండ్‌ఎం ఫైనాన్షియల్, జెన్సార్ టెక్నాలజీ, సిగ్నిటి టెక్, కోఫోర్జ్ లిమిటెడ్, పెర్సిస్టెంట్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ, ఒలక్ట్రా గ్రీన్‌టెక్, మజగాన్ షిప్‌బిల్డర్స్, జిందాల్ హోటల్స్, పవర్ గ్రిడ్, కెన్ ఫిన్ హోమ్స్, ధనలక్ష్మీ బ్యాంక్, కజారియా సిరామిక్, ఎస్ఆర్ఎఫ్, పరాగ్ డ్రగ్స్, షావర్స్ స్టాప్, శాంతి గేర్స్.

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	10,501.00	4.34
HDFCBANK	1,725.00	2.57
ASIANPAINT	3,043.00	1.7
M&M	2,998.95	1.17
EICHERMOT	4,798.10	0.68

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	1,015.90	-7.08
KOTAKBANK	1,782.50	-4.73
BAJAJFINSV	1,758.55	-3.37
BPCL	331	-3.36
INDUSINDBK	1,306.45	-3.03

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,641
ఎన్‌ఎస్‌ఈ	1,02,476
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,51,988
ఎఫ్‌ఐఐ	- 2,265
డీఐఐ	+ 3,226

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.14	$ 60.69
బ్రెంట్	74.36	$ 73.06

ప్రపంచ వృద్ధికి కీలకం.. ఏఐ

మంచిని వాడుకోవాలి, చెడు నుంచి సమాజాన్ని కాపాడుకోవాలి ● భారతి గ్రూప్ చైర్మన్ సునీల్ మిట్టల్



న్యూఢిల్లీ: రానున్న రోజుల్లో ప్రపంచ ఎకానమీ వృద్ధికి, భౌగోళిక రాజకీయాలకు కృత్రిమ మేధ (ఏఐ) కీలక చోదకశక్తిగా ఉంటుందని భావిస్తున్నట్లు భారతి గ్రూప్ చైర్మన్ సునీల్ మిట్టల్ అభిప్రాయపడ్డారు. ఏఐని ఉపయోగించుకోలేని కంపెనీలు, దేశాలు వెనుకబడిపోతాయని వ్యాఖ్యానించారు. ''ఈ కొత్త టెక్నాలజీలో మంచి, చెడూ రెండూ ఉన్నాయి. దీనితో కొత్త సవాళ్లు కూడా పొంచి ఉన్నాయి. ఇది దుర్వినియోగమయ్యే అవకాశాలు కూడా ఉన్నందున మరింత అప్రమత్తంగా వ్యవహరించాయి'' అని చెప్పారాయన. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక అనుభవాన్ని ఆయన తెలియజేస్తూ... ''దుబాయ్‌లోని మా సీనియర్ ఫైనాన్షియల్ అధికారికి నా గొంతును అనుకరిస్తూ, భారీ మొత్తంలో నగదును ట్రాన్స్‌ఫర్ చేయాలంటూ ఒక ఫేక్ కాల్ వెళ్లింది. ఆ అధికారి అప్రమత్తంగా వ్యవహరించి, ఫ్రాడ్‌ను వెంటనే గుర్తించడంతో ముప్పు తప్పింది. ఆ వాయిస్ రికార్డింగ్ విన్నప్పుడు అది అచ్చం నా గొంతులాగే ఉండటం నన్ను ఆశ్చర్యపర్చింది' అని చెప్పారు.

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇందులోని మంచిని వాడుకోవాలని, చెడు కోణం వల్ల తలెత్తే దుష్ప్రభావాల నుంచి సమాజాన్ని కాపాడుకోవాలని మిట్టల్ చెప్పారు. అయితే, మొత్తం మీద కృత్రిమ మేధతో ఒనగూరే ప్రయోజనాలపై తాను ఆశావహంగా ఉన్నట్లు ఒక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన వివరించారు. వ్యాపారాలపరంగా చూస్తే రొటీన్‌గా, పునరావృతమయ్యే విధులను నిర్వర్తించే ఉద్యోగాల్లో ఏఐ వల్ల కోత ఉంటోందని, కానీ వాటికి సమానంగా కొత్త ఉద్యోగాలు కూడా వస్తున్నాయని మిట్టల్ వివరించారు. కాల్ సెంటర్లు, వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్ మొదలైన వాటిలో ఏఐతో గణనీయంగా మార్పులు వస్తున్నాయని తెలిపారు. కృత్రిమ మేధ రాకతో కొత్త ఆలోచనలు, కొత్త ఐడియాలు రాగలవని, వాటి నుంచి కొత్త వ్యాపారాలు, కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని మిట్టల్ ధీమా వ్యక్తం చేశారు.

ఆదాయం పెరగాలి

దేశీయంగా టెలికం మౌలిక సదుపాయాలపై మరింతగా ఇన్వెస్ట్ చేయాలంటే సగటున యూజర్లపై వచ్చే ఆదాయం (ఏఆర్‌పీయూ) ఇంకా పెరగాల్సి ఉంటుందని మిట్టల్ చెప్పారు. ఇటీవలి పెంపు తర్వాత 2.5 డాలర్ల స్థాయిలో స్థిరపడిన ఏఆర్‌పీయు 5 డాలర్లకు చేరాల్సి ఉంటుందన్నారు. మరోవైపు, ఎడారులు, అడవులతో నిండిపోయిన 25 శాతం భూభాగంలో ఉంటున్న 5 శాతం జనాభాకు ఇంకా ఇంటర్నెట్ కనెక్టివిటీ లేదని మిట్టల్ చెప్పారు. అలాంటి ప్రాంతాల్లో కూడా ఇంటర్నెట్ కనెక్టివిటీని అందించేందుకు శాటిలైట్ కమ్యూనికేషన్ ఒక 'మ్యాజిక్ బులెట్'గా పనిచేస్తుందని పేర్కొన్నారు.

'తయారీ'లో మరిన్ని ఆవిష్కరణలు రావాలి: భారత్ ఫోర్జ్ కల్యాణి



2047 నాటికి సంపన్న దేశంగా ఎదగాలని భారత్ నిర్దేశించుకున్న నేపథ్యంలో గణనీయంగా వృద్ధి సాధించాలంటే తయారీ రంగంలో కొత్త ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణి తెలిపారు. కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టాలంటే నవకల్పనలు అత్యంత కీలకమని, నూతన సాంకేతికతలను స్థానికంగా అభివృద్ధి చేస్తే పరిశ్రమకు దన్నుగా ఉంటుందని పేర్కొన్నారు. 'విదేశాల్లో తయారైన వాటిని కాపీ కొట్టడం కాకుండా మనం కూడా టెక్నాలజీలో కొత్త ఆవిష్కరణలను రూపొందించాలి. ఇతర దేశాలు మన నుంచి కాపీ కొట్టేలా మన సొంత ఉత్పత్తులను తయారు చేయాలి' అని కల్యాణి చెప్పారు. ఏఐతో ఉత్పాదకత, సమర్థత, ఉత్పత్తుల నాణ్యత మెరుగుపడగలదన్నారు.

వైద్య విధానాల్లో వినూత్నత: అపోలో హాస్పిటల్స్ ఎండీ సునీత రెడ్డి



వైద్యానికి సంబంధించి ప్రస్తుత టెక్నాలజీలను మరింత మందికి చేరువ చేసేందుకు వైద్య విధానాల్లో వినూత్నమైన ఆవిష్కరణలు అవసరమని అపోలో హాస్పిటల్స్ ఎండీ సునీత రెడ్డి చెప్పారు. విదేశీ అధ్యయనాలపై ఆధారపడకుండా దేశీయంగా ఫండమెంటల్ రీసెర్చ్ జరగాలని ఆమె పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి, ఆరోగ్య సంరక్షణ మెరుగుపడాలంటే పరిశోధనలపై గణనీయంగా వెచ్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జీడీపీలో ఒక్క శాతం కన్నా తక్కువే వెచ్చిస్తున్నామని సునీత రెడ్డి తెలిపారు. మరోవైపు, పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే సంచలనాత్మక మార్పులు కీలకమని డీసీఎం శ్రీరామ్ సీఎండీ అజయ్ శ్రీరామ్ చెప్పారు. జనధన యోజన, ఆధార్, మొబైల్ (జామ్ ట్రినిటీ) వంటి ప్రభుత్వ కార్యక్రమాలు రైతులతో కనెక్టివిటీ మెరుగుపడేందుకు గణనీయంగా తోడ్పడ్డాయని పేర్కొన్నారు. వ్యవసాయ ముడిపదార్థాలు, పనిముట్లు రైతులకు అందుబాటులోకి ఉండేందుకు ఈ-కామర్స్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.



జోరుగా విలాస ఇళ్ల విక్రయాలు

ఏడు పట్టణాల్లో 38 శాతం అధికం

- హైదరాబాద్‌లో అమ్మకాలు ఫ్లాట్
- రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్‌ఈ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా విలాస ఇళ్లకు (లగ్జరీ) డిమాండ్ బలంగా కొనసాగుతోంది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో రూ.4కోట్లకు పైగా విలువైన 12,630 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 9,165 యూనిట్లతో పోల్చి చూస్తే 38 శాతం వృద్ధి నమోదైంది. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సీబీఆర్‌ఈ విడుదల చేసింది.

ముఖ్యంగా హైదరాబాద్‌లో మాత్రం రూ.4కోట్లపైన ఖరీదైన ఇళ్ల విక్రయాలు 1,540 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో కాస్త మెరుగ్గా 1,560 యూనిట్లు అమ్ముడుపోవడం గమనార్హం.

పట్టణాల వారీగా..

- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో అత్యధికంగా 5,855 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది విక్రయాలు 3,410 యూనిట్లతో పోల్చితే 70 శాతం పెరిగాయి.
- ముంబైలో అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 3,250 యూనిట్ల నుంచి 3,820 యూనిట్లకు పెరిగాయి.
- బెంగళూరులో లగ్జరీ ఇళ్ల అమ్మకాలు 240 యూనిట్ల నుంచి 35 యూనిట్లకు తగ్గిపోయాయి.
- పుణెలో రెట్టింపునకు పైగా పెరిగి 810 యూనిట్ల మేర అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 330 యూనిట్లుగానే ఉన్నాయి.
- చెన్నైలోనూ 130 యూనిట్ల నుంచి 185 యూనిట్లకు అమ్మకాలు వృద్ధి చెందాయి.
- కోల్‌కతాలో రూ.4కోట్లకు పైన విలువ చేసే 380 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాంలో 240 యూనిట్లు అమ్ముడయ్యాయి.

ఆధునిక అపార్ట్‌మెంట్ల వైపు మొగ్గు..

''ప్రీమియం ఇళ్ల విభాగంలో డిమాండ్ పెరగడం చూస్తున్నాం. సంప్రదాయంగా మధ్యస్థ బడ్జెట్ ఇళ్ల మార్కెట్లు అయిన నోయిడా, బెంగళూరు, పుణె, చెన్నైలోనూ క్రమంగా లగ్జరీ ఇళ్ల వైపునకు వినియోగదారులు మొగ్గు చూపిస్తున్నారు. బంగళాల నుంచి ఆధునిక అపార్ట్‌మెంట్లు, పెంట్‌హౌస్‌ల వైపు మార్కెట్ మళ్లుతోంది. దీంతో లగ్జరీ ప్రాజెక్టుల్లో ప్రీమియం సౌకర్యాల కల్పన ఇతర ప్రాజెక్టులతో పోల్చితే కీలక వైవిధ్యంగా మారింది''అని సీబీఆర్‌ఈ ఇండియా చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజీన్ తెలిపారు. ఖర్చు చేసే ఆదాయం పెరగడం, సులభతర రుణ సదుపాయాలు, ఆధునిక, సకల సౌకర్యాలతో కూడిన ఇళ్లు అటు నివాసానికి, ఇటు పెట్టుబడులకు ఆకర్షణీయంగా మారినట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ప్రీమియం నివాస అనుభవం, ప్రపంచస్థాయి వసతులు మారిన కొనుగోలుదారుల ఆకాంక్షలను ప్రతిఫలిస్తున్నట్టు బెంగళూరుకు చెందిన రియల్టీ సంస్థ సుమధుర గ్రూప్ సీఎండీ మధుసూదన్ పేర్కొన్నారు.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

మహీంద్రా లాజిస్టిక్స్ లాభం డౌన్

క్యూ2లో రూ. 8.5 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ మహీంద్రా లాజిస్టిక్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 54 శాతం పతనమై రూ. 8.5 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 18.6 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 9 శాతం పుంజుకుని రూ. 1,236 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 1,136 కోట్ల టర్నోవర్ అందుకుంది.



ఫలితాల నేపథ్యంలో మహీంద్రా లాజిస్టిక్స్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.5 శాతం బలపడి రూ. 490 వద్ద ముగిసింది.

సైయంట్ డీఎల్ఎం లాభం 5 శాతం జూమ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ సైయంట్ డీఎల్ఎం సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 5.46 శాతం పెరిగి రూ.15.45 కోట్లు సాధించింది. టర్నోవర్ 33.45 శాతం ఎగసి రూ.389 కోట్లకు చేరింది. ఫలితాల నేపథ్యంలో సైయంట్ డీఎల్ఎం షేరు ధర క్రితంతో పోలిస్తే సోమవారం బీఎస్ఈలో 1.05 శాతం వృద్ధి చెంది రూ.699.15 వద్ద స్థిరపడింది.



బజాజ్ హౌసింగ్ లాభం అప్

రూ. 546 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: గృహ రుణ రంగ కంపెనీ బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 21 శాతం జంప్‌చేసి రూ. 546 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 451 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ గత నెలలోనే లిస్టయ్యింది. దీంతో తొలిసారి త్రైమాసిక ఫలితాలు వెల్లడించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 1,912 కోట్ల నుంచి రూ. 2,410 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 1,782 కోట్ల నుంచి రూ. 2,227 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 0.24 శాతం నుంచి 0.29 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.09 శాతం నుంచి 0.12 శాతానికి పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి 28.98 శాతంగా నమోదైంది.



ఫలితాల నేపథ్యంలో బజాజ్ హౌసింగ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2 శాతం నష్టంతో రూ. 137 వద్ద ముగిసింది.

ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రా @ రూ. 440-463

- ఈ నెల 25-29 మధ్య ఐపీవో
- రూ. 5,430 కోట్ల సమీకరణ

ముంబై: షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ కంపెనీ ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ ఇష్యూకి రూ. 440-463 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 25న ప్రారంభమై 29న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ. 1,250 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 4,180 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ సంస్థ గోస్వామి ఇన్‌ఫ్రాటెక్ విక్రయానికి ఉంచనుంది. వెరసి ఐపీవో ద్వారా కంపెనీ రూ. 5,430 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 32 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 600 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 320 కోట్లు దీర్ఘకాలిక మూలధన అవసరాలకు, మరో రూ. 80 కోట్లు కన్‌స్ట్రక్షన్ పరికరాల కొనుగోలుకి వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా ఐదు విభాగాలలో కార్యకలాపాలు విస్తరించింది. ఇవి.. మెరైన్ అండ్ ఇండస్ట్రియల్, సర్ఫేస్ ట్రాన్స్‌పోర్ట్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హైడ్రో, అండర్‌గ్రౌండ్, ఆయిల్ అండ్ గ్యాస్. 2024 జూన్ 30కల్లా కంపెనీ ఆర్డర్‌బుక్ విలువ రూ. 31,747 కోట్లకు చేరింది. ఈ ఏడాది తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో రూ. 3,154 కోట్ల ఆదాయం, దాదాపు రూ. 92 కోట్ల నికర లాభం ఆర్జించింది.

పీఎస్‌బీల్లో సీజీఎం పోస్టుల పెంపు

ఆర్థిక శాఖ పరిశీలనలో ప్రతిపాదన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) వ్యాపారం, లాభదాయకత పెరుగుతున్న నేపథ్యంలో వాటిల్లో చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) పోస్టులను పెంచే అంశాన్ని కేంద్ర ఆర్థిక శాఖ పరిశీలిస్తోంది. 2019 నుంచి అమలవుతున్న నిబంధనల ప్రకారం పీఎస్‌బీల్లో ఒక సీజీఎం, నలుగురు జనరల్ మేనేజర్లు ఉండొచ్చు. అప్పట్లో 10 ప్రభుత్వ రంగ బ్యాంకులను నాలుగింటిలో విలీనం చేసిన అనంతరం జీఎం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుకు మధ్య సీజీఎం పోస్టును ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నుంచి వ్యాపారం మెరుగుపడిన నేపథ్యంలో తమ వ్యాపార అవసరాలకు అనుగుణంగా పోస్టులను పెంచుకునే అవకాశాలు కల్పించాలని కేంద్ర ఆర్థిక శాఖను పీఎస్‌బీలు కొన్నాళ్లుగా కోరుతున్నాయి. దీంతో తదుపరి వృద్ధి అవకాశాలను బ్యాంకులు అందిపుచ్చుకోవడంలో తోడ్పాటు అందించే దిశగా సీజీఎం పోస్టుల పెంపు ప్రతిపాదనలను ఆర్థిక సేవల విభాగం పరిశీలిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 12 పీఎస్‌బీల్లో దాదాపు 4 లక్షల మంది ఆఫీసర్లు ఉన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల మొత్తం లాభాలు 35 శాతం పెరిగి రూ. 1.4 లక్షల కోట్ల స్థాయిని దాటాయి. ఇందులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వాటా ఏకంగా 40 శాతం పైగా (రూ. 61,077 కోట్లు) ఉంది.

లగేజీ పరిశ్రమలో స్థిరమైన డిమాండ్

- 2024-25 ఆదాయం క్షీణించొచ్చు
- గతంలో అధిక వృద్ధితో గరిష్ట బేస్
- పోటీ పెరగడంతో తగ్గిన ధరలు
- ఫలితంగా మార్జిన్లపై ప్రభావం పడొచ్చు
- క్రిసిల్ రేటింగ్స్ అంచనా

ముంబై: లగేజీ ఉత్పత్తుల పరిశ్రమలో (సంఘటిత రంగం) డిమాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024025)లో స్థిరంగా కొనసాగొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. పర్యాటకం, కార్పొరేట్ ప్రయాణాలకు డిమాండ్ కొనసాగుతుండం ఇందుకు సానుకూలంగా పేర్కొంది. అయితే పస్తుత ఆర్థిక సంవత్సరానికి సంఘటిత లగేజీ పరిశ్రమ ఆదాయం 8-10 శాతం క్షీణించొచ్చని అంచనా వేసింది. 2021-22 నుంచి 2023-24 మధ్య పరిశ్రమ పరిమాణం రెట్టింపు కావడం, అధిక బేస్ ఇందుకు కారణాలుగా పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2023-24) పరిశ్రమ 18 శాతం ఆదాయ వృద్ధిని నమోదు చేయడం గమనార్హం. ''తయారీ దారుల మధ్య పోటీ పెరిగింది. కొత్త సంస్థలు ప్రవేశించాయి. నిల్వలు మోస్తరుగా పెరగడం వంటి అంశాలతో కంపెనీలు విక్రయ ధరలను పోటాపోటీగా మార్చేశాయి. దీంతో నికరంగా విక్రయ ధరలు, ముఖ్యంగా ఎకానమీ (బడ్జెట్) విభాగంలో తగ్గాయి''అని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. 2023-24లో నిర్వహణ మార్జిన్లు 1.5 శాతం మేర తగ్గాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 0.50 శాతం వరకు క్షీణించి 13.5-14 శాతం వద్ద స్థిరపడొచ్చని అంచనా వేసింది. దేశ లగేజీ పరిశ్రమలో కేవలం కొన్ని పెద్ద సంస్థల ఆధిపత్యమే కొసాగుతున్నట్టు వివరించింది. ఇవి గత కొన్ని సంవత్సరాల్లో స్థానికంగా తయారీ సామర్థ్యాన్ని పెంచుకున్నట్టు తెలిపింది. మరోవైపు అసంఘటిత లగేజీ పరిశ్రమ ప్రధానంగా చైనా నుంచి దిగుమతులపైనే ఆధారపడినట్టు వివరించింది.

స్థానిక తయారీ..

హార్డ్ లగేజీ ఉత్పత్తుల తయారీని స్థానికంగానే చేపడుతుండడం గత ఐదేళ్లలో వీటి దిగుమతులు తగ్గుతూ వస్తున్నట్టు క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. ''హార్డ్ లగేజీకి ప్రాధాన్యం పెరుగుతుండడం, , పోటీ ధరలకే నాణ్యమైన ఉత్పత్తుల లభ్యత అన్నవి సంఘటిత రంగంలోని కంపెనీలకు అనుకూలం. ఫలితంగా దేశ లగేజీ పరిశ్రమలో సంఘటిత రంగ కంపెనీల వాటా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరకు 45 శాతానికి చేరుకుంటుంది. అదే సమయంలో రిస్కులు సైతం పెరుగుతున్నాయి. వరుసగా మూడేళ్ల పాటు డబుల్ డిజిట్ వృద్ధిని పరిశ్రమ చూసింది. అది ఇప్పుడు క్షీణిస్తోంది. కొత్త సంస్థల ప్రవేశంతో పోటీ పెరిగింది. ఇది ప్రచారంపై వ్యయాలను పెంచింది. దీంతో మార్జిన్లు మోస్తరు స్థాయికి చేరుకున్నాయి''అని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ హిమాంక్ శర్మ వివరించారు. డిమాండ్ మోస్తరు స్థాయికి దిగి రావడంతో 2024లో లగేజీ నిల్వలు 114రోజులకు (విక్రయాలకు సరిపడా) చేరాయని,



ఆర్థిక సంవత్సరం చివరికి 100-105 రోజులకు పరిమితం కావొచ్చని అంచనా వేసింది. కంపెనీల బ్యాలన్స్ షీట్లు పటిష్టంగా ఉండడం, పూర్తి సామర్థ్య వినియోగం నేపథ్యంలో సంఘటిత రంగ సంస్థలు హార్డ్ లగేజీ తయారీ సామర్థ్యాన్ని మరింత విస్తరించొచ్చని క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. ''సామర్థ్యం 25 శాతం మేర పెరగొచ్చు. ఇందుకు రూ.500-550 కోట్ల వరకు వ్యయం చేయాల్సి వస్తుంది. ఈ మొత్తాన్ని అంతర్గత వనరుల నుంచే కంపెనీలు సమకూర్చుకోవచ్చు. రుణ భారాన్ని పరిగణనలోకి తీసుకుని చూసినా వడ్డీ కవరేజీ రేషియో, నెట్‌వర్త్ పరంగా కంపెనీలు సౌకర్యంగానే ఉన్నాయి''అని క్రిసిల్ రేటింగ్స్ అసోసియేట్ డైరెక్టర్ రుషబ్ బోర్కార్ తెలిపారు.

రెన్యువబుల్స్‌లో 32 లక్షల కోట్ల పెట్టుబడులు కావాలి

2030 నాటికి ఇరెడా అంచనా

న్యూఢిల్లీ: దేశీ పునరుత్పాదక ఇంధన రంగంలో 2030 నాటికల్లా రూ. 32 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఇరెడా) సీఎండీ ప్రదీప్ కుమార్ దాస్ తెలిపారు. ఈ రంగం అవసరాలకు అనుగుణమైన ఆర్థిక సాధనాలను అందించడంపై దృష్టి పెట్టాలని రుణదాతలకు సూచించారు.

23వ ఇండియా పవర్ ఫోరం 2024లో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. 2031 నుంచి 2047 వరకు పూర్తి స్థాయి కర్బనరహిత ఆర్థిక వ్యవస్థకు అనువుగా ఉండే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై అందరి దృష్టి ఉంటుందని దాస్ పేర్కొన్నారు. గ్రీన్ హైడ్రోజన్, ఆఫ్‌షోర్ విండ్, ఈ-మొబిలిటీ మొదలైన వర్ధమాన రెన్యువబుల్ టెక్నాలజీలు కీలకంగా మారతాయని వివరించారు.


విన్నర్ ట్రోఫీతో లెక్‌లెర్క్
ట్రాక్‌పై దూసుకెళుతున్న లెక్‌లెర్క్ కారు

లెక్‌లెర్క్ జోరు...

- ఎఫ్1 సీజన్‌లో మూడో విజయం
- యూఎస్ గ్రాండ్‌ప్రిలో టైటిల్ సొంతం
- వెర్‌స్టాపెన్‌కు మళ్లీ నిరాశ
- తొలి ల్యాప్‌లోనే హామిల్టన్ అవుట్

ఆస్టిన్ (టెక్సాస్): ఫార్ములావన్ తాజా సీజన్‌లోని తొలి 10 రేసుల్లో 7 విజయాలు సాధించిన రెడ్ బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఆ తర్వాత అదే జోరు కొనసాగించడంలో విఫలమవుతున్నాడు. గత తొమ్మిది రేసుల్లో వెర్‌స్టాపెన్ ఒక్క రేసులోనూ విజయం అందుకోలేకపోయాడు. మరోవైపు ఇతర జట్ల డ్రైవర్లు అనూహ్యంగా పుంజుకొని వెర్‌స్టాపెన్‌కు గట్టి సవాలు విసరుతున్నారు. సీజన్‌లోని 19వ రేసుగా జరిగిన యునైటెడ్ స్టేట్స్ (యూఎస్) గ్రాండ్‌ప్రిలో ఫెరారీ జట్టు డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ విజేతగా నిలిచాడు. నిర్ణీత 56 ల్యాప్‌లను లెర్‌లెర్క్ అందరికంటే వేగంగా అందరికంటే ముందుగా ఒక గంట 35 నిమిషాల 09.639 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లోని లెక్‌లెర్క్‌కిది మూడో విజయం కావడం విశేషం. 'పోల్ పొజిషన్'తో రేసు మొదలుపెట్టిన లాండో నోరిస్ నాలుగో స్థానంతో సరిపెట్టుకోగా... ఫెరారీ జట్టుకే చెందిన కార్లోస్ సెయింజ్ రెండో స్థానాన్ని సంపాదించాడు. డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్‌కు మూడో స్థానం లభించింది. వాస్తవానికి నోరిస్ మూడో స్థానంలో నిలిచాడు. అయితే రేసు చివరి దశలో నోరిస్ ట్రాక్ బయటకు వచ్చాడు. దాంతో నిర్వాహకులు అతనిపై ఐదు సెకన్ల పెనాల్టీని విధించారు. దాంతో నాలుగో స్థానంలో నిలిచిన వెర్‌స్టాపెన్‌కు మూడో స్థానం ఖరారు కాగా... మూడోస్థానం పొందిన నోరిస్ నాలుగో స్థానానికి పడిపోయాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మెర్సిడెస్ జట్టు డ్రైవర్ లూయిస్ హామిల్టన్‌కు ఈ రేసులో నిరాశ ఎదురైంది. హామిల్టన్ తొలి ల్యాప్‌లోనే రేసు నుంచి వైదొలిగాడు. సీజన్‌లోని తదుపరి రేసు మెక్సికో గ్రాండ్‌ప్రి ఈనెల 27న జరుగుతుంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 19 రేసులు ముగిశాయి. వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్; 354 పాయింట్లు), నోరిస్ (మెక్‌లారెన్; 297 పాయింట్లు), లెక్‌లెర్క్ (ఫెరారీ; 275 పాయింట్లు) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టిక

స్థానం	డ్రైవర్	జట్టు	పాయింట్లు
1	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	354
2	నోరిస్	మెక్‌లారెన్	297
3	లెక్‌లెర్క్	ఫెరారీ	275
4	పియాస్ట్రి	మెక్‌లారెన్	247
5	సెయింజ్	ఫెరారీ	215
6	హామిల్టన్	మెర్సిడెస్	177
7	రసెల్	మెర్సిడెస్	167
8	పెరెజ్	రెడ్‌బుల్	150
9	అలోన్సో	ఆస్టన్ మార్టిన్	62
10	హుల్కెన్‌బర్గ్	మనీగ్రామ్ హాస్	29

యునైటెడ్ స్టేట్స్ గ్రాండ్‌ప్రి ఫలితాలు

స్థానం	డ్రైవర్	జట్టు	టైమింగ్	వ్యత్యాసం	పాయింట్లు
1	లెక్‌లెర్క్	ఫెరారీ	1:35:09.639		25
2	సెయింజ్	ఫెరారీ	1:35:18.201	8.562 సెకన్లు	18
3	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:35:29.051	19.412 సెకన్లు	15
4	నోరిస్	మెక్‌లారెన్	1:35:29.993	20.354 సెకన్లు	12
5	పియాస్ట్రి	మెక్‌లారెన్	1:35:31.560	21.921 సెకన్లు	10
6	జార్జి రసెల్	మెర్సిడెస్	1:36:05.934	56.295 సెకన్లు	8
7	పెరెజ్	రెడ్‌బుల్	1:36:08.711	59.072 సెకన్లు	6
8	హుల్కెన్‌బర్గ్	మనీగ్రామ్ హాస్	1:36:12.596	62.957 సెకన్లు	4
9	లాసన్	వీసా క్యాష్ యాప్	1:36:20.202	70.563 సెకన్లు	2
10	కొలాపింటో	విలియమ్స్ రేసింగ్	1:36:21.618	71.979 సెకన్లు	1

వరల్డ్ కప్ టీమ్‌లో హర్మన్‌కు చోటు



దుబాయ్: మహిళల టి20 వరల్డ్ కప్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన ప్లేయర్లతో ఎంపిక చేసిన జట్టులో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు చోటు లభించింది. భారత జట్టు సెమీఫైనల్‌కు చేరడంలో విఫలమైనా నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి హర్మన్ 2 అర్ధ సెంచరీలు సహా 133.92 స్ట్రయిక్ రేట్‌తో 150 పరుగులు సాధించింది. ఈ 'వరల్డ్ కప్ టీమ్'ను ఐసీసీ సోమవారం ప్రకటించింది. టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా సారథి లారా వోల్‌వార్ట్‌ను ఈ టీమ్‌కు కెప్టెన్‌గా ఎంపిక చేశారు. 12 మంది సభ్యుల ఈ టీమ్‌లో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాల నుంచి చెరో ముగ్గురికి అవకాశం లభించింది.

జట్టు వివరాలు: లారా వోల్‌వార్ట్ (కెప్టెన్), తజ్మీన్ బ్రిట్స్, నాన్‌కులులెకొ ఎమ్‌లాబా (దక్షిణాఫ్రికా), అమేలియా కెర్, రోజ్‌మేరీ మెయిర్, ఈడెన్ కార్సన్ (న్యూజిలాండ్), డియాండ్రా డాటిన్, అఫీ ఫ్లెచర్ (వెస్టిండీస్), డానీ వ్యాట్ (ఇంగ్లండ్), మెగాన్ షుట్ (ఆస్ట్రేలియా), నిగార్ సుల్తానా (బంగ్లాదేశ్), హర్మన్‌ప్రీత్ కౌర్ (భారత్).

ఒక్కొక్కరికి రూ. 1 కోటీ 30 లక్షలు!

న్యూజిలాండ్ మహిళా క్రికెటర్లకు దక్కిన ప్రైజ్‌మనీ

వెల్లింగ్టన్: ప్రపంచ క్రికెట్‌లో బిగ్–3 అయిన భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఆటగాళ్లతో పోలిస్తే న్యూజిలాండ్ క్రికెటర్లకు సాధారణంగా ఆట ద్వారా వచ్చే ఆదాయం తక్కువ. ఎవరో ఒకరిద్దరు మినహా ఎక్కువ మంది పార్ట్ టైమ్ ఉద్యోగాల ద్వారా ఇతర ఆదాయంపై ఆధారపడేవారే. ఇక ఒక్కసారి రిటైర్ అయితే నేరుగా ఏదైనా ఉద్యోగంలో చేరిపోతే తప్ప పని నడవదు. ఇక ఆ దేశపు మహిళా క్రికెటర్ల పరిస్థితి మరీ ఇబ్బందికరం. పురుష టీమ్ సభ్యులతో పోలిస్తే వీరికి దక్కేది చాలా తక్కువ మొత్తం. మహిళా క్రికెటర్లంతా ఆటపై ఇష్టం, ఆసక్తితో కొనసాగడమే. ఇలాంటి సమయంలో టి20 వరల్డ్ కప్ విజయం ద్వారా వచ్చిన మొత్తం వారికి కాస్త ఊరటను అందించింది! విజేతగా నిలవడంతో కివీస్ మహిళల టీమ్‌కు ప్రైజ్‌మనీ రూపంలో ఐసీసీ రూ. 23 లక్షల 40 వేల డాలర్లు అందించింది. ఈ మొత్తాన్ని జట్టులో 15 మందికి సమంగా పంచారు. దాంతో ఒక్కొక్కరికి 2 లక్షల 56 వేల న్యూజిలాండ్ డాలర్లు (సుమారు రూ.1 కోటీ 30 లక్షలు) లభించాయి. వరల్డ్ కప్‌కు ముందు వరుసగా 10 టి20లు ఓడి ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన జట్టు చివరకు చాంపియన్‌గా నిలిచింది. దాంతో ఆర్థికపరంగా కూడా జట్టులోని సభ్యులకు వెసులుబాటు దక్కడం ఈ టీమ్ గెలుపులో మరో సానుకూలాంశం!





సిరాజ్ ఫామ్‌పై ఆందోళన!

స్వదేశంలో గత కొంతకాలంగా పేలవ ప్రదర్శన

న్యూఢిల్లీ: భారత పేసర్ మొహమ్మద్ సిరాజ్ చాలా కాలంగా టెస్టు జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. షమీ కూడా లేకపోవడంతో బుమ్రాకు జతగా కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ జట్టు విజయాల్లో తన వంతు పాత్ర పోషించాడు. అయితే పేస్‌కు అనుకూలించే విదేశీ మైదానాలతో పోలిస్తే సొంతగడ్డపై అతని ప్రదర్శన పేలవంగా ఉంది. 17 విదేశీ టెస్టుల్లో సిరాజ్ 61 వికెట్లు పడగొట్టాడు. భారత గడ్డపై మాత్రం 13 టెస్టుల్లో 192.2 ఓవర్లు బౌలింగ్ చేసి 36.15 సగటుతో 19 వికెట్లే తీయగలిగాడు! ఇందులో కొన్ని సార్లు స్పిన్‌కు బాగా అనుకూలమైన పిచ్‌లపై దాదాపుగా బౌలింగ్ చేసే అవకాశమే రాకపోవడం కూడా ఒక కారణం. అయితే పిచ్‌తో సంబంధం లేకుండా స్వదేశంలో కూడా ప్రత్యర్థిపై చెలరేగే బుమ్రా, షమీలతో పోలిస్తే సిరాజ్ విఫలమవుతున్నాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో బుమ్రా తరహాలో వికెట్లు అందించలేకపోతున్నాడు. ముఖ్యంగా గత ఏడు టెస్టుల్లో అతను 12 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి న్యూజిలాండ్‌తో పుణేలో జరిగే రెండో టెస్టులో అతని స్థానంపై సందేహాలు రేకెత్తుతున్నాయి. సిరాజ్ స్థానంలో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ పేరును మేనేజ్‌మెంట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. సిరాజ్ బౌలింగ్‌లో స్వల్ప సాంకేతిక లోపాలే భారత్‌లో వైఫల్యాన్ని కారణమని మాజీ కోచ్ ఒకరు విశ్లేషించారు. 'టెస్టుల్లో సిరాజ్ అత్యుత్తమ ప్రదర్శనలన్నీ కేప్‌టౌన్, పోర్ట్ ఆఫ్ స్పెయిన్, బ్రిస్బేన్‌వంటి బౌన్సీ పిచ్‌లపైనే వచ్చాయి. బంతి పిచ్ అయిన తర్వాత బ్యాటర్ వరకు చేరే క్రమంలో అక్కడి లెంగ్త్‌కు ఇక్కడి లెంగ్త్‌కు చాలా తేడా ఉంటుంది. దీనిని అతను గుర్తించకుండా విదేశీ బౌన్సీ వికెట్ల తరహా లెంగ్త్‌లో ఇక్కడా బౌలింగ్ చేస్తున్నాడు. దీనికి అనుగుణంగా తన లెంగ్త్‌ను మార్చుకోకపోవడంతో ఫలితం ప్రతికూలంగా వస్తోంది. ఈ లోపాన్ని అతను సరిదిద్దుకోవాల్సి ఉంది. వన్డే, టి20ల్లో అయితే లెంగ్త్ ఎలా ఉన్నా కొన్ని సార్లు వికెట్లు లభిస్తాయి. కానీ టెస్టుల్లో అలా కుదరదు. బ్యాటర్ తగిన విధంగా సన్నద్ధమై ఉంటాడు. అయితే నా అభిప్రాయం ప్రకారం ఆస్ట్రేలియాకు వెళితే సిరాజ్ మళ్లీ ఫామ్‌లోకి వస్తాడు' అని ఆయన వివరించారు.

భారత 'ఎ' జట్టులో నితీశ్, రికీ భుయ్

ఆస్ట్రేలియా 'ఎ' సిరీస్‌కు జట్టు ఎంపిక


నితీశ్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా గడ్డపై జరిగే రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో పాల్గొనే భారత 'ఎ' జట్టును సెలక్టర్లు సోమవారం ప్రకటించారు. 15 మంది సభ్యుల ఈ టీమ్‌కు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇద్దరు ఆంధ్ర ఆటగాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి, రికీ భుయ్‌లకు ఇందులో చోటు లభించింది. భారత సీనియర్ టీమ్‌లో స్థానం కోల్పోయిన ఇషాన్ కిషన్‌కు ఈ జట్టులో అవకాశం దక్కడం విశేషం. ఈ టూర్‌లో భాగంగా ఆస్ట్రేలియా 'ఎ'తో మెకే, మెల్‌బోర్న్‌లలో భారత్ 'ఎ' నాలుగు రోజుల మ్యాచ్‌లు రెండు ఆడుతుంది. ఆ తర్వాత టెస్టు సిరీస్ కోసం సిద్ధమవుతున్న భారత సీనియర్ టీమ్‌తో పెర్త్‌లో మూడు రోజుల మ్యాచ్‌లో కూడా తలపడుతుంది. 'ఎ' జట్టు ప్రదర్శన ద్వారా కూడా బోర్డర్–గావస్కర్ ట్రోఫీ కోసం కూడా ఒకరిద్దరు ఆటగాళ్లను ఎంపిక చేసే అవకాశం ఉంది.

భారత 'ఎ' జట్టు వివరాలు: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్ (వైస్ కెప్టెన్), సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ రెడ్డి, దేవ్‌దత్ పడిక్కల్, రికీ భుయ్, బాబా ఇంద్రజిత్, ఇషాన్ కిషన్, అభిషేక్ పొరేల్, ముకేశ్ కుమార్, ఖలీల్ అహ్మద్, యశ్ దయాళ్, నవదీప్ సైనీ, మానవ్ సుథార్, తనుశ్ కొటియాన్.



పుణేరి వరుసగా రెండో విక్టరీ

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్ వరుసగా రెండో విజయం సాధించింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన పోరులో పుణేరి జట్టు 40–25తో మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్‌పై ఘనవిజయం సాధించింది. పల్టన్ కెప్టెన్, ఆల్‌రౌండర్ అస్లామ్ ఇనామ్‌దార్ (9 పాయింట్లు) అద్భుతంగా రాణించాడు. రెయిడింగ్‌లో 7 పాయింట్లు, టాకిల్‌లో 2 పాయింట్లు సాధించాడు. అంతకుముందు జరిగిన మొదటి మ్యాచ్‌లో యూపీ యోధాస్ బోణీ కొట్టింది. ఆ జట్టు 28–23తో దబంగ్ ఢిల్లీని ఓడించింది.


లలిత్ మోహన్

ఆంధ్ర ఓటమి

ఒక్క వికెట్ తేడాతో నెగ్గిన గుజరాత్

అహ్మదాబాద్: రంజీ ట్రోఫీ దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. మాజీ చాంపియన్ గుజరాత్ జట్టుతో సోమవారం ముగిసిన గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఒక్క వికెట్ తేడాతో ఓటమి పాలైంది. ఆంధ్ర నిర్దేశించిన 144 పరుగుల విజయలక్ష్యాన్ని గుజరాత్ జట్టు 50.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 131 పరుగులవద్ద గుజరాత్ 9వ వికెట్‌ను చేజార్చుకోగా... అర్జన్ నాగ్‌వాస్‌వాలా (16 నాటౌట్; 1 ఫోర్) గుజరాత్ జట్టును గట్టెక్కించాడు. ఆంధ్ర జట్టు స్పిన్నర్ లలిత్ మోహన్ 76 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టి తమ జట్టుకు విజయంపై ఆశలు రేకెత్తించాడు. శశికాంత్‌కు ఒక వికెట్ దక్కగా... మరో వికెట్ రనౌట్ రూపంలో వచ్చింది. అంతకుముందు ఫాలోఆన్ ఆడుతూ ఓవర్‌నైట్ స్కోరు 203/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 90.5 ఓవర్లలో 297 పరుగులకు ఆలౌటైంది. శ్రీకర్ భరత్ (47; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), హనుమ విహారి (32; 3 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (34; 6 ఫోర్లు), త్రిపురాణ విజయ్ (30; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. గుజరాత్ బౌలర్లలో అర్జన్ నాగ్‌వాస్‌వాలా 4 వికెట్లు తీయగా... సిద్ధార్థ్ దేశాయ్, రవి బిష్ణోయ్ 3 వికెట్ల చొప్పున పడగొట్టారు.

హైదరాబాద్ పరాజయం

గ్రూప్ 'బి'లోనే ఉన్న హైదరాబాద్ జట్టు కూడా రెండో ఓటమి చవిచూసింది. డెహ్రాడూన్‌లో ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 78 పరుగుల తేడాతో ఓడిపోయింది. 269 విజయలక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 69.1 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. రోహిత్ రాయుడు (47 నాటౌట్; 4 ఫోర్లు) అజేయంగా నిలిచాడు. ఉత్తరాఖండ్ బౌలర్ స్వప్నిల్ సింగ్ 59 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు.

'దేశవాళీ మ్యాచ్‌లు ఆడతా'

- నొప్పి పూర్తిగా తగ్గిపోయింది
- మ్యాచ్ ఫిట్‌నెస్‌పై షమీ దృష్టి



న్యూఢిల్లీ: భారత పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ తన చీలమండ గాయం నుంచి కోలుకుంటున్నాడు. ఏడాది క్రితం వన్డే వరల్డ్ కప్ ఫైనల్ ఆడిన అనంతరం గాయంతో అతను ఆటను పూర్తిగా దూరమయ్యాడు. ఫిబ్రవరిలో అతనికి శస్త్రచికిత్స కూడా జరిగింది. ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఫిట్‌గా మారేందుకు ప్రయత్నిస్తున్న షమీ తొలిసారి తాను పూర్తి రనప్‌తో బౌలింగ్ చేసినట్లు వెల్లడించాడు. ఈ క్రమంలో ఎలాంటి నొప్పి కలగలేదని అతను చెప్పాడు. 34 ఏళ్ల షమీ ఆదివారం భారత్, న్యూజిలాండ్ టెస్టు ముగిసిన తర్వాత చిన్నస్వామి స్టేడియంలో సుదీర్ఘ సమయం పాటు ఎలాంటి ఇబ్బందీ లేకుండా బౌలింగ్ చేశాడు. భారత అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అతని బౌలింగ్‌ను పర్యవేక్షించారు. 'కాలిపై భారం పడకూడదని చాలా రోజులుగా జాగ్రత్తగా, పరిమిత రనప్‌తో బౌలింగ్ చేస్తూ వచ్చాను. ఆదివారం మాత్రం చాలా సంతృప్తిగా అనిపించింది. పూర్తిగా నా సామర్థ్యం మేరకు బౌలింగ్ చేశాను. ఏ దశలోనూ ఇబ్బంది పడలేదు. 100 శాతం నొప్పి కూడా తగ్గిపోయింది. సాధ్యమైనంత త్వరగా బరిలోకి దిగాలని ఆశిస్తున్నా' అని షమీ చెప్పాడు.

బెంగాల్ తరఫున బరిలోకి...

ఆస్ట్రేలియా పర్యటనకు ముందు దేశవాళీ క్రికెట్‌లో 2, 3 మ్యాచ్‌లు ఆడాలని భావిస్తున్న షమీ... అప్పుడే తన ఆట, ఫిట్‌నెస్‌పై పూర్తి స్పష్టత వస్తుందని అన్నాడు. నవంబర్ 22 నుంచి పెర్త్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు జరగనుండగా... ఫిట్‌గా మారేందుకు షమీకి మరో నెల రోజుల సమయం ఉంది. 'పూర్తి ఫిట్‌నెస్‌ను సాధించడమే నా ముందున్న లక్ష్యం. ఆస్ట్రేలియాకు వెళ్లే ముందు నేను ఎంత దృఢంగా తయారవుతాననేది ముఖ్యం. ఫిట్‌గా లేకుండా అక్కడికి వెళ్లి ఏదైనా జరిగితే అది మంచిది కాదు. డాక్టర్లు ఓకే చెప్పేలా రోజుకు కనీసం 20–30 ఓవర్లు బౌలింగ్ చేయాలని భావిస్తున్నా. అందు కోసం మ్యాచ్‌లు ఆడటమే సరైంది' అని షమీ పేర్కొన్నాడు. భారత జట్టు ఆసీస్ బయల్దేరడానికి ముందు రంజీ ట్రోఫీలో బెంగాల్ జట్టు మూడు మ్యాచ్‌లు ఆడనుంది. వీటిలో అతను బరిలోకి దిగే అవకాశం ఉంది. ఫిట్‌గా మారి కంగారూ గడ్డకు చేరితే భారత్, భారత్ 'ఎ' మధ్య జరిగే మూడు రోజుల మ్యాచ్‌లో కూడా షమీ ఆడవచ్చు. గాయం నుంచి కోలుకొని మళ్లీ ఆడటం అంత సులువు కాదని... ఈ సుదీర్ఘ విరామం ఓపికను ప్రదర్శించే లక్షణాన్ని తనలో పెంచిందని అతను అభిప్రాయ పడ్డాడు. ప్లేయర్ ఎప్పుడైనా తన ప్రతిభ, సత్తాపై నమ్మకాన్ని కోల్పోరాదని, ప్రస్తుతం తన పోరాటమంతా ఫిట్‌నెస్‌తోనే అతను షమీ చెప్పాడు. 140 కిలోమీటర్లకు పైగా బంతులు విసిరే ముగ్గురు పేసర్లు ఒకే సమయంలో జట్టులో ఆడటం అరుదని... ఆస్ట్రేలియాలోని బౌన్సీ వికెట్లపై మన జట్టు సాధారణ స్కోరు నమోదు చేసినా... బౌలర్లు చెలరేగిపోగలరని అతను వ్యాఖ్యానించాడు. 2018–19 పర్యటనలో 16 వికెట్లతో భారత జట్టు ఆసీస్ గడ్డపై తొలిసారి సిరీస్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన షమీ... 2020–21 టూర్ తొలి టెస్టులో బ్యాటింగ్ చేస్తూ చేతికి గాయం కావడంతో సిరీస్ నుంచి తప్పుకున్నాడు.



'కామన్వెల్త్' నుంచి హాకీ అవుట్!

మెల్‌బోర్న్: వచ్చే కామన్వెల్త్ క్రీడల్లో హాకీతోపాటు షూటింగ్, రెజ్లింగ్ క్రీడాంశాలను పక్కన బెట్టాలని నిర్వాహకులు చూస్తున్నారు. దీనిపై కామన్వెల్త్ క్రీడల సమాఖ్య (సీజీఎఫ్) ఒక నిర్ణయానికి వచ్చినప్పటికీ బయటికి మాత్రం వెల్లడించడం లేదని మీడియా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) కూడా దీనిపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. 1998 కామన్వెల్త్ గేమ్స్‌లో హాకీని చేర్చాక ఇప్పటివరకు ఆ క్రీడను కొనసాగించారు. అయితే 2026లో మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చే గ్లాస్గో (స్కాట్లాండ్) బడ్జెట్‌ను తగ్గించుకునే పనిలో భాగంగా హాకీకి మంగళం పాడాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. 2022 బర్మింగ్‌హామ్ గేమ్స్‌లో 19 క్రీడాంశాలను నిర్వహించగా, వీటిని 10కి కుదించాలని గ్లాస్గో ఆర్గనైజింగ్ కమిటీ కసరత్తు చేస్తోంది. కేవలం నాలుగు వేదికల్లో కుదించిన క్రీడాంశాలను నిర్వహించడం ద్వారా బడ్జెట్‌ను చాలా వరకు తగ్గించుకోవచ్చని భావిస్తోంది. 2026 ఏడాదిలో జూలై 23 నుంచి ఆగస్టు 2 వరకు ఈ కామన్వెల్త్ గేమ్స్ ఉండగా, రెండు వారాల్లోపే ప్రపంచకప్ హాకీ కూడా ఉండటం కూడా సాకుగా చూపే అవకాశముంది. బెల్జియం, నెదర్లాండ్స్‌లు సంయుక్తంగా నిర్వహించే ప్రపంచకప్ హాకీ టోర్నీ ఆగస్టు 15 నుంచి 30 వరకు జరుగుతుంది. హాకీ ఆటను తొలగించాలనుకుంటున్న వార్తలపై స్పందించిన ఎఫ్ఐహెచ్ కొన్ని రోజుల్లోనే దీనిపై స్పష్టత వస్తుందని చెప్పింది. మంగళవారం క్రీడాంశాల విషయమై ప్రకటన వెలువడుతుందని చెప్పింది. 2022 బర్మింగ్‌హామ్ గేమ్స్‌లో పురుషుల విభాగంలో ఆస్ట్రేలియా జట్టుకు స్వర్ణం లభించగా... భారత జట్టుకు రజతం దక్కింది.

నువ్వు మా రాజువు కాదు!

చార్లెస్‌కు ఆస్ట్రేలియా పార్లమెంటులో చేదు అనుభవం



ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో ప్రసంగిస్తున్న చార్లెస్‌-3



బ్రిటన్‌ రాజు చార్లెస్‌కు వ్యతిరేకంగా నినదిస్తున్న సెనేటర్‌ థోర్ప్‌

కాన్‌బెర్రా: బ్రిటన్‌ రాజు చార్లెస్‌–3కి ఆస్ట్రేలియాలో చేదు అనుభవం ఎదురైంది. అధికారిక పర్యటనలో రెండో రోజు సోమవారం ఆస్ట్రేలియా పార్లమెంటులో ఆయన ప్రసంగించారు. ఆ వెంటనే, 'నువ్వు మా రాజువు కావు''అంటూ ఆదివాసీ సెనేటర్‌ లిడియా థోర్ప్‌ చార్లెస్‌ను ఉద్దేశించి నినాదాలు చేయడంతో కలకలం రేగింది. ''నువ్వు మా రాజువు కావు. మా ప్రజలపై మీరు మారణహోమానికి పాల్పడ్డారు. మా భూమిని మాకు తిరిగివ్వండి. మా నుంచి దొంగిలించిన వాటన్నింటినీ తిరిగి అప్పగించండి. మా ఎముకలు, పుర్రెలు, మా పిల్లలు, మా ప్రజలు... సర్వమూ తిరిగివ్వండి. మా భూమిని నాశనం చేశారు. నువ్వో జాతి వివక్షవాదివి''అంటూ చార్లెస్‌ను దుయ్యబట్టారు. భద్రతా సిబ్బంది బయటకు తీసుకెళ్తున్నా వెనక్కు తగ్గలేదు. ''ఇది మీ భూమి కాదు. నువ్వు నా రాజువు కావు''అంటూ థోర్ప్‌ పదేపదే నినదించారు. దీన్ని పలువురు ఆస్ట్రేలియన్లు ఖండించారు. ఇది దురదృష్టకరమైన రాజకీయ ప్రదర్శనవాదమని మాజీ ప్రధాని టోనీ అబాట్‌ అన్నారు. ఈ అనూహ్య పరిణామంతో చార్లెస్‌ దంపతులు షాక్‌కు గురయ్యారు. పార్లమెంటు భవనం ముందు ఉన్న లాన్‌లోనూ అసమ్మతివాదులు గుమిగూడారు. తల్లి క్వీన్‌ ఎలిజబెత్‌ మరణం తర్వాత చార్లెస్‌ ఆస్ట్రేలియాకు వెళ్లడం ఇదే తొలిసారి. థోర్ప్‌కు వలస విధాన వ్యతిరేకిగా పేరుంది. 2022లో సెనేటర్గా ప్రమాణస్వీకార వేళ కూడా అప్పటి బ్రిటన్‌ రాణి ఎలిజబెత్‌–2ను వలస రాజ్యపాలకురాలిగా అభివర్ణించారు. చాంబర్‌ ప్రెసిడెంట్‌ వారిస్తున్నా పట్టించుకోలేదు.

బ్రిటన్‌ వలసరాజ్యం...


ఆస్ట్రేలియా వందేళ్లకు పైగా బ్రిటన్‌ వలస రాజ్యంగా కొనసాగించింది. చాలా ఏళ్లుగా పూర్తి స్వాతంత్ర దేశంగా మనుగడ సాగిస్తున్నా దేశాధినేతగా మాత్రం బ్రిటన్‌ రాజే లాంఛనప్రాయంగా వ్యవహరిస్తున్నారు. దీనికి చెక్‌ పెట్టేందుకు 1999లో పార్లమెంటులో ఓటింగ్‌ జరిగినా స్వల్ప మెజారిటీతో వీగిపోయింది. దేశంలో ఆదివాసీ కన్సల్టేటివ్‌ అసెంబ్లీ ఏర్పాటు తీర్మానాన్ని కూడా పార్లమెంట్‌ 2023లో భారీ మెజారిటీతో తిరస్కరించింది.

మితిమీరిన టూరిజం మాకొద్దు

స్పెయిన్‌లో నిరసనలు

స్పెయిన్‌: మితిమీరుతున్న పర్యాటకంపై స్పెయిన్‌లోని కానరీ దీవుల ప్రజలు ఆగ్రహించారు. దీన్ని వ్యతిరేకిస్తూ వేలాదిమంది ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. గ్రాన్‌ కానరియా, టెనెరిఫే, లా పాల్మా, ఫ్యూర్టెవెంచురా, లాంజారోట్‌, ఎల్‌ హియర్రోలలో ఏకకాలంలో ప్రదర్శనలకు దిగారు. ద్వీపాల పర్యాటక నమూనాలో మార్పులు చేయాలని డిమాండ్‌ చేశారు. 'ఈ బీచ్‌ మాది'అంటూ నినదించారు. లక్షలాదిగా సందర్శకుల రాకతో సహజ వనరులు క్షీణించి పర్యావరణం దెబ్బ తింటోందని ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనల్లో కనీసం 8,000 మంది పాల్గొన్నారని స్పెయిన్‌ ప్రభుత్వం తెలిపింది. స్పానిష్‌ నేషనల్‌ స్టాటిస్టిక్స్‌ ఇన్‌స్టిట్యూట్‌ ప్రకారం ఈ ఏడాది జనవరి–సెప్టెంబర్‌ మధ్య ఏకంగా 99 లక్షల మంది కానరీ దీవులను సందర్శించారు. 2023 కంటే ఇది 10 శాతం ఎక్కువ. ఈ దీవుల జనాభా 22 లక్షలు. పర్యాటకంపై స్పెయిన్‌ భారీగా ఆధారపడుతుంది.

పాక్‌ సుప్రీం సీజే పదవీ కాలం ఇక మూడేళ్లే



ఇస్లామాబాద్‌: పాకిస్తాన్‌ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) పదవీ కాలాన్ని మూడేళ్లకు పరిమితం చేసేందుకు ఉద్దేశించిన చట్ట సవరణకు అధ్యక్షుడు ఆసిఫ్‌ ఆలీ జర్దారీ సోమవారం ఆమోదముద్ర వేశారు. అంతేకాదు, సీజేను ఎంపిక చేసేందుకు సుప్రీంకోర్టులోని నలుగురు సీనియర్‌ జడ్జిలతో ప్రత్యేక కమిటీ నియామకం ఉత్తర్వుపైనా ఆయన సంతకం చేశారు. ఇందుకు సంబంధించిన 26వ రాజ్యాంగ సవరణపై నేషనల్‌ అసెంబ్లీ, సెనేట్‌లతో ఆదివారం మొదలైన చర్చలు, సోమవారం ఉదయం 5 గంటల వరకు కొనసాగాయి. అనంతరం ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. తాజా సవరణ ద్వారా ఈ నెల 25న పదవీ విరమణ చేసే సీజే జస్టిస్‌ కాజీ ఇసా స్థానంలో జస్టిస్‌ మన్సూర్‌ అలీ షా కొత్తగా బాధ్యతలు చేపట్టకుండా షెహబాజ్‌ షరీఫ్‌ ప్రభుత్వం అడ్డుకోగలిగింది. ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి 65 ఏళ్లు వచ్చే వరకు బాధ్యతల్లో కొనసాగుతారు. ఆయన స్థానంలో సీనియర్‌ మోస్ట్‌ జడ్జి ఆటోమేటిక్‌గా ఆ పదవిని చేపడతారు. తాజా పరిణామంతో ఈ సంప్రదాయానికి ముగింపు పలికినట్లయింది. అంతేకాకుండా, సీజే ఎంపిక కోసం ప్రత్యేకంగా ఒక కమిటీ ఏర్పాటుకానుంది. ఇందులో సుప్రీంకోర్టులోని నలుగురు సీనియర్‌ జడ్జీలతోపాటు, సెనేట్‌, నేషనల్‌ అసెంబ్లీ నుంచి ఇద్దరు చొప్పున సభ్యులుగా ఉంటారు. చట్ట సవరణను నవ శకానికి నాందిగా ప్రధాని షెహబాజ్‌ షరీఫ్‌ అభివర్ణించగా దేశ స్వతంత్ర న్యాయవ్యవస్థకు చావుదెబ్బగా ప్రతిపక్ష నేత ఇమ్రాన్‌ ఖాన్‌కు చెందిన పీటీఐ పార్టీ పేర్కొంది.

కమలకు స్టీవీ 'హ్యాపీ బర్త్‌డే'

పాట పాడి స్టెప్పులేసిన లెజెండరీ సింగర్‌

జార్జియా: స్వింగ్‌ స్టేట్స్‌లో ఒకటైన జార్జియాలో డెమొక్రటిక్‌ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌ ఆదివారం పలు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. న్యూ బర్త్‌ మిషనరీ బాప్టిస్ట్‌ చర్చితోపాటు, జోన్స్‌ బోరోలోని డివైన్‌ ఫెయిత్‌ మినిస్ట్రీస్‌ ఇంటర్నేషనల్‌లను సందర్శించారు ద్వేషం, విభజన రాజకీయాలు చేసేవారిని కాకుండా కరుణ, ప్రేమతో దేశాన్ని నడిపే నేతను ఎన్నుకోవాలని ప్రజలను హారిస్‌ కోరారు. ఈ ప్రచార కార్యక్రమాల్లోనే హారిస్‌ తన 60వ జన్మదినం జరుపుకున్నారు. లెజెండరీ సింగర్‌ స్టీవీ వండర్‌ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. బాబ్‌ మార్లే 'రిడంప్షన్‌ సాంగ్‌'లోని పంక్తులతో పాటు నల్లజాతి ఉద్యమ దిగ్గజం మార్టిన్‌ లూథర్‌ కింగ్‌ జూనియర్‌ జయంతి సందర్భంగా తాను రాసిన 'హ్యాపీ బర్త్‌ డే' పాటను ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. హారిస్‌ చప్పట్లు తన 'హ్యాపీ బర్త్‌ డే'పాటను ఆస్వాదించారు. అనంతరం ఈ వీడియోను ఆమె సోషల్‌ మీడియాలో పోస్ట్‌ చేశారు. వండర్‌ గతంలోనూ హారిస్‌ కోసం ప్రదర్శనలిచ్చారు. గత ఆగస్టులో డెమొక్రటిక్‌ నేషనల్‌ కన్వెన్షన్‌లోనూ ఆయన ఆనూహ్యంగా మెరిశారు. హారిస్‌కు మద్దతుగా 1973 నాటి తన సూపర్‌ హిట్‌ సాంగ్‌ 'హయ్యర్‌ గ్రౌండ్‌'ను ఆలపించి అలరించారు.



'హ్యాపీ బర్త్‌డే' పాటతో హారిస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న స్టీవీ వండర్‌

శుభాకాంక్షల వెల్లువ

ప్రచారంలో బిజీగా ఉన్న హారిస్‌ పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పెన్సిల్వేనియాలో ప్రచారంలో ఉన్న రిపబ్లికన్‌ ప్రత్యర్థి డొనాల్డ్‌ ట్రంప్‌ కూడా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు జో బైడెన్‌ కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను అసాధారణ నాయకురాలిగా అభివర్ణించారు. ఉపాధ్యక్ష అభ్యర్థి, మిన్నెసోటా గవర్నర్‌ టిమ్‌ వాల్జ్‌ కూడా హారిస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ అధ్యక్షుడు బరాక్‌ ఒబామా అయితే హారిస్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. ప్రజల హక్కుల కోసం జీవితమంతా పోరాడుతున్న ఆమెను అధ్యక్షురాలిగా ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభ మాజీ స్పీకర్‌ నాన్సీ పెలోసీ కూడా హారిస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రంప్‌ వంట ప్రచారార్భాటమే

మెక్‌డొనాల్డ్స్‌ స్టోర్‌ మేనేజర్‌ నోటీసుతో వెల్లడైన వాస్తవం



మెక్‌డొనాల్డ్స్‌లో కస్టమర్‌కు ఫ్రెంచ్‌ ఫ్రైస్‌ అందిస్తున్న ట్రంప్‌

వాషింగ్టన్‌: అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫీస్టర్‌విల్లే మెక్‌డొనాల్డ్స్‌ ఫ్రై స్టేషన్‌లో ఆదివారం డొనాల్డ్‌ ట్రంప్‌ చేసిన హడావిడి అంతా ప్రణాళికా బద్ధంగా జరిగిందేనని తేటతెల్లమైంది. ఆ స్టోర్‌ మేనేజర్‌ డెరెక్‌ జియాకామ్‌అంటోనియో అతికించిన నోటీసు ఈ విషయాన్ని స్పష్టంచేస్తోంది. కాలేజీ రోజుల్లో మెక్‌డొనాల్డ్స్‌ రెస్టారెంట్‌లో పనిచేశానని కమల హారిస్‌ చెప్పిన విషయాన్ని ఎగతాళి చేస్తూ ఆదివారం ట్రంప్‌ మెక్‌డొనాల్డ్స్‌ స్టోర్‌లో ఫ్రెంచ్‌ ఫ్రైను వేయించి కారులో కస్టమర్‌కు అందించడం తెల్సిందే. అయితే ఇదంతా డ్రామా అంటూ కొందరు చేసిన ఆరోపణలకు మేనేజర్‌ అంటించిన నోటీసు బలం చేకూర్చింది. ''అధ్యక్ష అభ్యర్థి ట్రంప్‌, ఆయన ప్రచార బృందం విజ్ఞప్తి మేరకు ఆదివారం సాయంత్రం నాలుగు గంటల దాకా స్టోర్‌ను మూసేస్తున్నాం. మాది రాజకీయ పార్టీ కానప్పటికీ ఫీస్టర్‌విల్లే ప్రాంతంలోని చిరువ్యాపారుల గిరాకీ పెంచేందుకు, పార్టీ ప్రచారం ద్వారా అందివచ్చిన వ్యాపారవృద్ధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు మేం రాజకీయ నాయకులకు తలుపులు బార్లా తెరుస్తున్నాం. 30 ఏళ్ల క్రితం న్యూయార్క్‌లో సాధారణ సిబ్బందిగా మెక్‌డొనాల్డ్స్‌లో చేరిన నేను ఇప్పుడు ఈ స్టోర్‌ వ్యాపారాన్ని మరింత పెంచి నా వృత్తిజీవితాన్ని మరింత అర్థవంతంగా మార్చుకుంటా. స్టోర్‌ను మూసేసి స్థానిక వినియోగదారులకు అసౌకర్యం కల్గిస్తున్నందుకు చింతిస్తున్నా. వీలైనంత త్వరగా స్టోర్‌ను తెరచి సదా మీకు సేవచేసేందుకు సిద్ధంగా ఉంటాం''అని మేనేజర్‌ ఆ నోటీస్‌లో పేర్కొన్నారు. దీంతో స్టోర్‌లో ట్రంప్‌ వంటచేయడం, ప్యాకెట్లు అందించడం అంతా కెమెరాల ముందు చేసిన ప్రచార ఆర్భాటమని డెమొక్రాట్లు విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఘటనను సమర్థిస్తున్న వాళ్లూ చాలా మందే ఉన్నారు. ఇప్పటికే పలుమార్లు హత్యాయత్నాల నుంచి తృటిలో బయటపడిన మాజీ దేశాధ్యక్షుడి భద్రత నిమిత్తం ఆమాత్రం ఆంక్షలు అమలుచేయడంలో తప్పు లేదని, స్టోర్‌ను మూసేయడం సబబేనని కొందరు వాదిస్తున్నారు. ''శ్రామిక వర్గాన్ని పట్టించుకుని ట్రంప్‌ కనీసం ఇలాగైనా వంట చేసి వారి కష్టాలను తెల్సుకుని ఉంటాడు' అని ఇంకొకరు ఆన్‌లైన్‌లో పోస్ట్‌పెట్టారు.

తైవాన్‌ జలసంధిలోకి అమెరికా, కెనడా యుద్ధనౌకలు

చైనా భారీ విన్యాసాలు పూర్తయిన నేపథ్యంలో పరిణామం

తైపీ: తైవాన్‌ జలసంధిలో ఉద్రిక్తతలకు తావిచ్చే మరో పరిణామమిది. ఆదివారం అమెరికా, కెనడా యుద్ధ నౌకలు చైనా, తైవాన్‌లను విడదీసే తైవాన్‌ జలసంధిలోకి ప్రవేశించాయి. అమెరికా యుద్ధ నౌక యూఎస్‌ఎస్‌ హిగ్గిన్స్‌, కెనడా యుద్ధ నౌక హెచ్‌ఎంసీఎస్‌ వాంకూవర్‌ ఆదివారం తైవాన్‌ జలసంధి గుండా ప్రయాణించాయని, తైవాన్‌ జలసంధి గుండా వెళ్లేందుకు అన్ని దేశాల నౌకలకు స్వేచ్ఛ ఉందని చెప్పడమే తమ ఉద్దేశమని సోమవారం అమెరికా నేవీకి చెందిన ఏడో ఫ్లీట్‌ తెలిపింది. తైవాన్‌ భూభాగం తమదేనంటూ వారం క్రితం చైనా భారీ యుద్ధ విన్యాసాలతో ఆ దేశాన్ని పూర్తి స్థాయిలో దిగ్బంధించడం తెలిసిందే. గత నెలలో జర్మనీకి చెందిన రెండు యుద్ధ నౌకలు తైవాన్‌ జలసంధిలో ప్రయాణించాయి. కాగా, తాజాగా అమెరికా, కెనడాల చర్యను చైనా ఖండించింది. తైవాన్‌ అంశం స్వేచ్ఛా నౌకాయానానికి సంబంధించింది కాదు, తమ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలకు సంబంధించిన వ్యవహారమని చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికా, కెనడా యుద్ధ నౌకలు తైవాన్‌ జలసంధిలోకి ప్రవేశించడం ఈ ప్రాంత శాంతి, సుస్థిరతలకు భంగకరమని చైనా మిలటరీ వ్యాఖ్యానించింది. అవి జలసంధిలో ఉన్నంత సేపు వాటిని పరిశీలించేందుకు తమ వైమానిక, నౌకా బలగాలను అక్కడికి తరలించామని వివరించింది.

నీట్‌-యూజీపై నివేదికకు మరో రెండు వారాల గడువు

న్యూఢిల్లీ: నీట్‌-యూజీ నిర్వహణలో తేవాల్సిన సంస్కరణలపై నివేదిక సమర్పించడానికి ఏడుగురు సభ్యుల నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు మరో రెండు వారాల గడువు ఇచ్చింది. వైద్యవిద్యలో అండర్‌ గ్రాడ్యుయేట్‌ ప్రవేశాల కోసం నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ (ఎన్‌టీఏ).. నీట్‌-యూజీని నిర్వహిస్తోంది. ఈసారి నీట్‌-యూజీలో అక్రమాలు జరిగాయని తీవ్ర దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్ష విధానంలో మార్పులు తెచ్చి, అవకతవకలకు ఆస్కారం లేకుండా, పారదర్శకంగా నీట్‌-యూజీ పరీక్షను నిర్వహించడానికి తగు సిఫారసులు చేయాల్సిందిగా ఇస్రో మాజీ ఛైర్మన్‌ కె.రాధాక్రిష్ణన్‌ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏడుగురు సభ్యులతో నిపుణుల కమిటీని వేసింది. అలాగే ఎన్‌టీఏ పనితీరును ఈ కమిటీ సమీక్షించనుంది. పరీక్ష సమగ్రత దెబ్బతిందనేందుకు తగు ఆధారాలు లేవని నీట్‌-యూజీని రద్దు చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. నిపుణుల కమిటీ నివేదికకు గడువు ముగుస్తోందని, మరో రెండువారాలు దీన్ని పొడిగించాలని సొలిసిటర్‌ జనరల్‌ తుషార్‌ మెహతా సోమవారం కోరగా.. చీఫ్‌ జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం అందుకు సమ్మతించింది.

కరెన్సీ కట్టలు, ప్రత్యేక గదులు, ఐరాస ఆహారం

యాహ్యా సిన్వర్‌ బంకర్‌లో సకల సదుపాయాలు

గాజా: గాజాలో హమాస్‌ సాయుధులు సరైన తిండిలేక యుద్ధక్షేత్రంలో రక్తమోడుతుంటే ఇటీవల మరణించిన సంస్థ అధినేత యాహ్యా సిన్వర్‌ మాత్రం అత్యంత విలాసవంతంగా గడిపినట్టు ఇజ్రాయెల్‌ ప్రకటించింది. తమ సైన్యానికి భయపడి సిన్వర్‌ చాన్నాళ్లు బంకర్‌లోనే దాక్కున్నాడంటూ గత ఫిబ్రవరి నాటి వీడియోలను విడుదల చేసింది. వాటి ప్రకారం... గాజాలో ఖాన్‌ యూనుస్‌ పట్టణంలోని తన నివాసప్రాంతం కింది భూగర్భంలో బంకర్‌లో సిన్వర్‌ తలదాచుకున్నారు. అందులోని కిచెన్‌లో చాలారోజులకు సరిపడా అన్ని రకాల వంట సరకులున్నాయి. పాలస్తీనా శరణార్థుల కోసం ఐరాస ఉచితంగా సరఫరా చేసిన ఆహార సంచులు కనిపించాయి. కోట్ల కొద్దీ డాలర్ల కట్టలు లభించాయి. ప్రత్యేక గదులు, స్నానాల గదులు, భారీగా ఆయుధాలను కనుగొన్నారు. సిన్వర్‌, ఆయన భార్య, పిల్లలు అత్యవసర వస్తువులను తీసుకుని వెళ్లిపోతున్నట్లు మరో వీడియోలో రికార్డయింది. సిన్వర్‌ భార్య చేతిలో బ్యాగు రూ.27 లక్షలుంటుందని వార్తలొచ్చాయి.

దేశంలో కొత్తగా 10 అణు విద్యుత్కేంద్రాలు

న్యూఢిల్లీ: దేశంలో కొత్తగా పది అణువిద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం జరుగుతోందని కేంద్రం వెల్లడించింది. సోమవారం శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల సంబంధ పార్లమెంటరీ స్థాయీ సంఘం భేటీలో ఈ వివరాలను సభ్యులకు అందజేసింది. 700 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో గుజరాత్‌, రాజస్తాన్‌, హరియాణాల్లో వీటిని నెలకొల్పారు. గుజరాత్‌లోని కాక్రపార్‌లో రెండు అణు విద్యుత్కేంద్రాల్లో ఉత్పత్తి మొదలైందని కేంద్రం పేర్కొంది. అయితే వీటి నిర్మాణం చాలా ఆలస్యమవుతోందని కమిటీ సభ్యుడు జైరాం రమేశ్‌ అసంతృప్తి వ్యక్తం చేశారు. ''2007లో ఆమోదం పొందిన ప్రాజెక్టులు ఇప్పుడు పూర్తి కావస్తుండటం గ్రేట్‌. 'సుప్రీం నేత' కనుసన్నల్లో అభివృద్ధి వేగానికిది నిదర్శనం'' అని 'ఎక్స్‌'లో వ్యంగ్యంగా స్పందించారు. కాక్రపార్‌–3, కాక్రపార్‌–4 రియాక్టర్లు కాంగ్రెస్‌ హయాంలోనే ఆమోదం పొందాయన్నారు.

భారత్‌ లౌకిక దేశంగా ఉండాలనుకోవడం లేదా?

- పిటిషనర్లకు సుప్రీంకోర్టు ప్రశ్నలు
- రాజ్యాంగ పీఠికలో సెక్యులర్‌, సోషలిస్ట్‌ పదాల చేరికపై సుప్రీంకోర్టులో పిల్‌

న్యూఢిల్లీ: ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో చేర్చిన సామ్యవాద, లౌకిక(సోషలిస్ట్‌, సెక్యులర్‌) పదాలను తొలగించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను సోమవారం సుప్రీంకోర్టు విచారించి పిటిషన్లపై పలు ప్రశ్నలు సంధించింది. మాజీ రాజ్యసభ సభ్యుడు సుబ్రహ్మణ్యస్వామి, లాయర్‌ విష్ణు శంకర్‌ జైన్‌, బలరామ్‌ సింగ్‌, లాయర్‌ అశ్వినీ ఉపాధ్యాయ్‌ తదితరులు దాఖలుచేసిన ఈ పిల్‌లను జస్టిస్‌ సంజీవ్‌ ఖన్నా, జస్టిస్‌ సంజయ్‌ కుమార్‌ల ధర్మాసనం విచారించింది. ''సామ్యవాదం అనే పదానికి అర్థాలను ప్రాశ్చాత్య దేశాల కోణంలో చూడొద్దు. సోషలిజం పదానికి అర్థాన్ని అందరికీ సమాన అవకాశాలు అనే దృక్కోణంలోనే చూడాలి. సెక్యులరిజం అనే పదం భారత రాజ్యాంగంలో భాగమని గతంలో ఎన్నో తీర్పుల్లో న్యాయస్థానాలు తేల్చిచెప్పాయి. సెక్యులర్‌ పదం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగం. ఫ్రెంచ్‌ వారి సెక్యులరిజంకు బదులు ఆధునిక భావజాల సెక్యులరిజాన్ని భారత్‌ సంగ్రహించింది. మీరు భారత్‌ లౌకిక దేశంగా ఉండాలనుకోవట్లేరా?''అని జస్టిస్‌ ఖన్నా ప్రశ్నించారు. దీనికి లాయర్‌ విష్ణుశంకర్‌ జైన్‌ బదులిచ్చారు. ''మేం లౌకిక అనే పదానికి వ్యతిరేకం కాదు. కానీ ఆ పదాన్ని పీఠికలో చేర్చిన విధానాన్ని మాత్రమే సవాల్‌ చేస్తున్నాం. తప్పుడు మార్గంలో సోషలిజం పదాన్ని చేరిస్తే వ్యక్తిగత స్వేచ్ఛ అనేది ప్రమాదంలో పడుతుందని బీఆర్‌ అంబేడ్కర్‌ అభిప్రాయపడ్డారు. 1949 నవంబర్‌ 26నాటి రాజ్యాంగ పీఠికనే కొనసాగిద్దాం. సవరణల ద్వారా పీఠికలో సవరణ చేయకూడదు. అదనపు పదాలను చేర్చడంలో హేతుబద్ధత లోపించింది'అని లాయర్‌ వాదించారు. ''కొత్తగా చేరిన పదాలు దేశంలో ఎలాంటి మార్పులు తీసుకురాకున్నా ఒక గందరగోళానికి తెరలేపాయి. దీంతో పీఠికలో ఎలాంటి మార్పులైనా చేయొచ్చన్న భావన తదుపరి ప్రభుత్వాల్లో నెలకొంది''అని లాయర్‌ అశ్వినీ ఉపాధ్యాయ్‌ వాదించారు. వాదోపవాదనల తర్వాత కేసు విచారణ నవంబర్‌ 18వ తేదీకి వాయిదాపడింది.

కుటుంబ నియంత్రణలో దక్షిణాది సక్సెస్‌

- ఆయా రాష్ట్రాల రాజకీయ ప్రాతినిథ్యాన్ని తగ్గించకండి
- కేంద్రానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌ సూచన



సాక్షి, న్యూఢిల్లీ: కుటుంబ నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాల విజయం పార్లమెంటులో వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించేదిలా ఉండకూడదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌ పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణలో సాధించిన విజయం ఆయా రాష్ట్రాలకు దండనగా మారకుండా తగు నిబంధనలను రూపొందించాలని కేంద్రానికి సూచించారు. సోమవారం 'ఎక్స్‌'లో ఆయన... 'కుటుంబ నియంత్రణ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు అగ్రగామిగా ఉన్నాయి. పరిమిత సంతానం విషయంలో 1988లో కేరళ, 1993లో తమిళనాడు, 2001లో ఆంధ్రప్రదేశ్‌, 2005లో కర్ణాటక ముందు వరుసలో ఉన్నాయి. అయితే ఈ విజయాలు పార్లమెంట్‌లో ఆయా రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించగలవని కొంతకాలంగా ఆందోళనలు వినిపిస్తున్నాయి. అందుకే 2001లో వాజ్‌పేయి ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 82ను సవరించింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన 2026 తర్వాత సేకరించే మొదటి జనాభా లెక్కలపై ఆధారపడి ఉంటుందని అందులో పేర్కొన్నా రు. సాధారణంగా, 2026 తర్వాత మొదటి జన గణన అంటే 2031 అని అర్థం. కానీ ప్రస్తుతం మొత్తం జన గణన షెడ్యూల్‌కు అంతరాయం ఏర్పడింది. 2021లో చేపట్టాల్సిన జనగణన మొదలే కాలేదు. ఇలా ఆలస్యం చేస్తూ వస్తున్న జన గణనను లోక్‌సభ సీట్ల కేటాయింపునకు ఉపయోగిస్తారా?'అని ఆయన ప్రశ్నించారు. అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాల విజయానికి ఇది విఘాతం కలిగిస్తుందనడంలో సందేహం లేదని, అలా జరగకుండా తగిన మార్గదర్శకాలను రూపొందించాలని జైరాం రమేశ్‌ సూచించారు.



సోమవారం ఢిల్లీలో నిరాహార దీక్ష విరమిస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్‌. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్లో చేర్చాలన్న డిమాండ్‌తో ఆయన తన మద్దతుదారులతో కలిసి ఆమరణ దీక్ష చేస్తున్నారు. ఈ అంశంపై డిసెంబర్‌ 3న లద్దాఖ్‌ సంఘాలతో సమావేశానికి కేంద్ర హోం శాఖ హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు.




చిలీ రాజధాని శాంటియాగోలో ఆదివారం జాంబీ పరేడ్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

మయన్మార్‌లో పడక మునక.. ఎనిమిది మంది మృతి, 20 మంది గల్లంతు

బ్యాంకాక్‌: అండమాన్‌ సముద్రంలో ఆదివారం మయన్మార్‌కు చెందిన పడవ మునిగిన ఘటనలో ఎనిమిది మంది చనిపోగా 20 మందికి పైగా గల్లంతయ్యారు. తీర ప్రాంత పట్టణం క్యావుక్‌కర్‌లో గత వారం రోజులుగా సైన్యానికి, ప్రజాస్వామ్య అనుకూల గెరిల్లాలకు మధ్య తీవ్ర పోరు కొనసాగుతోంది. ఈ పట్టణం, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 75 మంది ప్రజలు దక్షిణ ప్రాంత టనింథర్యిలోని తీర పట్టణం మెయిక్‌కు పడవలో బయలుదేరారు. అలల తాకిడి తీవ్రతకు పావు గంటలోనే పడవ ప్రమాదానికి గురైంది. సమీప గ్రామాల వారు వచ్చి సుమారు 30 మందిని కాపాడారు. ఎనిమిది మృతదేహాలను వెలికి తీశారు. మరో 20 మంది జాడ తెలియాల్సి ఉంది. పడవ సామర్థ్యం 30 నుంచి 40 మంది మాత్రమే కాగా, అందుకు మించి జనం ఎక్కడం, వారి వెంట సామగ్రి ఉండటంతో బరువు పెరిగి ప్రమాదానికి దారితీసిందని చెబుతున్నారు. క్యావుక్‌కర్‌ సమీపంలోని కియె గ్రామంపై బుధవారం ఆర్మీ వైమానిక దాడులు జరిపిందని, దీంతో వేలాదిగా జనం సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్నారని హక్కుల గ్రూపులు అంటున్నాయి.

మదర్సాల నుంచి విద్యార్థుల తరలింపు ఆపండి: సుప్రీంకోర్టు

ఎన్‌సీపీసీఆర్‌ ఆదేశాలపై స్టే



న్యూఢిల్లీ: గుర్తింపులేని మదర్సాల నుంచి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ (ఎన్‌సీపీసీఆర్‌) ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. ఎన్‌సీపీసీఆర్‌ ఆదేశాల అమలును ఆపాలని, ఈ ఆదేశాల ఆధారంగా కొన్ని రాష్ట్రాలు చేపట్టిన చర్యలను నిలుపు చేయాలని జమైత్‌ ఉలేమా –ఇ– హింద్‌ చేసిన విజ్ఞప్తి మేరకు చీఫ్‌ జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌ సారథ్యంలో త్రిసభ్య ధర్మాసనం.. స్టే విధించింది. ఉత్తరప్రదేశ్‌, త్రిపురలు గుర్తింపులేని మదర్సాల నుంచి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు మార్చడాన్ని జమైత్‌ సవాల్‌ చేసింది. జూన్‌ 7, 25 తేదీల్లో ఎన్‌సీపీసీఆర్‌ జారీచేసిన ఆదేశాలు, వీటి ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు వెలువరించిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు స్పష్టం చేసింది.

ప్రజ్వల్‌ బెయిల్‌కు కర్ణాటక హైకోర్టు నో

బెంగళూరు: అత్యాచారం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్‌ మాజీ ఎంపీ ప్రజ్వల్‌ రేవణ్ణకు కర్ణాటక హైకోర్టు బెయిలిచ్చేందుకు నిరాకరించింది. ప్రజ్వల్‌ పెట్టుకున్న మరో రెండు ముందస్తు బెయిల్‌ పిటిషన్లను సైతం తోసిపుచ్చుతూ సోమవారం జస్టిస్‌ ఎం.నాగప్రసన్న తీర్పు వెలువరించారు. తమ ఇంటి పనిమనిషిపై అత్యాచారానికి పాల్పడిన కేసుతోపాటు మరో రెండు అత్యాచారం కేసులు, లైంగిక వేధింపుల కేసులపై దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్‌) ఈ ఏడాది ఆగస్టులో కోర్టులో 2,144 పేజీల చార్జిషీటును దాఖలు చేసింది. ప్రజ్వల్‌ రేవణ్ణ హొళెనరసిపుర జేడీఎస్‌ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ కుమారుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ మనవడు.

భారత సమాఖ్యకు ప్రాతిపదిక ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వం

భారతదేశ పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మన రాజ్యాంగ నిర్మాతలు రాజకీయ వ్యవస్థ నిర్మాణాన్ని నిర్ణయించారు. దేశ భిన్నత్వం, విభిన్న వర్గాల ప్రజల ఆలోచనలు, ప్రయోజనాలు, భౌగోళిక వైవిధ్యాలు, ఆచార, సాంప్రదాయాలు, సంస్కృతులు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకొని భారత పరిపాలనా విధానానికి రూపకల్పన చేశారు. పార్లమెంటరీ అధ్యక్ష తరహా ప్రభుత్వాల ఎంపిక విషయంలో జరిగిన చర్చల అనంతరం పార్లమెంటరీ ప్రభుత్వ విధానం వైపు మొగ్గు చూపారు. ఏక కేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల విషయంలో మాత్రం మన రాజ్యాంగ నిర్మాతలు విజ్ఞతను ప్రదర్శించారు. ఎంతో దూరదృష్టితో మనదేశ పరిస్థితులకు అనుగుణంగా ఏక కేంద్ర,సమాఖ్య లక్షణాల కలయికగా పరిపాలనా వ్యవస్థను రూపొందించారు. ప్రాంతీయమైన పరిపాలనా అవసరాలు, భిన్నత్వం, పరిపాలనా సౌలభ్యం మొదలైన అంశాలను ప్రాతిపదికగా చేసుకొని సమాఖ్య లక్షణాలను పొందుపరిచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలను పంపిణీ చేశారు. మన సమాఖ్యను నిర్మించేటప్పుడు అమెరికాకు బదులుగా కెనడా విధానాన్ని అనుసరించారు. దేశ విభజన కాలం నాటి స్థితిగతులు,స్వదేశీ సంస్థానాల విలీనం, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడం, ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థను అమలు చేయడం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్రీకృత వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేశారు. మన దేశం బలమైన ఏకకేంద్ర లక్షణాలు గల బలహీనమైన సమాఖ్య ప్రభుత్వమే గాని బలమైన సమాఖ్య లక్షణాలున్న బలహీనమైన ఏక కేంద్రం కాదని కె.సి.వేర్ పేర్కొనడం గమనార్హం.

మూడు జాబితాలు

భారత రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ప్రకారం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన చేస్తూ మూడు జాబితాలను పొందుపరిచారు. కేంద్ర జాబితాలో జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలను పొందుపర్చగా, ప్రాంతీయ ప్రాముఖ్యమున్న 66 అంశాలను రాష్ట్ర జాబితాలో చేర్చారు. ప్రాంతీయ ప్రాముఖ్యం ఉన్నప్పటికీ జాతీయ దృక్పథం అవసరమైన అంశాలను ఉమ్మడి జాబితాగా పేర్కొంటూ 47 అంశాలను పొందుపర్చారు. కాలక్రమంలో వచ్చిన అనేక మార్పుల దృష్ట్యా ప్రస్తుతం కేంద్ర జాబితాలో 100 అంశాలు, రాష్ట్ర జాబితాలో 61 అంశాలు, ఉమ్మడి జాబితాలో 52 అంశాలు ఉన్నాయి. 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్య, అడవులు, తూనికలు, కొలతలు వంటి అంశాలను రాష్ట్రజాబితా నుంచి తొలగించి ఉమ్మడి జాబితాలో చేర్చడం వల్ల పైన పేర్కొన్న మార్పులు సంభవించాయి. మూడు జాబితాల్లో పేర్కొనని అంశాలను, నూతనంగా వచ్చే అంశాలను అవశిష్ట అధికారాలుగా పేర్కొంటూ వాటిపై శాసనాలను చేసే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు. ఏదైనా ఒక



అంశం అవశిష్ట అంశం అవుతుందో, కాదో నిర్ణయించే అధికారం సుప్రీంకోర్టుకు మాత్రమే ఉంటుంది. ప్రపంచంలో సమాఖ్య విధానాన్ని అనుసరించే అన్ని దేశాల రాజ్యాంగాల్లోని సమాఖ్య లక్షణాలను మనదేశం కూడా కలిగి ఉంది. లిఖిత రాజ్యాంగాన్ని కలిగిన మనదేశంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలను పంపిణీ చేయడం, అదేవిధంగా కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు పరిష్కరించడం కోసం స్వతంత్ర ప్రతిపత్తిగల న్యాయస్థానమైన సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సుప్రీంకోర్టు రాజ్యాంగ పరిధికి లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. కాబట్టి మన దేశంలో రాజ్యాంగం ఆధిక్యతను కలిగి ఉంటుందని చెప్పొచ్చు. మారుతున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని సవరిస్తున్నారు. మన రాజ్యాంగంలోని సమాఖ్య లక్షణాలను.. అనగా 7వ షెడ్యూల్‌ను, 11వ భాగాన్ని, సుప్రీంకోర్టు అధికారాలను సవరించాలంటే భారత పార్లమెంట్ 2/3వ వంతు మెజార్టీతో పాటు దేశంలోని 1/2 వంతుకు తగ్గకుండా రాష్ట్రాలు కూడా తమ ఆమోదాన్ని తెలపాల్సి ఉంటుంది. దేశ పరిపాలనకు అవసరమైన శాసనాలను రూపొందించే పార్లమెంట్‌లోని ఎగువసభ రాజ్యసభ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. పార్లమెంట్‌లోని ఎగువ సభ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించడం వల్ల కేంద్రం చేసే చట్టాలు రాష్ట్రాల ప్రయోజనాలకు భిన్నంగా ఉంటే రాజ్యసభ దాన్ని నిరోధిస్తుంది. గతంలో బీహార్‌లోని రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ)కు చెందిన రబ్రీదేవి ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పరిపాలన విధిస్తూ రాష్ట్రపతి చేసిన ప్రకటనను పార్లమెంట్‌లోని లోక్‌సభ ఆమోదించినప్పటికీ రాజ్యసభ తిరస్కరించింది. ఈ కారణంగా బీహార్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేయాల్సి వచ్చింది.

అవశిష్ట అధికారాలు కేంద్రానికే

భారతదేశంలోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా కేంద్రంలో బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఏక కేంద్ర లక్షణాలను రాజ్యాంగంలో ప్రబలంగా పొందుపర్చడం విశేషం. కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ జరిగినప్పటికీ, కేంద్ర జాబితాలో 97, రాష్ట్ర జాబితాలో 66, ఉమ్మడి జాబితాలో 47 అంశాలను పొందుపర్చినప్పటికీ ఉమ్మడి జాబితాలోని అంశాలపై పరోక్షంగా కేంద్రానికి ఆధిపత్యం ఉంటుంది. అవశిష్ట అధికారాలను కూడా కేంద్రానికి కేటాయించడంతోపాటు 249, 250, 356, 252 వంటి అధికరణలు రాష్ట్ర జాబితాలోని అంశాలపై కూడా కేంద్రం శాసనాలు చేయడానికి అవకాశం కల్పిస్తున్నాయి. దీనిద్వారా మన దేశంలో బలమైన కేంద్రం ఉందని పేర్కొనవచ్చు. మన దేశంలోని రాష్ట్రాల్లో అధిపతులుగా వ్యవహరించే గవర్నర్ రాష్ట్రాల పరిపాలనలో కీలకమైన పాత్రను పోషిస్తారు. అయితే గవర్నర్ల నియామకంలో, వారిని బదిలీ చేసే సందర్భంలో, వారి పదవీకాలాన్ని పొడగించడంలో, పదవి నుంచి తొలగించడంలో కేంద్ర ప్రభుత్వమే పూర్తి అధికారాలను కలిగి ఉంటుంది. గవర్నర్ల నియామకంలో, తొలగింపు విషయంలో రాష్ట్రాలకు ఎలాంటి అధికారాలుండవు. రాజ్యాంగంలోని 18వ భాగంలో పొందుపర్చిన అత్యవసర పరిస్థితులు, ఆ సందర్భంలో కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించే తిరుగులేని అధికారాలు మనదేశ ఏక కేంద్ర లక్షణాన్ని తెలియజేస్తున్నాయి. జాతీయ అత్యవసర పరిస్థితిని విధించిన కాలంలో కేంద్రం రాష్ట్ర జాబితాలో పేర్కొన్న అంశాలపై కూడా శాసనాలను చేయవచ్చు. 356 అధికరణను అనుసరించి రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించినప్పు డు రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన అంశాలన్నింటిపై కేంద్రమే శాసనాలు చేస్తుంది. ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించిన కాలంలో కేంద్రం జారీచేసే ఆర్థికపరమైన ఆదేశాలను రాష్ట్రాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అందువల్లే భారతదేశం సాధారణ పరిస్థితుల్లో సమాఖ్యగా, అత్యవసర పరిస్థితుల్లో ఏక కేంద్రంగా పనిచేస్తుందని బి.ఆర్.అంబేద్కర్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాల బర్తరఫ్

భారత రాజ్యాంగంలోని కొన్ని అంశాలు కేంద్రం ఆధిపత్యాన్ని చాటుకోవడానికి, కేంద్రం రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం కలుగజేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. 365 అధికరణ ప్రకారం కేంద్రం.. రాష్ట్రాలకు పరిపాలనాపరమైన ఆదేశాలను జారీ చేసినప్పుడు ఒకవేళ రాష్ట్రాలు పాటించని సందర్భంలో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను బర్తరఫ్ చేయడమే కాకుండా ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవచ్చు. రాష్ట్ర శాసనసభలు రూపొందించి, ఆమోదించిన బిల్లులపై గవర్నర్ తన ఆమోద ముద్ర వేయకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం కేంద్రానికి పంపించవచ్చు. ఒకవేళ రాష్ట్రపతి సదరు బిల్లును తిరస్కరిస్తే దానిపై రాష్ట్రాలకు ఎలాంటి అధికారం ఉండదు.రాష్ట్రాల్లో శాంతిభద్రతలు క్షీణించినప్పుడు రాష్ట్రాలు కోరితే కేంద్రం తన సాయుధ బలగాలను పంపాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రాల అభిప్రాయంతో నిమిత్తం లేకుండానే తన బలగాలను మోహరింపజేసే అధికారం కూడా కేంద్రానికి ఉంది.

పార్లమెంట్‌కు విశేష అధికారాలు

భారతదేశ పరిపాలనలో అత్యంత కీలకపాత్రను పోషించే రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థలు కూడా బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు తోడ్పడ్డాయని పేర్కొనవచ్చు. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆదాయ వనరులను పంపిణీ చేసేందుకు కేంద్ర ఆర్థిక సంఘాన్ని రాష్ట్రపతి ఏర్పాటు చేస్తారు. ఈ ఆర్థిక సంఘాన్ని మనదేశ ఆర్థిక సమాఖ్యను సమన్వయపరిచే చక్రంగా పేర్కొంటారు. ఫైనాన్స్ కమిషన్‌ను కేంద్రమే నియమిస్తుంది. దానిలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రాతినిధ్యం ఉండదు. కేంద్ర ప్రభుత్వ ఖర్చులను, ఖాతాలను తనిఖీ చేసే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చులను, ఖాతాలను కూడా తనిఖీ చేయవచ్చు. అయితే ఈ విషయంలో కాగ్ విధులను, బాధ్యతలను నిర్ణయించే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది. మనదేశ పరిపాలనలో అత్యంత కీలక పాత్రను పోషించే అఖిల భారత సర్వీసుల ఉద్యోగుల ఎంపిక విషయంలో కేంద్రంలో ఉండే యూపీఎస్సీ కీలకపాత్రను పోషిస్తోంది. భారతదేశంలో రాజ్యాంగబద్ధమైన ఎన్నికలను నిర్వహించే కేంద్ర ఎన్నికల కమిషన్ విధివిధానాలను నిర్ణయించడంలో, ప్రజాప్రాతినిధ్య చట్టాలను రూపకల్పన చేయడంలోనూ పార్లమెంట్ మాత్రమే అధికారాన్ని కలిగి ఉంటుంది.

కేంద్ర ప్రణాళికా సంఘం

భారతదేశం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థను అనుసరిస్తోంది. మనదేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు అనే అంశం ఉమ్మడి జాబితాలో ఉంది. 1950లో కేంద్ర కేబినెట్ తీర్మానాన్ని అనుసరించి ఏర్పాటు చేసిన కేంద్ర ప్రణాళికా సంఘం భారత ప్రధానమంత్రి నేతృత్వంలో పని చేస్తోంది. అంటే.. జాతీయ ప్రణాళికలతోపాటు రాష్ట్రాల ప్రణాళికలను నిర్మించడంలో, నియంత్రించడంలో కేంద్రమే ముఖ్యపాత్రను పోషిస్తోంది. ప్రణాళికా సంఘంలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. కేంద్రీకృతమైన ప్రణాళిక వ్యవస్థను అనుసరించడం వల్ల రాష్ట్రాల్లో ప్రణాళికా సంఘాలకు ఎలాంటి ప్రాధాన్యం లేదు. ప్రణాళికా సంఘం రూపొందించిన ప్రణాళికా ముసాయిదాను ఆమోదించే జాతీయాభివృద్ధి మండలికి కూడా ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు. జాతీయాభివృద్ధి మండలిలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించినప్పటికీ ఇది కేవలం ప్రణాళికా సంఘానికి సలహా మండలిగా మాత్రమే పనిచేస్తుంది. అంతర్రాష్ట్ర కౌన్సిల్‌కు ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు. ఈ కౌన్సిల్ కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య అదేవిధంగా రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించే సంస్థగా పని చేస్తోంది.

భారత్‌లో బలమైన కేంద్రం

భారతదేశం సాధారణ సమాఖ్య లక్షణాలను కలిగి ఉన్నప్పటికీ ప్రపంచంలో వాస్తవిక సమాఖ్య ప్రభుత్వానికి ఆదర్శంగా పేర్కొనే అమెరికా సమాఖ్యతో అనేక అంశాల్లో విభేదిస్తోందని పేర్కొనవచ్చు. అమెరికన్ సమాఖ్య ప్రకారం రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను కల్పించి కేంద్ర ప్రభుత్వానికి జాతీయ ప్రాముఖ్యమున్న కొన్ని అంశాలపై అధికారాలను కల్పించారు. అంటే బలమైన రాష్ట్రాలను ఏర్పాటు చేశారు.

భారతదేశంలో కేంద్రానికి ఎక్కువ అధికారాలను కల్పించడం ద్వారా బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. అమెరికాలో మిగులు(అవశిష్ట) అధికారాలను రాష్ట్రాలకు కేటాయించగా భారతదేశంలో మాత్రం దానికి భిన్నంగా కేంద్రానికి కేటాయించారు. అమెరికాలో దేశం మొత్తానికి వర్తించే ఫెడరల్ రాజ్యాంగంతో పాటు ప్రతి రాష్ట్రానికి సొంత రాజ్యాంగాలను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. దీని ద్వారా అక్కడ రెండు రాజ్యాంగాలున్నాయి. భారతదేశంలో ఒకే రాజ్యాంగం అమల్లో ఉంది. అదేవిధంగా అమెరికాలో జాతీయ పౌరసత్వం, రాష్ట్ర పౌరసత్వం అని రెండు పౌరసత్వాలు ఉండగా మనదేశంలో ఒకే పౌరసత్వం అమల్లో ఉంది. ఆ ఒక్క పౌరసత్వం కూడా కేంద్ర జాబితాలో ఉండటం వల్ల పౌరసత్వాలపై చట్టాలను చేసే అధికారాన్ని పార్లమెంట్ కలిగి ఉంటుంది.

అమెరికన్ శాసన శాఖయైన కాంగ్రెస్‌లోని ఎగువసభ సెనేట్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే సెనేట్‌లోని మొత్తం వంద మంది సభ్యులు ఆ దేశంలోని 50 రాష్ట్రాల నుంచి.. అంటే ఒక్కో రాష్ట్రం నుంచి ఇద్దరు సభ్యులు చొప్పున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్కడ పెద్ద రాష్ట్రానికి, చిన్న రాష్ట్రానికి ఒకే రకమైన ప్రాతినిధ్యం కల్పించారు. కానీ భారతదేశంలో రాష్ట్రాల జనాభాను బట్టి రాజ్యసభలో సభ్యుల ప్రాతినిధ్యం వేర్వేరుగా ఉంది. అమెరికాలో వికేంద్రీకృతమైన న్యాయవ్యవస్థ ఉండగా మనదేశంలో కేంద్రీకృతమైన న్యాయవ్యవస్థ అమల్లో ఉంది. రాష్ట్రాల రాజ్యాంగాధిపతులైన గవర్నర్లను అమెరికాలోని రాష్ట్రాల్లో ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. మనం కెనడా పద్ధతిని అనుసరిస్తుండడం వల్ల మన దేశంలోని రాష్ట్రాల అధిపతులైన గవర్నర్లను రాష్ట్రపతి అనగా కేంద్రం నియమిస్తుంది. అమెరికా రాజ్యాంగం వాస్తవికమైన దృఢ రాజ్యాంగంగా వ్యవహరిస్తోంది. కానీ, మనదేశంలో రాజ్యాంగం ప్రధానంగా అదృఢమైనది. భారతదేశంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం తిరుగులేని అధికారాన్ని కలిగి ఉంది. అంటే ఈ విషయంలో రాష్ట్రాల ఆమోదం తప్పనిసరి కాదు.

ఉద్యోగాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా ఈఎంఆర్ పాఠశాలల్లో 21 గెస్ట్ టీచర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా ఐటీడీఏ పాడేరు పరిధిలోని ఏపీ స్టేట్ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఒప్పంద ప్రాతిపదికన గెస్ట్ టీచర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 21.
» పోస్టుల వివరాలు: పీజీటీ-09, టీజీటీ-12.
» సబ్జెక్టులు: ఇంగ్లిష్, తెలుగు, కెమిస్ట్రీ, బయాలజీ, తెలుగు, హిందీ.
» ఈఎంఆర్ పాఠశాలలున్న ప్రాంతాలు:జి.కె.వీధి, ముంచింగ్‌పుట్, డుంబ్రిగూడ, చింతపల్లి, పాడేరు,హుకుంపేట, జి.మాడుగుల, అనంతగిరి, అరకువ్యాలీ, కొయ్యూరు, పెదబయలు.
» అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ, బీఈడీ, సీటెట్, ఎస్‌టెట్ ఉత్తీర్ణులవ్వాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును గురుకులం సెల్, ఐటీడీఏ పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: emrsrecruitment22@gmail.com.
» దరఖాస్తులకు చివరితేది: 26.10.2024.
» వెబ్‌సైట్: https://allurisitharamaraju.ap.gov.in

ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ, కోల్‌కతాలో 13 పోస్టులు

కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్(ఎస్‌ఆర్‌ఎఫ్‌టీఐ) వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 13.
» పోస్టుల వివరాలు: కన్సల్టెంట్-08, అకడమిక్ కన్సల్టెంట్-01, అడ్మినిస్ట్రేటివ్ కన్సల్టెంట్-01, ఔట్‌రీచ్ ఆఫీసర్-01, లీగల్ అడ్వైజర్-01, అకడమిక్ కోఆర్డినేటర్-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(బీబీఏ), పీజీ(ఎంబీఏ), పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: అకడమిక్/అడ్మినిస్ట్రేటివ్ కన్సల్టెంట్ పోస్టులకు 68 ఏళ్లు, మిగతా పోస్టులకు 63 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.50,000 నుంచి 99,000
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డైరెక్టర్, సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్, ఈఎం బైపాస్ రోడ్, పంచశయర్, కోల్‌కతా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 30.10.2024.
» వెబ్‌సైట్: https://srfti.ac.in

మూర్తము నుంచి అమూర్తానికి అనేది..



సంఘీకృత ఉద్గార పద్ధతి/ సామాజిక కృత కథనా పద్ధతి-సామాజిక వాచిక పద్ధతి/ చర్చా పద్ధతి

1. బౌద్ధుల కాలంలో చర్చాపద్ధతి ఆవిర్భవించింది.
2. సంఘీకృత ఉద్గార పద్ధతిని సాంఘీ కీకృతం చేసిన చర్చ అనడం ఉత్తమం.
3. సంఘీకృత ఉద్గార పద్ధతిలో విద్యార్థులు చొరవ తీసుకొని చర్చలు, గోష్ఠులు నిర్వహించుకుంటారు.
4. యాకబ్, సింప్సన్ ప్రకారం సామాజీకీకృత కథనంలో విద్యార్థులు సహజ వాతావరణంలో చర్చలు జరుపుతారు. ప్రశ్నలు వేస్తారు. పథక రచన చేస్తారు, నివేదిస్తారు. ప్రకటనలు చేస్తారు. పనిచేస్తూ ఉంటారు.
5. ఉపాధ్యాయుడు మార్గదర్శకునిలా, సహాయకునిలా, నిర్దేశకునిలా వ్యవహరిస్తాడు.

చర్చ రూపాలు

1. సెమినార్ (సెమినార్ గోష్ఠి పథకం)
   సెమినార్‌లో విద్యార్థులు వ్యక్తిగతం లేదా సామూహికంగా సమస్యను దర్యాప్తు చేసి నివేదిక సమర్పిస్తారు. ఆ నివేదికపై సమావేశంలో చర్చిస్తారు.
   ఉదా: 'రోడ్డు భద్రత విద్య' అనే పాఠ్యాంశంపై సెమినార్.
2. వాగ్వాదం (Debate): ఒక ప్రత్యేకమైన సమస్యపై పరస్పర విరుద్ధమైన అభి ప్రాయాలున్న ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారు. వివాదాంశంపై అనుకూలంగా లేదా ప్రతికూలంగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు. వాగ్వాదం జరిగేటప్పుడు సమన్వయకర్త ఉంటాడు.
   ఉదా: మతం, మానవాళి మనుగడకు అవసరమా? కాదా?
   1. భారత రాజ్యాంగం దృఢమైందా? అదృఢమైందా?
   2. జాతీయ సమైక్యతకు కులం అవరోధమా? కాదా?
   3. రాజ్యాంగం ఏకకేంద్ర లక్షణాలు కలదా? సమైఖ్య లక్షణాలు కలదా?
3. సింపోజియం: ఎంపిక చేసిన విషయంలోని వివిధ అంశాలపై సభ్యులు అభి ప్రాయాలు వ్యక్తం చేస్తారు. స్ట్రక్ ప్రకారం సింపోజియం వ్యాఖ్యానాల సముదా యం. ఇది మౌఖికంగా గానీ, లిఖితంగా గానీ ఉండవచ్చు. సింపోజియంలో చర్చా కార్యక్రమాన్ని తరగతి ఎదుట నిర్వహి స్తారు. సింపోజియంలో నలుగురు లేదా ఐదు మంది ఉంటే మంచిది.
   ఉదా: జాతీయ సమైక్యతకు అవరోధాలు.
4. జట్టు చర్చ (Panel Discussion)
   4 నుంచి 8 మంది విద్యార్థులున్న గ్రూపు ను ప్యానల్ అంటారు. దీనికి ఒక అధ్యక్షుడు ఉంటాడు. సభ్యులు ఇతని ఆధ్వర్యంలో చర్చిస్తారు.
   ★ సభ్యులు అర్ధచంద్రకారంలో ప్లాట్‌ఫాం పై కూర్చుంటారు.
   ★ అధ్యక్షుడు అడిగే ప్రశ్నలకు సభ్యులు జవాబులిస్తారు.
5. రౌండ్ టేబుల్ సమావేశం:
   1. ఇది తరగతిలో విద్యార్థులు నిర్వహించే బహిరంగ చర్చ. విద్యార్థులను నాలుగు లేదా ఐదు వర్గాలుగా విభజిస్తారు.
   2. వీరు ఒక అంశాన్ని చర్చిస్తారు.
   3. చిన్న సమూహంలో చర్చ ప్రభావ వంతమైన ఫలితాన్ని ఇస్తుంది.
   4. విద్యార్థులందరూ చర్చలో పాల్గొంటారు. కాబట్టి మంచి ఫలితాలు పొందవచ్చు.
   5. చర్చలు పూర్తయిన తర్వాత ప్రతి గ్రూపు తరగతిలో సారాంశాన్ని నివేదించాలి.
   6. రౌండ్ టేబుల్ సమావేశాన్ని గ్రూపు చర్చ అని కూడా అంటారు.
   ఉదా: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలు.
6. కార్య శిబిరం (Workshops)
   కార్యశిబిరంలో పాల్గొనే వ్యక్తులు పత్రాలను పాటించడం, చర్చలను నిర్వర్తిం చడం వంటి కార్యకలాపాలను ఆచరణ రూపంలో చేస్తారు.
   ఉదా: విద్యార్థుల్లో పటాలు గీసే నైపుణ్యాలు పెంపొందించే వర్క్‌షాప్.
7. బ్రెయిన్ స్టార్మింగ్ :
   • ఆలెక్స్ ఆస్‌బర్న్ రూపొందించారు.
   • మెదడులో ఆలోచనలు రేకెత్తించడం దీని ముఖ్య ఉద్దేశం.
   • ఉపాధ్యాయుడు ఒక సమస్యను విద్యా ర్థులకు ఇచ్చి వారి నుంచి సమాధానా లు కోరతాడు. ఆ సమాధానాలు సరైనవా కావా? అనేవి ముఖ్యం కాదు. విద్యార్థుల్లో విభిన్న ఆలోచనలు రేకెత్తించి సృజనాత్మకత పెంపొందించడం బ్రెయిన్ స్టార్మింగ్ ముఖ్య ఉద్దేశం.

ప్రయోజనాలు:

1. విద్యార్థి సాంఘీకీకరణానికి వీలు కలుగుతుంది.
2. నాయకత్వ లక్షణాలు పెంపొందిం చవచ్చు.
3. వాక్‌పటిమను అభివృద్ధి చేయవచ్చు.
4. ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం నేర్పవచ్చు.
5. ప్రజాస్వామ్య విలువలు పెంచవచ్చు.
6. ఉపాధ్యాయుడికి, విద్యార్థులకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పవచ్చు.

పరిమితులు:

1. నిరర్థకమైన చర్చగా పరిణమించవచ్చు.
2. కాలయాపనతో కూడుకున్నది
3. ధైర్యం, చొరవ ఉన్న కొద్ది మంది విద్యార్థులు మిగతావారిపై ఆధిపత్యం చూపవచ్చు.
4. విద్యార్థులు వాదన పటిమ కోసం, ప్రజ్ఞను చూపించడం కోసం వాదించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. విద్యార్థులు తోటివారి అభిప్రాయాలను గౌరవించడం ఏ పద్ధతిలో నేర్చు కుంటారు?
   1) ప్రశ్నోత్తర 2) ప్రకల్పన
   3) ఉపన్యాస 4) చర్చా
2. సాంఘిక శాస్త్రానికి ఒక చక్కని విద్యా ప్రణాళికా ప్రయోగశాల?
   1) పాఠశాల ప్రయోగశాల
   2) సాంఘికశాస్త్ర మ్యూజియం
   3) సాంఘికశాస్త్ర తరగతి గది
   4) చుట్టూ ఉండే సమాజం
3. సింపోజియంలో ఎంతమంది విద్యార్థులు పాల్గొంటే బాగుంటుంది?
   1) 10-15 2) 20-30
   3) 15-18 4) 4-5
4. విద్యార్థుల్లో స్వీయ అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం కల్పించే పద్ధతి?
   1) పర్యవేక్షితాధ్యయనం
   2) సామాజీకీకృత కథనం
   3) మూలాధార పద్ధతి
   4) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
5. జిల్లా ఉపవిద్యాధికారి జనవరిలో పూర్తి చేయాల్సిన సిలబస్ డిసెంబర్‌లోనే పూర్తి చేయాలని ఆదేశించాడు. అప్పుడు హై స్కూల్ ఉపాధ్యాయుడిగా మీరు?
   1) ముఖ్యమైన అంశాలు బోధిస్తారు
   2) ఉపన్యాస పద్ధతిలో బోధిస్తారు
   3) చర్చా పద్ధతిలో కష్టమైన పాఠాలు బోధిస్తారు
   4) సమస్యాపరిష్కార పద్ధతి అవలంబిస్తారు
6. పర్యవేక్షితాధ్యయనంలో మోబిల్ ఇ. సింప్సన్ ఒక పాఠానికి 90 నిమిషాల కాలవ్యవధిని కేటాయించి దాన్ని కింది ఏ కార్యకలాపాలుగా వర్గీకరించారు?
   1) సమీక్ష-25ని., నియోజన 25ని.,అభ్యాసాలు 15ని., నియోజిత అధ్యయనం 20 ని.
   2) సమీక్ష-25 ని., నియోజన-25 ని.,అభ్యాసాలు 5ని.,నియోజితాధ్య యనం-35 ని.
   3) సమీక్ష-30ని., నియోజన 20ని.,అభ్యాసాలు,10ని., నియోజితాధ్య యనం-20 ని.
   4) సమీక్ష-25ని.,నియోజన-35ని.,అభ్యాసాలు-15ని.,నియోజితాధ్య యనం-20 ని
7. ఏ బోధనా పద్ధతిలో మోడరేట్ ఆవశ్యకత ఉంటుంది?
   1) సమస్యాపద్ధతి 2) మూలాధార పద్ధతి
   3) సామాజీకీకృత కథనం
   4) సమస్యా పద్ధతి
8. 9వ తరగతిలోని భూపట చలనాలు అనే అంశం బోధించడానికి అనువైన పద్ధతి?
   1) మూలాధార పద్ధతి
   2) ఉపన్యాస ప్రదర్శనా పద్ధతి
   3) సామాజీకీకృత కథనం
   4) సమస్యాపద్ధతి
9. సింపోజియం గోష్ఠిలో?
   1) అనేకమంది విద్యార్థులు ఒక సమస్య గురించి నివేదిస్తారు
   2) ఎంపికచేసిన విషయంలో వివిధ అంశాలపై పాల్గొనే సభ్యులు అభిప్రా యాలు వ్యక్తం చేస్తారు
   3) తరగతిని 4 లేదా 5 చర్చా వర్గాల కింద విభజిస్తారు
   4) చైర్మన్ ప్రశ్నలకు 4 నుంచి 8 మంది అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు
10. జట్టు బోధనలో రెండు అంతకంటే ఎక్కువ విషయాలు ఒకే వర్గంలోని విద్యార్థులకు సంయుక్తంగా చేపట్టడం?
    1) సంచయన క్రమానుగతం
    2) సమవర్తిత విషయాలు
    3) ఏక కేంద్ర నమూనా
    4) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం
11. కంప్యూటర్ యుగంలో సాంఘికశాస్త్ర అధ్యయనాలు అవసరమా? కాదా? అనే అంశాన్ని చేపట్టడానికి సామాజీకృత కథనంలోని ఏ రూపం అనువైంది?
    1) సెమినార్ గోష్ఠి పథకం
    2) వాగ్వాదం 3) సింపోజియం
    4) కార్యశిబిరం
12. 'జలియన్‌వాలాబాగ్ దురంతం'అనే అం శాన్ని బోధించడానికి అత్యుత్తమ మూలాధారం?
    1) ఆనాటి వార్తాపత్రికలు
    2) చిరస్మారకాలు
    3) ఉద్యమ నాయకుల రచనలు
    4) జలియన్ వాలాబాగ్‌కు సంబంధించిన నమూనా
13. ఆదాయం, వ్యయాన్ని సూచించే 'సంతులిత బడ్జెట్' అనే అంశాన్ని బోధించడానికి అనువైన బోధనోపకరణం?
    1) కమ్మీగ్రాఫ్ 2) టేబుల్ చార్ట్
    3) ఫ్లోచార్ట్ 4) లైన్ గ్రాఫ్
14. బోధనలో క్రమమైన, తార్కికమైన, ఫలప్రదమైన ఏర్పాటును సూచించేది?
    1) ఉపగమం 2) నైపుణ్యం
    3) వ్యూహం 4) బోధనాంశం

సమాధానాలు

1) 4 2) 4 3) 4 4) 2 5) 2
6) 2 7) 3 8) 2 9) 2 10) 2
11) 2 12) 2 13) 2 14) 3

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విద్యార్థి వాస్తవ జీవిత సమస్యలను ఎదుర్కోవడానికి తగిన సామర్థ్యాన్ని పెంపొందించే జీవితాన్ని సరిదిద్దుకోగల జ్ఞానాన్ని ఇవ్వడం ఏ యూనిట్ ముఖ్యోద్దేశం?
   1) వనరుల యూనిట్
   2) బోధనా యూనిట్
   3) అనుభవ ప్రాముఖ్య యూనిట్
   4) నిర్మాణాత్మక యూనిట్
2. 'సింపోజియం వ్యాఖ్యానాల సముదాయంగా ఉంటుంది. ఇది మౌఖికంగా గానీ, లిఖితంగా గానీ ఉండవచ్చు. విభిన్న భావాలను, దృక్పథాలను అందిస్తుంది' అని పేర్కొన్నవారు?
   1) రెమాంట్ 2) వెస్లీ
   3) స్ట్రక్ 4) రాన్స్కీ
3. జట్టు బోధన భావన ఏ దేశంలో ఆవిర్భ వించింది?
   1) రష్యా 2) అమెరికా
   3) ఇంగ్లండ్ 4) ఇండియా
4. మూర్తము నుంచి అమూర్తానికి అనేది ఒక?
   1) బోధనా క్షేత్రం 2) బోధనా ప్రవర్తన
   3) బోధనోపకరణం 4) బోధనా సూత్రం
5. కిందివాటిలో సామాజిక సర్వేకు సరిపోయే అంశం?
   1) గ్రామస్థుల్లోని మూఢనమ్మకాలను తెలుసుకోవడం
   2) పాఠశాల స్థితిగతులను తెలుసుకోవడం
   3) బహుళార్థ సాధక ప్రాజెక్టుల ప్రయోజనాలను తెలుసుకోవడం
   4) విద్యార్థులు సాధించిన ప్రగతిని తెలుసుకోవడం
6. 9వ తరగతి విద్యార్థులకు కుటుంబ బడ్జెట్ అనే పాఠాన్ని అవగాహన చేయించడానికి అనువైన పద్ధతి?
   1) ప్రాజెక్టు 2) ఉపన్యాస
   3) ప్రదర్శన 4) బృంద

సమాధానాలు

1) 4; 2) 3; 3) 2; 4) 4; 5) 1; 6) 1.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ-మెయిల్ sakshieducation@gmail.com

నేత్రానుగుణ్యత అంటే ఏమిటి?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

కాంతి

పుటాకార దర్పణం

పుటాకార దర్పణానికి ఎదురుగా ఒక చిన్న వస్తువును ఉంచినప్పుడు దాని ప్రతిబింబం పెద్దగా ఆవర్తనం చెంది తలకిందులుగా ఏర్పడుతుంది.

1. చెవి, ముక్కు, గొంతు పరిశీలించడానికి వైద్యులు ఈ దర్పణాన్ని ఉపయోగిస్తారు. కాబట్టి దీన్ని డాక్టర్స్ మిర్రర్ అని కూడా అంటారు.
2. సౌరశక్తిని ఒక బిందువు వద్ద కేంద్రీకరించే సోలార్ కనెక్టర్లలో ఈ దర్పణాన్ని ఉపయోగిస్తారు. అందువల్ల దీన్ని బర్నింగ్ మిర్రర్ అంటారు. సోలార్ కనెక్టర్లలో పుటాకార దర్పణాలు, కుంభాకార దర్పణాలను ఉపయోగించవచ్చు.
3. దీన్ని సేవింగ్ మిర్రర్‌గా ఉపయోగిస్తారు.
4. టార్చిలైట్, వాహనాల హెడ్‌లైట్‌లలో ఈ దర్పణాన్ని ఉపయోగిస్తారు. ఈ దర్పణాల ప్రధాన నాభి వద్ద విద్యుత్ బల్బును అమర్చుతారు.

కుంభాకార దర్పణం

కుంభాకార దర్పణంలో పెద్ద వస్తువు ప్రతిబింబం చిన్నగా, నిటారుగా ఏర్పడుతుంది.

1. కుంభాకార దర్పణాన్ని వాహనాల్లో డ్రైవర్ పక్కన అద్దాలుగా ఉపయోగిస్తారు.
2. ఆగ్రాకోట వద్ద ఏర్పాటు చేసిన కుంభాకార దర్పణంలో తాజ్‌మహల్ పూర్తి ప్రతిబింబం కనిపిస్తుంది.

- **దూరదర్శిని:** కంటి నుంచి దూరంగా ఉన్న వస్తువులను దగ్గరగా స్పష్టంగా చూడటానికి దూరదర్శినులను ఉపయోగిస్తారు.
- దూరదర్శినిని 1608 జనవరి 10న గెలీలియో అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.
- **దూరదర్శిని రకాలు:** ఉపయోగించే విధానాన్ని బట్టి దూరదర్శినిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **ఖగోళ దూరదర్శిని:** భూమికి ఆవల ఉన్న ఖగోళ వస్తువులను అంటే సూర్యుడు, నక్షత్రాలు, గ్రహాలు మొదలైన వాటిని పరిశీలించడానికి ఈ దూరదర్శినిని ఉపయోగిస్తారు. దీనిలో తుది ప్రతిబింబం తలకిందులుగా ఏర్పడుతుంది. అయితే ఖగోళ వస్తువులన్నీ గోళాకారంలో ఉండటం వల్ల ఖగోళ వస్తువులను ఈ దూరదర్శిని ద్వారా పరిశీలించడంలో ఎలాంటి సమస్య ఉండదు.

- **భూ ఖగోళ దూరదర్శిని:** భూమి, సముద్రాలపై దూరంగా ఉన్న వస్తువులను దగ్గరగా, స్పష్టంగా చూడటానికి ఖగోళ దూరదర్శినిని ఉపయోగిస్తారు. దీనిలో తుది ప్రతిబింబం నిటారుగా ఏర్పడుతుంది. నిర్మాణం దృష్ట్యా దూరదర్శినులను తిరిగి రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **వక్రీభవన దూరదర్శిని:** ఇలాంటి దూరదర్శినిని కటకాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ రకానికి చెందిన దూరదర్శినిని గెలీలియో కనుగొన్నాడు.
2. **పరావర్తన దూరదర్శిని:** వీటిని దర్పణాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ రకానికి చెందిన దూరదర్శినిని జేమ్స్ గ్రిగోరి అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

1. హబుల్ స్పేస్ టెలిస్కోప్‌ను 1990 ఏప్రిల్‌లో నాసా శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి ప్రవేశపెట్టారు. దీని ద్వారా విశ్వ రహస్యాలను అధ్యయనం చేస్తున్నారు.
2. X-కిరణాలతో పనిచేసే మొదటి టెలిస్కోప్ (చంద్ర X-Ray)ను నాసా శాస్త్రవేత్తలు రూపొందించారు. దీన్ని 1999లో అంతరిక్షంలోకి ప్రయోగించారు.
3. రేడియో తరంగాలను ఉపయోగించి పనిచేసే ప్రపంచంలో అతిపెద్దదైన రేడియో టెలిస్కోప్‌ను మహారాష్ట్రలోని పుణే సమీపంలో ఏర్పాటు చేశారు. దీని పేరు India Giant రేడియో ఆస్ట్రోనామికల్ టెలిస్కోప్.
4. 2009 మార్చి 6న కెప్లర్ టెలిస్కోప్‌ను నాసా శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి ప్రయోగించారు. ఈ టెలిస్కోప్‌ను ఉపయోగించి జీవరాశిని కలిగి ఉన్న గ్రహాల ఉనికిని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.
5. ప్రపంచంలో అతిపెద్దదైన సోలార్ టెలిస్కోప్‌ను భారతదేశం రూపొందిస్తోంది. దీన్ని జమ్మూకాశ్మీర్‌లోని లఢక్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారు.

మైక్రోస్కోప్‌లు

- **సూక్ష్మదర్శినులు:** కంటికి దగ్గరగా ఉన్న చిన్న వస్తువులను పెద్దగా, స్పష్టంగా చూడ డానికి సూక్ష్మదర్శినులను ఉపయోగిస్తారు. వీటిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.
- **సరళ సూక్ష్మదర్శిని:** దీన్ని తక్కువ నాభ్యాంతరం ఉన్న ఒకే ఒక కుంభాకార కటకాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ కటకాలకు ఒకవైపున చిన్న వస్తువును ఉంచి రెండో వైపు నుంచి చూస్తే దాని ప్రతిబింబం ఆవర్తనం చెంది నిటారుగా కనిపిస్తుంది. కాబట్టి సరళ సూక్ష్మదర్శినిలో చిన్న వస్తువు ప్రతిబింబం చాలా పెద్దదిగా కనిపిస్తుంది.

ఉపయోగాలు

1. చిన్న అక్షరాలను స్పష్టంగా చదవడానికి
2. వేలిముద్రలను, హస్తరేఖలను పరిశీలించడానికి
3. గడియారంలోని చిన్న భాగాలను స్పష్టంగా చూడటానికి
4. వాచ్ మెకానిక్‌లు ఈ సరళ సూక్ష్మదర్శినిని ఉపయోగిస్తారు.

- **సంయుక్త సూక్ష్మదర్శిని:** దీనిలో రెండు కుంభాకార కటకాలు ఉంటాయి. ఇందులో వస్తువుకు దగ్గరగా ఉన్న కటకాలను వస్తు కటకం, కంటికి దగ్గరగా ఉన్న కటకాన్ని అక్షి కటకం అంటారు. ఈ రెండు కటకాల మధ్య దూరాన్ని సంయుక్త సూక్ష్మదర్శిని పొడవు అని అంటారు. ఈ సూక్ష్మదర్శినిలో చిన్న వస్తువు ప్రతిబింబం మొదట వస్తు కటకం వల్ల, ఆ తర్వాత అక్షి కటకం వల్ల రెండుసార్లు ఆవర్తనం చెంది తుది ప్రతిబింబం తలకిందులుగా ఏర్పడుతుంది. సంయుక్త సూక్ష్మదర్శిని ఆవర్తన సామర్థ్యం సరళ సూక్ష్మదర్శినితో పోల్చినప్పుడు 1000 నుంచి 2000 రెట్లు ఎక్కువగా ఉంటుంది. బ్యాక్టీరియా, ఫంగస్, వృక్ష కణాలు, జంతు కణాలు, జీవ కణాలు, రక్త కణాలు, పుప్పొడి రేణువులు మొదలైన వాటిని పరిశీలించడానికి దీన్ని ఉపయోగిస్తారు.

1. ఎలక్ట్రానిక్స్ సూత్రం ఆధారంగా పనిచేసే ఎలక్ట్రానిక్స్ మైక్రోస్కోప్ ఆవర్తన సామర్థ్యం సంయుక్త సూక్ష్మదర్శిని కంటే 265 రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వైరస్‌ను పరిశీలించడానికి దీన్ని ఉపయోగిస్తారు.
2. 2011 సెప్టెంబరులో బ్రిటన్ శాస్త్రవేత్తలు ఆప్టికల్ మైక్రోస్కోప్‌ను కనుగొన్నారు. దీని ఆవర్తన సామర్థ్యం ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్‌తో పోల్చినప్పుడు 250 రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రాథమిక కణాల గురించి అధ్యయనం చేయడానికి దీన్ని ఉపయోగిస్తున్నారు.

- **స్టీరియోస్కోప్:** హోలోగ్రఫీ విధానంలో చిత్రీకరించిన త్రిడైమెన్షనల్ ఫొటోలను చూడటానికి ఈ సాధనాన్ని ఉపయోగిస్తారు.
- **స్ట్రోబోస్కోప్:** గమనంలో ఉన్న వస్తువు, తన చుట్టూ తాను తిరుగుతున్న వస్తువును నిశ్చల స్థితిలో ఉన్నట్లుగా చూడటానికి ఈ సాధనాన్ని ఉపయోగిస్తారు.
- **పెరిస్కోప్:** Z ఆకారం ఉన్న ఒక గొట్టం రెండు మూలల వద్ద M_1, M_2 అనే రెండు సమతల దర్పణాలను ఒక్కొక్క దాన్ని 45° కోణంతో అమర్చుతారు. యుద్ధం జరిగే సమయంలో బంకరు (గొయ్యి)లో ఉన్న సైనికులు, జలాంతర్గామిలో ఉన్న నావికులు, శత్రువుల కదలికలను పరిశీలించడానికి దీన్ని ఉపయోగిస్తారు.
- **కెలిడియోస్కోప్:** దీన్ని మూడు సమతల దర్పణాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ దర్పణాలను సమబాహు త్రిభుజం ఆసన్న భుజాల్లా అమర్చి నిర్మిస్తారు. ఈ దర్పణాల మధ్య ఒక వస్తువును ఉంచినప్పుడు అనేక ప్రతిబింబాలు కనిపిస్తాయి.
- **Sextant:** త్రికోణమితిలోని Secθ సూత్రం ఆధారంగా ఈ సాధనం పనిచేస్తుంది. దీన్ని ఉపయోగించి పర్వతాలు, భవనాలు, కట్టడాల ఎత్తును తెలుసుకోవచ్చు.
- **అల్టీమీటర్:** ఈ సాధనాన్ని గగనతలంలో ఎగురుతున్న విమానాలు, రాకెట్‌లు, క్షిపణులు మొదలైన వాటిలో అమర్చి భూఉపరితలం నుంచి ఆ వస్తువుల ఎత్తును కొలవవచ్చు.
- **సినిమా ప్రొజెక్టర్:** దీన్ని థామస్ అల్వా ఎడిసన్ కనుగొన్నాడు. సినిమా ప్రొజెక్టర్‌కు ముందు భాగంలో కుంభాకార కటకాలను అమర్చుతారు. ఈ ప్రొజెక్టర్ ద్వారా ఒక సెకన్ కాలంలో 16 ఫిల్మ్‌లు కదలి వెళ్లినట్లయితే తెరపైన ఏర్పడిన బొమ్మ సజీవ చిత్రంలా కనిపిస్తుంది.
- టెలివిజన్‌ను జె.ఎల్. బయర్డ్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. టెలివిజన్‌లో కెనియోస్కోప్ అనే పరికరం విద్యుదయస్కాంత తరంగాలను —వ సెకను కాలంలో పిక్చర్‌గా మార్చుతుంది.
- ఆధునిక కాలంలో ఉపయోగిస్తున్న ఎల్‌సీడీ, ఎల్ఈడీలను క్యాలెండర్ టెలివిజన్‌లు అని పిలుస్తారు. వీటిలో పిక్చర్ స్పష్టత ఎక్కువగా ఉంటుంది.
- **కెమెరా:** కెమెరాను జోసెఫ్ నయోప్సీనైస్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. మానవుని కంటి భాగాలను ఆధారంగా చేసుకొని కెమెరాను ఆవిష్కరించారు. కెమెరా వివిధ భాగాలతో కంటిలోని భాగాలను పోల్చవచ్చు.

1. మానవ కనుగుడ్డు కెమెరాలోని కుంభాకార కటకంలా పనిచేస్తుంది. ఈ కనుగుడ్డు ఉబ్బెత్తుగా ఉండి కుంభాకార కటకంలా పనిచేస్తుంది. కాబట్టి కనుగుడ్డు వస్తువు దూరాన్ని ఆధారంగా చేసుకొని తనంతట తానుగా తన నాభ్యాంతరాన్ని మార్చుకుంటూ ఆ వస్తువును స్పష్టంగా చూడగలుగుతుంది. ఈ ధర్మాన్ని నేత్రానుగుణ్యత అంటారు.
2. కనురెప్ప కెమెరాలోని మూతలా పనిచేసి, కనుగుడ్డుకు రక్షణ కల్పిస్తుంది.
3. రెటీనా కెమెరాలోని ఫిల్మ్‌లా పనిచేస్తుంది. కాబట్టి వస్తువు ప్రతిబింబం దీనిపైన ఏర్పడుతుంది.

నిశ్చల స్థితిలో ఉన్న ఒక వస్తువును ఫొటో తీయడాన్ని స్టిల్ ఫొటోగ్రఫీ అంటారు. కదులుతున్న వస్తువును ఫొటో తీయడాన్ని Kinetography అంటారు.

అదృశ్య వికిరణాలు

పరారుణ కిరణాలు: పరారుణ కిరణాలను హెర్చెల్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఈ కిరణాల తరంగదైర్ఘ్య అవధి 7500 A° నుంచి సుమారు 4 మిలియన్‌ల A° వరకు ఉంటుంది. ఈ కిరణాలను అన్ని రకాలైన గాజు పదార్థాలు శోషించుకుంటాయి. కాబట్టి గాజుతో నిర్మించిన సాధనాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని గుర్తించేందుకు వీలుకాదు.

రాతి ఉప్పు/ సైంధవ లవణం: రాతి ఉప్పుతో చేసిన పట్టకం, కటకాల ద్వారా ఈ తరంగాలు చొచ్చుకువెళతాయి. ఇలాంటి పట్టకం, కటకాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

- పరారుణ కిరణాలు వాటి వెంట ఉష్ణాన్ని మొసుకొనిపోతాయి. ఈ కిరణాలు ఏవైనా వస్తువులను తాకినప్పుడు ఆ వస్తువుల ఉష్ణోగ్రత పెరుగుతుంది. కాబట్టి పరారుణ కిరణాలను ఉష్ణ వికిరణాలు అని కూడా అంటారు. ఈ సూత్రం ఆధారంగా పనిచేసే థర్మోపైల్, బోలోమీటర్ అనే సాధనాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

ఉపయోగాలు

1. టీవీ, రేడియో కార్యక్రమాల ప్రసారానికి
2. టీవీ రిమోట్ కార్డ్‌లో
3. రహస్య సంకేతాలను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి ప్రసారం చేసేందుకు
4. పొగమంచు, దుమ్ము, ధూళి కణాల ద్వారా కొంతదూరంలో ఉన్న వస్తువులను చూసేందుకు, స్పష్టంగా ఫొటో తీసేందుకు
5. గోడలపై ఉన్న పాత చిత్రలేఖనాలను తొలగించేందుకు
6. కండరాల నొప్పిని, బెణుకుల నొప్పిని తగ్గించేందుకు
7. పక్షవాతాన్ని నయం చేసేందుకు
8. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాలను నియంత్రించేందుకు
9. తక్కువ దూరం ప్రయాణించేందుకు, రాకెట్లు, క్షిపణుల కోసం ఈ కిరణాలను మార్గ నిర్దేశిక కిరణాలుగా ఉపయోగిస్తారు.

దృష్టి రకాలు

1. **మోనాక్యులర్ దృష్టి:** ఒకే కన్నుతో వస్తువులను చూడగలగడాన్ని మోనాక్యులర్ దృష్టి అంటారు.
   ఉదా: కాకి దృష్టి
2. **బైనాక్యులర్ దృష్టి:** రెండు కళ్లతో వస్తువులను చూడగలిగే దృష్టి జ్ఞానాన్ని బైనాక్యులర్ దృష్టి అంటారు.
   ఉదా: మానవుడి దృష్టి
3. **నిషాచర దృష్టి:** రాత్రి సమయంలో లేదా చీకటిలో వస్తువులను చూడగలిగే దృష్టి జ్ఞానాన్ని నిషాచర దృష్టి అంటారు.
   ఉదా: పిల్లిదృష్టి

దృష్టిలోపాలు

1. **హ్రస్వదృష్టి (దగ్గర దృష్టి):** కంటికి దగ్గరగా ఉన్న వస్తువును మాత్రమే చూడగలిగి దూరంగా ఉన్న వస్తువును చూడలేని దృష్టిలోపాన్ని హ్రస్వ దృష్టి అంటారు. ఈ దృష్టి లోపాన్ని నివారించడానికి తగిన నాభ్యాంతరం ఉన్న వికేంద్రీకరణ కటకాన్ని ఉపయోగించాలి.
2. **దూరదృష్టి (దీర్ఘ దృష్టి):** కంటి నుంచి దూరంగా ఉన్న వస్తువును మాత్రమే చూడగలిగి దగ్గరగా ఉన్న వస్తువును చూడలేని దృష్టిలోపాన్ని దూరదృష్టి లేదా దీర్ఘ దృష్టి అంటారు. ఈ దృష్టి లోపాన్ని తగిన నాభ్యాంతరం ఉన్న కేంద్రీకరణ కటకాన్ని ఉపయోగించి నివారించవచ్చు.

- **అసమదృష్టి:** కంటిలోని కార్నియా అనే భాగం దెబ్బతినడం వల్ల ఈ దృష్టి లోపం ఏర్పడుతుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులు ఏ వస్తువును పరిశీలించినా అడ్డు, నిలువు రేఖలుగా కనిపిస్తుంది. ఈ లోపాన్ని సవరించడానికి తగిన నాభ్యాంతరం ఉన్న స్తూపాకార కటకాన్ని ఉపయోగించాలి.
- **చత్వారం:** కొంత మందిలో వయసు పెరిగిన కొద్దీ కళ్ల నేత్రానుగుణ్యతను కోల్పోతాయి. అంటే తమంతట తాము తమ నాభ్యాంతరాన్ని మార్చుకోలేక దగ్గరగా, దూరంగా ఉన్న వస్తువులను చూడటం వీలుకాదు. ఇలాంటి దృష్టి లోపాన్ని చత్వారం అంటారు. ఈ లోపాన్ని సవరించడానికి ద్వినాభికటకాన్ని ఉపయోగించాలి.
- **రేచీకటి:** విటమిన్-ఎ లోపం వల్ల ఈ దృష్టి లోపం ఏర్పడుతుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులకు పగటి సమయంలో అంటే సూర్యకిరణాల సమక్షంలో మాత్రమే దృష్టి జ్ఞానం ఉంటుంది. కానీ రాత్రి సమయంలో లేదా చీకటిలో కృత్రిమ కాంతి జనకాల వల్ల వచ్చే కాంతి తీవ్రత వల్ల దృష్టి జ్ఞానం కలుగదు. ఇలాంటి దృష్టి లోపాన్ని రేచీకటి అంటారు. ఈ లోపాన్ని సవరించుకోవడానికి విటమిన్ -ఎ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తీసు కోవాలి.
- **వర్ణాంధత్వం:** కంటిలో కోన్స్ లోపం వల్ల ఈ దృష్టి లోపం ఏర్పడుతుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులు అన్ని రంగులను గుర్తిం చలేరు. కాబట్టి ఈ దృష్టి లోపాన్ని వర్ణాంధత్వం అంటారు. ఇది జన్యువుల ద్వారా తల్లిదండ్రుల నుంచి సంతానానికి సంక్రమిస్తుంది. అందువల్ల దీనికి చికిత్సా విధానం అందుబాటులో లేదు.


How far is the starting point..

BANK EXAMS REASONING

DIRECTIONS

Main Directions:

East West
North South



Sub-Directions (or) Cardinal Directions:

North-East South-East
South-West North-West

From the above diagram, we can also observe that:


a) Angle between North and East is 90°
b) Angle between North-East and East is 45°
c) Angle between North and South-East is 135°

Rotation of Angles: To solve angle movement questions, it is necessary to know about the rotations of angles.

CW (Clock Wise)


ACW (Anti Clock Wise)

Left-Right Conditions:



Pythagoras Rule:

$a^2 + b^2 = c^2$



Some standard values:

If a = 3; b = 4, then c = 5 i.e., $3^2 + 4^2 = 5^2$

$a^2 + b^2 = c^2$

$3, 4, 5 \to 3^2 + 4^2 = 5^2$

$5, 12, 13 \to 5^2 + 12^2 = 13^2$

$7, 24, 25 \to 7^2 + 24^2 = 25^2$

$8, 15, 17 \to 8^2 + 15^2 = 17^2$

Shadow Cases:

Morning

Direction	*Shadow falls*
East	Front side
West	Back side
North	Left side
South	Right side

Evening

Direction	*Shadow falls*
East	Back side
West	Front side
North	Right side
South	Left side


- At 12 Noon there is no shadow because the rays of the sun are vertically downward.

Exercise

1. Satyam starts walking towards East and after walking 20 m, turn Southwards and walks 10 m and then he turns to his right and walks 30 m. In which direction is he now with respect to the starting point?

1) South 2) West
3) South-East 4) South-West
5) None of these

Sol:



So, Satyam is in the south-west direction with respect to starting point.

This type of question, can solve in distance method:

1. **Same Directions (Addition)**
   $E_3 + E_4 = E_7$
   $S_2 + S_3 = S_5$
2. **Opposite Directions (Subtraction)**
   $N_3 - S_8 = S_5$
   $E_8 - W_3 = E_5$
3. ⊥ (Pythagoras) Directions ($a^2 + b^2 = c^2$)
   $E_5N_{12} = NE_{13}$
   $E_3S_4 \Rightarrow SE_5$

Above,
question we can write
$E_{20}\,S_{10}\,W_{30} \Rightarrow W_{10}\,S_{10} \Rightarrow SW$
Ans: 4

2. Anirudh walked 35 meters towards South. Then he turned to his left and walked 40 meters. He then turned towards his left and walked 15 meters. He again turned to his right and walked 25 meters. At what approximate distance is he from the starting point and in which direction?

1) 60m NE 2) 35m SE
3) 67m East 4) 67m SE
5) None of these

Sol: $S_{35}\,E_{40}\,N_{15}\,E_{25}$
$S_{35}\,N_{15}\,E_{40}\,E_{25}$

$S_{20}E_{65} \to 20^2 + 65^2 = 4625$
approx. 67m.
SE_{67}
Ans: 4

3. Arun travels 10 miles towards West, then travels 20 miles South, then travels 6 miles East, then travels 20 miles North and then finally goes 10 miles West. How far is he from the starting place?


1) 10 2) 14 3) 20 4) 6
5) None of these

Sol: $W_{10}\,S_{20}\,E_6\,N_{20}\,W_{10}$
W_{14}
Ans: 2

4. A is East to B and West of C, H is South-West of C and B is South-East of X, who is the farthest West?

1) C 2) A 3) X 4) B
5) None of these

Sol:



B is the farthest west
Ans: 4

5. Gopal moves towards South-East a distance of 7m, then he moves towards west and travels a distance of 14m. From here, he moves towards North-West a distance of 7m and finally he moves a distance of 4m towards East and stood at that point. How far is the starting point from where he stood?

1) 3m 2) 4m
3) 10m 4) 11m
5) None of these

Sol: $SE_7\,W_{14}\,NW_7\,E_4 = W_{10}$
Ans: 3

Directions (Q. No. 6 and 7) Study the following information care- fully and answer the questions given below.

Point P is 9m towards the East of point Q. Point R is 5m towards the South of point P. Point S is 3m towards the West of point R. Point T is 5m towards the North of point S. Point V is 7m towards the South of point S.

6. If a person walks in a straight line for 8m towards West from point R, which of the following points would he cross the first?


1) V 2) Q 3) T 4) S
5) None of these

Ans: 4

7. Which of the following points are in a straight line?

1) P, R, V 2) S, T, Q
3) P, T, V 4) V, T, R
5) None of these

Sol:




Ans: 5

8. If North is called as East, West is called as North and so on.. then South East is called as?

1) South-West 2) South
3) North East 4) North
5) None of these

Sol:



Ans: 1

9. One early morning, after the sunrise a man was standing facing a pole. The shadow of the pole fell exactly to his right. In which direction person facing finally?

1) North 2) East
3) West 4) South
5) None of these

Ans: 4

10. A man travels 4 km due North, the travels 6 km due East and further travels 4 km due North. How far and in which direction is he from the starting point?


1) 14 km North East
2) 10 km North East
3) 3 km South East
4) 14 km North West
5) None of these

Sol: $N_4\,E_6\,N_4$
$N_8\,E_6$ (⊥)
NE_{10}
Ans: 2

11. Seven villages A, B, C, D, E, F and G are situated as follow.
E is 2 km to the West of B
F is 2 km to the North of A
C is 1 km to the West of A
D is 2 km to the South of G
G is 2 km to the East of C

1) E and G 2) E and C
3) G and C 4) F and G
5) None of these

Sol:



Ans:3

12. A walked 40 m towards West, took a left turn and walked 30m. He, then took a right turn and walked 20m. He again took a right turn and walked 30m. How far was he from the starting point?

1) 50 m 2) 60 m
3) 55 m 4) 70 m
5) 45 m

Sol: $W_{40}\,S_{30}\,W_{20}\,N_{30}$
$= W_{60m}$
Ans: 2